# చేగువేరా

## రచనలు





## విప్లవం-రాజకీయాలు

# చేగువేరా రచనలు

# చేగువేరా రచనలు

★ క్యూబా విప్లవం

★ సోషలిస్టు సమాజ తొలిదశ

★ లేఖలు

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013*

ISBN 978-93-84162-00-9

96979

అనువాదం

కలేకూరి ప్రసాద్, సఫ్దర్ అహ్మద్, గుడిపూడి విజయరావు

ప్రచురణ సంఖ్య : 896

ప్రథమ ముద్రణ : అక్టోబరు, 2004

ద్వితీయ ముద్రణ : జూలై, 2009

తృతీయ ముద్రణ : అక్టోబరు, 2010

నాల్గవ ముద్రణ : డిసెంబర్, 2011

ఐదవ ముద్రణ : మార్చి, 2014

వెల : ₹. 80/-

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర
హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు, కరీంనగర్

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

# విషయసూచిక


ఉపోద్ఘాతం.......................................................... 7

**క్యూబా విప్లవం ................................................... 11**

విప్లవ ప్రారంభం ................................................... 13

**సోషలిస్టు సమాజ తొలిదశ ........................................... 57**

మనం ఏమి నేర్చుకున్నాం? ఏమి బోధించాం?........................ 59

గెరిల్లా పోరాట ఉద్దేశం.............................................. 63

గెరిల్లా యుద్ధం : ఒక విధానం........................................ 69

క్యూబా ప్రస్థానం ..................................................... 85

విప్లవ సైన్యం సామాజిక సిద్ధాంతాలు .................................. 86

రాజకీయ సార్వభౌమాధికారం, ఆర్థిక స్వాతంత్ర్యం .................... 95

వైద్య విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలనుద్దేశించి చేసిన ప్రసంగం ..... 111

క్యూబా విప్లవ అధ్యయనం ............................................. 119

క్యూబా : చారిత్రక మినహాయింపా లేక సామ్రాజ్యవాద

వ్యతిరేక పోరుకు నాయకత్వమా?....................................... 127

నవీన పని సంస్కృతి....................................................... 139

కార్యకర్తలు : విప్లవానికి మూలం ........................................ 147

**లేఖలు .......................................................... 153**

# ఉపోద్ఘాతం

ఎర్నెస్టో గువేరా డీలా సెర్నా అర్జెంటీనాలోని రొస్సారియోలో 1928 జూన్ 14న జన్మించారు. బ్యూనస్ ఎయిర్స్‌లో వైద్య శాస్త్ర పట్టభద్రుడైన తర్వాత ఉన్నత విద్యనభ్యసిస్తూ ఆయన లాటిన్ అమెరికాలో పర్యటించాడు. గ్వాటిమాలాలో రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించాడు. అప్పుడున్న జాకోబ్ ఆర్బెంజ్ ప్రభుత్వాన్ని సిఐఎ కుట్రతో కూలదోయడం ప్రత్యక్షంగా చూశాడు. నిర్బంధ పరిస్థితులలో గ్వాటిమాలా వదలి మెక్సికో సిటీ చేరిన గువేరా అక్కడ ఫైడల్ కాస్ట్రోను కలుసుకున్నాడు. వెనువెంటనే గెరిల్లా దళంలో చేరాడు. అర్జెంటీనియన్లు ముద్దుగా పిలిచే చే పేరు అతనికి స్థిరపడింది.

1956 నవంబరు 25 నుంచి డిసెంబరు2 వరకూ సియర్రా మాయెస్ట్రా నుంచి గ్రాన్మా నౌకలో తలపెట్టిన తిరుగుబాట యాత్రలో అతను భాగమయ్యాడు. మొదట దళం డాక్టర్‌గా ప్రవేశించిన చే 1957 జులైలో మొదటి కమాండర్ అయ్యారు. సెప్టెంబరు 1958 నుంచి గువేరా, కామిలో సెయిన్‌ఫ్యూజోస్‌లు చెరో దళానికి నాయకత్వం వహించి నడిపించారు. తీవ్రమైన పోరాటాన్ని తట్టుకుంటూ చే దళాన్ని డిసెంబరు చివరి నాటికి శాంతా క్లారా పోరాటంలో విజయానికి నడిపించాడు. క్యూబా విప్లవ గమనంలో అది నిర్ణయాత్మక ఘట్టం.

1959 జనవరి మొదటి తేదీన క్యూబా విమోచనానంతరం విప్లవ ప్రభుత్వంలో చే ఒక ప్రధాన నాయకుడైనాడు. 1959 సెప్టెంబరులో ఆయన జాతీయ పరిశ్రమలు వ్యవసాయ శాఖ అధ్యక్షుడైనాడు. ఆ ఏడాది నవంబరులో జాతీయ బ్యాంకు ఛైర్మన్, 1961లో పరిశ్రమల మంత్రి అయ్యాడు. క్యూబా ప్రతినిధిగా చే ప్రపంచానికి సుపరిచితుడైనాడు.

1965లో చే క్యూబాను వదలిపెట్టి విదేశాలలో విప్లవ పోరాటాలలో పాల్గొనేందుకు తరలివెళ్ళాడు. కాంగో ఆఫ్రికాలో చాలా మాసాలుండి మళ్లీ 1965

డిసెంబరులో క్యూబాకు  రహస్యంగా చేరుకున్నాడు. నవంబరు1966లో చే బొలీవియా చేరుకున్నాడు. అక్కడి సైనిక నియంతృత్వానికి వ్యతిరేకంగా  గెరిల్లా దళాన్ని నడిపించాడు. అమెరికా ఆధ్వర్యంలోని బొలీవియా  కిరాయి దళాలు ఆయన్ను బంధించాయి. 1967 ఆక్టోబరు8న ఆయనను కిరాతకంగా హత్య చేశారు.

1967 అక్టోబరు 18న చేగువేరా స్మృత్యర్థం నిర్వహించిన సభలో పది లక్షల మంది ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగంలో క్యూబా అధ్యక్షుడు ఫైడెల్  కాస్ట్రో  చే గురించి ఇలా చెప్పాడు :

“చేకు ఏదో అదృష్టం కలిసి వచ్చిందని భావించేవారు. అతడి అనుభవాన్ని , నాయకత్వ సామర్థ్యాన్ని తక్కువ చేసి చూపడానికి విఫలయత్నం చేస్తున్నారు. చే అసాధారణ సామర్థ్యంగల ఒక సేనాని. అయితే అతడిని మనం స్మరించినపుడు, అతడి గురించి ఆలోచించినపుడు కేవలం సైనికపరమైన సామర్థ్యమే మౌలికమని అనుకోము యుద్ధమే సర్వస్వం కాదు. విప్లవకారులకు యుద్ధం ఒక సాధనం మాత్రమే. విప్లవమే ముఖ్యం. విప్లవ లక్ష్యం, విప్లవ భావాలు, విప్లవ సిద్ధాంతాలు, విప్లవ భావనలే ముఖ్యం. ఈ రంగాల్లోనే ఇపుడు చే లేని లోటు మనకు స్పష్టంగా గోచరిస్తోంది.

చే వ్యక్తిత్వం సకలగుణ సంపన్నమైనది. లక్ష్యశుద్ధి, దూరదృష్టి, విశాలమైన సభ్యత, ఆలోచించే తత్వంతో అతడు అనితర సాధ్యుడిగా నిలబడ్డాడు. ఆలోచనలు, కార్యశీలత సమాన స్థాయిలో ఉన్న వ్యక్తిగా ఖ్యాతిగాంచాడు. అన్ని మంచి లక్షణాలు ఒక వ్యక్తిలో కలిసి వుండడం అరుదు. చెక్కుచెదరని విశ్వసనీయత, నిజాయితీ, నిరాడంబరత, తమగౌరవం అతడి స్వంతం. ఈ లక్షణాలు ఒక నిజమైన విప్లవకారున్ని సూచిస్తాయి. ఇలాంటి వ్యక్తిత్వం ఆదర్శవంతమైనది. కనుకనే క్రమశిక్షణ కలిగిన సైనికునిగా భావి తరాలకు చే తన అనుభావాన్ని,  తన విజ్ఞానాన్ని, కృషిఫలాలను వారసత్వంగా అందించాడు.

చే గొప్ప రచయిత కూడా భాషపై ఎంతో పట్టుకలిగిన వాడు. విప్లవయుద్ధం గురించి అతడి వర్ణనలు పోల్చలేనివి. అతడి ఆలోచనల లోతు అనంతమైనది. అసాధారణమైన ఏకాగ్రత, భావప్రగాఢతతో అతడు రచనలు చేసేవాడు. భవిష్యత్తులో అతని రచనలు విప్లవ భావాల కళాఖండాలుగా మిగిలిపోగలవని నా ప్రగాఢ విశ్వాసం. అతడి రచనలే లేకున్నట్లయితే లెక్కలేనన్ని జ్ఞాపకాలు, వర్ణనలు మనకు మిగిలేవి కావు. దేశసేవలో ఉన్నంత కాలం అతడు నిరంతరం శ్రమించాడు. ఒక్కరోజు కూడా విశ్రాంతి తీసుకునే వాడు కాదు. జాతీయ బ్యాంకు అధ్యక్షునిగా, కేంద్ర ప్రణాళికా సంఘం డైరెక్టరుగా, పరిశ్రమలశాఖ మంత్రిగా, రక్షణ కేంద్రాల అధిపతిగా, రాజకీయ, ఆర్థిక, మైత్రి బృందాల సభ్యునిగా అతడికి ఎన్నో బాధ్యతలు  అప్పగించాము. అతడి విలక్షణమైన మేధ ఏ

బాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వహించేది. యుద్ధంలో సైనికులకు నేతృత్వం వహించినట్లే అంతర్జాతీయ సమావేశాల్లో అతడు దేశానికి ప్రాతినిధ్యం వహించేవాడు. సంస్థాగత బాధ్యతలను కూడా ఆదర్శవంతంగా నిర్వర్తించేవాడు.

చే కార్యాలయాల్లో రాత్రిళ్లు కూడా లైట్లు వెలుగుతూనే ఉండేవి. ఏదో ఒక పని చేస్తూనో, చదువుతూనో ఉండేవాడు. అన్ని సమస్యల మధ్యనే అతడు అలుపెరగకుండా చదివే వాడు. నిద్ర మానేసిన సమయాన్ని చదువు కోసం వినియోగించేవాడు. తన సెలవు రోజును స్వచ్ఛంద సేవ కోసం కేటాయించేవాడు. ఎందరో సామాజిక కార్యకర్తలకు అతను నైతిక స్ఫూర్తిని అందించాడు. స్వచ్ఛంద సేవారంగంలోకి వేలాది మంది ప్రజలను రప్పించాడు.

విప్లవకారునిగా, కమ్యూనిస్టు విప్లవకారునిగా, నిజమైన కమ్యూనిస్టుగా అతడికి నైతిక విలువలపై ఎల్లలు లేని విశ్వాసం ఉండేది. మానవ చైతన్యం పై అతడికి ప్రగాఢమైన నమ్మకం ఉండేది. నైతిక స్పందనే మానవ సమాజంలో కమ్యూనిజాన్ని నిర్మించగలదని అతడు స్పష్టంగా గ్రహించగలిగాడు. ఎన్నో విషయాలను దీర్ఘంగా ఆలోచించి , వాటిని మెరుగు పరిచి రచించాడు. చే రచనలు, అతడి విప్లవ ఆలోచన క్యూబా విప్లవ క్రమానికి, లాటిన్ అమెరికా విప్లవ క్రమానికి శాశ్వతమైన ప్రయోజనం చేకూర్చగలవని ఈ రోజున పేర్కొనాలి. అతడి ఆలోచనలకు సార్వజనీన విలువ కూడా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఈ గెరిల్లా సైనికుణ్ణి పోరాటంలో చంపగలిగామని సామ్రాజ్యవాదులు గొప్పలు పోతున్నారు. చే లాంటి కార్యసాధకుడిని అదృష్టం కొద్ది నిర్మూలించ. గలిగామని వారు భుజాలు ఎగరేస్తున్నారు. అయితే వారికి ఒక్క విషయం తెలియదనుకుంటా. కార్యాచరణ చే వ్యక్తిత్వంలో ఒక భాగం మాత్రమే. అందుకే అతడి మరణం దేశ వాసులను ఇంతగా క్రుంగదీస్తోంది".

ఒక గొప్ప మేధను కోల్పోయినందుకు చింతిస్తున్నాం. 39 సంవత్సరాలకే అతడిని మృత్యువు కబళించడం మరింత బాధ కలిగించే అంశం. ఘనమైన తన అనుభవం, మేధస్సు ఫలాలు మరింత ఎక్కువగా దక్కకపోవడం దేశవాసులను బాధిస్తోంది."

ప్రస్తుతం ప్రచురితమవుతున్న చే రచనల సంపుటి 1997లో ఆయన 30 వర్ధంతి సందర్భంగా మొదటి సారి వెలువడింది. ఇది చే జీవిత చరిత్ర కాదు, ఆయన తన అనుభవాలు అభిప్రాయాలు తన మాటల్లోనే చెప్పిన సందర్భం. ఈ ముప్పై ఏళ్లలో చే గురించి ప్రపంచంలో జరుగుతున్న ప్రచారం ఒక విధంగా పాక్షికంగా వుంది. ఆయన కాల్పనిక విప్లవకారుడైనట్టు చిత్రించబడుతున్నది. ఒంటరి గెరిల్లా యోధుడుగా చూపే

చిత్రాలు విపరీతంగా పంపిణీ అవుతున్నాయి. కాస్ట్రోతో పాటు భుజం కలిపి మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆచరణను సమ్మిళితం చేస్తూ నూతన సమాజ నిర్మాణం కోసం కృషి జరిపిన వ్యక్తి ఆయన. కాని పై పాక్షికచిత్రణలో ఆ విషయం వుండదు. ఆయన మరణానంతరం రెండు దశాబ్దాలకు కూడా చే రచనలు ఇంగ్లీషులో అందుబాటులో లేకపోవడం ఇందుకొక సంకేతం.

1965 ఏప్రిల్‌లో తొలిసారిగా క్యూబా వదలి వెళ్ళాడు. అప్పటి నుండి అతడి ఆచూకిపై రకరకాల వదంతులు వ్యాపించాయి. లాటిన్ అమెరికాలోని ప్రతిదేశంలో అతడు కనబడ్డాడని కొందరు, కాస్ట్రో తన ప్రత్యర్థిని హత్య చేయించాడని మరికొందరు పుకార్లు రేపారు. గత నాలుగు దశాబ్ధాలుగా చే ను క్యూబా విప్లవం, కాస్ట్రో నుండి వేరు చేయడానికి ఒక ప్రయత్నం జరుగుతోంది. ఇలాంటి అర్ధరహితమైనవి, ఆరోపణలు ఎన్నో ప్రసంగాలు, రచనలు చేశాడు. చే గురించి కాస్ట్రో గువేరాతో తనకున్న అనుబంధాన్ని కాస్ట్రో అందులో అద్భుతంగా వివరించారు. చే వీరమరణం పొందిన బొలివియా విప్లవ పోరాటం గురించి కాస్ట్రో నిష్పక్షపాతంగా వ్యాఖ్యానించారు.

గువేరా ప్రసంగాలు, రచనలను నాలుగు విభాగాలుగా ఈ పుస్తకంలో సమకూర్చాము. క్యూబా గెరిల్లా యుద్ధం (1956–58) క్యూబా ప్రభుత్వంలో పని చేసిన కాలం (1959–65) అంతర్జాతీయ అంశాలపై గువేరా ఆలోచనలు; గువేరా లేఖలుగా ఈ పుస్తకాన్ని విభజించాం తి పుస్తక సంపాదకుడు, జోస్ మార్టి ప్రచురణ కేంద్రం హవాన సంయుక్త ఆధ్వర్యంలో (1987) ఈ రచన వెలువడింది. చేగువేరా స్టడీస్ సెంటర్ అందించిన సహకారంతో తొలి ఎడిషన్‌ను మరింత అభివృద్ధి పరిచాము. గువేరా స్పానిష్ రచనలు మాకెంతో సహకరించాయి. పాఠకునికి అదనపు సమాచారం ఇవ్వడం కోసం ఈ పుస్తకంలో చే జీవితంలో ముఖ్యఘట్టాలను కూడా పొందుపరిచాము.

ఈ పుస్తకాన్ని రూపొందించడంలో చేగువేరా స్టడీస్ సెంటర్ అందించిన సహకారం ఎనలేనిది. సెంటర్ సంచాలకుడు అలీడా మిర్చ్, పరిశోధన సమన్వయకర్త మారియా డెల్ కార్మెన్ అరియట్ గార్సియాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలపాల్సిన అవసరం ఉంది. పాఠ్యాంశాలను ఎంపిక చేయడంలో వారు విలువైన సూచనలు ఇచ్చారు. ఎన్నో పొరబాట్లు సరిచేశారు. పుస్తకం రూపకల్పనకు ఓషియన్ ప్రెస్ పూర్తి బాధ్యత వహించింది.

**దేవిడ్ డియుష్మాన్,**

***2003***

# 1

# క్యూబా విప్లవం

# విప్లవ ప్రారంభం

1952 మార్చి 10వ తేదీన మొదలైన సైనికపాలన చరిత్ర-బాటిస్టా నాయకత్వంలో జరిగిన రక్తపాత రహిత సైనిక తిరుగుబాటు చరిత్ర సైనిక శిఖరాలు తిరగబడిన రోజు నుండే మొదలు కాలేదు. దానికి మూలాలను క్యూబా చరిత్రలో అన్వేషించాలి. 1933లో అమెరికా రాయబారి సమ్మర్ వెల్స్ ప్రత్యక్ష జోక్యం చేసుకున్న సందర్భం కన్నా ఇంకా వెనక్కి వెళ్ళాలి. 1901లో జరిగిన ప్లాట్ సవరణ కంటే కూడా ఇంకా వెనక్కి వెళ్ళాలి. అమెరికా విస్తరణావాదులకు ప్రత్యక్ష ప్రతినిధి అయిన లార్సియో లోపేజ్ ఆగమనం కంటే కూడా యింకా వెనక్కి వెళ్ళి చూడాలి. 19వ శతాబ్దం ఆరంభంలో క్యూబా పట్ల తమ దేశపు స్థిరమైన విధానాన్ని ప్రకటించిన జాన్ క్విన్సీ కాలం కంటే కూడా ఇంకా వెనక్కి వెళ్ళాలి. ఆ విధానంవల్లనే యాపిల్ ముక్క తెగిపడ్డట్టుగా స్పెయిన్ నుండి క్యూబా చీలిపోయింది.

ప్రజాస్వామిక ప్రభుత్వాలు పతనమై వాటి స్థానంలో ఇతర ప్రభుత్వాలు రావడం నుండి ఈ సామ్రాజ్యాల వెల్లువ ఆటుపోట్లను మనం గమనించవచ్చు. అన్ని లాటిన్ అమెరికన్ దేశాల్లోనూ ఇటువంటి లక్షణాలనే మనం చరిత్ర పొడవునా చూడవచ్చు. అతి తక్కువ మందికి ప్రాతినిధ్యం వహించే నియంతృత్వ ప్రభుత్వాలు అత్యధికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాస్వామిక ప్రభుత్వాలను సైనిక కుట్ర ద్వారా పడగొట్టి అధికారంలోకి వచ్చాయి. ఈ అర్థంలో క్యూబా విప్లవానికి మిగతా అన్ని లాటిన్ అమెరికన్ దేశాలకూ ఒక స్పష్టమైన తేడా వుంది. ఈ కారణాలవల్లనే ఈ రచయితకు లాటిన్ అమెరికా దేశాల సామాజిక ఉద్యమాల కెరటాలలో అటూ యిటూ కొట్టుకుపోతూ మరో లాటిన్ అమెరికా ప్రవాసి ఫైడల్ కాస్ట్రోను కలుసుకొనే అవకాశం లభించింది.

ఆయన్ని నేను ఒకానొక మెక్సికన్ చలి రాత్రిలో కలుసుకున్నాను. మా మొదటి చర్చ అంతర్జాతీయ రాజకీయాలపైనే జరిగిందని జ్ఞాపకం. కొన్ని గంటలలోపలే, తెల్లవారకముందే ఆయన మాటలకు ఆకర్షితుడునయ్యాను. ప్రస్తుతం క్యూబా అధినేతగా వున్న ఆయనను నేను మెక్సికోలో ఎందుకు ఎలా కలుసుకున్నానో చెప్పాలి.

అది 1954. ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఆటుపోట్లకు గురవుతున్న సమయం. జాకబ్ ఆర్బెంజ్ గజ్‌మాన్ నాయకత్వంలోని చివరి లాటిన్ అమెరికన్ విప్లవ ప్రజాస్వామ్యం చాపకింద నీరులా అమెరికా చేసిన దాడిలో ఇరుక్కుంది. ఆ దాడికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించిన వ్యక్తి ఆనాటి అమెరికా విదేశాంగ మంత్రి జాన్ ఫాస్టర్ డుల్లెస్. అతను దాడికి నాయకత్వం వహించడమూ, అతనే గ్వాటిమాలాలోని అతిపెద్ద సామ్రాజ్యవాద కంపెనీ అయిన యునైటెడ్ ఫ్రూట్ కంపెనీకి న్యాయవాదీ, స్టాక్ హోల్డర్ కావడమూ యాదృచ్ఛికమైన అంశాలు కావు.

ఓటమిపాలై బాధాతప్తమైన దేశాన్ని పునర్నిర్మించాలన్న ఆశ కలిగిన ఇతర గ్వాటిమాలియన్లతో కలిసి నేను అక్కడి నుండి తిరిగి వస్తున్నాను.

ఫైడల్ కాస్ట్రో తన అతి పెద్ద కర్తవ్య నిర్వహణకు తన మనుషుల్ని సిద్ధపరిచేందుకు ఒక తటస్థ ప్రాంతాన్ని వెతుక్కుంటూ మెక్సికో వచ్చాడు. శాంటియాగోడి క్యూబాలో మొంకాడా సైన్యాలపైన దాడి తర్వాత అంతర్గతంగా చీలిక అప్పటికే ఏర్పడింది.

బలహీనులందరూ బయటకు వెళ్ళిపోయారు. వాళ్ళంతా పెద్ద త్యాగాలు అవసరంలేని రాజకీయ పార్టీల్లోనో విప్లవ గ్రూపుల్లోనో చేరారు. కొత్తగా రిక్రూట్ అయిన వాళ్ళు జులై 26 ఉద్యమంగా పిలవబడే దానిలో కొత్త శ్రేణుల్లో చేరడం మొదలుపెట్టారు. 1953 జులై 26న మొంకాడా పైన దాడికి గుర్తుగా ఆ ఉద్యమానికి ఆ పేరు వచ్చింది. మెక్సికోలో నెలకొన్న పరిస్థితులకు తగ్గినట్లు ఈ కొత్త వారికి శిక్షణనివ్వడం అనేది అత్యంత క్లిష్టమైన కర్తవ్యం. వాళ్ళు మెక్సికో ప్రభుత్వానికీ, అమెరికా, ఎఫ్‌బిఐ ఏజెంట్లకీ, బాటిస్టా ఏజెంట్లకీ వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈ మూడు శక్తులతో పోరాటం ఒక రకంగా చూస్తే అంతస్సంబంధమున్న పోరాటం. ఇందులో డబ్బు అత్యంత కీలకమైన పాత్ర పోషించింది. దాడిని తోడు ట్రుజిల్లో గూఢచారులతో మేము పోరాడవలసి వచ్చింది. ప్రత్యేకించి మియామిలో అతి పేలవమైన ఎంపికకు వ్యతిరేకంగా కూడా మేం పని చేయాల్సి వచ్చింది. అన్ని అవరోధాలను అధిగమించిన తర్వాత ఒక ముఖ్యమైన అంశాన్ని

గుర్తుంచుకోవాలి. నిష్క్రమించడం... ప్రవేశించడం మిగతా విషయాలన్నీ ఆ సమయంలో మాకు చాలా తేలిక అనిపించాయి. యిప్పుడు ఆ పరిస్థితులన్నింటినీ చూస్తే ఎన్ని త్యాగాలు ఎన్ని ప్రాణనష్టాలు జరిగాయో. ఆ ప్రయత్నానికి ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చిందో అంచనా కట్టగలం.

కొద్ది మంది సన్నిహితులతో తనకున్న అసాధారణమైన శక్తితో, గొప్ప కార్యదీక్షతో నిబద్ధతతో క్యూబాలో పోరాడడానికి వెళ్ళే విప్లవ సైనికుల్ని ఫైడల్ కాస్ట్రో తయారు చేశాడు. ఆయనకు సమయం అనేది అమూల్యమైన అంశం కాబట్టి దాదాపుగా ఆయన ఎప్పుడూ సైనిక ఎత్తుగడల గురించి పాఠాలు చెప్పలేదు. మేమంతా జనరల్ ఆల్బర్ట్ బాయో దగ్గర నుండి కొద్దిగా నేర్చుకున్నాం. మొదటి పాఠం విన్నప్పుడు నాకు విజయం సాధ్యమేనన్న భావన తక్షణం కలిగింది. ఒక పవిత్రమైన ఆశయం కోసం విదేశీ తీరంలో మరణించడం ఎంతో మంచిది అన్న ఆలోచనలు నేను చేరిన కొత్తలో ఉండేవి. అప్పుడు విజయం పట్ల నాకు చాలా సందేహాలుండేవి. ఇలా అనేక మాసాలు గడచిపోయాయి. మా పరిస్థితి మెరుగుపడింది. జనరల్ బాయో నిర్దేశికత్వంలో, నేను నాయకుడిగా 1956 మార్చిలో క్యూబా వెళ్ళడానికి ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. అదే సమయంలో బాటిస్టా నుండి జీతాలు పొందుతున్న రెండు మెక్సికన్ పోలీస్ యూనిట్లు ఫైడల్ కాస్ట్రో కోసం వెతుకుతున్నాయి. అతను దొరికితే వాళ్ళకి సంపద రాశులుగా కురిసేది. అయితే వాళ్ళు, ఆర్థికపరంగా చూసుకున్నా ఒక పొరపాటు చేశారు. ఒక యూనిట్‌కు ఫైడల్ దొరికిపోయాడు. అప్పుడే ఈ పొరపాటు వాళ్ళవైపు నుండి జరిగింది. అతన్ని చంపకపోవడమే వాళ్ల పొరపాటు. కొన్ని రోజుల్లోనే ఆయన అనుచరులు చాలా మంది పట్టుబడ్డారు. మెక్సికో నగర శివార్లలో మేమందరం కూడా పోలీసుల చేతికి చిక్కాం. అందర్నీ జైల్లో పెట్టారు.

దీంతో మొదటి అంకం చివరి దశ వాయిదా పడింది. మాలో కొంత మందిని 57 రోజులు జైల్లో వుంచారు. ఒక్కొక్క రోజునూ లెక్కపెట్టుకొంటూ గడిపాం. మా ముందున్న కర్తవ్యం గుర్తుకు వస్తుంది. కమాండర్ కాలిక్సో గార్షియా, నేనూ ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తించాము. అయితే ఏ క్షణంలోనూ మేమెవ్వరం ఫైడల్ కాస్ట్రో పట్ల విశ్వాసాన్ని కోల్పోలేదు. స్నేహం కోసం తన విప్లవ వైఖరిని భిన్నంగా రాజీమార్గాన్ని అవలంబించడంగా చెప్పడానికి వీలున్న పనులు కాస్ట్రో చేశాడు. నా ప్రత్యేకమైన కేసును ఆయనకి వివరించిన సంగతి జ్ఞాపకం వుంది. నేనొక విదేశీయుడిని. అక్రమంగా మెక్సికోలో వున్నాను. నాపైన

అనేక అభియోగాలు మోపారు. నా వలన విప్లవ కర్తవ్యాలకు ఏ ఆటంకమూ రాకూడదని నేనాయనకు చెప్పాను. అవసరమైతే నన్ను వదిలేసేయమని చెప్పాను. నేను పరిస్థితిని అర్థం చేసుకోగలననీ, నన్నెక్కడికి వెళ్లమని చెప్పినా అక్కడికి వెళ్లి పోరాడడానికి నేను సిద్ధమేననీ చెప్పాను. అయితే అర్జెంటీనా లేదా ఏదైనా దగ్గరి దేశానికి పంపమని ఆయనకు చెప్పాను. ఫైడల్ కాస్ట్రో అప్పుడు చెప్పిన చురుకైన సమాధానం కూడా నాకు జ్ఞాపకం వుంది. 'నిన్ను వీడను–ఎడబాయను' అని ఆయన నాకు చెప్పాడు. అదే జరిగింది. మమ్మల్ని జైలు నుండి బయట పడేయడానికి ఎంతో విలువైన సమయాన్నీ డబ్బునీ వెచ్చించాల్సి వచ్చింది. తనతో వుండే వ్యక్తులపట్ల ఫైడల్ చూపించే వ్యక్తిగత శ్రద్ధ అందరూ ఎప్పుడూ ఆయనకు విధేయంగా వుండేలా చేస్తుంది. ఆశయాలపట్ల వ్యక్తులపట్ల ఆయనకుండే నిబద్ధత తిరుగుబాటు సైన్యాన్ని ఒక బిగిసిన పిడికిలిగా మార్చే శక్తిని ఆయనకు యిచ్చింది. అజ్ఞాతంలో మా పని సాగిపోతోంది. రోజులు గడుస్తున్నాయి. మేం దాక్కోగలిగిన ప్రదేశాల్లో దాగి వుంటున్నాం. సాధ్యమైనంత వరకూ ఎవరికీ కన్పించకుండా వుంటున్నాం. వీధుల్లోకి అసలు వెళ్ళడంలేదు. అనేక మాసాలు గడిచిన తర్వాత మాలోనే ఒక ద్రోహి వున్నట్లుగా మాకు తెలిసింది. అతని పేరు తెలియదు. ఒక ఆయుధాల ఓడని కూడా అమ్మేశాడని తెలిసింది. అయితే ఆ అమ్మకాల లీగల్ కాంట్రాక్ట్ వ్యవహారాలు పూర్తి కాలేదు. మొదటి వాయిదా ద్వారా ఆ ద్రోహికి మా అంతర్గత పని తీరు గురించి తెలుసునని క్యూబా అధికారులకు తెలిసింది. అయితే దాని వల్లనే మేం రక్షింపబడ్డాం. మాకు కూడా అదే పరిష్కారం చూపింది.

ఆ క్షణం నుండి ఎడతెగని పనిలో పడిపోయాం. అసాధారణమైన వేగంతో మేం అన్నింటినీ సమకూర్చుకుంటున్నాం. యూనిఫారంలు, రైఫిళ్లు, ఇతర సాధనాలు. రెండు యాంటీ ట్యాంకు గన్‌లు ఇలా కొద్దిగానే సమకూర్చుకున్నాం. అయితే ఆ యాంటీ ట్యాంకు గన్‌లకు కావాల్సిన మందుగుండు లేదు. 1956 నవంబర్ 25వ తేదీన ఉదయం రెండు గంటల సమయంలో ఫైడల్ కాస్ట్రో అధికారిక ప్రకటనలో చెప్పినట్లు "1956 కల్లా మేం విముక్తులమవుతాం. లేదా ప్రాణాలు కోల్పోయి అమరులమవుతాం" అన్న మాటల్ని నిజం చేయడానికి సన్నద్ధులయ్యాం. మనుషులలో సామగ్రితో నిండిన పడవ టాక్స్‌పన్ తీరాన్ని వదలి బయలుదేరాం. వాతావరణం చాలా దారుణంగా వుంది. మెక్సికో అఖాతంలో ప్రవేశించాం. అప్పుడు పడవ లైట్లు వెలిగించాం. సముద్ర ప్రయాణంలో కలిగే అనారోగ్యాలకు విరుగుళ్లు దొరుకుతాయేమోనని చూశాం. కానీ దొరకలేదు. మేం క్యూబా జాతీయ గీతాన్ని, జులై 26 పాటనీ పాడాం. దాదాపు ఐదు నిమిషాలపాటు అలా

పాటలు పాడాం. కాసేపటికి మొత్తం పడవంతా విషాద వాతావరణం ఏర్పడింది. ముఖాలు విషాదంగా పెట్టి కడుపులు పట్టుకొని బకెట్లలో తలలు పెట్టి, మరికొందరు అచేతనంగా పడిపోయి వున్నారు. వాంతులు చేసుకొన్నారు. ఐదారుగురు నావికులు, మరో ఐదారుగురు యితరులు తప్ప మొత్తం 8 మందికీ 'సముద్ర జ్వరం' పట్టుకొంది. ఐదారు రోజులకి పరిస్థితి కొంచెం మెరుగుపడింది. అయితే మేం దొరికిన దాన్నల్లా పడవలోకి చేర్చేసరికి బరువు ఎక్కువైపోయింది. బరువు తగ్గించడం కోసం అవసరంలేవనుకున్న వస్తువుల్ని పడేశాం. క్యూబాకి దక్షిణంగా పెద్ద మలుపు తిరిగి జమైకా, జమైకా దీవుల సరిహద్దుల నుండి ఓరియంట్ రాష్ట్రంలోని నికెరో గ్రామ ప్రాంతానికి చేరుకోవాలని అనుకున్నాం. ఆ ప్రణాళిక ప్రకారమే చాలా నెమ్మదిగా ప్రయాణం చేస్తున్నాం. మేం క్యూబా చేరేనాటికి ఫ్రాంక్ పాయిస్ నాయకత్వంలో శాంటియాగోడి క్యూబాలో జరగాలని అనుకున్న తిరుగుబాటు వార్తని గురించి నవంబర్ 30వ తేదీన మేం రేడియోలో విన్నాం. మరుసటి రోజు డిసెంబర్ 1వ తేదీన మా పడవను నేరుగా కేప్‌క్రజ్ లైట్‌హౌస్ వైపు మళ్ళించాం. ఎందుకంటే మా దగ్గర మంచినీళ్ళు, తిండి, ఇంధనం కొరత ఏర్పడింది. ఉదయం రెండు గంటల ప్రాంతంలో ఆ చీకటిలో పరిస్థితి చాలా ఆందోళనకరంగా వుంది. తీరం కన్పిస్తుందేమోనని అందరూ ముందుకీ వెనక్కీ తిరుగుతూ చూస్తున్నారు. అది ఎంతకీ కన్పించదు. గతంలో నావికా దళంలో లెఫ్టినెంట్‌గా పని చేసిన రోక్ పైనున్న చిన్న వంతెన మీదికి మరొక్కసారి ఎక్కాడు. కేప్ నుండి కాంతి కన్పిస్తుందేమో చూడడానికి అంతలో కాలు జారి నీళ్లల్లో పడిపోయాడు. కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత మాకు లైట్‌హౌస్ కాంతి కన్పించింది. లాస్ కొలరాడాస్ బీచ్‌లోని చెలిక్ అనే ప్రాంతంలో క్యూబా తీరాన మేం చేరేప్పటికి పొద్దు బాగా పైకెక్కింది. ఎంతో శ్రమకోర్చి మేం ముందుకు పోవడానికి మా ప్రయత్నాలూ, మా ప్రయాణపు ఆఖరి ఘడియలు ఎన్నో కష్టతరం అయ్యాయి.

మా పడవని ఒక తీర రక్షణ పడవ గుర్తించింది. వెంటనే మా విషయాన్ని బాటిస్టా సైన్యానికి తెలియజేసింది. మేం అవసరమైన సామాన్లను మాత్రమే తీసుకొని తీరంపై దిగిన మరుక్షణంలో మాపైన శత్రు విమానాల దాడి మొదలైంది. మాకదంతా కొత్త. అయినా ఆకులు కప్పుకొని నడవడం వలన విమానాలు మమ్మల్ని పసిగట్టి దాడి చేయలేకపోయాయి. అనేక గంటలపాటు అలా పయనించాం. ఒక వ్యక్తి తనకి దారి తెలుసునని చెప్పడంతో అతన్ని అనుసరించి మేం దారి తప్పాం. అనుభవం లేనితనంతోపాటు బాధ్యతారాహిత్యం వలన అక్కడక్కడే మేం తిరగాల్సి వచ్చింది.

మాది నీడల సైన్యం. దెయ్యాల సైన్యం. ఒక గాఢమైన ఉన్మత్తయంత్రాంగాన్ని అనుసరిస్తూపోతున్న సైన్యం సముద్ర ప్రయాణంలో ఆకలితో, సముద్ర జ్వరంతో ఏడు రోజులు గడిపాము. నేల మీద మరో మూడు రోజులు పయనించాము. మెక్సికో నుండి బయలుదేరి 10 రోజులు గడిచిన తర్వాత కచ్చితంగా డిసెంబర్ 5వ తేదీన మేం అల్జీరియా డి పియో (పవిత్రుల ఆనందం) అనే ప్రదేశానికి చేరుకున్నాం. (ఎంత విచిత్రం) అప్పటికి స్పృహ తప్పడం, విశ్రాంతి కావాలనడంతో ఒక రాత్రి ప్రయాణానికి ఆటంకం ఏర్పడింది. అల్జీరియా డి పియో అనే ప్రాంతం ఒక చెట్లతోపు. దాన్ని ఆనుకొని చెరకు తోటలున్నాయి. మరో వైపున లోయలున్నాయి. ఆ తర్వాత దట్టమైన అడవి వుంది. బస చేయడానికి ఆ ప్రాంతం ఏ మాత్రం అనువైనది కాదు. అయినప్పటికీ అక్కడే ఒక రోజు విశ్రాంతి తీసుకోవాలని ఆగాం. మరుసటి రాత్రి మా ప్రయాణం మొదలుపెట్టాం.

## అల్జీరియా డి పియో

అల్జీరియా డి పియో ఓరియంట్ ప్రొవిన్స్‌లోని నికెరో మున్సిపాలిటీలో వుంది. మమ్మల్ని నియంతల సైన్యం ఆశ్చర్యపరిచిన కేప్ క్రజ్‌కు సమీపాన ఆ ప్రాంతం వుంది. పర్వత ప్రాంతంలో నడిచి బాగా అలసిపోయాం. డిసెంబర్ 2వ తేదీన లాస్ కొలరోడాస్ బీచ్ అనే ప్రాంతం చేరుకున్నాం. మా దగ్గర వున్న సామానంతటినీ కోల్పోయాం. కొత్తబూట్లతో ఉప్పునీటి కయ్యల గుండా నడవడంవల్ల అందరికీ పాదాలకు గాయాలయ్యాయి. బూట్లు కోసుకుపోతున్నాయి. అయితే ఆ బూట్లు, వాటివల్ల ఏర్పడిన ఫంగస్ మాత్రమే మా ఏకైక శత్రువులు కాదు. మేం ఏడు రోజులపాటు తిండి లేకుండా, సముద్ర జ్వరంతో బాధపడుతూ ప్రయాణం చేసి మెక్సికన్ అఖాతం, కరేబియన్ సబ్రా దాటి వచ్చాం. నవంబర్ 25వ తేదీన టక్ససన్ తీరాన్ని వదలి బయలుదేరాం. మేము బయలుదేరే నాటికి గాలి తీవ్రత ఎక్కువగా వుండడంవల్ల నౌకాయానాన్ని నిషేధించారు. ఈ పరిస్థితులన్నీ ఏ మాత్రం అనుభవంలేని కొత్త రిక్రూట్స్‌పైనా తమ ప్రభావాన్ని బలంగానే వేశాయి.

మాకు మిగిలిన యుద్ధసామగ్రి కేవలం రైఫిళ్లు, మందుగుండు బెల్టులు, కొన్ని పొడితూటాలు. మా మందులు అంతర్ధానమయ్యాయి. అంతకు ముందు రాత్రి నికెరో చక్కెర మిల్లుకు చెందిన చెరుకుతోట మీదుగా వెళ్లాం. దాని యజమాని జూలయోలోబో. ఆ రాత్రి మా ఆకలి దప్పుల్ని చెరుకు గడలతో తీర్చుకున్నాం. అయితే మాకు అనుభవం

లేకపోవడంవల్ల చెరుకు పిప్పినీ, చెత్తనీ అక్కడే పారవేశాం. మా జాడ కోసం వెతుకుతున్న సైనికులను అక్కడికి తీసుకువచ్చింది. ఆ గుర్తులు కాదు – వీళ్లని అక్కడికి తీసుకు వచ్చింది. మాతోనే వున్న ద్రోహి అని కొన్ని సంవత్సరాల తర్వాత తెలిసింది. అంతకు ముందు రాత్రే అతన్ని వెళ్లనిచ్చాం. మా సుదీర్ఘమైన పోరాటంలో ఇలాంటి తప్పులు పదేపదే చేశాం. ప్రమాదకరమైన ప్రాంతాల్లో ఎవరో తెలియని పౌరుల్ని కూడా నమ్మడం మంచి కాదని మాకు అర్థం అయ్యేంత వరకూ ఆ పొరపాట్లు చేస్తూనే వున్నాం. మాకు తప్పుడు దారి చూపించిన ఆ వ్యక్తిని ఆ రాత్రి వెళ్లనీయకుండా వుండాల్సింది. డిసెంబర్ 5వ తేదీ. ఉదయం పూట ఎవరూ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయాము. కొంచెం దూరం నడిచేసరికే విపరీతమైన అలసట ముందుకు వచ్చింది. విశ్రాంతి అవసరం అనిపించింది. దట్టమైన అడవికి ఆనుకొని వున్న చెరుకుతోటలో విశ్రమించాం. ఆ ఉదయం పూట అందరం గంటల తరబడి నిద్రపోయాం.

మధ్యాహ్నానికి ఏవో అసాధారణమైన కదలికల్ని గమనించాం. రకరకాల సైనిక విమానాలు మా చుట్టూ గిరికీలు కొడుతున్నాయి. మాలో కొంతమంది ఇవేమీ పట్టించుకోకుండా చెరుకు గడల్ని విరిచి తింటున్నారు. వాళ్ల కదలికలు విమానాల్లో వున్న వాళ్లకి తెలిసిపోతాయన్న విషయమే వాళ్లు పట్టించుకోవడంలేదు. విమానాలు కొంచెం కిందికి దిగి తక్కువ వేగంతో తిరుగుతున్నాయి. నేను బృందానికి వైద్యుణ్ణి. గాయపడ్డ యోధులకు వైద్యం చేయాల్సిన బాధ్యత నాదే. చివరిగా నేను వైద్యం చేసిన వ్యక్తిని గుర్తుకు తెచ్చుకున్నాను. అతని పేరు హంబర్టో లా మోతే. అదే అతనికి ఆఖరి రోజయ్యింది. నా దగ్గర ప్రథమ చికిత్స చేసుకొని అలసిసొలసి అతను అలా నడచిపోవడం నాకు యింకా గుర్తుంది. తాను వేసుకోలేని బూట్లను చేత్తో పట్టుకొని కాళ్ళీడ్చుకుంటూ వెళ్లాడు. నేనూ, మౌంటేన్ మా దగ్గర మిగిలిన తిండి తింటూ మా పిల్లల గురించి మాట్లాడుకొంటూ వున్నాం. అప్పుడు ఎక్కడో తుపాకీ పేలిన చప్పుడు వినిపించింది. కొన్ని సెకన్లలోనే మాపైన అగ్నివర్షం కురుస్తున్నట్లుగా తూటాల వాన కురిసింది. నా దగ్గర వున్న రైఫిల్ అంత మంచిది కాదు. నేను కావాలనే ఆ నాసిరకం రైఫిల్‌ను తీసుకున్నాను. సముద్ర ప్రయాణం పొడవునా ఉబ్బసం వ్యాధి నన్ను ఎంతగానో ఇబ్బంది పెట్టింది. ఆరోగ్యం సరిగాలేని నేను అంత మంచి రైఫిల్‌ను తీసుకొంటే దానికి అన్యాయం చేయడమే అవుతుంది. అది వేరే వాళ్ళ దగ్గర వుండడమే మంచిదని నేనీ రైఫిల్‌ను తీసుకున్నాను. తొలుత తుపాకులు పేలిన తర్వాత ఏం జరిగిందో గుర్తు రావడంలేదు. అప్పటి కెప్టెన్ అల్‌మైదా మా దగ్గరకు వచ్చి ఫైరింగ్‌కు ఆదేశాలు ఇవ్వమని అడిగాడు. ఆదేశాలు ఇవ్వడానికి

అక్కడ ఎవ్వరూ లేరు. పక్కనే వున్న చెరుకుతోటలోకి అందర్నీ రమ్మని చెప్పడానికి ఫైడల్ తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యాడని తర్వాత తెలిసింది. అల్మైదా తన బృందానికి నాయకత్వం వహించడానికి వెళ్ళిపోయాడు. ఒక కామ్రేడ్ నా పాదాల దగ్గర మందుగుండు పెట్టెను పడేశాడు. నేను ఆ పెట్టెవైపు చూశాను. అతను అప్పుడు బాధగా ముఖంపెట్టి మందుగుండు పెట్టెలకు సమయం మించిపోయింది అని అన్నట్టు నాకు కచ్చితంగా గుర్తు. ఆ మాటలు చెప్పి చెరుకు తోటలోకి పరుగెత్తాడు. (ఆ తర్వాత అతన్ని బాటిస్టా మనుషులు చంపేశారు)

వైద్యానికి అంకితం కావాలా విప్లవ సైనికుడుగా నా బాధ్యతను నిర్వర్తించాలా అన్న మీమాంసలో పడడం బహుశా అదే మొదటిసారి. నా ఎదురుగా మందుల బస్తా వుంది. ఇంకొక వైపున మందుగుండు పెట్టె వుంది. రెండింటినీ మోయలేను. నేను మందులబస్తాని వదిలేసి మందుగుండు పెట్టెను తీసుకొని చెరుకు తోటవైపు నడిచిపోయాను. ఫాస్టినో పెరెజ్ తన సబ్ మెషిన్‌గన్‌ను పేల్చడం గుర్తుంది. నా పక్కన అల్‌బెంటోసా అనే కామ్రేడ్ నడుస్తున్నాడు. ఇంతలో తుపాకీ మోత విన్పించింది. చాతి మీద గట్టిగా కొట్టినట్టనిపించింది. మెడకు గాయం అయింది. కచ్చితంగా చనిపోయాననిపించింది. అల్‌బెంటోసా నెత్తురు కక్కుకొంటున్నాడు. పాయింట్ 45 తూటాలు చేసిన గాయం నుండి రక్తం కారుతున్నది. 'వాళ్ళు నన్ను చంపేశారు' అంటూ అతను తన రైఫిల్‌ని పేల్చడం మొదలుపెట్టాడు. ఎవరిపైనా ప్రత్యేకమైన గురి పెట్టి కాల్చడంలేదు. అలా కాలుస్తూనే వున్నాడు. 'నాకు కూడా దెబ్బ తగిలింది' అన్నాడు. ఫాస్టినో అలా కాల్పులు జరుపుతూనే నా వైపు చూసి ఏం పర్వాలేదు అన్నాడు. అతని కళ్లల్లో నేను దాదాపు చనిపోయానన్న భావన కదులాడింది.

నేల మీద అలా పడి వుండే అడవుల వైపుకి కాల్పులు జరిపాను. చనిపోవడం ఖాయం అనిపించింది. బాగా చనిపోవడం ఎలా అని ఆలోచిస్తున్నాను. జాక్ లండన్ రాసిన పాత కథ ఒకటి గుర్తుకొచ్చింది. అందులో హీరో అలాస్కా మంచులో యిరుక్కుపోతాడు. తాను గడ్డ కట్టుకుపోయి చనిపోవడం ఖాయం అని అర్థమయ్యాం తర్వాత గౌరవప్రదంగా చనిపోవడం కోసం ఒక చెట్టుకు ఆనుకొని అలా నిలబడిపోతాడు. ఆ క్షణంలో నా మెదడులో మెదిలిన విషయం అది ఒక్కటే. మోకాళ్ళ మీద నిలబడిన వ్యక్తి ఒకరు మనం లొంగిపోవడం ఉత్తమం అన్నాడు. మరో వైపు నుండి ఒక స్వరం విన్పించింది. 'యిక్కడ ఎవరూ లొంగిపోరు' అని పెద్దగా పలికిందా స్వరం. ఆ స్వరం కామిలో ఫీన్ స్వగోదని తర్వాత తెలిసింది. పోన్స్ నా దగ్గరకు వచ్చాడు. చాలా కష్టంగా చూపించాడు. దాదాపు ఊపిరితిత్తుల గుండా తూటా దూసుకుపోయినట్లుంది.

'నేను గాయపడ్డాను' అన్నాడతను. 'నేను కూడా' అని బదులిచ్చాను. ఆ తర్వాత పోన్స్ యింకా గాయపడకుండా వున్న ఇతర కామ్రేడ్స్ తోటవైపు, పాక్కుంటూ వెళ్ళారు. ఒక్క క్షణం నేను ఒంటరిగా వుండిపోయాను. చావు కోసం ఎదురు చూస్తూ అలా వుండిపోయాను. అల్మైదా నా దగ్గరకు వచ్చాడు. నన్ను కదలమని వేడుకున్నాడు. తీవ్రమైన నొప్పితోనే నేను పొలం వైపు నా శరీరాన్ని యీడ్చడం మొదలుపెట్టాను. అక్కడ కామ్రేడ్ రావుల్ సొరెజ్ కలిశాడు. బుల్లెట్ దెబ్బకు అతని బొటనవేలు ఎగిరిపోయింది. అతనికి ఫాస్టినో పెరెజ్ కట్టుకడుతున్నాడు. ఆ తర్వాత అంతా గందరగోళంగా తయారైంది. విమానాలు మరింత కిందికి దిగి చెరుకుతోట చుట్టూ తిరుగుతున్నాయి. అంతా తికమక దృశ్యాలు కన్పించాయి. ఒకరు చెరుకు గడ వెనుక దాక్కోడానికి ప్రయత్నిస్తున్నారు. మరొకరు ఏ కారణం లేకుండానే 'సైలెన్స్' అని అరుస్తున్నారు. అల్ మీద నాయకత్వంలో అక్కడికక్కడ ఒక బృందం తయారైంది. అందులో లెఫ్టినెంట్ రామారో వాల్టస్ (యిప్పుడుడాయన కమాండర్) చావో, బెనీటెజ్‌లు కూడా వున్నారు. అల్ మీదా నాయకత్వంలో మేము చెరుకు తోటను దాటే అడవుల్లోని సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాం. 'ఫైర్' అన్న మొదటి అరుపులు చెరకు తోటలో విన్పించాయి. ఆ తర్వాత మంటలు పొగలేవడం కన్పించింది. సరిగ్గా ఏం జరిగిందో గుర్తుకు రావడంలేదు. నేను ఓటమిని గురించి ఆలోచిస్తుండిపోయాను. నేను చనిపోవడం ఖాయం అన్న విషయాన్ని గురించి ఆలోచిస్తుండిపోయాను. చీకటి పడి యిక నడవడం అసాధ్యం అన్పించేంత వరకూ నడిచాం. అందరం గుట్టగా ఒక దగ్గరే నిద్రపోవాలనుకున్నాం. అందరం ఆకలిదప్పికతో అలమటిస్తున్నాం. దానికితోడు దోమలబెడద తోడై మరింత కష్టంగా తయారైంది మా పరిస్థితి. 1956 డిసెంబర్ 5వ తేదీన మాకు అగ్ని బాప్తీసం నికెరో శివార్లలో ఆ విధంగా జరిగింది. రూపొందనున్న విప్లవ సైన్యం ప్రయాణం అలా మొదలైంది.

## లా ప్లాటా యుద్ధం

సియుర్రా మేస్ట్రోలోని లా ప్లాటా నదీ ముఖద్వారం వద్ద చిన్న సైనిక పటాలం మీద దాడిలో మాకు తొలి విజయం లభించింది. దాంతో మా ఉత్సాహం ద్విగుణీకృతం అయ్యింది. అదొక శంఖారావం వంటిది. విప్లవ సైన్యం నిజంగా వుందనీ, అది యుద్ధానికి సన్నద్ధంగా వుందనీ తెలిపే సంఘటన అది. తుది విజయం మనదేనని మరింతగా విశ్వసించడానికి ఆ తొలి విజయం తోడ్పడింది.

1957 జనవరి 14వ తేదీన మేం మగ్దలీన నది దగ్గర బస చేశాం. అది సియాఱ్రా మేస్ట్రా నుంచి సముద్రం దాకా విస్తరించిన భూభాగం దాన్ని లా ప్లాటా నది నుండి వేరు చేస్తుంది.

అందరూ లక్ష్యాన్ని ఛేదించడం ప్రాక్టీస్ చేయాలని ఫైడల్ కాస్ట్రో ఆదేశాలిచ్చాడు. మాలో చాలా మంది జీవితంలో మొదటిసారి ఆయుధాలను ఉపయోగిస్తున్నారు. చాలా రోజులుగా లేని స్నానం చేయడానికి అవకాశం వచ్చింది. స్నానం చేయగలిగిన వాళ్ళు శుభ్రమైన బట్టలు వేసుకున్నారు. ఆ సమయంలో మా దగ్గర 23 ఆయుధాలున్నాయి. తొమ్మిది టెలిస్కోపిక్ రైఫిళ్ళు, ఐదు సెమి ఆటోమాటిక్ రైఫిళ్ళు, నాలుగు బోల్ట్ యాక్షన్ రైఫిళ్ళు, రెండు థాంప్సన్ మెషిన్ గన్నులు, రెండు సబ్ మెషిన్‌గన్‌లు, ఒక 16 గేజ్ షాట్‌గన్, యివే పని చేసే స్థితిలో వున్న ఆయుధాలు.

ఆ మధ్యాహ్నం మేం లా ప్లాటా పరిసరాల్లోని ఆఖరి కొండను దాటాం. అంతగా నలగని దారిలో పయనిస్తున్నాం. మాతోపాటు మెలిబాయాడిస్ ఎలియాస్ అనే రైతును తీసుకెళ్తున్నాం. అతన్ని మా గైడు యూటిమియో సిఫార్సు చేశాడు. అతన్ని తర్వాత కాసిల్లాస్ బంధించాడు. అయితే అతన్ని చంపకుండా 10,000 డాలర్లు లంచం యిస్తానని ఆశ చూపి ఫైడల్ కాస్ట్రోని చంపమని చెప్పాడు. అందుకతను అంగీకరించాడు. ఒక్కసారి యుటెమియోకు కాస్ట్రోని చంపే అవకాశం దగ్గరగా వచ్చింది. అయితే అతనికి కాస్ట్రోని చంపడానికి ధైర్యం చాలలేదు. అయితే అతను శత్రువుకు మాత్రం బాగా వుపయోగపడ్డాడు. మా క్యాంపుల వివరాలను అతను శత్రువుకు తెలియజేశాడు.

యుటెమియో ఒకప్పుడు మాకు ఎంతో విధేయంగా పని చేశాడు. భూస్వాములకు వ్యతిరేకంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న ఎందరో రైతుల్లో అతను ఒకడు.

ఆ రోజు మేం ఇద్దరు రైతుల్ని పట్టుకున్నాం. వాళ్ళిద్దరూ మా గైడుకు బంధువులని తర్వాత తెలిసింది. ఒకతన్ని వదిలేశాం. ముందు జాగ్రత్త చర్యగా ఒకతన్ని మాత్రం మాతోనే అట్టిపెట్టుకున్నాం. మరుసటి రోజు జనవరి 15వ తేదీన లా ప్లాటా సైనిక శిబిరాలు కన్పించాయి. అవి యింకా నిర్మాణ దశలోనే వున్నాయి. అర్ధనగ్నంగా వున్న కొంతమంది మనుషులు అటూ ఇటూ తిరుగుతూ కన్పించారు. అయితే శత్రు సైనిక దుస్తులు కన్పించలేదు. సూర్యాస్తమయానికి కొంచెం ముందుగా ఆరు గంటల ప్రాంతంలో ఒక పడవ వచ్చింది. అందులోంచి కొందరు దిగారు. మరికొందరు పడవలోనే వుండిపోయారు. ఏం చేయాలో అర్థం కాలేదు. దాంతో మా దాడి వాయిదా వేసుకున్నాం.

16వ తేదీ ఉదయాన ఆ బ్యారక్‌లను గమనిస్తూ వున్నాం. పడవ రాత్రే అదృశ్యం అయ్యింది. సైనికులెవరూ కన్పించలేదు. సాయంత్రం మూడు గంటలకు నది వెంబడి సైనిక శిబిరాల దాకా వున్న రోడ్డు మీదగా నడిచి వెళ్ళి అక్కడేం వుందో చూడాలనుకున్నాం. ఐదు నిమిషాల తర్వాత మేం యిద్దరు రైతుల్ని పట్టుకున్నాం. వారిలో ఒకరికి ఇన్ఫార్మర్‌గా రికార్డు వుంది. మేం ఎవరమో వారికి చెప్పాం. వాళ్ళకేమీ హాని చేయమని చెప్పాం. వాళ్ళు మాకు విలువైన సమాచారాన్ని అందించారు. బ్యారక్‌లలో 15 మంది సైనికులున్నారని చెప్పారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలో భయంకరుడుగా పేరుమోసిన చికో ఒసారియో ఏ క్షణంలోనైనా అక్కడికి రావచ్చునని చెప్పారు. అతను లాంటి కుటుంబం కోసం పని చేస్తాడు. లాంటీ కుటుంబీకులు చికో ఒసారియో లాంటి వారి సాయంతో ఆ ప్రాంతంలో బీభత్సాన్ని సృష్టించి తమ ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారు. కొద్దిసేపటికి చికో వచ్చాడు. బాగా తాగి వున్నాడు. సాంచెజ్ అతన్ని ఆగమని ఆదేశించాడు. చికో 'మస్కిటో' అని సమాధానం చెప్పాడు. అది పాస్‌వర్డ్ అన్నమాట. మేం దోపిడీ దొంగల్లాగా కన్పించి వుంటాం. అయితే అతను బాగా తాగి వుండడంతో అతన్ని బోల్తా కొట్టించడం తేలికయ్యింది. ఫైడల్ ఒక అడుగు ముందుకు వేసి తానొక సైనిక కల్నల్‌ననీ, తిరుగుబాటుదారుల్ని ఎందుకు అణచివేయలేదో తెలుసుకోడానికి వచ్చాననీ చెప్పాడు. దానికంతటికీ సైన్యం అసమర్థతే కారణం అని అతను చెప్పాడు. సైనికులు తమ సమయమంతా బారక్‌లలోనే గడుపుతున్నారని, తినడం తప్ప ఏమీ చేయడంలేదనీ చెప్పాడు. తప్పనిసరిగా తిరుగుబాటుదారుల్ని ఏరివేయాల్సిన అవసరం వుందని గట్టిగా నొక్కి చెప్పాడు. చుట్టుపక్కల ప్రాంతాల్లో స్నేహంగా వుండే వారెవరనీ, శత్రుపూరితంగా వుండేవారెవరనీ అడిగి తెలుసుకున్నాం. అతను శత్రుపూరితంగా వుండేవారని చెప్పిన వారిని మిత్రులుగానూ, స్నేహపూర్వకంగా వుంటారని చెప్పిన వారిని శత్రువులుగానూ రాసుకున్నాం. ఇరవై మంది దాకా పేర్లు అతను చెప్పాడు. యింకా చెప్పుకుపోతూనే వున్నాడు. ఇద్దరు వ్యక్తుల్ని తానెలా చంపిందీ బాటిస్టా అతన్ని శిక్షించకుండా ఎలా వదిలి వేసిందీ చెప్పాడు. కాస్త తలబిరుసుతనాన్ని ప్రదర్శించిన యిద్దరు రైతుల్ని తానెలా కొట్టిందీ వివరించాడు. సైనికులు యిటువంటి పనులు చేయలేదని చెప్పాడు. ఫైడల్ కాస్ట్రో పట్టుబడితే ఏం చేస్తావని' ఫైడల్ అతని అడిగాడు. ముఖంలో ఒక రకమైన భావాన్ని వ్యక్తం చేస్తూ 'అతన్ని నరికేస్తాను' అన్నాడు. పెరెజ్‌ను కూడా అలాగే చేస్తానని చెప్పాడు. అతని బూట్లని చూపిస్తూ (అవి మేం వేసుకొనే లాంటి మెక్సికన్ తయారీ బూట్లు) 'యీ బూట్లు మేం చంపిన ఆ లం–కొడుకుల్లో ఒకరివి...' అన్నాడు. తనకు తెలియకుండానే చికో ఒసారియో తన

మరణశాసనంపైన తానే సంతకం చేశాడు. సైనికులు తమ విధుల్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్న విషయాన్ని వాళ్ళకు తెలియజెప్పడానికి ఆకస్మిక తనిఖీ చేద్దాం. నువ్వు కూడా మాతో రమ్మని ఫైడల్ అడిగాడు. అందుకు చికో ఒప్పుకున్నాడు.

బారక్‌లను సమీపించాం. ముందు చికో నడుస్తున్నాడు. మా ఎత్తుగడను అతను పసిగట్టాడో లేదో తెలియదు. ముందుకు నడుస్తూనే వున్నాడు. బాగా తాగి వుండడంతో అతను సరిగా ఆలోచించలేకపోతున్నాడు. నదిని దాటి బ్యారక్‌లను సమీపిస్తుండగా ఖైదీగా దొరికిన వ్యక్తిని కట్టేయాలని మిలటరీ రూల్స్ చెబుతున్నాయని ఫైడల్ చికోతో చెప్పాడు. అతను అడ్డు చెప్పలేదు. ముందుకు నడుస్తూనే వున్నాడు. అయితే ఇంతకు ముందులా కాకుండా ఒక ఖైదీగా నడుస్తున్నాడు. ముఖద్వారం దగ్గర, హనోరియా అనే ఫోర్‌మెన్ ఇంటి దగ్గరా మాత్రమే కాపలా సైనికులున్నారన్న విషయం చెప్పాడు. అతను మమ్మల్ని ఎల్‌మాసియోకి వెళ్ళే దారిలో ఒక దగ్గరకు తీసుకెళ్ళాడు. కామ్రేడ్ లూయిస్ క్రెస్టో చుట్టూ తిరిగి వచ్చి చికో చెప్పిన సమాచారం నిజమేనని చెప్పాడు. క్రెస్టో బ్యారక్‌లను చూశాడు. గార్డులు కాలుస్తున్న సిగరెట్ల నిప్పును గమనించాడు. మేం బ్యారక్‌లలో వెళ్ళబోతుండగా ముగ్గురు గార్డులు గుర్రాల మీద వచ్చారు. వాళ్ళు వెళ్ళే వరకూ అడవిలో దాక్కున్నాం. వాళ్ళు ఒక ఖైదీని నడిపించుకుంటూ వెళ్తున్నారు. నాకు అతి సమీపంగా వాళ్ళు వెళ్ళారు. 'నేను మీలాంటి వాణ్ణి' అని ఆ రైతు చెప్తున్నాడు.' 'నోర్మూసుకొని నడువు లేకపోతే కొరడాతో కొడతా' అని హూంకరింపు వినిపించింది. ఆ హూంకరించిన వాడు కార్పొకల్ బాసోల్ అని తర్వాత తెలిసింది. మేం దాడి చేసినప్పుడు అతను బ్యారక్‌లలోనే వుంటే ఆ రైతుకి మా బుల్లెట్లు తగిలే ప్రమాదం వుంది. ఇప్పుడా ప్రమాదం అతనికి తప్పింది అనుకున్నాను. అయితే మరుసటి రోజున మా దాడిని గురించి విన్న గార్డులు అతన్ని ఎల్‌మాసియో దగ్గర చంపేశారు.

మా దగ్గర దాడికి 22 ఆయుధాలు సిద్ధంగా వున్నాయి. మందుగుండు చాలా తక్కువగా వుంది. ఏ విధంగానైనా సరే బ్యారక్‌లను స్వాధీనం చేసుకోవాలి. ఏ మాత్రం విఫలమైనా మూల్యం భారీగా చెల్లించవలసి వుంటుంది. మొత్తం మందుగుండు ఖర్చయిపోతుంది. మమ్మల్ని మేం రక్షించుకోలేని పరిస్థితి వస్తుంది. లెఫ్టినెంట్ జులియో డియాడ్ (ఎల్‌యువారో యుద్ధంలో ఆయన వీరోచితంగా పోరాడి మరణించాడు). కామిలో ఫీన్ ఫ్యాగోస్, బెనిటెజ్, కాలిక్స్టో మొరౌల్స్ వీళ్ళు సెమి ఆటోమేటిక్ ఆయుధాలను ధరించి ఉంటారు. కప్పు వున్న గుడిసెను చుట్టుముట్టాలి. ఫైడల్, యూనివర్సో సాచెజ్, లూయిస్ క్రెస్పో గాలిక్స్టో గార్షియా, ఫజార్డో, పిటీ ఫజార్డో నేను కేంద్ర స్థలం పైన దాడి

చేయాలి. రావుల్ కాస్ట్రో తన బృందంతోనూ, అల్‌మెడో తన బృందంతో కలిసి బ్యారక్‌ల మీద ఎడమ వైపు నుండి దాడి చేయాలి.

బ్యారక్‌లకు 40 మీటర్ల దూరంలో వున్నాం. పున్నమి వెన్నెల కురుస్తున్న రాత్రి. ఫైడల్ మెషిన్‌గన్‌లో తూటాలు కురుస్తున్న రాత్రి. ఫైడల్ మెషిన్‌గన్‌తో కాల్పులు ప్రారంభించాడు. మిగతా రైఫిళ్లు అతన్ని అనుసరించాయి. వెంటనే లొంగిపోవలసిందని ఆదేశించాం. ఏ సూచనలు రాలేదు. హంతకుడు, ఇన్ఫార్మర్ అయిన చికోని మొదటే కాల్చేశారు. దాడి తెల్లవారు జాము రెండు గంటల 40 నిముషాలకు మొదలైంది. గార్డుల నుండి మేం ఊహించిన దాని కన్నా ఎక్కువగానే ప్రతిఘటన ఎదురైంది. లొంగిపోవలసిందిగా మేం ఆదేశించిన ప్రతిసారీ ఎం-1 తుపాకీతో ఒక సార్జెంట్ కాల్పులు జరుపుతూ వచ్చాడు. పాత బ్రెజిలియన్ తరహా చేతి బాంబులు వాడమని మాకు ఆదేశాలందాయి. నేనూ, లూయిస్ క్రెస్టో మా బాంబుల్ని విసిరాం. కానీ ఫలితం లేదు. రావుల్ కాస్ట్రో ఒక డైనమేట్ స్టిక్‌ను విసిరాడు. ఫలితం లేదు. ప్రాణాలకు తెగించైనా ఆ ఇళ్ల దగ్గరకు వెళ్ళి వాటికి నిప్పంటించాల్సిన అవసరం ఏర్పడింది.

యూనివర్సో సాంచెజ్ మరో విఫల ప్రయత్నం చేశాడు. కామిలో ఫీన్ ఫ్యూగోస్ కూడా వైఫల్యం చెందాడు. చివరకు నేనూ, లూయిస్ క్రెస్పో కలిసి ఒక భవనం దగ్గరకు వెళ్ళి దానికి నిప్పంటించాం. ఆ మంటల కాంతిలో చూస్తే అది కొబ్బరికాయల్ని నిలువ వుంచే ప్రదేశం అన్న విషయం తెలిసింది. అయితే దీంతో సైనికులు భయపడిపోయారు. కాల్పులు ఆపేశారు. పారిపోవడానికి ప్రయత్నిస్తున్న ఒక సైనికుడు క్రస్పో తుపాకీకి దొరికిపోయాడు. లూయిస్ క్రెస్పో అతన్ని చాతి మీద కాల్చాడు. అతని రైఫిల్ గుంజుకున్నాడు. యింకా కాల్పులు జరుపుతూనే వున్నాడు. కామిలో ఫీన్ ఫ్యూగోస్ చెట్టు వెనుక నుండి ఒక సార్జెంట్‌ను కాల్చాడు. అతని మందుగుండు అంతా అయిపోయింది. మా తూటాలకు శత్రు సైనికులు కుప్పకూలిపోతున్నారు. కామిలో ఫీన్ ఫ్యూగోస్ మొదట యింట్లోకి అడుగు పెట్టాడు. అతను వెళ్ళే సమయానికే అక్కడి సైనికులు లొంగిపోతున్నట్లుగా కేకలు వేస్తున్నారు. అక్కడ దొరికిన వాటిని పోగు చేశాం. ఎనిమిది స్ప్రింగ్ ఫీల్ట్‌లు, ఒక థాంప్సన్ మెషిన్‌గన్, 1000 తూటాలు దొరికాయి. మేం 500 రౌండ్లు కాల్చాం. ఇప్పుడు మాకు తూటాల బెల్టులు, ఇంధనం, కత్తులు, బట్టలు, కొంత తిండి దొరికాయి. వాళ్ళల్లో యిద్దరు చనిపోయారు. ఐదుగురు గాయపడ్డారు. దుర్మార్గుడు హనోరయతోపాటు కొంత మంది పారిపోయారు. ముగ్గుర్ని ఖైదీలుగా పట్టుకున్నాం. మా కెవరికీ చిన్నగాయమైనా లేదు. సైనికుల క్వార్టర్లకు నిప్పు పెట్టింతర్వాత మేం మా దాడిని ఉపసంహరించుకున్నాం.

గాయపడిన వాళ్ళకు చికిత్స చేశాం. వాళ్ళల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడి ఆ తర్వాత చనిపోయారట. తుది విజయం సాధించిన తర్వాత తెలిసింది. వాళ్ళని ఖైదీ సంరక్షణలో వుంచి మేం వెళ్ళాం. ఆ సైనికుల్లో ఒకరు కమాండర్ రావుల్ కాస్ట్రో నాయకత్వంలో విప్లవ సైన్యంలో చేరి లెఫ్టినెంట్ స్థాయికి ఎదిగాడు. యుద్ధానంతరం ఒక విమాన ప్రమాదంలో అతను మరణించాడు.

గాయపడిన వారి పట్ల మేం అనుసరించిన వైఖరి బాటిస్టా సైనికుల వైఖరి కంటే పూర్తిగా భిన్నమైంది. గాయపడిన మా మనుషుల్ని వాళ్ళు చంపడమేకాదు. క్షతగాత్రులైన వాళ్ళ మనుషుల్ని కూడా వాళ్ళ కర్మానికి వాళ్ళని వదిలేశారు. ఈ తేడా శత్రువుపై కూడా బాగా ప్రభావం చూపింది. మా విజయానికి ఇది కూడా ఒక కారణం. ఖైదీలందరికీ మంచి వైద్యం, మందులు అందజేయమని ఫైడల్ ఆదేశాలిచ్చాడు. నాకా నిర్ణయం నచ్చలేదు. ఒక వైద్యుడిగా ఆ మందులు మా మనుషుల కోసమే వుపయోగించాలని నేననుకున్నాను. సాధారణ పౌరులందరినీ వదిలేశాం. జనవరి 17 ఉదయం 4.30కి పామా మెతావైపు బయలుదేరాం పొద్దుపొడిచే సమయానికి అక్కడికి చేరుకున్నాం. సియార్రా మేస్ట్రా ప్రాంతంలోని చొరబడరాని ప్రాంతాలను వెదకడం మొదలుపెట్టాం. మేం వెళ్ళేసరికి అక్కడ దయనీయమైన దృశ్యం కన్పించింది. ఆ ప్రాంతంలో ఎయిర్‌ఫోర్స్ వాళ్ళు బాంబులు వేయబోతున్నామని అక్కడి భూస్వాములు, స్థానిక ప్రైవేటు సైన్యాలూ అంతకు ముందు రోజునే అక్కడి రైతు కుటుంబాలను బెదిరించారు. దాంతో రైతాంగం సముద్ర తీరం వైపు పారిపోవడం మొదలుపెట్టారు. వాళ్ళు వెళ్ళిపోతే వాళ్ళ భూమిని, ఆస్తుల్నీ కొల్లగొట్టాలని ఈ భూస్వాముల ఆలోచన. మా దాడితో వాళ్ళ అబద్ధం నిజమై కూర్చుంది. అంతటా భీతావహ పరిస్థితి నెలకొంది. వాళ్ళని పారిపోనీయకుండా నిలవరించడం మావల్ల కాలేదు. విప్లవ సైన్యానికి యిది తొలి విజయం లభించిన యుద్ధం. ఈ యుద్ధంలోనూ, ఆ తర్వాత జరిగిన యుద్ధంలోనూ మాకు మనుషులకంటే ఆయుధాలే ఎక్కువగా వున్నాయి. అప్పటికింకా రైతాంగం మా పోరాటంలో చేరడానికి సంసిద్ధంగా లేదు. నగర స్థావరాలతో సమాచార వ్యవస్థ యింకా రూపొందలేదు.

## ద్రోహానికి బీజాలు

మళ్ళీ మా సైనిక బృందాన్ని కలవడం ఎంతో ఆనందంగా వుంది. క్రమశిక్షణ కలిగిన 200 మంది సైనికులు కొత్త ఆయుధాలు, పెరిగిన ఆత్మవిశ్వాసం. పైన నేను పేర్కొన్న గుణాత్మకమైన మార్పు నాకు సియార్రాలో కన్పించింది. అది నిజంగా విముక్తి

ప్రాంతం. జాగ్రత్త చర్యలు అంతగా అవసరంలేదు. రాత్రిపూట స్వేచ్ఛగా మాట్లాడుకోవడానికి కొంత అవకాశం వుంది. సియర్రాలోని గ్రామాలను సందర్శించడానికి కూడా మాకు అనుమతి దొరికింది. అక్కడి ప్రజలతో సత్సంబంధాలు మా పాత కామ్రేడ్‌లు మమ్మల్ని ఆహ్వానించడం కూడా ఎంతో సంతోషదాయకంగా వుంది. ఆ రోజుల్లో ఫెలిపె పాజోస్, రావులే చిబాస్‌లు ఎంతో జనాకర్షణ కలిగి వుండేవారు. అయితే వాళ్ళిద్దరి వ్యక్తిత్వాలు పూర్తిగా భిన్నమైనవి. రావులే చిబాస్ పూర్తిగా వాళ్ళ అన్నయ్య (ఎడ్వర్డో) కీర్తిపైనే ఆధారపడి బతికాడు. ఆయన క్యూబాలో నిజంగా ఒక యుగానికి ప్రాతినిధ్యం వహించాడు. రావులే చిబాస్‌కి వాళ్ళన్నయ్య గుణాలు ఒక్కటీ రాలేదు.

ఫెలిప్ పాజోస్ తనదైన స్వంత వ్యక్తిత్వం వుంది. ఒక గొప్ప ఆర్థికవేత్తగా, నిజాయితీపరుడిగా ఆయనకు పేరుంది. ఆయన కార్లోస్ ప్రియో ఫోక్రాస్ పాలనలో నేషనల్ బ్యాంకు ప్రెసిడెంట్‌గా పని చేశాడు. అయినా కొంచెం కూడా అవినీతికి పాల్పడలేదన్న పేరు తెచ్చుకున్నాడు. ఆ రోజుల్లో అవినీతికి గురి కాకుండా వుండడం అంటే చాలా గొప్ప విషయం. అయితే ఆ సమయంలో జరుగుతున్న దారుణాలపట్ల అతను మౌనంగా వున్నాడు. ఒక విప్లవకారుడికి అదెలా సాధ్యం? ఫెలిసె పాజోస్ ఎంతో చాకచక్యంగా తన నోరు మూసుకున్నాడు. బాటిస్టా సైనిక కుట్ర తర్వాత తన పదవిని వదిలేశాడు. నిజాయితీపరుడిగా, ఆర్థికవేత్తగా, తెలివైన వాడిగా పేరు తెచ్చుకున్నాడు. అయితే అతను సియర్రాకు వచ్చి దానిపైన తన ఆధిపత్యాన్ని ప్రకటించుకోవాలని అనుకున్నాడు. ఈ దేశ భవితవ్యాన్ని నిర్దేశించేది తానే అనుకున్నాడు. ఉద్యమానికి ద్రోహం చేయడానికి అప్పుడే కుట్ర పన్నాడేమో అనిపిస్తుంది. అది తర్వాత నిజమైంది. అతని ప్రవర్తన ఎప్పుడూ నిజాయితీగా లేదు. జాయింట్ డిక్లరేషన్ (సియార్రా ప్రణాళిక) – తనను తాను జులై 26 ఉద్యమ ప్రతినిధిగా ప్రకటించుకున్నాడు. దీన్ని తర్వాత విశ్లేషించుకుందాం – రిపబ్లికన్‌కు తాత్కాలిక ప్రెసిడెంట్ కాబోతున్నట్లు ప్రకటించుకున్నాడు. ఈ విధంగా తాత్కాలిక ప్రభుత్వంలో తాను నమ్మదగిన వ్యక్తి ఒకరు వున్నారన్న నమ్మకాన్ని ప్రియోకి కలిగించాడు. ఆ రోజుల్లో మాట్లాడుకోవడానికి మాకు ఎక్కువ సమయం లేదు. అయితే ప్రణాళిక విప్లవాత్మకంగా చేయడంలో తాను ఎంతగా కృషి చేసిందీ ఫైడల్ ఒకసారి చెప్పాడు. రెండు రాతియుగపు వ్యక్తిత్వాల మధ్య అది ఎంత కష్టమో స్పష్టంగా తెలుస్తుంది.

ప్రాథమికంగా ఆ ప్రణాళిక 'అన్ని ప్రతిపక్షాలతోనూ అన్ని పౌర సంఘాలు, విప్లవ సంఘాలతోనూ కూడిన పౌర విప్లవ కూటమి' ఏర్పడాలన్న పిలుపును ఇచ్చింది.

ఇంకా అది అనేక ప్రతిపాదనలు చేసింది. పోరాటాన్ని నడిపేందుకు ఒక ఉమ్మడి విప్లవ వేదిక ఏర్పాటు. తాత్కాలిక ప్రభుత్వానికి ఒక వ్యక్తిని అధినేతగా ప్రకటించడం క్యూబా అంతర్గత వ్యవహారాల్లో మరో దేశపు జోక్యాన్ని ఆహ్వానించడం కానీ లేదా ఆమోదించడం కానీ ఈ వేదిక చేయదు. అంతేకాకుండా రాజకీయాల నుండి సైన్యాన్ని పూర్తిగా తొలగిస్తుంది. ఒక సంవత్సరం లోపు ఎన్నికలను జరుపుతుంది.

ఈ తాత్కాలిక ప్రభుత్వానికి ఒక కార్యక్రమం కూడా ప్రకటించింది. పౌర, సైనిక రాజకీయ ఖైదీలందరికీ విముక్తి, పత్రికా, రేడియో స్వేచ్ఛా రాజ్యాంగం హామీ ఇచ్చింది అన్ని పౌర, రాజకీయ హక్కులు అందరికీ, అన్ని మునిసిపాలిటీలలో తాత్కాలిక మేయర్ల నియామకం. ప్రభుత్వంలో అన్ని రకాల అవినీతికి అడ్డుకట్ట వేయడం. అన్ని ప్రభుత్వ సంస్థల్లోనూ సమర్థతను పెంపొందించడానికి చర్యలు. సివిల్ సర్వీసుల ఏర్పాటు. కార్మిక సంఘాల రాజకీయాలను ప్రజాస్వామీకరించడం, అన్ని ట్రేడ్ యూనియన్లు, పరిశ్రమల్లో స్వేచ్ఛగా ఎన్నికలు జరపడం, నిరక్షరాస్యతపై యుద్ధం, పౌర విద్యకు పెద్దపీట, సమాజం పట్ల, మాతృదేశం పట్ల బాధ్యతలు, హక్కుల విషయాలలో చైతన్యం పెంచడం. వ్యవసాయ సంస్కరణలు తీసుకురావడం. భూసంస్కరణలు అమలు చేయడం. చెరుకు రైతులందరినీ యజమానులుగా ప్రకటించడం. కౌలుకు పోరాటం చేస్తున్న వారికి ఆ భూమి యజమానికి తగిన పరిహారం చెల్లించి వారికే యాజమాన్యం ఇవ్వడం, ద్రవ్య స్థిరత్వాన్ని సాధించడం కోసం స్థిరమైన ఆరోగ్యకరమైన ద్రవ్య విధానాన్ని రూపొందించడం, ఉత్పాదక కార్యక్రమాలు చేపట్టడం, పారిశ్రామికీకరణను త్వరితం చేయడం, కొత్త ఉద్యోగాలను సృష్టించడం. ఇలా తన కార్యక్రమాన్ని ప్రకటించింది.

దీనితోపాటు మరో రెండు ముఖ్యమైన విషయాలు చెప్పుకోవాలి. మొదటిది తాత్కాలిక ప్రభుత్వానికి అధ్యక్షుడిని నియమించడం. స్వేచ్ఛ కోసం స్వతంత్రం కోసం ఒక పిలుపునిస్తే దాని వెనుక క్యూబా ప్రజలందరూ ఐక్యంగా నిలబడతారనీ, ఆ పిలుపును ఇవ్వగలిగిన వ్యక్తి నిజాయితీపరుడై, నిష్పక్షపాతంతో వ్యవహరించాలి. అలాంటి సమర్థుడైన క్యూబా రిపబ్లిక్‌కు అధ్యక్షత వహించగలిగిన వ్యక్తులు చాలా మంది వున్నారు" అని ఆ ప్రకటన పేర్కొంది. (ఆ ప్రకటనపైన సంతకం చేసిన వారిలో ఒకరైన ఫెలిపె పాజోస్‌కు అంత మంది లేరని తెలుసు. కేవలం ఒక్కరే వున్నారని తెలుసు. ఆ ఒక్కరూ తానేననీ తెలుసు) రెండవది : ఈ నియామకం రాజకీయాలతో సంబంధంలేని పౌర సంస్థలు చేయాలి. దాని వలన అధ్యక్షుడు ఏ ఒక్క పార్టీకి చెందకుండా వుంటాయి. దీనివలన నిష్పాక్షికమైన ఎన్నికలు జరుగుతాయి.

“చర్చల కోసం సియా[్రా రావలసిన అవసరమేమీ లేదు. హవానాలోనూ, మెక్సికోలోనూ మా ప్రతినిధులు ఉంటారు” అని కూడా ఆ డాక్యుమెంట్ పేర్కొంది. వ్యవసాయ సంస్కరణల గురించి మరింత స్పష్టమైన ప్రకటనలు చేయాలని ఫైడల్ పట్టుపట్టాడు. అయితే ఆ యిద్దరు ఆటవిక మనుషులను ఒప్పించడం చాలా కష్టం అయ్యింది. “ఉపయోగంలేని భూమిని పంపిణీ చేసేందుకు వ్యవసాయ సంస్కరణలకు పునాదులు వేయాలి” అన్నమాటతోపాటు ఆ భూమిపైన గతంలో యాజమాన్యపు హక్కును కలిగి వున్న వారికి నష్టపరిహారం చెల్లించిన తర్వాత” అన్నమాట చేరింది.

నిజంగా ప్రకటించిన కొన్ని అంశాలను విప్లవం నెరవేర్చ లేకపోయింది. ప్రణాళికలో ప్రకటించిన అంశాలను ఐక్యతను శత్రువు బద్దలు కొట్టగలిగాడు. విప్లవ సైన్యాన్ని వాళ్ళు గుర్తించ నిరాకరించారు. భవిష్యత్తులో ఏర్పడబోయే విప్లవ ప్రభుత్వాన్ని గుర్తించ నిరాకరించారు.

ఒప్పందంతో మేం సంతృప్తి చెందలేదు. కానీ అది తప్పనిసరి. ఆ సమయంలో అదే ప్రగతిశీలమైంది. అది విప్లవోద్యమానికి తాత్కాలిక ఆటంకం అని తెలుసు అయినా దానితో రాజీపడాల్సి వచ్చింది. అయితే శత్రువు తన కుట్ర ద్వారా మేము కుదుర్చుకున్న ఆ ఇబ్బందికరమైన అవగాహన తెగిపోవడానికి అసౌకర్యవంతమైన సంబంధాలను తెలుసుకోడానికి సాయం చేశాడు. తద్వారా ప్రజలకు ఈ వ్యక్తుల అసలు ప్రయోజనాలేమిటో తెలిపేలా చేశాడు.

ఇది కనీస కార్యక్రమం అని మాకు తెలుసు. మా కృషికి పరిమితులు విధించే కార్యక్రమం అని తెలుసు. అయితే సియర్రా మేస్ట్రాలో కూర్చుని మా అభిప్రాయాలను రుద్దడం సాధ్యంకాదని మాకర్థమయ్యింది. చాలా కాలంపాటు మా సైనిక శక్తినీ, ప్రజల్లో ఫైడల్ కాస్ట్రోపైనున్న అపారమైన విశ్వాసాన్నీ వాడుకోడానికి ప్రయత్నించిన ‘స్నేహితుల’పైన ఆధారపడవలసి వచ్చింది. అంతేకాకుండా వాళ్ళు క్యూబాపైన సామ్రాజ్యవాదుల ఆధిపత్యం వుండాలని దళారీ బూర్జువాల ద్వారా అది కొనసాగాలనీ కోరుకున్నవారు.

ఆ ప్రణాళికలో ఇతర అంశాలు అనేకం వున్నాయి. అది సియర్రా మేస్ట్రా గురించిన ప్రస్తావన చేసింది. సియర్రా పరిస్థితి గురించి ప్రభుత్వ ప్రచారానికి ఎవరూ మోసపోవద్దు. సియర్రా మేస్ట్రా అనేది స్వాతంత్ర్యానికి సంకేతం. అది దేశ ప్రజల హృదయాల్లో పాతుకుపోయింది. మన ప్రజల విశ్వాసాన్ని ఎలా నిలుపుకోవాలో మాకు తెలుసు అని చెప్పేందుకు అది నిలిచి వుంది” అని ఆ ప్రకటన పేర్కొంది. “ఎలా చేయాలో

మాకు తెలుసు” అన్న మాటలకి ఎలా చేయాలో ఫైడల్ కాస్ట్రోకి తెలుసు అని అర్థం. మిగతా యిద్దరూ సియర్రా మేస్ట్రాలో జరిగిన పోరాటాలలో నిలబడలేకపోయారు. కనీసం ప్రేక్షకులుగా కూడా వుండలేకపోయారు. చిబాస్‌ను బాటిస్టా పోలీసులు బాగా ఇబ్బంది పెట్టారు. యిద్దరూ ఆ తర్వాత అమెరికా వెళ్ళిపోయారు. అది ఒక పథకం ప్రకారం జరిగిన కుట్ర. “స్వతంత్రాన్ని కాపాడడానికి” అనే పేరుతో క్యూబాలోని కొంత మంది పెద్దలు వచ్చారు. సియర్రా అడవుల్లో వున్న విప్లవ సైనిక నేతతో కలిసి సంతకాలు చేశారు. మియామిలో తమ ఇష్టానుసారంగా వ్యవహరించడానికి దాన్ని వాడుకున్నారు. అయితే రాజకీయ కుట్రలు ఎప్పుడూ శత్రువుల బలం మీద ఆధారపడి వుంటాయన్న విషయం వాళ్ళు మర్చిపోయారు.

ఆయుధాలు ప్రజల చేతుల్లో వుంటే ఏమవుతుందో వాళ్ళకి తెలియలేదు. గెరిల్లా సైన్యంపైనే పూర్తి విశ్వాసం వున్న మా నాయకుడు త్వరితంగా చర్యలు చేపట్టాడు. ద్రోహం విజయవంతం కాకుండా అడ్డుకున్నాడు. అనేక నెలల తర్వాత మియామి ఒప్పందం ఫలితాలు తెలిసిన తర్వాత ఫైడల్ నుంచి తీవ్రమైన సమాధానం రావడంతో శత్రువు నిశ్చేష్టుడయ్యాడు. మేం విచ్ఛిన్నకులమనీ సియర్రా నుండి మా అభిప్రాయాలను రుద్దుతున్నామని మా పైన ఆరోపణలు చేశారు. అయితే వాళ్ళు తమ ఎత్తుగడలను మార్చుకొని మరో వల పన్నాల్సిన అవసరం ఏర్పడింది. అదే కారకాస్ ఒప్పందం.

1957, జులై 12వ తేదీన విడుదలైన సియర్రా ప్రణాళిక పత్రికల్లో అచ్చయ్యింది. మాకైతే ఈ ప్రకటన కేవలం ఒక ఆటవిడుపు. శత్రువును యుద్ధ భూమిలో ఓడించడం అన్నది మా ప్రధాన కర్తవ్యం. నేను కమాండర్ ఒక కొత్త పటాలాన్ని ఏర్పాటు చేశారు. రామిరో వాల్టోస్ కెప్టెన్ అయ్యాడు. అతని ప్లాటూన్ నాతో చేరింది. కైరోరీ రెండో కూడా కెప్టెన్ అయ్యాడు. అతని ఒక ప్లాటూన్‌కు అధినేత. మా పటాలం మూడు సైనిక దళాలతో రూపొందింది. అగ్రగామి దళంగా వున్న ప్లాటూన్‌కు లాలో సార్టివాస్ కెప్టెన్. రామిరో వార్టెస్, కైరో రీడెండోలు మిగతా రెండు ప్లాటూన్లకు నాయకులు. మా పటాలాన్ని ‘ఏమీ లేని రైతుల’ పటాలంగా పిలిచేవాళ్ళు. ఇందులో 75 మంది వున్నారు. అందరం ఒకేలాంటి దుస్తులు ధరించే వాళ్ళం. ఆయుధాలు ధరించే వాళ్ళం. వాళ్ళను తలచుకుంటే నాకెంతో గర్వం. కొన్ని రాత్రుల తర్వాత మరింత గర్వపడ్డాను. మేం ‘కార్లోస్’ (ఫ్రాంక్ పాయిస్ మారుపేరు)కు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాం. ఆయన అంతిమ ఘడియాల్లో వున్నాడు. రాయడం వచ్చిన ఆఫీసర్లంతా సంతకాలు చేశారు. (చాలా మంది సియర్రా రైతులకు సంతకాలు రావు. అయినా వాళ్ళు గెరిల్లా సైన్యంలో ప్రముఖ స్థానాలకు వచ్చారు)

సంతకాలు రెండు కాలమ్‌లలో వున్నాయి. రెండో కాలమ్‌లో మా హోదాలు రాశాం. నా వంతు వచ్చినప్పుడు 'కమాండర్' అని రాయి అని ఫైడల్ చాలా మామూలుగా అన్నాడు. ఆ విధంగా ఏ లాంచనాలు లేకుండా నేను కమాండర్‌గా పదోన్నతి పొందాను. అది అప్పుడు కాలమ్-2గా వుండేది. తర్వాత కాలమ్-4గా పేరొందింది.

ఒక రైతు ఇంటిలో రాసిన ఆ ఉత్తరం మా మీద శత్రువు వత్తిడిని తగ్గించడానికి మా సరఫరాల కోసం శాంటియోగోలో వీరోచితంగా పోరాడుతున్న సోదరుడికి గెరిల్లాల ప్రేమ పూర్వకమైన సందేశం. ప్రతి ఒక్కరిలోనూ ఏదో రూపంలో సంతోషం నెలకొంది. ఆ రోజున నేను ప్రపంచంలోనే అమితంగా గర్వపడే మనిషినైనాను. నా హోదా, సీలియా (సాంచెజ్) నాకొక నక్షత్రం బహుమతిగా యిచ్చాడు. దాంతోపాటు మంజానిల్లో నుండి తెప్పించిన చేతి గడియారం యిచ్చారు. కొత్తగా ఏర్పాటైన నా పటాలం మొదటి పని సాంచెజ్ మోస్కెరాని పట్టుకోవడం. అతను బాటిస్టా మనుషుల్లోకెల్లా జిత్తులమారి. తప్పించుకుపోయాడు. ఒక రకంగా స్వతంత్రమైన జీవితం గడుపుతున్నాం. దానికి న్యాయం చేయాలి. దాంతో సాహస కృత్యాలకోసం పథకాలు వేస్తున్నాం. జులై 26 వస్తుంది. ఉత్సవాలు నిర్వహించాలి. నా ఇష్టమొచ్చినట్లు చేయమని ఫైడల్ నాకు అనుమతినిచ్చాడు. చివరి సమావేశంలో ఒక కొత్త డాక్టరు కలిశాడు. ఆయనపేరు సెర్జియో డెల్‌విల్లే. ఇప్పుడాయన మన విప్లవ సైన్యం జనరల్ స్టాఫ్‌కు అధిపతి. ఆ కాలంలో సియర్రా పరిస్థితులు అనుకూలించిన మేరకు ఆయన ప్రాక్టీసు చేశాడు. తర్వాత గెరిల్లాలలో చేరాడు.

మేం ఇంకా బతికే వున్నామన్న విషయాన్ని రుజువు చేయాలి. మరో ఫ్రంట్‌ను ఏర్పాటు చేసేందుకు మీరంతా చక్కెర మిల్లు నుండి తెచ్చిన ఆయుధాలను అంతకు ముందే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫాస్టినొ పెరెజ్ వంటి అనేక మంది విలువైన నాయకులు అరెస్టయ్యారు. మేము వేర్వేరు బృందాలుగా ఏర్పడడాన్ని ఫైడల్ వ్యతిరేకించాడు. అయినా కొంత మంది కామ్రేడ్స్‌వల్ల అది తప్పలేదు. ఫైడల్ ఆలోచనే సరైందని తర్వాత తెలిసింది. అప్పటి నుండి సియర్రా మేస్ట్రాని గెరిల్లా సైన్యాన్ని విస్తరించడంలో భాగంగా పటిష్టపరచడం మొదలుపెట్టాం.

## హతమైన పప్పీ

సియర్రా మేస్ట్రాలో పరిస్థితులు ఎంత దుర్భరంగా వున్నప్పటికీ ఆ రోజు అద్భుతంగా వుంది. టర్కినో ప్రాంతంలో అత్యంత లోతైన ఆగ్వారివిస్ లోయలో ప్రయాణిస్తున్నాం. చాలా ఓపిగ్గా సాంచెజ్ మస్కెరా దళాలను వెంటాడుతున్నాం. ఆ

హంతకుడు దారి పొడవునా విషాదాన్ని చవి చూసుకుంటూ వెళ్తున్నాడు. దారి పొడవునా దహనమైన పంట పొలాలు దర్శనమిస్తున్నాయి. నేవడా పర్వత శ్రేణుల్లోనో లేదా మేం 'వికలాంగ పర్వతశ్రేణి' అని పిలిచే ప్రాంతంలోనో కామిలో వుంటాడని మాకు తెలుసు. శత్రువు అటువైపే వెళ్తున్నాడు. ఒక డజను మందితో కామిలో హడావుడిగా వెళ్ళాడు. వీళ్ళే మూడు బృందాలుగా ఏర్పడాల్సి వచ్చింది. నా పని సాంచెజ్ మొస్కెరాని వెనక నుండి దాడి చేసి చుట్టుముట్టడం. అతన్ని చుట్టుముట్టి పట్టుకోవడమే మా ధ్యేయం. దాంతో మేం అతన్ని ఓపిగ్గా అనుసరించాం. చాలా దూరం వెళ్ళాలి. దారి పొడవునా కాలిపోయిన రైతుల ఇళ్ళు మాకు దర్శనమిచ్చాయి. శత్రు దళాలు దూరంగా వున్నాయి. వాళ్లెంత మంది వున్నారో తెలియదు. కొండలు లోయలగుండా మా ప్రయాణం చాలా కష్టంగా వుంది. శత్రువు లోయ మధ్యలోకి చేరుకున్నాడు. కొన్ని వారాల వయస్సున్న మా వేటకుక్క పిల్లవల్ల పరిస్థితి పాడైంది. లేకపోతే అంతా సవ్యంగానే జరిగిపోయేది. దాన్ని వెనక్కి వెళ్ళమని ఫెలిక్స్ ఎంతగా చెప్పినా వినకుండా అది మా వెనకే పడి వస్తుంది. దారి సరిగా లేదు. నడవడం చాలా కష్టంగా వుంది. కూలిపోయిన చెట్ల మీదగా నడవాలి. పొదల్ని, చెట్లని దాటుకుంటూ నడుస్తున్నాం. చాలా మౌనంగా మా చిన్న సైనిక పటాలం నడుస్తోంది. అడవిలో వుండే మామూలు చప్పుళ్ళు తప్ప విరిగిన కొమ్మ చప్పుడైనా లేదు. అకస్మాత్తుగా నిశ్శబ్దం బద్దలైంది. చిన్న కుక్కపిల్ల గట్టిగా మొరుగుతుంది. అది నడవలేక గట్టిగా మొరుగుతుంది. కూలిన చెట్టును దాటించమని దాని యజమానులను పిలుస్తోంది. మాలో ఒకరు దాన్ని పట్టుకొచ్చారు. మా ప్రయాణం కొనసాగుతోంది. శత్రువు కదలికల్ని గమనించడానికి సెంట్రీని పెట్టుకొని మేం ఒక చోట విశ్రమించాం. ఆ చిన్న కుక్కపిల్ల మరొక్కసారి పిచ్చెక్కినట్లు మొరగడం మొదలుపెట్టింది. ఎంత సముదాయించబోయినా లాభం లేకపోయింది. దాన్ని వదిలిపోతామని భయపడ్డ ఆ చిన్న జంతువు మొరుగుతూనే వుంది. నేనే ఆదేశమిచ్చాను. నాకు గుర్తుంది. 'ఫిలిక్స్, ఆ కుక్క మొరగడం ఆపాలి. గొంతు పిసికేయ్. నీదే బాధ్యత అది మొరగకూడదు' అన్నాను. అతనూ ఆ చిన్న కుక్క పిల్లా పటాలం మధ్యలో వున్నారు. చాలా నెమ్మదిగా ఒక తాడు అందుకున్నాడు. దాని మెడకు బిగించాడు. ఆ బుజ్జికుక్కపిల్ల కదలికలు మెల్లగా ఆగిపోయాయి. తాడు అంతగట్టిగా బిగుసుకున్నప్పటికీ ఒక మూలుగు దాని గొంతు నుండి బయటకు వచ్చింది. దానికి ముగింపు రావడానికి ఎంత సమయం పట్టిందో తెలియదు. కానీ మా అందరికీ మాత్రం ఆ హింస శాశ్వతంగా అలానే వుండిపోతుందా అనిపించింది. ఆఖరిసారిగా ఒక్కసారి కదిలి ఇక కదలడం మానేసిందా కుక్కపిల్ల.

ఆ సంఘటన గురించి ఒక్కమాటైనా ఎవరం మాట్లాడకుండా మా ప్రయాణం మొదలుపెట్టాం. సాంచెజ్ మొస్కెరా దళాలు మాకంటే కొద్దిగా ముందున్నాయి. కొన్ని క్షణాలలోనే కాల్పుల శబ్దం వినిపించింది. మేం త్వరత్వరగా లోయలోకి దిగాం. కామిలో దాడి ప్రారంభించాడని మాకు తెలుసు. శత్రువుతో ఏ క్షణంలో నైనా తలపడవలసి వస్తుందని జాగురూకతలో ముందుకు కదులుతున్నాం. కాల్పులు చాలా తీవ్రంగా జరుగుతున్నాయి. అయితే ఎక్కువ సేపు జరగలేదు. మేం అందరం ఉత్కంఠతో వున్నాం. చివరి ఇంటిలోకి వెళ్ళాం. దాని యజమానులు ఎక్కడ సామాను అక్కడ వదిలి వెళ్ళిపోయారు. సైనికులు ఏ ఆనవాళ్ళూ వదలలేదు. ఇద్దరు పైకి ఎక్కి చూసివచ్చి పైన ఒక సమాధి వుంది అన్నారు. సమాధిని తవ్విచూశాం. శత్రు సైనికుడొకరిని పాతిపెట్టారు అని చెప్పారు. చనిపోయిన వ్యక్తి గుర్తింపు పత్రాలను కూడా వాళ్ళు తీసుకువచ్చారు. చనిపోయింది శత్రు సైనికుడు అన్న విషయం తప్ప ఇంకేమీ తెలియలేదు. నిరుత్సాహంగా వెనుదిరిగాం. రాత్రికి ఒక ఇంటికి చేరాం. అది కూడా ఖాళీగా వుంది. అది మార్‌వెర్ట్ సెటిల్‌మెంట్‌లో వుంది. అక్కడ మేం విశ్రాంతి తీసుకోడానికి వీలు చిక్కింది. పంది మాంసం వండారు. కింద కూర్చొని తింటున్నాం. ఫెలిక్స్ అనుకుంటాను. కింద ఒక ఎముక పడేశాడు. దాని కోసం ఒక పెంపుడు కుక్క వచ్చింది. ఫెలిక్స్ దాని తల నిమిరాడు. అది అతని వైపు చూసింది. ఫెలిక్స్ కూడా చూశాడు. ఆ తర్వాత మేమిద్దరం ఒకరి వైపు ఒకరు చూసుకున్నాం. ఆ చూపుల నిండా అపరాధ భావన. అకస్మాత్తుగా అందరూ మౌనంగా వుండిపోయారు. అందరిలోనూ ఒక తెలియని అలజడి. హత్యగావించబడ్డ పప్పీయే మరో కుక్క కన్నులగుండా మమ్మల్ని చూస్తున్నట్టు అందరికీ అనిపించింది.

1958 ఏప్రిల్, జూన్ మాసాలలో రెండు రకాల ధోరణులను చూడవచ్చు. ఫిబ్రవరి ఆరంభంలో పినోడెల్ ఆగ్వా యుద్ధం తర్వాత ఉద్యమ వెల్లువ పెరిగింది. దేశమంతటా నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తున్నారు. ప్రత్యేకించి ఓరియంటే రాష్ట్రంలో అది మరింతగా పెరిగింది. జులై 26 ఉద్యమం పిలుపునిచ్చిన సార్వత్రిక సమ్మె (ఏప్రిల్ 9) విఫలం అయిన తర్వాత ఆ ఉద్యమ వెల్లువ తగ్గుముఖం పట్టింది. జూన్ నాటికి అది కనీస స్థాయికి చేరింది. ఒకటవ కాలమ్‌పైనా నియంత సైన్యాలు తమ ఉక్కుపిడికిలి బిగించాయి. కామిలో ఏప్రిల్ మొదట్లో కాలలో రెండో కాలమ్ కమాండర్‌గా వెళ్ళాడు. అక్కడ మైదాన ప్రాంతాల్లో అనేక సాహస కృత్యాలు చేశాడు. ఏప్రిల్ 9 వైఫల్యం తర్వాత సియర్రా సామర్థ్యంతోనూ, క్రౌర్యంతోనూ మైదాన

ప్రాంతంలో పోరాడిన మొదటి కమాండర్ అతనే. ఆ తర్వాత సియర్రాకి తిరిగి వచ్చాడు. విప్లవ వెల్లువ ఉధృతంగా వున్న రోజుల్లో అనేక విప్లవ శిబిరాలను ఏర్పాటు చేశాం. అందులో నిజంగా పోరాడేందుకు సిద్ధపడిన వాళ్ళున్నారు. బట్టలకి మట్టికాకుండా హవానా విజయోత్సవాల్లో చేరాలని ఆలోచించే వాళ్ళు వున్నారు. నియంతల అణచివేత మొదలైన తర్వాత, ఏప్రిల్ 9 తర్వాత ఆ బృందాలు అదృశ్యం అవడమో లేదా సియర్రాలో చేరడమో జరిగింది.

ఆ నిర్బంధంలో చాలా మేరకు దళాల ఆత్మస్థైర్యం దెబ్బతిన్నది. దీన్ని ఆసరాగా చేసుకొని నియంత సైన్యం కొన్ని కరపత్రాలు ప్రచురించి విమానాల్లోంచి విప్లవ ప్రాంతాల్లో వెదజల్లారు. అవి ఈ విధంగా వున్నాయి.

సహదేశ భక్తుల్లారా : విప్లవ కార్యక్రమాల్లో నిమగ్నమై పల్లెల్లోనూ, అడవుల్లోనూ వున్నారా? మీరు తిరిగి మా కుటుంబాలకు కలుసుకొని ఆనందంగా వుండే అవకాశం వుంది. మీ తప్పుల్ని తెలుసుకొని తిరిగిరండి.

మీరు మీ ఆయుధాలను వదిలి చట్టానికి కట్టుబడి వుండేట్టయితే మీ ప్రాణాలకూ, కుటుంబాలకూ ఎటువంటి హానీ తలపెట్టరాదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మీరు మీ రాష్ట్ర గవర్నర్‌నో, మీ మున్సిపాలిటీ మేయర్‌నో, పార్లమెంటు సభ్యుడినో, సమీప మిలటరీ, నావికాదళం, లేదా పోలీస్‌స్టేషన్‌కో, సంబంధిత అధికారి దగ్గరకు వెళ్ళి కలవండి. మీరు గ్రామీణ ప్రాంతాల్లో వుంటే భుజం మీద తుపాకీ పెట్టుకొని చేతులు పైకెత్తిరండి. పట్టణ ప్రాంతంలో వుంటే మీ ఆయుధాన్ని సురక్షితమైన ప్రాంతంలో వుంచి రండి. మీరు సమాచారం అందించగానే దాన్ని అధికారులు తీసుకువస్తారు. ఈ పని త్వరగా చేయండి. ఎందుకంటే మీరున్న ప్రాంతంలో ఏరివేత చర్యలు ముమ్మరం కాబోతున్నాయి.

ఆ తర్వాత లొంగిపోయిన వారి ఫొటోలను ప్రచురించారు. వాటిలో కొన్ని నిజమైనవి. కొన్ని నకిలీవి. విప్లవ ప్రతీఘాత చర్యలు ముమ్మరమయ్యాయన్నది స్పష్టంగా తెలుస్తున్నది. చివరికి అది సియర్రాని చుట్టుముడుతుంది. ఏప్రిల్ చివరలోనూ మే మొదట్లోనూ అది తారా స్థాయిలో వుంది. మొదటి దశలో నాలుగో బ్రిగేడ్ ఆక్రమణలో వున్న ప్రాంతాన్ని విముక్తి చేయడం మా కర్తవ్యం. అది లాస్ మినాస్ డి బెయ్‌సిటో వరకూ విస్తరించి వుంది. సాంచెజ్ మొస్కెరాం అక్కడే వున్నాడు. మా పోరాటం అంటూ

దొంగ దెబ్బతీయడమే తప్ప యిరు వర్గాలూ ముఖాముఖీ తలపడటంలేదు. రాత్రిపూట మేం ఎం-26 ఫిరంగులు పేల్చేవాళ్ళం. అయితే వాళ్ళకి దాని శక్తి ముందే తెలుసు. వాళ్ళ బస చుట్టూ పెద్ద తీగల జల్లెడ ఏర్పాటు చేసుకున్నారు. పాల క్యానులు దానికి తగిలి పెద్ద చప్పుడు సృష్టించడం తప్ప మరేం చేసేవి కావు.

మా శిబిరం లాస్ మినాస్‌కి రెండు కిలోమీటర్ల దూరంలో లా బటీలియా అనే ప్రాంతంలో ఒక భూస్వామి ఇంట్లో ఏర్పాటయింది. అక్కడి నుండి సాంచెజ్ మొస్కెరా కదలికలపైన నిఘా వేశాం. ఆ దుండగులు పొద్దున్నే బయటకు వెళ్ళి రైతుల గుడిసెల్ని తగలబెట్టడం, వాళ్ళని దోచుకోవడం మేం అక్కడికి చేరేలోపు వెళ్ళిపోవడం జరుగుతున్నది. కొన్నిసార్లు అక్కడక్కడా వున్న మా రైఫిల్ యూనిట్ల మీద దాడులు చేసి వాళ్ళని తరిమికొడుతున్నారు. మాతో సంబంధాలున్నాయని అనుమానం వస్తే ఆ రైతుల్ని చంపేస్తున్నారు.

మేం ఒక ఇంట్లో వున్నాం. అది అడవి కాదు. చెట్లూ పొదలూ ఏం లేవు. అయినా మాపైన విమాన దాడిని ఎందుకు చేయలేదో నాకు అర్థంకాలేదు. సాంచెజ్ మొస్కెరాకి మాతో తలపడే వుద్దేశం లేదని అనుకున్నాం. ఎయిర్‌ఫోర్స్ వాళ్ళని పిలిస్తే ఇంత దగ్గరలో వుంటే ఎందుకు దాడి చేయలేదన్న దానికి వివరణ యివ్వాల్సి వస్తుందనే అతను పిలవలేదనిపించింది. అయినా మా మధ్య మెరుపుదాడుల పోరు సాగింది.

ఆ రోజుల్లో ఒకసారి నేను ఒక సహాయకుణ్ణి తీసుకుని ఫైడల్‌ను కలవడానికి వెళ్ళాను. ఆయన అప్పుడు ఎల్ జిబారోలో వున్నాడు. ఒక రోజంతా నడక. ఫైడల్‌తో ఒక రోజు గడిపిన తర్వాత నేను తిరుగుముఖం పట్టాను. ఎందుకో సరిగా గుర్తులేదు కానీ నాతోపాటు వచ్చిన సహాయకుడు అక్కడే వుండవలసి వచ్చింది. నేను మరో గైడును తీసుకొని రావలసి వచ్చింది. మా శిబిరానికి దగ్గరగా వచ్చాం. కొంత దూరం రోడ్డుంది. తర్వాత అన్నీ పొలాలు. ఒక పొలంలో వరుసగా శవాలు కన్పించాయి. మేం గుర్రాలు దిగి చూశాం. వాళ్ళు మాకు ఆహారం తెస్తున్న వాళ్ళు. వాళ్ళని పసిగట్టి సాంచెజ్ మొర్కెస్ చంపేశాడు. నాతోపాటు ప్రయాణం చేస్తున్న గైడు ఆ దృశ్యాన్ని చూసి జడుసుకున్నాడు. కౌబాయ్ సినిమాల్లో హీరో పక్కనున్న వ్యక్తి శవాలను పరికించి చూసినట్లుగా అతనా శవాలను చూశాడు. ఇక నాతో రానని చెప్పాడు. నేనొక్కణ్ణే బయలుదేరవలసి వచ్చింది. ఒక కాఫీతోట మధ్యలోంచి వెళ్ళాను. మొదట ఒక ఇల్లు కన్పించింది. అందులో ఎవరూ లేరు. అక్కడికి నేను వెళ్ళేసరికి పెద్ద చప్పుడయ్యింది. నేను కాల్పులు జరపడానికి

సిద్ధమయ్యాను. తీరా చూస్తే అది ఒక పంది. నన్ను చూసి బెదిరిపోయింది. ఆ తర్వాత ఒక కామ్రేడ్ నిద్రపోతూ కన్పించాడు. దళానికి నాయకత్వం వహిస్తున్న యూనివర్సో సాంచెజ్ శత్రువులు దాడి చేయవచ్చనే అనుమానంతో ఇంటిని ఖాళీ చేయమని ఆదేశించాడు. దళం అంతా ఎవరికి వారు విడిపోయి ఆ ప్రాంతాన్ని కాపాడుతున్నారు. ఇది పెద్ద చెప్పుకో దగ్గ విషయం ఏమీ కాదు. కానీ ఒక సంతృప్తి కలిగే విషయంగా, ధైర్యాన్ని కూడదీసుకున్న సందర్భంగా గుర్తుంది. ప్రయాణం అంతా భయం భయంగా వుండి ప్రాంతానికి చేరగానే ధైర్యం వచ్చిన సందర్భం. అయితే శాంతారోజూ అనే చిన్న కుగ్రామాలలో సాంచెజ్ మొర్కెస్ బలగాలతో పెద్దయుద్ధం జరిగింది. అతను ఆ గ్రామంలో ఉన్నట్టు మాకు తెలిసింది. మేం అక్కడికి బయలుదేరాం. నాకు ఉబ్బసం ఉంది. దాంతో ఒక చిన్న గుర్రం మీద నేను వెళ్తున్నాను. దాంతో నాకు బాగా స్నేహం కుదిరింది. ఒక్కచోట నుండి కాక అనేక ప్రాంతాల నుండి కాల్పులు జరుగుతున్నాయి. దాంతో నేను గుర్రం దిగాల్సివచ్చింది. చిన్నకొండ మీద ఒక బృందంతో కలిసి పొజిషన్ తీసుకున్నాను. శత్రువు లక్ష్య రహితంగా మోర్టార్లు పేలుస్తున్నాడు. ఒక్క క్షణం కాల్పులు తీవ్రతరమయ్యాయి. నా కుడి వైపుకి కాల్పులు జరుగుతున్నాయి దాంతో పొజిషన్ మార్చాలనుకున్నాను. ఇంతలో ఎడమ వైపు నుండి కాల్పులు మొదలయ్యాయి. నా సహాయకుణ్ణి ఎక్కడికో పంపేశాను. రెండు వైపుల నుండీ కాల్పులు జరుగుతుంటే నేను ఆ మధ్యలో ఒంటరిగా మిగిలిపోయాను. నా ఎడమ వైపున సాంచెజ్ మొస్కెరా బలగాలు. కొన్ని మోర్టార్ బాంబులు పేల్చిన తర్వాత పెద్దపెద్దగా అరుచుకుంటూ వెళ్ళిపోయారు. మా వాళ్ళకి పెద్దగా అనుభవంలేదు. ఒకటి రెండుసార్లు కాల్పులు జరిపి కొండ కిందికి పారిపోయారు. నేను ఒక్కణ్ణే మిగిలిపోయాను. కొంత సేపటికి సైనికుల హెల్మెట్‌లు కన్పించాయి. ఒక గూండా మా వాళ్ళ వెనక పరుగెడుతూ కాల్పులు జరుపుతున్నాడు. అది చూసి నేను అతని వైపు కాల్పులు జరిపాను. అతనికి తగల్లేదు. అయితే పది మంది నన్ను చూశారు. పది రైఫిళ్ళు నా వైపు కాల్పులు జరపడం మొదలు పెట్టాయి. వెయ్యి తూటాలున్న తోలు బెల్టు నా భుజం మీద వుంది. నేను అడ్డదిడ్డంగా పరుగెట్టడం మొదలుపెట్టాను. శత్రు సైనికుల అరుపులు వినబడుతున్నాయి. నేను చెట్ల చాటుకు వెళ్ళేలోపు నా పిస్టల్ జారిపడి పోయింది. మళ్ళీ వెనక్కి వెళ్ళి దాన్ని తెచ్చుకున్నాను. శత్రువులు పేలుస్తున్న రైఫిల్ మళ్ళా దుమ్ము రేపుతున్నాయి. మా కామ్రేడ్‌లు ఏమయ్యారో తెలియదు. దాడి ఫలితం ఏమిటో తెలియదు. అడవుల్లోకి వెళ్ళాను. వాళ్ళ వెనక చేరిన తర్వాత నేను సురక్షితమైన ప్రాంతంలోనే వున్నాననిపించింది. నా ఉబ్బసం రోగం కరుణించి

పరుగుకు అవకాశం కల్పించింది. కానీ ఇప్పుడు దాని ప్రభావం కన్పిస్తుంది. ఛాతీలో నా గుండె ఎగిరి గంతులేస్తోంది. ఇంతలో ఎవరో వస్తున్నట్లుగా కొమ్మలు విరుగుతున్న చప్పుడు. పారిపోవడానికి సత్తువలేదు. పారిపోవాలన్న కోరిక ఎంతగా పెరుగుతున్న పారిపోలేక పోయాము. ఇంతలో ఒక కామ్రేడ్ వచ్చాడు. అతను కొత్తగా చేరినవాడు. దారి తప్పి యిటు వచ్చాడు. అతను నన్ను ఓదార్చడానికి ప్రయత్నించాడు. 'బాధపడకు కమాండర్! నేను కూడా నీతోపాటు మరణిస్తాను' అన్నాడు. నాకు చనిపోవాలని లేదు. అతనికి తన తల్లి గురించి చెప్పాలనుకున్నాను. చెప్పలేదనుకుంటాను. ఆ రోజంతా ఎంతో పిరికిగా తయారయ్యాను.

జరిగిన సంఘటనలన్నింటినీ రాత్రిపూట సమీక్షించుకుంటాం. మారినో అనే అద్భుతమైన కామ్రేడ్ చనిపోయాడు. అంతకు మించి శత్రువుకు పెద్దగా విజయాలేం లభించలేదు. సైన్యం వదలివెళ్ళిన ప్రదేశంలో ఒక రైతు శవం కన్పించింది. అతని నోట్లో తుపాకి పెట్టి కాల్చి చంపారు. ఎందుకు చంపారో ఎవరికి తెలుసు? అప్పుడే వారితో గడపడానికి చిన్న డబ్బా కెమెరా వేసుకొని అర్జెంటీనా జర్నలిస్టు జార్జి రికార్డో మాసెట్టి వచ్చాడు. అతను ఆ రైతు శవాన్ని ఫొటో తీసుకున్నాడు. అతను సియర్రాకు రావడం అదే మొదటిసారి. ఆ తర్వాతి కాలంలో అతనితో మా స్నేహ సంబంధం కొనసాగాయి.

ఆ యుద్ధాల తర్వాత మేం లా ఒటీలియా నుండి కొంచెం వెనుకడుగు వేశాం. రామిరోవాల్డిస్ కమాండర్‌గా ప్రమోట్ అయినా స్థానాన్ని ఆక్రమించాడు. కొంత మంది ఉద్యమకారులతో నేను ఆ ప్రాంతాన్ని విడిచివెళ్ళాను. కొత్తగా రిక్రూట్ అయిన వారికి శిక్షణ యిచ్చే స్కూలు బాధ్యతలు తీసుకున్నాను. అంతే కాకుండా సైన్యం దాడిని తిప్పికొట్టడం అనే ముఖ్యమైన కర్తవ్యం వుంది. ఏప్రిల్ చివరి రోజులు, మే మొదటి రోజుల్లో మేం రక్షణ ప్రాంతాలను ఎంపిక చేయడంలో నిమగ్నమయ్యాం. దొరికినంతగా ఆహార పదార్థాలని మందుల్ని కొండపైకి చేరవేశాం. రానున్నది పెద్ద దాడి.

సమాంతరంగా చెరుకు తోటల యాజమాన్యాల నుండి పన్నులు వసూలు చేయడం మొదలుపెట్టాం. ఆ రోజుల్లో రెయిగో ఫెర్నాండెజ్ మమ్మల్ని చూడడానికి వచ్చాడు. పశువుల మందల యజమాని అతను. మాకు చందమామనీ, చుక్కల్నీ యిస్తానని ప్రగల్భాలు పలికాడు. అతను మైదాన ప్రాంతం చేరుకోగానే మాకిచ్చిన మాట మర్చిపోయాడు. చెరకుతోట యజమానులు ముందు మాకు ఏమి యివ్వలేదు. అయితే బాగా బలపడిన తర్వాత మాకు అవసరమైనవన్నీ సమకూడినాయి.

కొంత కాలం తర్వాత మా ప్రాంతాన్ని రక్షించడానికి కామిలోని పిలిచారు. మా ప్రాంతంలో ఒక రేడియో స్టేషన్, ఆస్పత్రులు వున్నాయి. కొండపైన ఒక చిన్న విమానం దిగడానికి ఏర్పాట్లు జరిగాయి. మనకి శత్రు సైనికులు ఎంత మంది అన్నది ముఖ్యం కాదు. మనం ఆధారపడ గలిగిన వాళ్ళు ఎంత మంది వున్నారన్నది ముఖ్యం అన్న సూత్రాన్ని ఫైడల్ పాటించాడు. అది మా ఎత్తుగడ. అందుకే మొత్తం బలగాలని కమాండ్ స్టేషన్ దగ్గర మోహరించింది. మేం ఊహించినట్టుగానే మే 25వ తేదీన దాడి మొదలైంది. మా దగ్గర పనికొచ్చే రైఫిళ్ళు 200 కంటే ఎక్కువ లేవు. ఫైడల్ కాస్ట్రో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి కాఫీ పంట వ్యవహారాలు మాట్లాడుతుండగా ఈ దాడి మొదలైంది. ఆయన దాదాపు 350 మంది రైతులను ఆహ్వానించాడు. పంట సమస్యల్ని పరిష్కరించడంపట్ల వాళ్ళు ఆసక్తిగా వున్నారు. సియర్రా డబ్బుని రూపొందించుకుందాం అనీ దాంతో చెల్లింపులు జరపవచ్చునీ, ఉత్పత్తిదారులు, వినియోగదారుల సహకార సంఘాలు ఏర్పాటు చేయవచ్చునీ, ఒక పర్యవేక్షక సంఘాన్ని ఏర్పాటు చేయవచ్చునీ, అంతే కాకుండా పంటలు పండించడానికి విప్లవ సైన్యం సహాయపడుతోందనీ ఫైడల్ ప్రతిపాదించాడు. ప్రతి విషయాన్ని రైతులు ఒప్పుకున్నారు. అయితే ఫైడల్ తన ఉపన్యాసాన్ని ముగించబోతుండగా మెషిన్‌గన్‌ల మోతలు వినిపించాయి. శత్రు సైన్యం కెప్టెన్ ఏంజిల్ వెర్టీసియా మనుషుల పైన విరుచుకుపడింది. ఎయిర్‌ఫోర్స్ రంగంలోకి దిగి ఆ ప్రాంతాన్ని ధ్వంసం చేయడం మొదలు పెట్టింది.

## నిర్ణయాత్మకమైన సమావేశం

1958 మే 3వ తేదీన రోజంతా ఒక కీలకమైన సమావేశం జరిగింది. అది జరిగినట్లు యిప్పటి దాకా ఎవరికీ తెలియదు. మా విప్లవ వ్యూహం రూపొందించడంలో ఆ సమావేశానికి ఎంతో కీలకమైన పాత్ర వుంది. తెల్లవారుజామున మొదలై మళ్ళీ తెల్లవారిందాకా ఆ సమావేశం జరిగింది. ఆ సమావేశం ఏప్రిల్ 9 వైఫల్యం కారణాలు, దాని ప్రభావం చర్చించింది. జులై 26 ఉద్యమాన్ని గుర్తించడం, నియంతల గెలుపువల్ల కలిగిన బలహీనతని అధిగమించడానికి చర్యల గురించి కూడా చర్చ జరిగింది. నేను నేషనల్ డైరెక్టరేట్ సభ్యుడిని కాకపోయినా కామ్రేడ్స్ ఫాస్టినో పెరెజ్, రినె లాయోస్ లాటోర్‌లు నన్ను ప్రత్యేకంగా ఆహ్వానించడంతో సమావేశానికి వెళ్ళాను. మొదట్లో నేను వాళ్ళని తీవ్రంగా విమర్శించేవాడిని. వాళ్ళతోపాటు ఫైడల్, విల్మా ఎడ్మిన్ (అజ్ఞాతంలో డిబోరా), నికో టారెస్, లూయిస్ బుచ్, సిలియా సాంచెజ్, మార్సెల్ ఫెర్నాండెజ్ (అప్పటు

జోయిలో), హైడీ శాంతి మారియా, డేవిజ్ సాల్వడార్, ఎన్నో ఇన్‌ఫాంట్ మొదలైన వాళ్ళున్నారు. ఆ సమావేశం ఎంతో ఉత్కంఠతో జరిగింది. అప్పటి వరకు జులై 26 ఉద్యమానికి నాయకత్వం వహించిన కామ్రేడ్ల పనితీరుపైన తీర్పు చెప్పే సమావేశం కావడంతో అంత ఉత్కంఠత ఏర్పడింది. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఫైడల్ నాయకత్వంపైన తిరుగులేని విశ్వాసాన్ని ప్రకటించాయి. అప్పటి వరకూ నాయకత్వం వహించిన వారి పైన తీవ్రమైన విమర్శలు పెట్టారు. అన్ని దళాలకూ కమాండర్ ఇన్‌చీఫ్‌గా ఫైడల్‌ను ఎన్నుకోవడమే కాకుండా జులై 26 ఉద్యమానికి ఫైడల్‌నే ప్రధాన కార్యదర్శిగా ఆ సమావేశం ఎన్నుకొంది. అప్పటి వరకూ జరిగిన సంఘటనలనూ, అందులో ప్రతి వ్యక్తి ప్రవర్తననూ విడివిడిగా విశ్లేషించారు. దాంతో చర్చలు బాగా వేడెక్కాయి. పోరాటంలో ప్రజా సోషలిస్టు పార్టీ పాత్రను వ్యతిరేకించిన కార్మిక ప్రతినిధులపైన చర్చ మరింత వేడిగా జరిగింది. ఓటమికి బాధ్యతంతా వారిదే కాకపోయినప్పటికీ ఎక్కువ బాధ్యత వాళ్ళదే అన్న అంచనాకు వచ్చాం. కార్మిక ప్రతినిధి డేవిడ్ సాల్వడర్ ఎక్కువ విమర్శలకు గురయ్యాడు. హవానా బాధ్యుడైన ఫాస్టినో పెరెజ్, మిలీషియాకు బాధ్యుడైన రీనో రాయోస్ లాటూర్ తీవ్ర విమర్శలపాలయ్యారు.

సాల్వడర్ తన తీవ్రవాద దృక్పథంలో సమ్మె నడిపాడనీ, ఫాస్టినో రాజధానిని పట్టుకోవడం గురించి సరిగ్గా ఆలోచనలేదనీ, డేనియన్ విప్లవకారుల ఎంపికలో సరైన నైపుణ్యాన్ని ప్రదర్శించలేదనీ విమర్శలనెదుర్కొన్నారు. సియర్రాకీ, లానోకీ మధ్య విభజన రేఖ స్పష్టంగా కన్పించింది. సియర్రా ప్రతినిధులు గెరిల్లా యుద్ధ అనుభవంతో పరిపక్వతను సాధించారు. లానో ప్రతినిధులు అంతగా పరిపక్వతను సాధించలేరు. మరో ముఖ్యమైన అంశం కూడా వుంది. ప్రాంతీయ ప్రభావం కూడా వుంది. లానా ప్రాంతంలో కామ్రేడ్లు తేమ వాతావరణానికి తగినట్లు పని చేయవలసి వచ్చింది. అదే ఉద్యమానికి తగిన పని తీరు అని వాళ్ళు భావించారు. దాంతో సియర్రా కంటే లానోకే ఎక్కువ ప్రాధాన్యత ఉందని వాళ్ళు భావించారు. నియంతృత్వ సైన్యాలను ఎదుర్కొనడంలో తీవ్రంగా విఫలం చెందిన తర్వాత ఒక ప్రాంతమే నాయకత్వం వహించే స్థితి వచ్చింది. అది సియర్రా. ఒకే ఒక్క నాయకుడు ముందుకు వచ్చాడు. అతను ఫైడల్ కాస్ట్రో. చాలా తీవ్రమైన చర్చల తర్వాత అనేక మార్పులు జరిగాయి. ఫాస్టినో పెరెజ్‌ను తన బాధ్యతల నుండి తప్పించి అతని స్థానంలో (డెలియో గోమెజ్) బచోవానీ, డేవిడ్ సాల్వడర్‌ను తన బాధ్యతల నుండి తప్పించి ఆ స్థానంలో నికో టోరెస్‌ను నియమించారు. ఉద్యమ అవగాహనకు సంబంధించి

ఈ మార్పువల్ల పెద్దగా లాభం ఏమీ లేదు. తర్వాత సియర్రా పిలుపు యివ్వబోయే సార్వత్రిక విప్లవ సమ్మె విషయంలో అన్ని కార్మిక శక్తులను సిద్ధపరిచే విషయంలో క్రమశిక్షణకు కట్టుబడి "స్టాలినిస్టులతో" కలిసి పని చేయడానికి తాను సిద్ధమేనని నికో తెలిపాడు. అయితే దానివలన ఫలితం పెద్దగా వుంటుందని తాను అనుకోవడం లేదని చెప్పాడు. అతను ఆ మాట పాపులర్ సోషలిస్టు పార్టీ కామ్రేడ్స్‌ను దృష్టిలో వుంచుకొని చెప్పాడు. డేనియల్ విషయంలో మరొకరిని ఆయన స్థానంలో నియమించాల్సిన అవసరం లేకపోయింది. లానో ప్రాంత మిలీషియా దళాలకు కూడా కాస్ట్రోనే కమాండర్–ఇన్–చీఫ్‌గా వున్నారు కాబట్టి డేనియల్ స్థానంలో మరొకరి నియామకం అవసరం లేదు. హైదీ శాంతా మారియాను జులై 26 ఉద్యమ ప్రతినిధిగా ప్రవాసంలో ఆర్థిక వ్యవహారాలు చూసేందుకు మియామీకి పంపాలని ఆ సమావేశం నిర్ణయించింది. రాజకీయరంగం విషయానికి వస్తే మొత్తం నేషనల్ డైరెక్టరేట్ సియర్రాకి పోవాలన్న నిర్ణయం జరిగింది. దానికి ఫైడల్ కాస్ట్రో ప్రధాన కార్యదర్శిగా వుంటారు. ఐదుగురు సభ్యులు కార్యదర్శివర్గం ఏర్పడింది. ఒక్కొక్కరు ఒక్కొక్క రంగం బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయా బాధ్యతలు ఎవరెవరు తీసుకున్నారో యిప్పుడు గుర్తులేదు. కానీ, ఆయుధాలకు సంబంధించీ, విదేశీ సంబంధాలకు సంబంధించిన వ్యవహారాలు మాత్రం ప్రధాన కార్యదర్శి నిర్వహించాలన్న నిర్ణయం జరిగింది. తమ బాధ్యతల నుండి తప్పుకున్న ముగ్గురు కామ్రేడ్‌లు సియర్రా వెళ్ళాలన్న నిర్ణయం జరిగింది. అక్కడ డేవిడ్ సాల్వడార్ కార్మిక ప్రతినిధిగానూ ఫాస్టినో, డేనియల్‌లు కమాండర్లుగానూ పని చేస్తారు. చివరి యుద్ధంలో శత్రు సైన్యంతో తీవ్రంగా పోరాడిన దళానికి డేనియల్ కమాండర్‌గా నియామకం అయ్యాడు. అతను శత్రువు మీద యుద్ధం చేస్తూనే మరణించి అమరుడయ్యాడు. ఫాస్టినోని హవానా తిరిగి వెళ్ళి అక్కడ రకరకాల బాధ్యతలు నిర్వహించాలని నిర్ణయం జరిగింది. నాయకత్వాన్ని వదిలేసి పని చేసిన తర్వాత సియర్రా పోరాటంలో చేరాలని నిర్ణయం జరిగింది. అతను అలాగే చేశాడు. ఫైడల్ కాస్ట్రో నాయకత్వం వహించిన కాలమ్‌లో అతను పని చేశాడు. చరిత్రలో జరిగిన సంఘటనలను జరిగినట్టుగానే చెప్పుకోవాలి. ఒక సందర్భంలో మాకు వ్యతిరేకంగా వుండేవాడు. ఫాస్టినో ఎంతో నిజాయితీ పరుడిగానూ, సాహసవంతుడిగానూ పేరొందాడు. అతని సాహసాలను నేను కళ్ళారా చూశాను. ఒకసారి మాకు ఆయుధాలను తీసుకువచ్చిన విమానాన్ని శత్రు విమానం పసిగట్టింది. అది శత్రువు చేతిలో పడకుండా ఫాస్టినో అవసరమైన చర్యలు చేపట్టాడు. మెసిన్‌గన్ నిప్పులు కురిపిస్తుండగా ఆ విమానాన్ని కాల్చేశాడు. అతని చరిత్రంతా ఆ విప్లవ దీక్ష కన్పిస్తుంది.

ఆ సమావేశంలో ఇంకా అంత ప్రాధాన్యతలేని అంశాలను చర్చించాం. మా మధ్య పరస్పరం సంబంధాలు ఎలా వుండాలో చర్చించాం. నగరాల్లో ఉద్యమ నిర్మాణం గురించి మార్సెలో ఫెర్నాండెజ్ చదివిన నివేదికపైన చర్చ జరిగింది. నేషనల్ డైరెక్టరేట్ నిర్ణయాలను పార్టీ విభాగాలకు పంపేందుకు మరొక నివేదిక తయారు చేయవలసిందిగా అతన్ని ఆదేశించారు. పౌరుల తిరుగుబాటు ఉద్యమ నిర్మాణం గురించి మరొక నివేదిక సమర్పించబడింది. ప్రవాస కమిటీ గురించి కామ్రేడ్ బుచ్ నివేదిక సమర్పించాడు. మేరియో లేరేనా అన్యమనస్కంగా పని చేస్తున్నాడనీ, ఉయాట్టియాతో పోలిస్తే అంత సమర్థవంతంగా పని చేయడంలేదని ఆ నివేదికలో చెప్పాడు. ప్రవాసంలో అప్పటి వరకూ పార్టీ పూర్తికాలం కార్యకర్తగా స్టైఫండ్ పొందుతున్నది అతను ఒక్కడే. అతనికి బదులు ఉయాట్టియాకు ఆ స్టైఫండ్ ఇవ్వాలని ఉద్యమం తరపున అతన్నే అధ్యక్ష అభ్యర్థిగా ప్రకటించాలని నిర్ణయం జరిగింది. మరియు లెరేనా ధోరణి మార్చుకోకపోతే ప్రవాస కమిటీ ఛైర్మన్ పదవి నుండి కూడా తొలగించాలన్న నిర్ణయం చేశారు. విదేశాల్లో అనేక సమస్యలున్నాయి. ఉదాహరణకు న్యూయార్క్‌లో ఆర్నాట్టు బారన్, ఏంజెల్ పెరెజ్, పాబ్లో డియాడ్ వర్గాలు వేర్వేరుగా పని చేయడమేగాక ఒక్కొక్కసారి పరస్పరం ఘర్షణ పడుతూ ఒకరి పనికి ఒకరు ఆటంకంగా తయారయ్యారు. జులై 26 ఉద్యమం నియమించిన ప్రవాస కమిటియే అధికారకమైన కమిటీ అని పేర్కొంటూ ప్రవాస కమిటియే అధికారకమైన కమిటీ అని పేర్కొంటూ ప్రవాస వర్గాలన్నింటికీ ఫైడల్ లేఖలు పంపాలని నిర్ణయం అయ్యింది.

అప్పటి వుల్ఫ్‌గంజ్ లార్జాబాల్ నాయకత్వంలోని వెనిజులా ప్రభుత్వం నుండి ఏ మేరకు సాయం అందే అవకాశాలున్నాయో సమావేశం చర్చించింది. ఆయన ఉద్యమానికి సాయం చేస్తానని మాట మార్చాడు. నిజానికి ఆయన చాలా సాయపడ్డాడు. ఆయన పైన మాకు ఒకటే ఫిర్యాదు. అతను విమానం నిండా ఆయుధాలతోపాటు 'విలువైన' మాన్యుల్ ఉరూట్టియా లియోను కూడా పంపాడు. నిజానికి మేం కోరుకుంటేనే ఆయన పంపాడు. సమావేశంలో మిగతా ఒప్పందాలు జరిగాయి. హేదీ శాంతామారియా మియామీ వెళ్తుంది. లూయిస్ బుచ్ ఉరూట్టియాకు సంబంధించిన కబురు తీసుకొని కారకాస్ వెళ్తాడు. కార్లోస్ ఫ్రాంకి సియర్రా వెళ్ళి రేడియో బాధ్యతలు చేపట్టాలి. వెనిజులా ద్వారా రేడియో కాంటాక్టు జరుగుతుంది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బట్టి అది ఎంత ప్రముఖమైన సమావేశమో చెప్పవచ్చు. ఉద్యమం ఎదుర్కొంటున్న అనేక క్లిష్ట సమస్యలకు

ఈ సమావేశంలో పరిష్కారం లభించింది. మొదటి దశలో ఉద్యమానికి ఫైడల్ కాస్ట్రో రాజకీయంగా, సైనికపరంగా కూడా నాయకత్వం వహిస్తాడు. అన్ని సాయుధ దళాలకూ ఆయనే కమాండర్–ఇన్–ఛార్జిగానూ, పార్టీ ప్రధాన కార్యదర్శిగానూ రెండు బాధ్యతలనూ నిర్వహిస్తాడు. ప్రత్యక్ష సాయుధ పోరాటం అన్న సియర్రా పంథానే అధికారిక పంథాగా ఆమోదించి దాన్ని అన్ని ప్రాంతాలకు విస్తరింపచేయాలి. ఆ విధంగా మొత్తం దేశాన్ని చేతిలోకి తీసుకోంది. మొదట్లో ఇంకా పరిస్థితులు అనుకూలంగా మారకముందే తగిన ఏర్పాట్లు చేయకుండానే సార్వత్రిక విప్లవ సమ్మె నిర్వహించాలని అనుకున్నాం.

దాంతోపాటు సియర్రాలో నాయకత్వం వుండాలన్న నిర్ణయం తీసుకోవడం ద్వారా నిర్ణయాలు తీసుకోవడంలో ఎదురయ్యే సమస్యల్ని పోగొట్టగలిగాం. నిజానికి కొత్తగా చేసిందేమీ లేదు. ఉన్న వాస్తవాన్ని నమోదు చేశాం. అంతే ఆయా సంఘటనలను విశ్లేషించడంలోనూ సరైన పంథాను అవలంబించాం. సియర్రా ప్రజలు చూపిన రాజకీయ అవగాహనకు తగిన గుర్తింపు వచ్చింది. అంతే. ఏప్రిల్ 9వ తేదీకంటే ముందు జరిగిన సమావేశంలో రూపొందించిన వ్యూహం ప్రకారం జరిపించే సార్వత్రిక సమ్మె విఫలమవుతుందన్న మా సందేహాలు సరైనవేనని సమావేశం అభిప్రాయపడింది. కొన్ని ముఖ్యమైన కర్తవ్యాలు మిగిలిపోయాయి. ముఖ్యంగా సైన్యం దాడిని తిప్పికొట్టాం. కాస్ట్రో నాయకత్వం వహిస్తున్న ఒకటవ కాలమ్ స్థావరాన్ని సైన్యం చుట్టుముడుతున్న నేపథ్యంలో అదెంతో అవసరం. ఆ తర్వాత మైదానాలను ఆక్రమించాలి. అంతిమంగా ప్రభుత్వ రాజకీయ సైనిక యంత్రాంగాన్ని నాశనం చేయాలి. ఈ కర్తవ్యాలు పూర్తి కావడానికి ఏడు నెలలు పడుతుంది. సియర్రా ఫ్రంట్‌ను బలోపేతం చేయడం తక్షణ అవసరం. చిన్న సైన్యం క్యూబాతో తేలిగ్గా సంబంధాలు పెట్టుకోగా కలుగుతుందనీ ప్రజల్లో విప్లవ బీజాలు నాట గలుగుతుందనీ చాటి చెప్పడానికి అదెంతో అవసరం. ఇతర దేశాలతో సంబంధాలను కొనసాగించడం కూడా అంతే అవసరం. కొన్ని రోజుల క్రితం ఫైడల్‌కీ జుస్టో కారిల్లోకీ మధ్య జరిగిన రేడియో సంభాషణ విన్నాను. జుస్టో మోంటు క్రిస్టో గ్రూపు నాయకుడు. ఆ గ్రూపు గూండాలతోనూ సామ్రాజ్యవాదుల ప్రతినిధులతోనూ నిండి వుంది. "శుద్ధి" సైనికులకు మద్దతు ప్రకటిస్తే కోరింది యిస్తానన్నాడు. దానికి సమాధానంగా ఆ విధంగా ప్రకటించడం అసాధ్యమేమీ కాదని అయితే మా జనం సైనికుల చేతిలో బాధితులు అవుతున్నప్పుడు మంచి, చెడులను వేరు చేసి చూడడం సాధ్యం కాదనీ ఫైడల్ చెప్పాడు. ఆ ప్రకటన చేయడం జరగలేదు. వేరెనాతోనూ, ఉర్రూటియాతోనూ ఫైడల్ మాట్లాడాడు. అన్ని గ్రూపుల్నీ ఐక్యం పర్చేందుకు ప్రయత్నం

జరిగింది. కారకాస్‌లో వాళ్ళు మా సాయుధపోరాటాన్ని సొమ్ము చేసుకోవాలనుకుంటున్నారు. అయితే మా ఆశయాలకు ప్రతినిధులుగా అంతర్జాతీయ గుర్తింపు పొందారు. కాబట్టి జాగ్రత్తగా వుండాలి. సమావేశం ముగిసిన వెంటనే ఎటు వాళ్ళు అటు వెళ్ళిపోయారు. మా చిన్న సైన్యానికి శత్రుసైన్యం నుండి ఏ మాత్రం నష్టం కలగకుండా రక్షణ వలయాలను సృష్టించడానికి ప్రయత్నిస్తున్న అన్ని జనుల్నీ పర్యవేక్షించే బాధ్యత నాకు అప్పగించబడింది. సియర్రాకి కారకాస్ నుండి లా బొటిల్లా లేదా లా మేసా వరకూ వున్న పర్వత ప్రాంతాల్లో మొదలవుతుంది. సియర్రా డి కారకాస్ దగ్గర పెరెజ్ దళం వుంది. వాళ్ళ దగ్గర ఆయుధాలు అంతగా లేవు. లా బొటిల్లా దగ్గర రాయిరో నాల్టెస్ దళాలు వున్నాయి. చిన్న భూభాగాన్ని 200 తుపాకులతో కాపాడాలి. కొన్ని రోజుల తర్వాత బాటిస్టా సైన్యం చుట్టు ముట్టి అంతం చేసే వ్యూహంలో మొదలు పెట్టింది.

## చివరి దాడి - శాంతా క్లారాయుద్ధం

ఏప్రిల్ 9 అనేది పదేపదే గుర్తుకు వచ్చే ఓటమి. అది శత్రువు వంటి మీద దుమ్ము కూడా లేపలేకపోయింది. అంతే కాదు ఆ విషాదకరమైన తేదీ తర్వాత శత్రువు ఓరియంట్ రాష్ట్రమంతటా సైనికబలగాలను మోహరించి సియర్రా మేస్ట్రా వరకూ తన విధ్వంసాన్ని విస్తరించుకుంటూ వస్తున్నాడు. దాదాపు పది వేల మంది సైనికుల్ని దించాడు. ఆ బలగాలతో మే 25వ తేదీన లాస్ మెర్సెడిస్ పైన దాడిని మొదలుపెట్టాడు. ఆ దాడి సందర్భంగా బాటిస్టా సైన్యంలో పోరాటపటిమ ఎంత పేలవంగా ఉందో తెలిసింది. అదే విధంగా వనరులు ఎంత తక్కువ వున్నాయో అర్థమైంది. ఉపయోగించడానికి పనికి వచ్చే 200 రైఫిళ్లతో అన్ని రకాల ఆయుధాలతో వున్న పది వేల మంది సైనికుల్ని ఎదుర్కోవాలి. మా కుర్రాళ్లు రెండు రోజులపాటు ఎంతో ధైర్యంగా పోరాడారు. ఒక్కొక్కరు పది పదిహేను మంది సైనికులతో తలపడ్డారు. అంతే కాదు ట్యాంకులు మోర్టార్లు, యుద్ధ విమానాలను ఎదుర్కొని ఒక చిన్న సైనిక పటాలం ఆ పట్టణాన్ని వదిలిపోయేంత వరకూ పోరాడారు. కెప్టెన్ ఏంజెల్ లెర్టీసియా నాయకత్వం వహించాడు. వీరోచితంగా పోరాడుతూనే ఒక నెల తర్వాత ఆయన నేలకూలాడు.

అదే సమయంలో దుర్మార్గుడు యులోజియో, కాంటిల్లో నుండి ఫైడల్ ఒక లేఖను అందుకున్నాడు. అతను జిత్తులమారినక్క. శత్రుసైనిక అధినేతగా విప్లవనేతకు అతను లేఖ రాశాడు. యుద్ధం మొదలవుతోందనీ, చివరి ఫలితం కోసం వేచి చూడమని

ఆ లేఖ సారాంశం. నిజానికి యుద్ధం తన పని తాను చేసుకుపోయింది. రెండున్నర నెలల భీకర పోరాటంలో శత్రువు 1,000 మంది సైనికులను పోగొట్టుకున్నాడు. అంతేకాదు మాకు ఒక ట్యాంకు, 12 మోర్టార్లు, 12 ట్రిపాడ్ మెషిన్‌గన్‌లతోపాటు 600 ఆయుధాలు దొరికాయి. వాటిలో రెండు వందల దాకా సబ్ మెషిన్‌గన్‌లు, లెక్కలేనన్ని ఆటోమేటిక్ ఆయుధాలు బోలెడంత మందుగుండు అన్ని రకాల సామగ్రి లభించాయి. 450 మంది ఖైదీలుగా పట్టుబడ్డారు. వాళ్ళని ఆ తర్వాత రెడ్‌క్రాస్ వాళ్ళకి అప్పజెప్పాం. ఆ ఆఖరియుద్ధంలో బాటిస్టా సైన్యం విరిగిన వెన్నుతో సియర్రా మేస్ట్రా నుండి బయటపడింది. అయితే అదింకా ఓడించబడలేదు. పోరాటం కొనసాగుతుంది. మూడు చోట్ల నుండి మా దాడులు కొనసాగించాలని వ్యూహం పన్నాం. శాంటియాగో క్యూబా నుండి, లాస్ ఎలాస్ నుండి నేను అక్కడికి వెళ్ళాలి. ద్వీపం ఆ కొసన వున్న సినార్‌డెల్ రియోకి కామిలో ఫీన్ ఫ్యూగోస్ వెళ్ళాలి. అక్కడి నుండి 1895లో మహానాయకుడు మాడియా చేసినట్లు సాహసోపేతమైన అద్భుత యాత్రను నిర్వహించాలి. అయితే యుద్ధం ముమ్మరంగా వుండడంతో కామిలో కర్తవ్యంలోని రెండో సగాన్ని పూర్తి చేయలేకపోయాడు. సియర్రా మేస్ట్రా మీద దాడికి దిగిన సైనిక దళాలు తుడిచిపెట్టుకుపోయిన తర్వాత, మా బలగాలు శక్తినీ, స్థైర్యాన్నీ పెంపొందించుకున్న తర్వాత, ఆ ప్రాంతంలో మామూలు స్థితి నెలకొన్న వెంటనే మధ్య రాష్ట్రమైన లానే ఎలాస్‌లో మా యాత్ర ప్రారంభించాం. ద్వీపానికి ఆ చివరన వున్న వారికీ ఈ చివరన వున్న వారితో సమాచార సంబంధాలను ఒక పద్ధతి ప్రకారం పోగొట్టమని నాకు ఆదేశాలందాయి. ఆ పర్వత ప్రాంతంలో వున్న అన్ని రాజకీయ వర్గాలతోనూ సత్సంబంధాలు నెలకొల్పుకోవాలి. నా ప్రాంతంలో సైనికంగా ప్రభుత్వాన్ని నడిపే విస్తృతాధికారాలు నాకు ఇవ్వబడ్డాయి. ఆ ఆదేశాలను అందుకొన్న తర్వాత నాలుగు రోజుల్లోపు మా యాత్ర ప్రారంభించాలనుకున్నాం. 1958 ఆగస్టు 30వ తేదీన ఒక ప్రకటనలో మేం బయలుదేరాల్సి వుంది. అయితే ఇంతలో అనుకోని సంఘటన జరిగింది. యూనిఫారాలనూ, వాహనాలకు అవసరమైన గాసోలిన్‌నూ తీసుకొని ఆ రాత్రికి ఒక ట్రక్ వస్తుంది. అదే సమయానికి ఆయుధాలను తీసుకొని ఒక విమానం వచ్చింది. ఆ విమానం కిందికి దిగుతుండగా శత్రువుల కంటబడింది. దాంతో వాళ్ళు బాంబుల వర్షం కురిపించారు. రాత్రి 8 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకూ బాంబు దాడి చేస్తూనే వున్నారు. విమానం శత్రువుల చేతికి చిక్కకుండా వుండడానికీ, వాళ్ళబాంబు దాడిని నిలవరించడానికీ మేం విమానాన్ని తగులబెట్టేశాం. వాళ్లు పగలు కూడా బాంబు దాడి కొనసాగిస్తే మా పరిస్థితి యింకా దారుణంగా వుంటుంది. శత్రు

సైనికులు రన్‌వే మీద ముందుకు చొచ్చుకు వస్తున్నారు. గాసోలిన్‌ను తీసుకు వస్తున్న ట్రక్‌ను ముక్కలు ముక్కలు చేశారు. మాకిక కాలినడక తప్ప దిక్కులేదు. ట్రక్కులు కానీ, గుర్రాలు కానీ లేకుండా ఆగస్టు 31వ తేదీన కాలినడకన బయలుదేరాం. హైవే దాటిన తర్వాత ఏవో దొరుకుతాయిలే అన్న ఆశ. మంజానిల్లో నుండి బయాయో వరకూ వున్న ఆ హైవేని దాటిన తర్వాత నిజానికి మాకు ఒక ట్రక్కు దొరికింది. అయితే సెప్టెంబర్ 1వ తేదీన భయంకరమైన తుఫాను వచ్చింది. ఒక్క హైవే తప్ప రోడ్లన్నీ ప్రయాణించడానికి వీలు లేనంతగా పాడయ్యాయి. దాంతో ప్రయాణం కోసం వాహనాలను ఉపయోగించడం మానేశాం. గుర్రాలు లేకపోతే కాలినడక. మా దగ్గర కొంత మందుగుండు వుంది. ఒక బజూకా వుంది. 40 షెల్‌లు వున్నాయి. లాంగ్ మార్చ్ సాగించి త్వరగా ఒక శిబిరాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైనవన్నీ వున్నాయి. రోజు తర్వాత రోజు గడుస్తుంది. మాతో స్నేహపూర్వకంగా వుండే ఓరియంటే రాష్ట్రంలోనే వున్నప్పటికీ మా ప్రయాణం రోజురోజుకీ కష్టతరం అవుతుంది. నిండుగా పారుతున్న నదుల్ని దాటుకుంటూ పయనిస్తున్నాం. కాలువలు, వాగులు, నదులుగా మారాయి. మా మందుగుండు, ఆయుధాలూ, తడిసిపోకుండా జాగ్రత్త పడుతూ వెళ్తున్నాం. దారిలో గుర్రాలేమైనా దొరికితే వాటిని తీసుకెళ్తున్నాం. అలిసిపోయిన గుర్రాలను వదిలేస్తున్నాం. తూర్పు రాష్ట్రానికి దూరంగా వెళ్తున్నాం. కాబట్టి జనావాసాలున్న ప్రాంతాలకు వెళ్ళడం మానుకున్నాం.

వరదొచ్చిన ప్రాంతం గుండా నడుస్తున్నాం. దోమలు మా దుంప తెంచుతున్నాయి. విశ్రాంతి సమయాలను దుర్భరంగా మార్చేస్తున్నాయి. మంచి తిండి లేదు. మంచినీళ్ళు కూడా కుంటల నుండి తాగుతున్నాం. ప్రతి రోజూ ప్రయాణం సుదీర్ఘంగానూ, దుర్భరంగానూ తయారైంది. ప్రయాణం మొదలై వారం అవుతుంది. ఓరియంట్, కామాగే రాష్ట్రాలకు సరిహద్దుగా వున్న జొబాబోనదిని దాటేటప్పటికి మా దళాలు చాలా బలహీనపడ్డాయి. ఈ నది కూడా వరదొచ్చి పొంగుతుంది. ఆ తర్వాత మేం దాటిన నదులు కూడా అలాగే పొంగి పొర్లుతున్నాయి. మాలో చాలా మంది కాలికి చెప్పుల్లేకుండా ఆ చిత్తడి నేలలో నడుస్తున్నారు. దాని ప్రభావం తెలుస్తోంది.

సెప్టెంబర్ 9వ తేదీన లా ఫెడరల్ అనే ప్రాంతానికి చేరబోతుండగా మాకు ముందుగా నడుస్తూ మా గార్డులు శత్రు సైనికుల కంటబడ్డారు. వాళ్ళు జరిపిన కాల్పుల్లో ఇద్దరు విలువైన కామ్రేడ్స్ మరణించారు. శత్రువు కంటపడడంవల్ల మాకిక విశ్రాంతే లేకుండా పోయింది. వాళ్ళతో తలపడాల్సి వచ్చింది. కొంత సేపు యుద్ధం జరిగిన తర్వాత శత్రువులకు చెందిన చిన్న సైనిక పటాలం మాకు లొంగిపోయింది. మేం వాళ్ళను ఖైదీలుగా

పట్టుకున్నాం. ఇప్పుడు శత్రువుల ఎయిర్‌ఫోర్స్‌కి మేం ఏ దారిలో ప్రయాణిస్తున్నామో చూచాయిగా తెలుసు కాబట్టి యిప్పుడు చాలా జాగ్రత్తగా వుండాలి. ఒకటి రెండు రోజుల తర్వాత లాగునా గ్రాండే అనే ప్రాంతానికి చేరుకున్నాం. కామిలో దళాలు కూడా అక్కడికి చేరుకున్నాయి. వాళ్ల పరిస్థితి మాకంటే మెరుగ్గా వుంది. ఈ ప్రాంతం భయానకమైన దోమలకు ప్రసిద్ధి. దోమతెర లేకుండా నిద్రపోవడం చాలా కష్టం. మాలో కొంత మందికి దోమతెరలు లేవు.

బురద నేలల్లో చాలా రోజులు నడవాల్సి వచ్చింది. ఆకలి, దాహం, మా కాళ్ళు లోహపు కాళ్లలాగా బరువెక్కిపోయాయి. ఆయుధాలు విపరీతంగా బరువుగా వున్నాయి. కామిలోను మా కోసం వదిలిపెట్టారు. అయితే మా కోసం రావలసిన గార్డులు రాకపోవడంలో వాటిని మాసరీనో చక్కెర మిల్లు దగ్గరే వదిలిపెట్టాల్సి వచ్చింది.

కాట్రో అనే ప్రాంతంలో మా అగ్రగామి దళం శత్రువులతో తలపడాల్సి వచ్చింది. మళ్ళీ యుద్ధం. అలసట. అది పగటి సమయం. అతి కష్టం మీద మా దళంలో ఎక్కువ మంది అడవిలోకి వెళ్లగలిగాం. అయితే సైన్యం ముందుకు వస్తుంది. దాంతో వెనుక వుండిపోయిన వాళ్లు అడవిలోకి వచ్చేంత వరకూ యుద్ధం చేయాల్సి వచ్చింది. ఈలోపు మేం ఎయిర్‌ఫోర్స్ కంటబడ్డాం. జి-26, సి-47, పెద్ద సి-3 విమానాలు 200 మీటర్ల పరిధిలో బాంబులు కురిపించడం మొదలుపెట్టాయి. ఒక కామ్రేడ్ మరణించాడు. కెప్టెన్ సిల్వాతో సహా చాలా మంది గాయపడ్డారు. వాళ్ళని మోసుకొంటూ తప్పించుకున్నాం. కెప్టెన్ సిల్వా ఆ తర్వాత జరిగిన యుద్ధం అంతటిలోనూ విరిగిన చేతితోనే పాల్గొన్నాడు. మరుసటి రోజున వెనుకబడిపోయిన వాళ్ళంతా వచ్చి చేరారు. పది మంది మాత్రం కాలితో నాయకత్వంలోని దళంతో కలిసి లాస్ విలాస్ రాష్ట్రంలోని యాగాజే ప్రాంతానికి వెళ్ళాలి.

ఇన్ని కష్టాలు ఎదురవుతున్నప్పటికీ రైతుల నుండి ప్రోత్సాహం లేకపోవడం జరగలేదు. ఎవరో ఒకరు దారి చూపడానికి ముందుకు వచ్చేవారు. లేదా తిండిపెట్టేవాళ్ళు. అయితే ఓరియంటే రాష్ట్రంలో లాగా జనం అంతా ఏకగ్రీవంగా మాకు సహాయం చేయడానికి నిర్ణయించుకొని వున్నారని చెప్పలేం. కాని మాకు ఏదో విధంగా సహాయం చేసేవాళ్ళు. ఒక్కొక్కసారి మేం వెళ్ళిపోయిం తర్వాత మా గురించిన సమాచారం శత్రువుకు చేరవేసేవాళ్ళు. మేమంటే వ్యతిరేకత వుండి కాదు. వాళ్ళ జీవన పరిస్థితులు వాళ్ళనా స్థితికి తీసుకువచ్చాయి. వాళ్ళు యజమానులకు లొంగి వుండకపోతే పని కోల్పోయే పరిస్థితి. దాంతో గత్యంతరం లేక మా సమాచారాన్ని అందించే వాళ్ళు.

ఒక రోజు మధ్యాహ్నం పూట రేడియో వింటున్నాం. అందులో ఫ్రాన్సిస్కో టాబెర్ఎల్లా డోల్జ మాట్లాడుతున్నాడు. చేగువేరా సైనిక పటాలాన్ని సర్వనాశనం చేశామని బడాయిగా ప్రకటిస్తున్నాడు. చనిపోయిన వాళ్ళపేర్లను చెబుతున్నాడు. కొంత నిజం. కొంత అబద్ధం కల్పించి చెప్తున్నాడు. మా మరణవార్త మా దళాలలో విషాదాన్ని రేపింది. కొంచెం కొంచెంగా నిరాశ, నిస్పృహకు గురవడం మొదలైంది. ఆకలి, దప్పిక, అలసట, మా మీదకు దురుసుగా వస్తున్న శత్రు సైన్యాన్ని ఏమీ చేయలేకపోతున్నమన్న అసమర్థ భావన. అన్నింటినీ మించి పాదాలకు వచ్చిన మజమొర్రా అనే ఒకరకమైన జబ్బు మా ప్రయాణాన్ని ఎంతో దుర్భరం చేసింది. అడుగుతీసి అడుగు వేయడం ఎంతో బాధాకరమైందిగా పరిణమించింది. తిండి–ఈ రోజు దొరుకుతుంది. రేపు దొరకదు. ఎల్లుండి దొరకచ్చు, దొరక్కపోవచ్చు. ఇలా వుంది పరిస్థితి. మంచినీళ్ళు కూడా దొరకడం లేదు. వైమానిక దాడులు నిరంతరాయంగా కొనసాగు తున్నాయి. అతిగా బలహీనపడిన వారిని మోసుకుపోడానికైనా ఒక్క గుర్రం లేదు. సముద్రపు బురద నీళ్ళతో తడిసి మా బూట్లు పూర్తిగా పాడైపోయాయి. తుప్పలు, ముళ్ళు దారంతా పరుచుకొని వున్నాయి. ఎంతో కష్టం మీద మమ్మల్ని చుట్టుముట్టిన సైన్యపు వ్యూహాన్ని ఛేదించుకొని జుకారో–మొరాన్ చేరుకున్నాం. అదొక చారిత్రకమైన ప్రదేశం. స్వతంత్ర పోరాట కాలంలో దేశభక్తులకీ స్పానియర్డులకీ మధ్య భీకరమైన యుద్ధం జరిగిన ప్రాంతం ఇదే. రక్తం అప్పుడు ఏరులై పారింది.

తేరుకోడానికి సమయం చిక్కలేదు. మళ్ళీ వాన మొదలైంది. వాతావరణం ఏ మాత్రం బాగాలేదు. దానికితోడు శత్రువు దాడి. గత్యంతరం లేని పరిస్థితుల్లో మా ప్రయాణాన్ని కొనసాగించాల్సి వచ్చింది. దళాల అలసట రోజురోజుకీ మరింతగా పెరిగిపోతోంది. స్థైర్యం దిగజారిపోతుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారినప్పుడు వాళ్ళని తిట్లతో, బతిమలాటలతో నడిపించవలసి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో లాస్ విల్లాస్ పర్వతశ్రేణులు అల్లంత దూరాన కన్పించడంతో మా గెరిల్లాల ముఖాలు వెలిగిపోయి కొత్త ఉత్తేజం నిండింది. ఆ క్షణం నుండి కష్టాలు వున్నప్పటికీ వాటిని తట్టుకొనే శక్తి వచ్చింది. ప్రతిదీ తేలిక అనిపించింది. కామాణే లాస్విల్లాస్ రాష్ట్రానికీ సరిహద్దుగా ప్రవహిస్తున్న జుకారో నదిని యీదుకుంటూ దాటాం. రెండు రోజుల తర్వాత ట్రినిడాడ్–సాక్టి–స్పెరిటస్ పర్వతశ్రేణి మధ్యకు సురక్షితంగా చేరుకున్నాం. మరో దశ యుద్ధానికి సిద్ధపడుతున్నాం. రెండు రోజులు విశ్రాంతి తీసుకున్నాం. నవంబర్ 3వ తేదీన జరగబోయే ఎన్నికలను ఆపాలి. అక్టోబరు 16కి లాస్ విల్లాస్ పర్వత ప్రాంతానికి

చేరుకున్నాం. సమయం తక్కువగా వుంది. నిర్వర్తించాల్సిన కర్తవ్యం పెద్దది. ఉత్తర ప్రాంతంలో కామిలో శత్రువును భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. ఎస్కాంబ్రే పర్వత ప్రాంతానికీ మేం చేరుకున్న తర్వాత మేం ఏం చేయాలో నిర్ణయమైంది. సైనిక యంత్రాంగాన్ని ముప్పుతిప్పలు పెట్టాలి, దాని సమాచార వ్యవస్థను నాశనం చేయాలి. తక్షణ లక్ష్యం ఎన్నికలు ఆపడం. సమయం తక్కువగా వుంది. విప్లవ గ్రూపుల్లో ఐక్యత లేక పరస్పరం దాడులు చేసుకొని చంపుకుంటున్నారు. దీంతో మా పని చాలా కష్టమైంది.

ఎన్నికలు జరగకుండా నిలవరించడానికి పొరుగున వున్న పట్టణాల మీద దాడి చేయాలనుకున్నాం. కబీకు వాన్, ఫొమెంటో, శాక్టిస్పిరిటస్ మొదలైన పట్టణాల్లో అదే విధంగా చేయాలని ప్రణాళికలు వేశాం. జీంతలో పర్వత ప్రాంతాల్లోని గినియా డి మిరండా అనే చోట ఒక చిన్న శత్రు సైనిక పటాలం లొంగిపోయింది. ఆ తర్వాత బనాలో పటాలం పైనా దాడి చేశాం. పెద్దగా ఫలితం లేకపోయింది. ఎన్నికలు జరిగే నవంబర్ 3వ తేదీకి ముందు రోజులన్నీ క్షణం తీరిక లేకుండా గడిచాయి. మా దళాలు ప్రతిచోటకీ వెళ్ళి ఓటర్లని ఓటు వేయకుండా ఆపాయి. ఉత్తర ప్రాంతంలో కామిలో దళం ఎన్నికల తంతును పూర్తిగా స్తంభింపచేసింది. ఓరియంటే రాష్ట్రంలో అసలు పోలింగ్ జరగలేదు. కామాగేలో పోలింగ్ శాతం కొంచెం ఎక్కువగా వుంది. ఓరియంటే రాష్ట్రంలో ఆంటోనియా గిటెరెజ్ కాలమ్‌తో యుద్ధాలు జరుగుతున్నాయి. కొన్ని మున్సిపాలిటీ సీట్లు తప్ప ఓరియంటే రాష్ట్రంలో ప్రభుత్వం అన్నదే లేకుండా పోయింది. లాస్ ఎల్లాస్‌లో కూడా పరిస్థితి తీవ్రమవుతుంది. సమాచార వ్యవస్థపైన దాడి ఎక్కుపెట్టబడింది. మేం అక్కడికి వెళ్ళిన తర్వాత మా వ్యూహాన్ని మార్చాం. పట్టణాలలో మంచి మిలీషియా మనుషులు ట్రైనింగ్ కాంప్‌కి పంపి దాడి ఆదేశం కోసం ఎదురు చూడమని చెప్పాం. అది చాలా సమర్థవంతమైన పద్ధతిగా రుజువైంది. 1958 నవంబర్ డిసెంబర్ మాసాల్లో మేం క్రమక్రమంగా హైవేలను మూసివేశాం. ట్రినిడాడ్ నుండి శాలక్టిస్పిరిటాస్ వరకూ వున్న హైవేని డెప్టెన్ సిల్వా పూర్తిగా మూసివేయగలిగాడు. సెంట్రల్ హైవే మీద కూడా అనేక చోట్ల వంతెనల్ని పేల్చేశాం. సెంట్రల్ రైలు మార్గాన్ని కూడా చాలా చోట్ల మూసివేశాం. దక్షిణాది మార్గాన్ని రెండో ఫ్రంట్ మూసేసింది. ఉత్తర మార్గాన్ని కామిలో దళాలు మూసివేశాయి. దాంతో ద్వీపం రెండు భాగాలుగా విభజితమైంది. ఆ ప్రాంతానికి ప్రభుత్వ సాయం విమానాలు, సముద్రమార్గం ద్వారా మాత్రమే అందింది. ఆ ప్రాంతంలో విప్లవ గ్రూపుల మధ్య ఐక్యత సాధించడం అత్యవసరమైంది. కమాండర్ (ఎలోయ్) ఎస్కంబ్రే నేషనల్ ఫ్రంట్ కమాండర్ ఫార్ చోమన్, కమాండర్ రోలాండో క్యుబెలా నాయకత్వంలో రివల్యూషనరీ డైరెక్టరేట్,

మరో చిన్న గ్రూపు, ఫెలిక్స్ నాయకత్వంలో పని చేస్తున్న పాపులర్ సోషలిస్టు పార్టీ దళాలు, మేము వున్నాం. ఐదు వేర్వేరు సంస్థలు పని చేస్తున్నాయన్నమాట. ఆయా నాయకులలో నేను చర్చలు జరిపాను. వాళ్ళతో చాలా ఒప్పందాలు కుదిరాయి. ఒక ఉమ్మడి ఫ్రంట్‌ను ఏర్పర్చడం సాధ్యమైంది.

16వ తేదీ నుండి వంతెనలు కూల్చేయడం సమాచార వ్యవస్థను నాశనం చేయడం ఒక పద్ధతి ప్రకారం జరిగింది. దీంతో శత్రువు ముందుకు కదలడం అసాధ్యం అయ్యింది. అదే రోజున సెంట్రల్ హైవేలో ఫాల్కన్ నదిపైనున్న వంతెనను పేల్చేయడంతో హవానాకీ, లాస్ విల్లాస్ రాజధాని శాంతాక్లారాకీ మధ్య సంబంధాలు తెగిపోయాయి. అనేక పట్టణాలను పట్టుకున్నాం. ఎయిర్ ఫోర్స్‌దాడులు కొనసాగుతున్నప్పటికీ పట్టణాల మీద పట్టును కమాండర్లు కొనసాగించారు. ఎంతో మంది శత్రు సైనికులు లొంగిపోయారు. వందకుపైగా రైఫిళ్ళు విప్లవ సైన్యానికి దొరికాయి. శత్రువుకు ఊపిరిపీల్చుకొనే అవకాశం యివ్వకుండా తక్షణం సెంట్రల్ హైవేని దిగ్బంధించాలనుకున్నాం. డిసెంబర్ 21వ తేదీన సెంట్రల్ హైవేపైనున్న కాబాయిగువాన్, గుడ్యోస్‌లపై దాడి చేశాం. కుడ్యోస్ వెంటనే లొంగిపోయింది. తర్వాత కొన్ని రోజులకి కాబాగువాన్ లొంగిపోయింది. 90 మంది సైనికులు పట్టుబడ్డారు. సైన్యం లొంగిపోయి ఆయుధాలు యిచ్చివేస్తే ముక్తా ప్రాంతం నుండి బయటకు వెళ్ళనిస్తామని చెప్పాం. కాబాయ్ గువాన్ సంఘటన మరొక్కసారి నియంత అసమర్థతను రుజువు చేసింది. ఆ ప్రాంతానికి ఆ తర్వాత ఎప్పుడూ శత్రువు సైన్యాన్ని పంపలేదు.

లాస్ ఎల్లాస్‌లోని ఉత్తర ప్రాంతంలో కామిలో దళాలు అనేక పట్టణాల మీద దాడులు చేస్తున్నాయి. ఒక్కొక్క పట్టణాన్ని పట్టుకుంటూ శత్రుసైన్యాలకు ఆఖరి స్థావరమైన యాగాజేని పట్టుకున్నాడు. దానికి బాధ్యత వహిస్తున్న కమాండర్ పదకొండు రోజులపాటు విప్లవ సైన్యాన్ని నిలవరించాడు. అయితే మా దళాలు సెంట్రల్ హైవే మీద ముందుకు వెళ్ళాయి. కాబాయిగువాన్‌ని పట్టుకున్న తర్వాత ప్లేసటాస్ మీద రివల్యూషనరీ డైరెక్టరేట్ దళాలతో కలిసి దాడి చేశాం. ఒక్క పోరాటంతోనే అది లొంగిపోయింది. ఉత్తర తీరంలోని రెమిడియాస్, కాయిబేరియన్‌లను త్వరగా విముక్తం చేశాం. అది చాలా ముఖ్యమైన రేవు పట్టణం. శత్రువు రోజురోజుకీ బలహీనపడుతున్నాడు. ఓరియంటే రాష్ట్రంలో సాధిస్తున్న వరుస విజయాలతోపాటు ఎస్కాంబ్రౌలోని రెండో ఫ్రంట్ చిన్నిచిన్న సైనిక పటాలాలను ఓడిస్తుంది. కామిలో దళాలు ఉత్తరాదిని అదుపు చేస్తున్నాయి.

ఏ మాత్రం ప్రతిఘటన లేకుండా శత్రువు కామాజువానీ నుండి వెనక్కి తగ్గడంతో లాస్ ఎల్లాస్ రాష్ట్ర రాజధానిపైన దాడిని మొదలుపెట్టడానికి సిద్ధపడ్డాం. శాంతాక్లారా అన్నింటికీ కేంద్ర పట్టణం. 1,50,000 మంది అక్కడ నివాసముంటున్నారు. దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ దానికి సంబంధాలున్నాయి.

శాంతాక్లారా మీద దాడి సమయానికి మా దగ్గర ఆయుధాలు పెరిగాయి. మా దగ్గర పెద్ద ఆయుధాలు కూడా వున్నాయి కానీ వాటికి మందుగుండు లేదు. మేం పది ట్యాంకులను ఎదుర్కొనాలి. వాటిని ఎదుర్కొంటూ దాడిని సమర్థవంతంగా ఎక్కుపెట్టాలంటే జనం ఎక్కువగా వుండే ప్రాంతాలకు వెళ్ళాలి. అక్కడ ట్యాంకులు పని చేయవు. డిసెంబర్ 29వ తేదీన మా దాడిని మొదలుపెట్టాం. మొదట్లో యూనివర్శిటీని స్థావరంగా చేసుకున్నాం. తర్వాత శివారు ప్రాంతంలో మా షెడ్ క్వార్టర్స్ ఏర్పర్చుకున్నాం. సైనిక దళాలకు వ్యతిరేకంగా మా వాళ్ళు పోరాడుతున్నారు. వాళ్ళలో చాలా మంది పలాయనం చిత్తగిస్తున్నారు. మా వాళ్ళు కూడా చాలా మంది పోయినప్పటికీ శత్రువుపైన భీకరంగా పోరాడుతున్నారు. చనిపోయిన వాళ్ళను స్మశానాలకు చేర్చుతున్నారు. గాయపడిన వాళ్ళతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. ఆ చివరి రోజుల్లో మా దళాల ఉత్తేజాన్ని చూపే ఒక సంఘటన నాకు గుర్తుంది. ఒక సైనికుడు యుద్ధం జరుగుతుండగా నిద్రపోతూ కన్పించాడు. నేను అతన్ని లేపి తిట్టాను. నా తుపాకీ ప్రమాదవశాత్తు పేలడంతో దాన్ని పోగొట్టుకున్నాను అని సమాధానం చెప్పాడు. అలవాటైన నా పొడిగొంతుకలో 'అయితే వట్టి చేతులతో యుద్ధానికి వెళ్ళి ఆయుధం సంపాదించుకో' అని మామూలుగా అనేశాను. ఆ తర్వాత శాంతాక్లారాతో ఆస్పత్రిలో గాయపడిన వారిని పరామర్శిస్తుండగా చావుకు సిద్ధంగా వున్న ఒక మనిషి నా చేయిని స్పృశించాడు.

మీకు గుర్తుందా కమాండర్? రెమిడియోస్‌లో ఆయుధాన్ని వెతుక్కోమని నన్ను పంపించారు. దాన్ని యిక్కడ నేను సంపాదించగలిగాను అని తృప్తిగా చెప్పాడు. ఆ తర్వాత కొన్ని నిమిషాలకు అతను చనిపోయాడు. మా విప్లవ సైన్యం స్ఫూర్తి అటువంటిది.

కాపిరో కొండల నుండి ప్రతిఘటన కొనసాగుతుంది. డిసెంబర్ 30వ తేదీ రోజంతా యుద్ధం జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాలను పట్టుకొంటూ యుద్ధం చేస్తున్నాం. అప్పటికీ సైనికులున్న రైలుకీ, శాంతాక్లారాకీ మధ్య సమాచార వ్యవస్థను నాశనం చేశాం. కాపిరో కొండల మధ్యలో తాము చుట్టుముట్టబడ్డామని గమనించిన వాళ్ళు తమ సామానంతటితో రైల్లో పారిపోవాలనుకున్నారు. దారిలో ఇంజనూ, కొన్ని

పెట్టెలూ పట్టాలు తప్పాయి. ఆ తర్వాత ఎంతో ఆసక్తికరమైన యుద్ధం మొదలైంది. ఆ యుద్ధంలో వాళ్ళు రైలు దిగిపోవాల్సి వచ్చింది. వాళ్ల ఆయుధాలన్నీ మా చేతికి చిక్కాయి. నగరంలోని పవర్‌స్టేషన్‌ను పట్టుకున్నాం. పట్టణంలోని ఉత్తరభాగాన్ని ఆక్రమించాం. శాంతాక్లారా దాదాపు పూర్తిగా విప్లవ సైన్యం ఆధీనంలోకి వచ్చిందని రేడియోలో ప్రకటించాం. లాస్ ఎల్లాస్ సాయుధ దళాల కమాండర్–ఇన్–చీఫ్‌గా కెప్టెన్ రాబర్టో మృతి చెందిన విషాద వార్తను క్యూబా ప్రజలకు తెలియజెప్పడం కూడా గుర్తుంది. కెప్టెన్ రాబర్టో రోద్రిగెజ్ “ఎల్‌వాకెరిటో (చిన్న కౌబాయ్) పొట్టిగా వుండేవాడు. వయస్సులో చిన్నవాడు. అతను ఆత్మాహుతి దళ సభ్యుడు. స్వతంత్రం కోసం జరిగిన యుద్ధంలో అతను ఏ వెయ్యిన్నొక్కసార్లో చావుతో ఆడుకున్నాడు. ఆత్మాహుతి దళం అనేది విప్లవ స్ఫూర్తికి ఒక ఉదాహరణ. ఎంపిక చేసిన వాళ్ళని మాత్రమే అందులో చేర్చుకునే వాళ్ళు. ఎవరైనా చనిపోయినప్పుడు ఏ యుద్ధంలోనైనా చావులు తప్పవు – మరొకరిని ఎంపిక చేసే సమయంలో ఎంపిక కాని వారు ఎంతో దుఃఖపడేవారు. పోరాటానికీ, మరణానికీ ముందు వరుసలో నిలబడే అవకాశం తమకి రాదని బాధపడేవాళ్ళు.

ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌ని ఆక్రమించాం. దానికి దక్షిణంగా వున్న ట్యాంకుల్ని పట్టుకున్నాం. వెంటనే 31వ సైనిక పటాలం కమాండర్ క్యాబేలాకు లొంగిపోయింది. తర్వాత జైలు, కోర్టు భవనం, రాష్ట్ర ప్రభుత్వ భవనం, గ్రాండ్ హోటల్‌ని పట్టుకున్నాం. గ్రాండ్ హోటల్ పదవ అంతస్తు నుండి దాడి పూర్తయ్యేంత వరకు కాల్పులు జరుపుతూనే వున్నాయి. అప్పటికీ మధ్య క్యూబాలోని అతిపెద్ద కోట లియోన్సి రైడల్‌లోని సైన్యం మాత్రం మాకు లొంగలేదు. అయితే 1959 జనవరి ఒకటవ తేదీ నాటికి ఆ కోటకు రక్షణగా వున్న బలగాలు క్షీణించడం మొదలైందన్న వార్త తెలిసింది. ఆ రోజు ఉదయాన సైన్యాన్ని లొంగిపోవలసిందిగా కెప్టెన్ జిమెన్‌డ్, కెప్టెన్ రోద్రిగేజ్‌లతో కబురంపాం. అసాధారణమైన, పరస్పర భిన్నమైన నివేదికలు అందుతున్నాయి. సైన్యాన్ని దాని మానానికి దాన్ని వదిలేసి బాటిస్టా పారిపోయాడు. మా ఇద్దరు ప్రతినిధులు జనరల్ యులుజియో కాంటిల్లోని రేడియో ద్వారా కాంటాక్టు చేసి లొంగుబాటు గురించి చెప్పారు. అతను తిరస్కరించాడు. అతను సైన్యానికి నాయకుడిగా ప్రకటించుకున్నాడు. మేం వెంటనే ఫైడల్ కాస్ట్రోని కాంటాక్టు చేసి విషయం చెప్పాం. కాంటిల్లో కుట్ర పూరిత వ్యక్తిత్వం గురించి మా అభిప్రాయాన్ని కూడా తెలియజేశాం. దాన్ని కాస్ట్రో అంగీకరించాడు. నిర్ణయాత్మకమైన గంటల్లో బాటిస్టా ప్రభుత్వానికి బాధ్యులైన ముఖ్య వ్యక్తులందరికీ పారిపోవడానికి అవకాశం కల్పించాడు. ఒక సైనికాధికారిగా మమ్మల్ని సంప్రదించిన

వ్యక్తి, అతన్ని మేం గౌరవించాం. అయినా అతనిలా చేశాడు. ఆ తర్వాత వచ్చిన ఫలితాలు అందరికీ తెలిసినవే. కాంటిల్లో అధికారాన్ని గుర్తించడానికి కాస్ట్రో తిరస్కరించాడు. హవానాకు మార్చ్ చేయవలసిందిగా కాస్ట్రో ఆదేశం. ఇస్లే ఆఫ్ పైన్ జైలును వదిలిన తర్వాత కల్నల్ బార్కిన్ సైన్యానికి అధినేత అయ్యాడు. కామిలో దళాలు కొలంబియా కాంపును స్వాధీనపర్చుకున్నాయి. లా కబానా కోటను మేం స్వాధీనం చేసుకున్నాం. కొన్ని రోజుల్లోనే తాత్కాలిక ప్రభుత్వానికి ఫైడల్ కాస్ట్రోని ప్రధాన మంత్రిగా ప్రకటించడం ఇదంతా దేశ వర్తమాన చరిత్ర.

ఇప్పుడు మనం కేవలం ఒక దేశానికి సంబంధించిన సాధారణ సాధనాలము కాము. విముక్తం కాని అమెరికా దేశాల ఆశలం. అణచివేతదారులందరి కళ్ళూ, ఆశ చూసేవారందరి చూపులూ మాపైనే వున్నాయి. ఇతర లాటిన్ అమెరికా దేశాల ఉద్యమాల భవితవ్యం మేం వేయబోయే అడుగులపైన ఆధారపడింది. ప్రతి అడుగునీ శత్రువులూ, నా సహచరులూ అందరూ గమనిస్తున్నారు. మేం నిలదొక్కుకున్న తర్వాత మా తొలి విప్లవ కర్తవ్యాలను అన్ని కష్టాలను అధిగమిస్తూ నిర్వహించడం మొదలుపెట్టాం. కానీ క్యూబా ప్రధాన సమస్య ఏమిటి. విశాలమైన బ్రెజిల్‌తో సహా అన్ని లాటిన్ అమెరికా దేశాల లాగానే ఏక పంట ఆర్థిక వ్యవస్థే అసలు సమస్య.

మేం చెరకుకు బానిసలం. మమ్మల్ని ఉత్తరాది మార్కెట్‌కు కట్టిపడేస్తున్న ప్రధాన సమస్య అదే. అనేక రకాలైన పంటలు పండిస్తూ పరిశ్రమలను అభివృద్ధి చేయాలి. అంతేకాకుండా సమీప భవిష్యత్తులోనే మన వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులు మనకి బాగా సరిపోయే మార్కెట్లకు సరఫరా అయ్యే విధంగా పని చేయాలి. ప్రభుత్వం మొదటి కర్తవ్యం వ్యవసాయ సంస్కరణలు. రైతులకు భూమిని ఉచితంగా యివ్వడం. నిజాయితీగా ముందుకు వచ్చిన భూ యజమానులకు పరిహారం చెల్లించడం రైతులకు సాంకేతిక సహాయం అందజేయడం దేశంలోని ఉత్పత్తులకు మార్కెట్ గ్యారంటీ యివ్వడం. కొద్ది కాలంలో పసిగందుగా వున్న క్యూబా పరిశ్రమలు పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిన దేశాల పరిశ్రమలతో పోటీ పడడం ప్రారంభమవుతుంది.

ఈ ప్రాథమిక ఆయుధాలతో తమ సంపూర్ణ స్వతంత్రం కోసం క్యూబా ప్రజలు పోరాటాన్ని ప్రారంభిస్తారు. అదంత తేలికైన పని కాదని తెలుసు. అయితే జులై 26

ఉద్యమానికీ, మన విప్లవానికీ మొత్తంగా మన దేశానికీ మొత్తం లాటిన్ అమెరికా దేశాలకు ఆదర్శంగా నిలబడాల్సిన చారిత్రక కర్తవ్యం వుంది. వారిని మనం నిరుత్సాహపర్చరాదు. ఎటువంటి ఆర్థిక పరిణామాలు ఎదురైనా మన పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రకటించాం. ఇంకా పోరాడవలసి వస్తే మన చివరి రక్తపు చుక్క వున్నంత వరకూ ఈ గడ్డను సార్వభౌమాధికార గణతంత్రంగా చేయడానికి, ఆనందదాయకమైన, ప్రజాస్వామిక దేశంగా తీర్చిదిద్దడానికీ, ఇతర లాటిన్ అమెరికా సోదరులతో సౌభాతృత్వ సంబంధాలు నెరపే దేశంగా తీర్చిదిద్దడానికి పోరాడుతాం.

## ఎల్ పాటోజో

కొన్ని రోజుల క్రితం కొంత మంది గ్వాటిమాలియన్ దేశ భక్తుల మరణవార్తను మోసుకుంటూ ఒక కేబుల్ అందింది. వాళ్ళలో జులియోరాబర్టో కేసరస్ నెల్లె కూడా వున్నాడు.

కష్టతరమైన విప్లవకారుడి వృత్తిలో మరణం అనేది తరచూ ఎదురయ్యే ప్రమాదం. అయితే కష్టకాలంలో పక్కన కామ్రేడ్‌గా పని చేసి మంచి చెడుల్నీ, స్వప్నాల్నీ పంచుకున్న స్నేహితుడి మరణవార్త ఎంతో బాధాకరంగా వుంటుంది. జులియో రాబర్టో గొప్ప స్నేహితుడు. అతను పొట్టిగా, బక్క పలచగా వుంటాడు. అందుకే అతన్ని ఎల్ పాటోజో అని పిలిచే వాళ్ళం అంటే పొట్టివాడు, పిల్లవాడు అని అర్థం మెక్సిలో విప్లవం పురుడు పోసుకోవడం అతను చూశాడు. మాతో చేరతానని వచ్చాడు. అయితే జాతీయ విముక్తి యుద్ధంలో ఇంకా విదేశీయులను అనుమతించేది లేదని కాస్ట్రో చెప్పాడు. నా ఒక్కడికే గౌరవం దక్కింది.

విప్లవ విజయం తర్వాత కొన్ని రోజులకు ఎల్ పాటోజో తనకున్న కొద్దిపాటి సామాన్లను అమ్మేసి ఒక చిన్న సూట్‌కేసు పట్టుకుని క్యూబాలో ప్రత్యక్షమయ్యాడు. అనేక ప్రభుత్వ శాఖల్లో అతను పని చేశాడు. వ్యవసాయ సంస్కరణల నేషనల్ ఇనిస్టిట్యూట్‌కి తొలి అధినేతగా పని చేశాడు. అయితే దేనిలోనూ అతను సంతృప్తి చెందలేదు. యింకా ఏదో జరగాలన్న తపన కన్పించేది. తన స్వంత దేశం విముక్తి కావాలని కోరుకున్నాడు. విప్లవం అతన్ని ఎంతగానో మార్చేసింది. ఓటమి అంటే ఏమిటో పూర్తిగా అర్థం చేసుకోకుండానే గ్వాటిమాలాలోని వదిలి వచ్చాడు. ఇప్పుడు చైతన్యవంతుడైన విప్లవకారుడిగా మారాడు. మొదటిసారి మేం రైల్లో కలుసుకున్నాం. అర్ బెంజ్ పతనం

(1954) తర్వాత రెండు నెలలకు గ్వాటిమాలా వదలి రైల్లో వెళ్తున్నాం. ముందు తపాచులా వెళ్ళి అక్కడి నుంచి మెక్సికో నగరానికి వెళ్ళాలని మా ఆలోచన. ఎల్ పాటోజో నా కంటే చాలా చిన్నవాడు. అయితే మా ఇద్దరి మధ్య త్వరలోనే స్నేహం పెరిగింది. మేం చియాపస్ నుండి మెక్సికో కలిసి ప్రయాణం చేశాం. ఇద్దరం కలిసే ఒకేలాంటి కష్టాలను అనుభవించాం. ఇద్దరి దగ్గరా పైసాలేదు. ఇద్దరం ఓడిపోయిన వాళ్ళం. అననుకూల శత్రుపూరిత వాతావరణం. ఎల్ పాటోజో దగ్గర అస్సలు డబ్బులేదు. నా దగ్గర కొన్ని పెసోలున్నాయి. నా దగ్గర ఒక కెమెరా వుండేది. దాంతో పార్కుల్లో మనుషుల్ని ఫొటోలు తీసేవాళ్ళం. మా పార్టనర్ ఒక మెక్సికన్. అతనికి ఒక చిన్న డార్క్ రూం వుంది. అక్కడ ఫిల్ములు డెవలప్ చేసే వాళ్ళం. మాకు మెక్సికో సిటీ అంతా తెలిసిపోయింది. దారుణంగా మేం తీసిన ఫొటోలను బట్వాడా చేస్తూ యిటు కొస నుండి అటు కొస దాకా నడిచి వెళ్ళే వాళ్ళం. మాకు అన్ని రకాల క్లయింటులూ తారసపడ్డారు. ఫొటోలో వున్న చిన్నబాబు ఎంతో అందంగా వున్నాడనీ అంత అద్భుతంగా తీసినందుకు ఒక మెక్సికన్ పెసో అయినా యివ్వాలని బేరమాడేవాళ్ళం. ఆ విధంగా అనేక నెలలు పొట్టపోసుకున్నాం. మెల్లమెల్లగా విప్లవ అవసరాలు మమ్మల్ని వేరు చేశాయి. అతన్ని క్యూబాకు తీసుకు వెళ్ళడం ఫైడల్‌కి యిష్టంలేదని చెప్పేశాను. అతని తప్పేమీలేదనీ, మా సైన్యాన్ని వివిధ జాతీయులతో ఏర్పర్చడం యిష్టంలేకనే తనని తీసుకు వెళ్ళడం లేదని చెప్పాను.

ఎల్ పాటోజో జర్నలిస్టుగా పని చేశాడు. మెక్సికో యూనివర్శిటీలో ఫిజిక్స్ చదివాడు. బతకడం కోసం అనేక చోట్ల పని చేశాడు. ఇది కావాలని ఎన్నడూ అడిగేవాడు కాదు. అతను ఎప్పుడు అంతర్ముఖుడిగా వుండే వాడు. ఎంతో తెలివైనవాడు. సంస్కారం వున్నవాడు. ప్రజల కోసం పని చేయడంలో ఎంతో శ్రద్ధను కనపర్చేవాడు. అతను గ్వాటిమాలా లేబర్ పార్టీకి చెందినవాడు. తనంతట తానుగా ఆ జీవితాన్ని ఎన్నుకొని అద్భుతమైన విప్లవకారుడిగా ఎదిగాడు. మొదట్లో ఎంతో సున్నితంగా వుండేవాడు. విప్లవం ప్రజల్ని శుద్ధి చేస్తుంది. అభివృద్ధి చేస్తుంది.

అతను క్యూబా వచ్చిన తర్వాత మేం ఒక ఇంట్లోనే వున్నాం. అయితే కొత్త జీవితంలో తొలినాటి సాన్నిహిత్యాన్ని కొనసాగించడం మాకు కుదరలేదు. అతను స్థానిక ఇండియన్ భాషల్లో వుండే పుస్తకాలను చదవడం చూసి నేను అతని ఉద్దేశాలను సందేహించాను. ఒక రోజున తాను వెళ్ళిపోతున్నానని చెప్పాడు.

ఎల్ పాటోజోకి సైనిక శిక్షణ లేదు. తనని కర్తవ్యం రమ్మని పిలుస్తుందని చెప్పాడు. చేతిలో తుపాకీతో మా గెరిల్లా పోరాటాన్ని రగిలింపచేయడానికి తన దేశం వెళ్తున్నాడు. అప్పుడు మేం చాలా సేపు మాట్లాడుకున్నాం. అతనికి మూడు విషయాలు చెప్పాను. కదలిక సందేహించు – నిఘా ఎప్పుడూ ఒక చోట నుండి ఒక చోటికి కదులుతూనే వుండాలి. ఎప్పుడు ఒకేచోట రెండు రాత్రులు గడపవద్దు. అదే విధంగా మొదట్లో నీ స్వంత నీడపట్ల కూడా జాగురుకతతో వ్యవహరించాలి. స్నేహంగా వుండే రైతులు, సమాచారం అందించే వాళ్ళు, గైడ్‌లు, ఎవరైనా సరే నీకొక్క విముక్తి ప్రాంతం లభించేంత వరకూ అందరినీ సందేహించు. అదే విధంగా ఎప్పుడూ గార్డు డ్యూటీ చేయాలి. సురక్షిత ప్రదేశంలో బస చేయడం, చుట్టుముట్టి పట్టుకోవడానికి అవకాశం వున్న ఇంటిలో ఎప్పుడూ నిద్రపోవద్దు. ఇవన్నీ చెప్పాను. ఒక నులివెచ్చటి కరచాలనంతోపాటు నా స్నేహితుడికి నేనివ్వగలిగింది యిదే. అతను చేయొద్దని సలహా చెప్పగలనా? ఏ హక్కుతో? అసాధ్యం అనుకున్న దాన్ని చేసి చూపాం. విజయాన్ని అతను ప్రత్యక్షంగా చూశాడు. ఎల్ పాటోజో వెళ్ళిపోయాడు. ఆ తర్వాత అతని మరణవార్త వచ్చింది. పేర్ల విషయంలో ఏదైనా గందరగోళం జరిగి వుంటుందనుకున్నాం. అయితే అతని మృతదేహాన్ని వాళ్ళ అమ్మ చూసి గుర్తించింది. అతను మరణించాడు. సందేహం లేదు. ఒక్కడే కాదు అతనితోపాటు వున్న అనేక మంది మరణించారు. అందరూ అతనంత సాహసవంతులు, నిస్వార్థపరులు, తెలివైనవారే అయి వుంటారు. మాకు వ్యక్తిగతంగా వారు తెలియదు.

మరొక్కసారి ఓటమి, జవాబు చెప్పని ప్రశ్న. అతను ఇతరుల అనుభవం నుండి ఎందుకు నేర్చుకోలేదు? చిన్న సలహాను వాళ్ళెందుకు పాటించలేదు? ఎల్ పాటోజో ఎలా చనిపోయాడో తెలుసుకోవాలి. అప్పటికి మాకు సరిగ్గా తెలియదు. అయితే సరైన ప్రాంతాన్ని వాళ్ళు ఎంచుకోలేదని మాత్రం తెలుసు. కదలికల విషయంలోనూ, సందేహించడంలోనూ, నిఘా విషయంలోనూ సరైన జాగ్రత్తలు తీసుకోలేదు. శత్రువు వారిపై మెరుపుదాడి చేశాడు. కొందరిని ఖైదీలుగా పట్టుకున్నారు. కొంత మందిని వదిలేశారు. ఎల్ పాటోజో వంటి వారు యుద్ధంలో మరణించారు.

స్వతంత్రాన్ని సాధ్యం చేయడానికి మరొక్కసారి యువకుల రక్తం అమెరికాల దేశాల మట్టిని సారవంతం చేసింది. మరో యుద్ధంలో ఓడిపోయాం.నేలకొరిగిన వారి కోసం విలపించడానికి సమయం కావాలి. వారు చేసిన పొరపాట్లు దొర్లకుండా

చూసుకోవాలన్న నిర్ణయానికి రావాలి. అనేక విజయాలను సాధించడం ద్వారా ఒక్కొక్కరి మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలి. విముక్తిని సాధించడానికి ముందుకు నడవాలి.

ఎల్ పాటోజో క్యూబాని వదిలి పెట్టి వెళ్ళేప్పుడు ఏమీ విడిచి పెట్టిపోలేదు. ఏ సందేశమూ లేదు. మెక్సికోలోని పాత మిత్రులు అతను రాసిన కొన్ని కమతాలను తెచ్చి యిచ్చారు. అవే ఆ విప్లవకారుడి ఆఖరు వాక్యాలు.

విప్లవానికి, మాతృ దేశానికీ ఒక స్త్రీకీ ప్రేమగీతం రాశాడు. క్యూబాలో ఆ స్త్రీని అతను ప్రేమించాడు.

"ఇదుగో నా హృదయం తీసుకో

నీ చేత్తో పట్టుకో

ఉదయం అవ్వగానే

నీ చేతులు తెరువు

సూర్యుడు దాన్ని వెచ్చబరచనీ..."

ఎల్ పాటోజో హృదయం మాతోనే మిగిలిపోయింది. అతని ప్రేయసి చేతుల్లో, ప్రజలందరీ ప్రేమించే చేతుల్లో ఎల్ పాటోజో హృదయం వుండిపోయింది. గ్వాటిమాలాపైనా, అన్ని లాటిన్ అమెరికా దేశాలపైనా ఒక కొత్త రోజున పొడిచే సూర్యుడి కోసం ఎదురు చూస్తూ వుంది. ఈనాడు పరిశ్రమల శాఖలో అతనికి ఎందరో స్నేహితులున్నారు. అతని పేరుతో వెలిసిన చిన్న గణాంక శాస్త్ర పాఠశాల వుంది. గ్వాటిమాలా స్వేచ్ఛను పొందిన తర్వాత బడులకీ, ఫ్యాక్టరీలకీ, ఆస్పత్రులకీ, కొత్త సమాజాన్ని నిర్మించడానికి ప్రజలు పోరాడుతూ, పని చేసే ప్రతి ప్రదేశానికీ అతని ప్రియమైన పేరును పెట్టుకొంటాం.

# 2

# సోషలిస్టు సమాజ తొలిదశ

# మనం ఏమి నేర్చుకున్నాం? ఏమి బోధించాం?

**(డిసెంబరు 1958)**

**(ఈ వ్యాసం 1959 జనవరి ఒకటి విప్లవానికి కొన్ని వారాల ముందు వ్రాయగా లాస్ విల్లాస్ నుండి విప్లవ సైన్యం ప్రచురించే 'ప్యాట్రిసియా' పత్రికలో ప్రచురితమైంది)**

**ఈ** డిసెంబరు నెలలో గ్రాన్మా (Granma) దాడి ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఒక్కసారి మనం కొన్నేళ్ళుగా సాగుతున్న సాయుధ పోరాటాన్ని సుదీర్ఘమైన విప్లవఉద్యమాన్ని తిరిగి నెమరు వేసుకోవడం ఎంతైనా భావ్యం. విప్లవానికి తొలిగా ఊతమిచ్చింది 1952 మార్చి 10న జరిగిన బాటిస్తా సైనిక తిరుగుబాటు. 1953 జులై 26న జరిగిన మోంకాడా (Moncada) భీకర యుద్ధం విప్లవ తొలి ఘంటికను మ్రోగించింది.

ఆ బాట సుదీర్ఘమైంది. ఎన్నో సమస్యలు, వైరుధ్యాలతో నిండి ఉంది. విప్లవం వెనుక తిరిగేవారు గాక, నిజాయితీ, బాధ్యతగల నాయకత్వంలో నడిచే ఏ విప్లవ క్రమంలోనైనా నాయకులు, ప్రజల మధ్య పరస్పర సంభాషణ, భేటీల క్రమం చోటు చేసుకుంటుంది. ఇప్పటి ఉద్యమ నాయకులకు మోంకాడా ఆయుధాగారంపై జరిగిన దాడిలో పాల్గొన్న ఉత్సాహవంతులైన యువకులకు మధ్య ఎంతో అంతరం ఉంది. అయితే వ్యక్తులు మాత్రం వారే. ఐదేళ్ల ముఖాముఖి పోరాటం – రెండేళ్ళు బహిరంగ యుద్ధం"

– మనలో విప్లవ స్ఫూర్తి పెంచడమే కాదు వాస్తవాలతోనూ, ప్రజల సహజసిద్ధ విజ్ఞతతోనూ, పరిచయమూ ఏర్పడింది.

విశాల రైతాంగంతో సంబంధం పెరిగిన కొద్దీ ప్రస్తుత చట్టాలు ఎంత అన్యాయమైనవో తెలిసి వచ్చింది. వారసత్వ, ఆస్తి చట్టాల్లో సమూలమైన మార్పులు రావాలన్నదే రైతుల ఆకాంక్ష. ఈ విషయమై వారు మమ్ములను ఒప్పించగలిగారు. నిత్య వ్యవహారాల్లో పాల్గొనేప్పుడే క్యూబా రైతాంగం త్యాగశీలతను, వారి ఔన్నత్యాన్ని విధేయతను తెలుసుకున్నాం.

అయితే రైతులకు కూడా కొన్ని విషయాలు నేర్పాం. శత్రువర్గ దమనకాండ గురించి ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని వారికి నేర్పాం. ప్రజల చేతిలో ఉన్న ఆయుధాలు పాలకవర్గ సైన్యాల కంటే శక్తివంతమైనవని ప్రబోధించాం. ఒక్క మాటలో చెప్పాలంటే ఐక్యమత్యమే మహాబలమది చిరకాలంలోనే వారిలో స్ఫూర్తి నింపాం.

తన శక్తియుక్తులను తెలుసుకున్న రైతు ఉద్యమానికి దన్నుగా నిలిచాడు. నిర్భయంగా తన కోరికలను ప్రకటించాడు. సియర్రా మాస్త్రా వ్యవసాయ రంగ సవరణ మూడవ చట్టంలో రైతాంగం ఆశయాలు ప్రతిబింబించాయి. ఈ చట్టం నేడు మనకు ఎంతో గర్వకారణం. మన పోరాట చిహ్నం, విప్లవ సంఘటనంగా మన ఉనికికి కారణం.

అయితే ఇదే విధానాన్ని ఇతర సామాజిక సమస్యల పరిష్కారానికి పాటించలేదు. ప్రజలతో ఎలాంటి సంబంధాలు లేకుండా సియర్రా విప్లవ స్థావరంలో చిక్కుకున్న మేము కొన్నిసార్లు విప్లవ భావాల కంటే మా చేతిలో ఉన్న ఆయుధాలే శక్తివంతమైనవని భావించేవాళ్ళం. ఈ కారణంగానే ఏప్రిల్ 9 మనకో దురదృష్టకరమైన దినంగా మిగిలిపోయింది. అలెగ్రియా డి పయో (Alegriade Pio) వద్ద సాయుధ ఘర్షణలో చవిచూసిన ఘోరనష్టం సాయుధ పోరాట క్రమంలో ఒక ప్రధానమైన పరిణామం.

అలెగ్రియా డి పయో నుండి కొన్ని విప్లవాత్మకమైన పాఠాలు నేర్చుకున్నాం. భవిష్యత్‌లో జరిగే ఏ ఒక్క పోరాటంలో కూడా ఓటమి చవిచూడకూడదని, అలాగే ప్రజాపోరాటం కొన్ని సంప్రదాయబద్ధమైన నియమాలు - ఉల్లంఘించలేనివి - పాటిస్తుందని గ్రహించాం. ఈ పాఠం బాగా అర్థమైంది. రైతాంగంతో కలిసి కార్మికవర్గాలు కూడా ఉద్యమంలో పాలుపంచుకోవడానికి చర్యలు తీసుకున్నాం. అప్పుడే తమ డిమాండ్ల సాధన కోసం కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. వారిని యునైటెడ్ నేషనల్ వర్కర్స్ ఫ్రంట్ (FONU) ఆధ్వర్యంలో ఏకం చేసి తక్షణ లక్ష్యంగా విప్లవాత్మకమైన సాధారణ సమ్మె చేపట్టాలని నిర్ణయించాం.

ఇది రాజకీయ చాతుర్యాన్ని చాటుకోవడానికి వేసే వాగాడంబర ఎత్తుగడ కాదు. మేము ప్రజల ఆలోచనలను పరిశోధించడానికి కారణం కేవలం శాస్త్రపరమైన జిజ్ఞాస కాదు. రైతులు, కార్మికులకు సాయుధ నాయకత్వం వహిస్తున్న మేము కూడా ప్రజలలో భాగమే. వారి ఆశయాల సాధనే మా లక్ష్యం. మా నాయకత్వ బాధ్యతలు ప్రజల నుండి మమ్మల్ని వేరు చేయలేవు. ఇంకా చెప్పాలంటే మాపై మరింత భారం ఉంటుంది (ప్రజాసమస్యల విషయంలో).

క్యూబాలోని అన్ని సామాజిక వర్గాలకు మా ఉద్యమం ప్రాతినిధ్యం వహిస్తున్నందున ఉద్యోగులు, వర్తకులు, వాణిజ్యవేత్తలు, వృత్తిపరమైన వర్గాల సమస్యలపై కూడా మేము పోరాడాల్సి వస్తోంది. పారిశ్రామికవేత్తల విషయంలో కూడా మేము జోక్యం చేసుకుంటున్నాము. ఎందుకంటే జాతి నిర్మాణంలో వారి పాత్ర గణనీయమైనది. క్యూబాను నిరంతర కష్టాల కడలి నుండి బయటికి తీసుకురావాలనుకునే ప్రతి బాధ్యతగల పౌరుడి తరపున మేము పోరాడుతున్నాము.

ఈ దశలో జులై 26 ఉద్యమం తన పోరాటాన్ని అహంకార ధోరణితో కాకుండా ప్రజల విముక్తి కోసం, స్వేచ్ఛా, ప్రజాస్వామ్యం కోసం అంకిత భావంతో కొనసాగిస్తోంది.

ఈ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మా ప్రతిజ్ఞ మార్చబోతున్నాం. స్వతంత్రులుగానో, అమరవీరులుగానో ఉందాం అన్న నినాదం మాదికాదు. కేవలం స్వతంత్రులుగానే ఉండిపోవాలి. సమస్త క్యూబా ప్రజల ఉద్యమ కార్యదక్షతతో, తరతరాలుగా అనుభవిస్తున్న దాస్యశృంఖలాల స్థానంలో త్యాగం, బలిదానాలతో ఈ స్వాతంత్ర్యాన్ని సాధిద్దాం.

# గెరిల్లా పోరాట ఉద్దేశ్యం

## (1960)

(ఈ వ్యాసం గువేరా రచించిన లా గుయెర్రా డి గెరిల్లాస్ (La guerra de gererrillas) (Guerrilla Wefare పుస్తకం ప్రథమ అధ్యాయం)

**బా**టిస్టా నియంతృత్వంపై ప్రజల సాయుధ విజయం ప్రపంచ వార్తా సంస్థలు అభివర్ణించినట్లు చారిత్రక ఘట్టమే కాదు, లాటిన్ అమెరికా ప్రజా ఉద్యమాలపై ఇప్పటి వరకున్న పాత పిడివాద ఆలోచనలను పూర్తిగా మార్చివేసింది. నియంతృత్వ పాలనకు తెరదించడానికి, తమను తాము విముక్తులు చేసుకోవడానికి ప్రజలు సాయుధ గెరిల్లా పోరాటం చేయగలరన్న వాస్తవాన్ని క్యూబా విప్లవం ఆవిష్కరించింది.

లాటిన్ అమెరికా దేశాలలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు క్యూబా విప్లవం మూడు ప్రధానమైన సూత్రాలు నిర్దేశించిందని నేను నమ్ముతున్నాను. అవి :

1. ప్రజాదళాలు యుద్ధంలో సైన్యంపై విజయం సాధించగలరు.
2. విప్లవానికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడే వరకు వేచి చూడాల్సిన అవసరం లేదు. ఒక విప్లవ కేంద్రం పరిస్థితుల్లో మార్పు తీసుకురాగలదు.
3. అత్యంత వెనుకబడిన లాటిన్ దేశాలలో గ్రామీణ ప్రాంతాలే విప్లవ పోరాట క్షేత్రం అవుతాయి.

పై మూడు సిద్ధాంతాల్లో మొదటి రెండు ఎంతో విప్లవాత్మకమైనవి. ప్రజల ఆశయాలు, శత్రుసైన్యం దుర్భేద్యమనే ఆలోచనలు పరిస్థితులు అనుకూలించే వరకు ఎవరూ ఏమీ చేయలేరనే నిస్తేజం విప్లవానికి ఎలాంటి సహకారం అందించలేని వర్గాలకు ఈ రెండు సూత్రీకరణలు కొత్త పాఠాలు నేర్పగలవు. క్యూబాలో పైన పేర్కొన్న పరిస్థితులే

ఉండేవి. వాటి గురించి చర్చకూడా జరిగింది. అయితే విప్లవం ఈ ఊహాగానాలు, ధోరణులకు తెరదించింది. ఇప్పుడు లాటిన్ అమెరికాలో క్యూబా విప్లవ పంథాపై తీవ్రస్థాయిలో చర్చజరుగుతోంది.

స్వాభావికంగా, విప్లవ అనుకూల పరిస్థితులను చర్చించే సమయంలో గెరిల్లా స్థావరం ప్రేరణతో అవి సంభవిస్తాయని భావించకూడదు. గెరిల్లా స్థావరం ఏర్పాటు, దాని పటిష్టతకు కొన్ని కనీస వసతులు, వాతావరణం అవసరమని గుర్తించాలి. సామాజిక సమస్యల సాధనకు ప్రస్తుతం అమల్లో ఉన్న నీతిబాహ్యమైన లోపభూయిష్టమైన చట్టాలు ( నియంతృత్వపాలనలో) ఏ మాత్రం ఉపకరించవని, సాయుధ పోరాటంతోనే వాటికి పరిష్కారం లభించగలదని ప్రజలకు స్పష్టమైన రీతిలో ప్రబోధించాలి. సమాజ సమతుల్యతను నియంతృత్వశక్తులే దెబ్బతీస్తాయి. తద్వారా పాలకవర్గాల హక్కులను చట్టాన్ని ఉల్లంఘించైనా కాపాడటానికి ప్రయత్నిస్తాయి.

ఈ పరిస్థితుల్లో ప్రజాగ్రహం మరింత ప్రబలమై వారిలో విప్లవ ధోరణులకు బీజం వేస్తుంది. అధికారుల నియంతృత్వ పోకడలతో ఉద్యమం సాయుధ విప్లవంగా రూపాంతరం చెందుతుంది.

ఎన్నికల ద్వారా అధికారంలో వచ్చే ప్రభుత్వం ( ఎన్నికలు నిష్పక్షపాతమైనా, లోపభూయిష్టమైనా) రాజ్యాంగ మార్గదర్శక సూత్రాలు పాటిస్తున్నట్లు సంకేతాలు పంపితే గెరిల్లా యుద్ధానికి కాలుదువ్వడం కష్టతరమవుతుంది. ఎందుకంటే చట్టాలకు లోబడే ప్రజలు తమ సమస్యల సాధనకు ఉద్యమించే పరిస్థితులు ఇంకా కొనసాగుతుంటాయి.

మూడవ సూత్రీకరణ సైనికపరమైనది. ఉద్యమాలు కేవలం పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితమన్న భావనను ఈ సిద్ధాంతం గట్టిగా తిప్పికొట్టింది. గ్రామీణ ప్రాంత ప్రజలు జాతీయ ఉద్యమాలకు (లాటిన్ అమెరికాలో) ఎంతో ఊతమిచ్చారన్న వాస్తవాన్ని కొందరు విశ్లేషకులు పూర్తిగా మరచిపోయినట్లున్నారు. సామాజిక, రాజకీయ పరిస్థితులను వాస్తవిక దృక్పథంలో విశ్లేషించితే సాయుధ పోరాటానికి తగిన వాతావరణం ఏర్పడిందా? లేదా? అని ఆలోచించాలే కాని సంఘటితమైన కార్మిక వర్గాలు తమ సమస్యలను ఉద్యమాల ద్వారా సాధించగలరా? లేదా? అని కాదు. కార్మిక ఉద్యమాలకు కొన్ని పరిమితులు ఉన్నాయని చెప్పడానికే ఈ వాదన చేస్తున్నాను. ఎందుకంటే వారి ఉద్యమాలు ప్రభుత్వ ఉక్కుపాదం నుండి తప్పించుకోజాలవు. నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లాల్సి ఉంటుంది. ఆయుధాలు లేకుండా, రక్షణ లేకుండా వారు ప్రభుత్వాన్ని ఎదురించే పరిస్థితే తలెత్తదు. అయితే గ్రామీణ ప్రాంతాలకు వస్తే ఇలాంటి నిర్బంధ చర్యలు ఏ మాత్రం ఉండవు.

తిరోగమన శక్తుల ప్రభావానికి దూరంగా ఉండే ఈ ప్రాంతాలలో స్థానికులకు సాయుధ విప్లవకారులు కొండంత అండగా నిలబడే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి.

ప్రజలను విముక్తి చేయడానికి చేపట్టే గెరిల్లా యుద్ధానికి ప్రత్యేకమైన, వైవిధ్య భరితమైన లక్షణాలు ఉంటాయి. ఇతర ఉద్యమాలకు ఉన్నట్టే ఈ పోరాటానికి అంతిమ లక్ష్యం ఒక్కటే. దోపిడీ వ్యవస్థను రూపుమాపడం. పోరాటానికి (యుద్ధం) కొన్ని లిఖిత, నైతిక నియమాలు ఉంటాయన్నది నిర్వివాదం. వీటిని అతిక్రమించే వారు ఘోర పరాభవాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. కొందరు సూచించినట్లు సాయుధ పోరాటం కూడా ఈ నిబంధనలను పాటించాల్సి ఉంది. అయితే దానికున్న ప్రత్యేకతల దృష్ట్యా, ఈ తరహా యుద్ధానికి అదనపు నియమనిబంధనలు కూడా వర్తిస్తాయి. ఆయా దేశాల సామాజిక, భౌగోళిక పొందికలు ప్రజాపోరాటాల తీరును నిర్దేశిస్తాయన్నది వాస్తవం. అయితే అన్ని ప్రజాపోరాటాలకు వర్తించే నియమాలే గెరిల్లా యుద్ధానికి కూడా వర్తిస్తాయి.

ప్రస్తుతం మన ముందున్న ప్రధాన సమస్యల్లా సాయుధ పోరాటానికి విధి విధానాలు రూపొందించడం. ఈ నిబంధనలను విముక్తి కోరే ప్రజలు తప్పక పాటించాలి. వాస్తవాల ఆధారంగా ఒక సిద్ధాంతాన్ని రూపొందించడం, క్యూబా అనుభవాలకు ఒక నిర్ధిష్టమైన రూపు ఇవ్వడం మన బాధ్యత.

తొలిగా అవసరమైంది గెరిల్లా యుద్ధంలో సభ్యులు. ఒకవైపు నిరంకుశ ప్రభుత్వం, వారి జీతం తీసుకొనే వృత్తిపరమైన సైన్యం (ఎంతో శక్తివంతమైనది, క్రమశిక్షణ గలది). అవసరమైతే విదేశీ సైనిక సహకారం, ప్రభుత్వాధికారుల మద్దతును సైతం కూడగట్టి పాలకవర్గాలను కాపాడే శక్తి సామర్థ్యాలు సైన్యానికి ఉంటాయి. మరోవైపు ఆ దేశంపై లేదా ఆ ప్రాంతపు పీడిత జనం. గెరిల్లా యుద్ధం ప్రజాయుద్ధం, సామూహిక ఉద్యమమని నొక్కి చెప్పాలి. సాయుధులైన విప్లవకారులు ప్రజా ఉద్యమానికి నాయకులు. ప్రజలే వారికి స్ఫూర్తి. సైన్యం కంటే సంఖ్యాపరంగా గెరిల్లాలు చాలా తక్కువని ఎవరూ భ్రమ పడరాదు. సైన్యానికి – ఆయుధ సంపత్తిలో తప్ప – వారు ఏ విధంగా తక్కువ కాదు. పెద్ద ఎత్తున ప్రజల మద్దతు ఉంటే ఆయుధాలు తక్కువ సంఖ్యలో ఉన్నా గెరిల్లా యుద్ధం వైపు విప్లవకారులు మొగ్గు చూపుతారు.

కనుక సాయుధ విప్లవకారుడు ఆయా ప్రజల సహాయసహకారాల పైనే ఆధారపడి ఉంటాడు. ఇది తప్పదు కూడా. ఈ పరిస్థితిని ఒక ప్రాంతంలోని బందిపోటు దొంగల ముఠాతో పోలుద్దాం. బందిపోట్లు ప్రాథమికంగా గెరిల్లాల పోరాట విధానాలనే పాటిస్తారు. వారికి తమ ప్రాంత భౌగోళిక కూర్పుపై పూర్తి అవగాహన ఉంటుంది. సామూహిక

జీవనం, నాయకుని పట్ల విధేయత, ధైర్య సాహసాలు, మెరుపుదాడులు నిర్వహించగల శక్తి సామర్థ్యాలు వారిలో పుష్కలం. అయితే విప్లవకారులకు, దోపిడీ దొంగలకు మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం ఒక్కటే. అదే ప్రజల ఆమోదం. అది లేకనే వారు ప్రభుత్వ దళాల చేతిలో హతమవుతారు లేక పట్టుబడతారు.

విప్లవకారుల కార్యకలాపాలను విశ్లేషించిన మీదట ఒక ప్రశ్న ఉదయిస్తుంది. అసలు విప్లవకారుడు దేనికోసం పోరాడుతున్నాడు? విప్లవకారుడు ఒక సామాజిక కార్యకర్త అని మనం ఒక నిర్దిష్టమైన అభిప్రాయానికి రావచ్చు. ప్రజాగ్రహానికి స్పందనగా ఆయుధాలు చేపట్టి దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాటం చేసేవాడు విప్లవకారుడు. అన్యాయం తీవ్రంగా ప్రబలి ఉన్న సామాజిక వ్యవస్థ స్వరూపాన్ని మార్చివేయడానికి ఉద్యమించేవాడు విప్లవకారుడు. నియంతృత్వ వ్యవస్థను వ్యతిరేకిస్తూ తన శక్తినంతా కూడగట్టుకొని (పరిస్థితులు అనుకూలించిన మేరకు) దోపిడీ కేంద్రాలను (సంస్థలు) ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తాడు.

గెరిల్లాపోరును విశ్లేషిస్తే, తాను కార్యకలాపాలు నిర్వహించే ప్రాంత భౌగోళిక స్వరూపంపై విప్లవకారునికి పూర్తి అవగాహన ఉండాలి. అందుబాటులో ఉండే మార్గాలు, నిష్క్రమణ మార్గాలు, సైనిక చర్యల్లో మెళకువ, స్థానికుల్లో బలం, సురక్షిత స్థావరాలు విప్లవ కేంద్రానికి ఎంతో అవసరం. గెరిల్లా యోధుడు తన కార్యకలాపాలను జనసాంద్రత పెద్దగా లేని మారుమూల గ్రామాలు, పర్వతప్రాంతాలలో కొనసాగిస్తాడు. ఈ ప్రాంతాల్లో ప్రజల ప్రధాన సమస్యల్లా భూమి యాజమాన్య హక్కులే. కనుక విప్లవకారుడు సాయుధ రైతువీరుడు. రైతాంగం ఆశయాలను నెరవేర్చేవాడు.

ప్రస్తుత వాదనల ప్రకారం రెండు రకాల గెరిల్లా యుద్ధ విధానాలు ఉన్నాయి. బలమైన సైన్యానికి చేదోడువాదోడుగా వ్యవహరించే గెరిల్లా బృందాలు (సోవియట్‌లోని యుక్రేనియన్ గెరిల్లాలు) ఒక రకమైనవి. వీటి గురించి ఇక్కడ చర్చ అనవసరం. ఒక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ ఉద్భవించే సాయుధ సముదాయం మరో విధమైనది. ప్రజల మద్దతే ఆయుధంగా గ్రామీణ ప్రాంతాలలో వెలిసే ఈ విప్లవ బృందాలు ఏ సిద్ధాంతాల కోసమైనా పోరాడవచ్చు కాని ప్రాథమికంగా స్థానికుల ఆర్థిక హక్కు అయిన భూమి కోసం ఉద్యమించాల్సి ఉంటుంది.

విప్లవ ఉద్యమ భావజాలం ఏదైనా తొలుత ఆర్థిక, సామాజిక సమస్యల సాధన కోసం గెరిల్లా దళాలు పోరాటం చేయక తప్పదు.

చైనాలో తొలుత కార్మికుల ఉద్యమాన్ని మావో చేపట్టారు. అయితే పాలక సైన్యాలు ఈ కార్మిక సంఘాలను దాదాపు అంతమొందించాయి. యునాన్ ప్రస్థానం తర్వాత ఉద్యమాన్ని గ్రామీణ ప్రాంతాలలో మావో రైతాంగ సమస్యలపై ప్రజలను సమీకరించి, సంపూర్ణ విప్లవాన్ని సాధించారు. ఇండోచైనాలో హోచిమిన్ ఉద్యమం వరిసాగు చేసే రైతులతో మొదలై ఫ్రెంచి సేనల ఓటమితో విజయవంతమైంది. ఈ రెండు దేశాలలో జాతీయభావం ప్రధానాంశంగా ఉన్నా ఉద్యమానికి ప్రాణం పోసింది మాత్రం భూసంస్కరణలే. అల్జీరియాలో కూడా ఫ్రెంచి వలసవాదులు ఆక్రమించుకున్న భూముల కోసం పోరాటం మొదలై అరబ్ జాతీయవాదానికి పునాదులు వేసింది. అమెరికా ఆక్రమించుకున్న పోర్టోరికోలో సైతం రైతులు భూమి కోసం పోరాటాలు చేశారు. 1868 నుండి 1898 వరకు క్యూబాలో జరిగిన విమోచనా యుద్ధం ( స్పెయిన్‌కు వ్యతిరేకంగా) ప్రధానంగా రైతులు, రైతుకూలీలు సాగించిందే.

గెరిల్లా యుద్ధతంత్రాన్ని ప్రత్యేకమైన యుద్ధతంత్రంగా మార్చివేసే లక్షణాలున్నా, ఈ తరహా యుద్ధంలో మనం సైనిక స్థావరాలపై పట్టు సాధించే విధంగా కార్యాచరణను రూపొందించుకోవలిసిన అవసరం ఎంతైనా ఉంది. ఉద్యమం బలపడే కొద్దీ సైనిక చర్యతో స్థావరాలను సాధించుకుంటూ, అంతిమ దశలో శత్రుసైన్యాన్ని సంపూర్ణంగా పరాజయం పాలుచేసే అవకాశాలు పెరుగుతాయి. అందుకే ప్రతి యుద్ధం, ఘర్షణ లేదా సాయుధ చర్యలో విజయం తప్పని సరిగా లభించేటట్లు కృషి చేయాలి. కొందరు నిపుణులు గెరిల్లా యుద్ధాన్ని కపట యుద్ధంగా అభివర్ణించారు. రహస్య కార్యకలాపాలు, కపటత్వం, మెరుపు దాడులు నిర్వహించడమే గెరిల్లా యుద్ధతంత్రంగా పేర్కొన్నారు. అయితే గెరిల్లా యుద్ధం ఒక ప్రత్యేకమైన కపట యుద్ధం. ప్రతికూల పరిస్థితులు, నిరంకుశత్వం కారణంగా ఈ మార్గాన్ని ఎంచుకున్నాం. సాంప్రదాయ యుద్ధతంత్రానికి ఇది కొంత భిన్నమైనదే.

యుద్ధం ఒక పోరాట ప్రక్రియ. ఇందులో ఇరుపక్షాలు తమ శత్రువును అంతమొందించడానికే ప్రయత్నిస్తాయి. సైనిక చర్యలే కాకుండా ఇతరత్రా విధానాలు అవలంబించి తమ లక్ష్యసాధనకు కృషి చేస్తాయి. సైన్యం రూపొందించే లేదా పాటించే విధానాలనే గెరిల్లాలు అవలంభిస్తారు. అయితే వారు ప్రజల పక్షాన, వారి ఆశయ సాధనకు పోరాడతారు. శత్రువు బలహీనతలను ఆసరా చేసుకొని ముందుకు సాగుతారు. జాగ్రత్తగా పరిశీలిస్తే సైనిక విభాగాలు అవలంబించే విధానాలు గెరిల్లా యుద్ధతంత్రానికి ఏ మాత్రం తీసిపోవు. రహస్య సైనిక కార్యకలాపాలు వంచనా పూరితమైన దాడులు, శత్రుసైన్యం తేరుకోవడానికి వీలు లేకుండా దెబ్బగొట్టే మెరుపు దాడులు ఇందుకు నిదర్శనాలు. గెరిల్లా

బృందం కూడా సైనిక విభాగం లాంటిదే. అది అనుసరించేది కూడా సైనికుల పద్ధతులే. కాకపోతే సువిశాలమైన ప్రాంతంలో అది తన కార్యకలాపాలు నిర్వహిస్తూ శక్తివంతమైన శత్రువును తనదైన శైలిలో చిత్తు చేస్తుంది. అలా వ్యవహరించడమే గెరిల్లా విధానం, గెరిల్లా సభ్యుడి బాధ్యత కూడా అదే.

దాడి చేసి పారిపోవడం అని మరికొందరు చెప్పారు. అవును, అదీ నిజమే. దాడి చేసి పారిపోవడం, సమయం కోసం వేచి చూసి సైన్యంపై దాడికి పాల్పడటం, సురక్షితంగా తిరిగి వెళ్ళడం... ఇలా నిరంతరంగా పోరు సాగిస్తూ శత్రువు కంటిపై కునుకు లేకుండా చేయడమే గెరిల్లాల పని. ఈ తరహా పోరు కొన్ని తప్పుడు సంకేతాలిస్తున్నట్లు కనిపించినా, విప్లవం సాధించడం కోసం, శత్రువర్గాన్ని తుడిచిపెట్టడం కోసం ఇదే తప్పని సరి మార్గం.

ఇక్కడ ప్రతి ఒక్కరికీ అర్థం కావాల్సిన విషయమేమిటంటే గెరిల్లా యుద్ధం ఒక నిరంతర ప్రక్రియ. ఈ సమయంలో సంపూర్ణ విజయం సాధించడానికి అవకాశాలే ఉండవు. ఉద్యమం బలపడి గెరిల్లాల సంఖ్య పెరిగి ఒక సాధారణ సైనిక విభాగం వలె గెరిల్లా బృందాలు అవతరిస్తే అప్పుడే సాంప్రదాయ యుద్ధతంత్రానికి అవకాశం ఉంటుంది. ఒక సారి సాధారణ సైన్యం స్థాయికి ఎదిగినపుడు శత్రుసైన్యాన్ని సంపూర్ణంగా మట్టు బెట్టడానికి వీలుపడుతుంది. యుద్ధంలో విజయం సైన్యం ద్వారానే సాధ్యం. అయితే ఇందుకు పునాది మాత్రం గెరిల్లా బృందాలే.

సైనికాధికారి యుద్ధంలో ముందుండి నిర్దేశిస్తూ శత్రువులను ఎదుర్కొని మరణించాల్సిన అవసరం ఎలా ఉండదో గెరిల్లా కూడా తాను చేసే ప్రతి పోరాటంలో మరణించాలన్న నియమం ఏదీ లేదు. ప్రాణత్యాగం చేయడానికి అతడు వెనుకాడడు, అయితే ఒక సిద్ధాంతం కోసం పోరాడుతూ మరణించడం కంటే ఆ సిద్ధాంతం వాస్తవ రూపం దాల్చడానికి రక్త తర్పణం చేయాలి. ఈ ఆలోచనే గెరిల్లా యుద్ధానికి మూలాధారం.

పై అంశాలను పరిశీలిస్తే, గెరిల్లా యుద్ధకాండపై వచ్చిన నిందాపూర్వకమైన వ్యాఖ్యానాలు కూడా ప్రశంసలుగా మారతాయి. గెరిల్లాలు చేపట్టిన మహోన్నతకార్యం, అంతిమ లక్ష్యం గురించి తెలుస్తాయి. ఇక్కడో విషయం గమనించాలి. లక్ష్య సాధనకు కేవలం అక్రమ మార్గాలనే అనుసరించాలని ఎక్కడా ప్రబోధించలేదు. పోరాట పటిమ, ఓటమిలో సహనం, విప్లవ లక్ష్యంలో ఎదురయ్యే కఠినమైన పరిస్థితులను ఎదుర్కోవడం... ఇవన్నీ విప్లవయోధుడి ఔనత్యాన్ని తెలియజేస్తాయి.

# గెరిల్లా యుద్ధం : ఒక విధానం

**(సెప్టెంబరు 1963)**

చరిత్రను ఒకసారి పరిశీలిస్తే గెరిల్లా యుద్ధాలు జరిగిన దాఖలాలు మనకు ఎన్నో లభిస్తాయి. వివిధ సందర్భాల్లో, వివిధ పరిస్థితుల్లో విభిన్నమైన లక్ష్యాలు సాధించేందుకు ఇవి ఉపకరించాయి. ఈ మధ్య కాలంలో జరిగిన ప్రజా విమోచనా పోరాటాల్లో ఈ పద్ధతులను పాటించారు. ఉద్యమనాయకులు తమ లక్ష్యసాధనకు తాత్కాలిక యుద్ధ పద్ధతులను అనుసరించారు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ దేశాలలో ఇలాంటి పోరాటాలు సాగాయి. ముఖ్యంగా భూస్వామ్య వ్యవస్థ, పరాయి పాలనకు వ్యతిరేకంగా ఈ పోరాటాలు జరిగాయి. ఐరోపాలో కొన్ని దేశాలు తమ సైన్యంలోనే గెరిల్లా దళాలను ఏర్పాటు చేసుకున్నాయి.

అమెరికా దేశాలలో గెరిల్లా యుద్ధాలు అనేకసార్లు జరిగాయి. సిజర్ అగస్టో సాండినో (Cesar Augusto Sandino) అమెరికా దళాలపై నికరాగ్వా (Nicargua) లోని సెగోవియా (Segavia) నదీ తీరం వద్ద జరిపిన ఆకస్మిక దాడులు ఇందుకు ఓ ఉదాహరణ. ఈ మధ్యనే మనం క్యూబాలో విప్లవ యుద్ధాన్ని చూశాం. లాటిన్ అమెరికా దేశాలలో కొన్ని ప్రగతిశీల శక్తులు సాయుధ పోరాటం ఆవశ్యకతపై చర్చను లేవదీశాయి. అలాగే రాజకీయ విశ్లేషకులు, సిద్ధాంతకర్తలు దీనిపై వ్యాసాలు రాశారు.

ఈ వ్యాసంలో గెరిల్లా యుద్ధంపై మా ఆలోచనలను, దాని సక్రమ వినియోగానికి సూచనలను ఇస్తున్నాం. ముందుగా ఒక విషయం చెప్పదలిచాం. గెరిల్లా యుద్ధం విప్లవ లక్ష్య సాధనకు ఒక మార్గం. విప్లవం ముఖ్య ఉద్దేశం రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకోవడం. లాటిన్ అమెరికా దేశాలలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా గెరిల్లా యుద్ధం

సంకల్పాన్ని ప్రజాపోరాటాలలో పరిమితమైన రీతిలో ఉపయోగించి లక్ష్య సాధనకు కృషి చేయాల్సి ఉంది.

అయితే వెంటనే కొన్ని సందేహాలు తలెత్తే అవకాశం ఉంది. అధికారం హస్తగతం చేసుకోవడానికి కేవలం గెరిల్లా యుద్ధమే మార్గమా? లేకపోతే ప్రజాపోరాటంలో అదో ముఖ్య భాగమా? లేక ఉద్యమాలలో వినియోగించిన అనేక పద్ధతుల్లో అదొకటా? చివరగా మేము ఒక ప్రశ్న అడగదలిచాం. క్యూబా విప్లవ పంథా లాటిన్ అమెరికా దేశాలకు ప్రస్తుత పరిస్థితులలో వర్తింపచేయగలమా? వాద ప్రతివాదనల సందర్భంగా గెరిల్లా యుద్ధాన్ని సమర్ధించిన వారిని ప్రజా ఉద్యమాలు విస్మరిస్తున్నారంటూ కొందరు విమర్శించారు. గెరిల్లా పోరాటం, ప్రజా ఉద్యమం వేరన్నట్టు జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నాం. ప్రజల మద్దతు లేకుండా సాయుధ పోరాటం సాగించడం అసాధ్యం. ఇందులో అపజయం, ఘోర పరాభావం తప్పదు. విప్లవ యోధుడు ఉద్యమానికి సాయుధ సేనాని, అతని లక్ష్యం రాజకీయ అధికారం. అతడికి రైతులు, కార్మికుల మద్దతు సంపూర్ణంగా ఉంటుంది. ఈ పరిస్థితులే లేకుంటే గెరిల్లా యుద్ధం చేయడం అసాధ్యం. అమెరికాలో జరిగిన సాయుధ పోరాటాలు, వాటి పంథాను లాటిన్ దేశాలలో కూడా అనుసరించడానికి ఇప్పుడు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. హవానా ద్వితీయ ప్రకటన సాయుధ పోరాటంపై స్పష్టమైన వివరణ ఇచ్చింది. “ లాటిన్ దేశాలలో వెనుకబడిన పారిశ్రామికీకరణ, భూస్వామ్య వ్యవస్థతో సతమతమవుతున్న వ్యవసాయ రంగం ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజానీకం కడగండ్లు వర్ణనాతీతం. కొన్ని దేశాలు మినహాయిస్తే గ్రామీణ ప్రదేశాలన్ని 70 శాతం జనాభా కలిగి ఉన్నాయి.

భూస్వాములు చాలా మంది నగర ప్రాంతాల్లో జీవితాలు గడుపుతున్నారు. వారిని మినహాయిస్తే పేద రైతులు, దినసరివేతన కూలీల అవస్థ చాలా ఘోరంగా ఉంది. తీవ్రమైన పీడిత జీవితాలను వారు గడుపుతున్నారు. మధ్యయుగ కాలం నాటి పరిస్థితులు నేటికీ కొనసాగుతున్నాయి. ఈ సామాజిక వర్గాలు విప్లవ బాటలో పయనించడానికి పరిస్థితులు ఎంతో అనుకూలంగా ఉన్నాయి.

లాటిన్ దేశాలలో సైన్యాలు సాంప్రదాయ యుద్ధ పద్ధతులలో ఆరితేరినవి. వారి ద్వారా పాలక వర్గాలు ప్రజలను దోచుకుతింటున్నాయి. వారిని చిత్రహింసలకు గురి చేస్తున్నాయి. అయితే గ్రామీణ, కొండ ప్రాంతాల్లో సాయుధ పోరాటం మొదలైతే వారు

దానిని ఆ సైన్యం సమర్ధవంతంగా ఎదుర్కోలేదు. ప్రతి పదిమంది సైనికులకు ఒక విప్లవకారుడు ప్రాణాలర్పిస్తే సైన్యం మనోధైర్యం తీవ్రంగా దెబ్బతిని కనిపించని శత్రువర్గాన్ని ఎదుర్కోవడానికి వెనుకడుగు వేస్తుంది.

ప్రాథమిక దశలో సాయుధ విప్లవాన్ని చిన్న చిన్న ప్రాంతాలకు, చిన్న వర్గాలకు పరిమితం చేసి తర్వాతి దశలో ఒక్కసారిగా ఉధృతం చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో పెద్ద కష్టమేమీ ఉండదు. అయితే నిరక్షరాస్యులైన రైతాంగానికి ఉద్యమ నాయకత్వం చాలా అవసరం. వారికి కార్మిక వర్గాల రాజకీయ, సామాజిక అండదండలు కల్పించాల్సి ఉంటుంది. ప్రస్తుత చారిత్రక పరిస్థితుల దృష్ట్యా లాటిన్ దేశాలలో విప్లవానికి బూర్జువా వర్గాలు నాయకత్వం వహించగల స్థితిలో లేవు. శక్తివంతమైన సైన్యాన్ని అదుపు చేసే శక్తి సామర్థ్యాలు వాటికి లేవు. ఈ కారణంగానే వారు అమెరికా సామ్రాజ్యవాదాన్ని, పెట్టుబడిదారీ విధానాలను ఎదుర్కోవడంలో ఘోరంగా విఫలమయ్యారు. సామాజిక విప్లవం వల్లవచ్చే కష్టాలు, పాలకవర్గాల దమనకాండకు వారు భయపడి అచేతనావస్థలో ఉన్నారు.”

సాయుధ విప్లవానికి ఏర్పడిన అనుకూల పరిస్థితులపై హవానా ద్వితీయ ప్రకటన ఈ క్రింది విధంగా వ్యాఖ్యానించింది.

“ విప్లవ అవగాహన, సమీకరణ, నాయకత్వం లాంటి ప్రత్యేకమైన పరిస్థితులు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళ వచ్చు లేదా ఉద్యమాన్ని వాయిదా వేయవచ్చు. విప్లవ పరిస్థితులు కాలక్రమంలో మెరుగుపడితే సామూహిక అవగాహన పెరిగి ఉద్యమానికి అవసరమైన సమీకరణ, వ్యవస్థ నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు.

ఈ ప్రాథమిక దశ శాంతియుతంగా జరుగుతుందా లేదా కొన్ని త్యాగాల తర్వాత సాఫల్యమవుతుందా అనేది సామాజిక శక్తులపై ఆధారపడి ఉంటుంది. చరిత్రలో విప్లవాన్ని ప్రసవానికి సహకరించే వైద్యుని పరిస్థితి వలే ఉంటుంది. సాధ్యమైనంత వరకు మామూలు కాన్పుకే అతడు ప్రాధాన్యతనిస్తాడు. శస్త్ర చికిత్స అవసరమనుకుంటే నిస్సందేహంగా తన పని తాను చేస్తాడు. అలాగే ఉజ్వల భవిష్యత్తు (పీడన నుండి విముక్తి) ఆశలను ప్రజల్లో రేకెత్తించడం నిజంగా కష్టంతో కూడుకున్న పని.

లాటిన్ అమెరికాలోని చాలా దేశాలలో విప్లవం తప్పనిసరి. ఈ వాస్తవం ఏదో ఒక వ్యక్తి అభిప్రాయం తీసుకొని గుర్తించినది కాదు. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న

దోపిడీదారి వ్యవస్థ, దమనకాండ, విప్లవకాంక్ష, సామ్రాజ్యవాద పతనం, వివిధ దేశాలలో సాగుతున్న ప్రజాపోరాటాలు ఇందుకు నిదర్శనాలు”

పై వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకొని గెరిల్లా యుద్ధాన్ని లాటిన్ దేశాలలో ఎలా కొనసాగించవచ్చో సమీక్షిద్దాం.

రాజకీయ అధికారం కోసం సాయుధ పోరాటం ఒక మార్గమని ముందుగానే నిర్ధారించాం. ఆ మార్గాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, లాటిన్ దేశాలలో వేరే మార్గాలలో కూడా రాజ్యాధికారం సాధించవచ్చేమో పరిశీలిద్దాం.

ప్రజా ఉద్యమాన్ని శాంతియుతంగా కొనసాగించి ప్రభుత్వాన్ని లొంగదీసుకోవచ్చు. కార్మిక వర్గాల చేతిలో రాజ్యాధికారం పెట్టి సమసమాజ స్థాపనకు శక్తి వంతమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. సిద్ధాంతపరంగా ఇది సాధ్యపడవచ్చు. అయితే లాటిన్ దేశాల కోణం నుండి పరిశీలిస్తే ప్రజాస్వామ్యయుతంగా ఉద్యమాన్ని లక్ష్యం వైపు తీసుకెళ్లడం చాలా కష్టం. భూస్వామ్య వ్యవస్థ, దమనకాండ కారణంగా ఉద్యమం సాయుధ పోరాటం స్థాయికి చేరుకోవచ్చు. విప్లవానికి అనుకూలమైన పరిస్థితులున్నపుడు వాటిని సద్వినియోగించుకోకుంటే అంతకంటే మించిన అపరాధం మరొకటి ఉండదు. చరిత్ర ఇందుకు సాక్షిభూతం.

విప్లవ నాయకత్వంపై అందరికీ మక్కువ ఉండదు. విశ్వవిద్యాలయాలు ప్రసాదించే అర్హతా పత్రంగా నాయకత్వ బాధ్యత ఉండదు. కార్మికోద్యమాన్ని ముందుండి నడిపే కార్యకర్తలే విప్లవానికి నాయకత్వం వహించే అర్హత కలిగి ఉంటారు. సాయుధ పోరాటాన్ని సరైన దశలో, అనుకున్న లక్ష్యాన్ని సాధ్యమైనంత సులువైన మార్గంలో సాధించగలిగే లక్షణాలు నాయకత్వానికి అవసరం. ఇదే విప్లవ పక్షాల పంథా, లక్ష్యం. దీన్ని రాజకీయ పరిశీలకులు, చరిత్ర రచయితలు ఎలాంటి సంకోచం లేకుండా ధృవీకరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం లాటిన్ అమెరికాలో భూస్వామ్య నిరంకుశత్వానికి, ప్రజల ఆకాంక్షలకు మధ్య తీవ్ర స్థాయిలో అంతరాలు ఏర్పడ్డాయి. బూర్జువా వర్గాలు, పాలక వర్గాల మధ్య ఉన్న తిరోగమన పొత్తు భూస్వామ్య వ్యవస్థ కొనసాగింపునకు దోహదపడుతోంది. ఈ నియంతృత్వ వ్యవస్థలో కొద్దిపాటి న్యాయ, చట్ట వ్యవస్థలు ఉన్నా వాటి ముఖ్య ఉద్దేశ్యం మాత్రం పాలకవర్గాల హక్కులను కాపాడటమే. అయితే చట్ట

వ్యవస్థపై ప్రజలు  భరించరాని ఒత్తిడి తీసుకు వస్తున్నారు. బూర్జువా వర్గాలు తమ హక్కులు, సమాజంలో తమ స్థానం కోసం ఈ చట్టాలను ఉల్లంఘించాల్సిన పరిస్థితులను సామాన్య ప్రజలు కల్పిస్తున్నారు.

కేవలం వ్యతిరేక గళం వినిపించినంత మాత్రాన బూర్జువా వర్గాలు తమ పని పూర్తయిందని భావించడానికి వీలు లేని పరిస్థితులు నేడు నెలకొన్నాయి. ఈ క్రమంలో పాలక వర్గాలు శాసనాలను తమకు అనుకూలంగా సవరించుకోడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తారు. కార్మిక వర్గాలపై నిర్బంధాన్ని పెంచుతారు. ఈ పరిస్థితులలోనే విప్లవానికి పునాదులు పడతాయి. ప్రజలు చట్టాలను (పాతవి, కొత్తవి) శాసనాలను ధిక్కరిస్తారు. అవసరమైతే సాయుధ పోరాటం చేపడతారు. అయితే ఇక్కడ నిరంకుశమైన వర్గ వ్యవస్థను (బూర్జువా) మనం ఏ మాత్రం మరవకూడదు. 'రాజ్యాంగయంత్రం – విప్లవం' పుస్తకంలో లెనిన్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పారు. "వివిధ వర్గాల మధ్య రాజకీయ ఆధిపత్యానికి జరిగే నిరంతర పోరుతో రాజ్యాన్ని ఎప్పుడూ సతమతమవుతూనే ఉంటుంది. ఈ పరస్పర వైరుధ్యాల నేపథ్యంలోనే దేశం లేదా రాజ్యం తన సత్తాను చాటుకోగలుగుతుంది. ఏ విధంగా చూసినా, రాజ్య వ్యవస్థ కొనసాగుతున్నంత కాలం సామాజిక వర్గాల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించడం దాదాపు అసాధ్యం"

మరో మాటలో చెప్పాలంటే, 'ప్రజాస్వామ్యం' అన్న పదాన్ని ఎలాంటి భేషజాలు లేకుండా నిరంకుశ పాలనకు జోడించడం సబబు కాదు. అలా చేయడానికి ఎవరినీ ప్రజలు అనుమతించకూడదు. కేవలం బూర్జువా వ్యవస్థ ఏర్పాటు చేసి కొద్దిపాటి హక్కులు కల్పించినంత మాత్రాన పరిస్థితిని చక్కదిద్దలేం. ఈ కోణంలో విప్లవాధికారానికి వెసులుబాటు కల్పించలేకపోతే నియంతృత్వ పాలనకు ద్వారాలు తెరిచినట్లేనని భావించాలి. ఖైదీకి తేలికపాటి సంకెళ్లు వేసినట్లుగా ఉంటుంది పై పరిస్థితి.

వర్గపోరాటం దృష్ట్యా పాలకవర్గాలు తమ హక్కులను సైతం తగ్గించుకుంటారు. అదీ ప్రజాస్వామ్యం పేరుతో తర్వాతి క్రమంలో ప్రజలపై నిర్బంధాన్ని పెంచి రాజ్య వ్యవస్థపై తమ పట్టు సడలకుండా కఠిన చర్యలు తీసుకుంటారు. ఈ  పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి? అనే సందేహం తలెత్తవచ్చు. మన సమాధానం ఒక్కటే : హింస కేవలం పాలకవర్గాల ప్రత్యేకమైన హక్కు కాదు. పీడిత ప్రజలు కూడా హింసాయుతమైన

ఆందోళనకు పూనుకోవచ్చు. అయితే అందుకు తగిన సమయం రావాలి. “ అవసరం లేకున్నా దేశంలో సాయుధపోరాటానికి ఉపక్రమించేవాడు నేరస్తుడు. అలాగే విప్లవానికి పరిస్థితులు అనుకూలించినపుడు పోరాటం చేయనివాడు నేరస్తుడే”, అని జోస్ మార్టి చెప్పారు.

“సోషల్ డెమోక్రసీ యుద్ధంపై ఎప్పుడూ ఒక భావాత్మక నిబద్ధతను ప్రదర్శించలేదు. యుద్ధాన్ని రాక్షస క్రీడగా అది అభివర్ణిస్తుంది. అయితే సమాజంలో వర్గ వ్యవస్థ కొనసాగినంత కాలం, దోపిడీ వ్యవస్థ కొనసాగినంత కాలం, యుద్ధం (విప్లవం) తప్పని సరి అని తెలుసు. దోపిడీదారి విధానాలను, వ్యవస్థను కాలరాయడానికి యుద్ధానికి సైతం వెనుకాడకూడదు,” అని 1905లో లెనిన్ పేర్కొన్నారు.

‘కార్మిక వర్గ విప్లవం - సైనిక కార్యక్రమం’ లెనిన్ పై అంశాలను పునరుద్ఘాటించారు. “వర్గపోరాటాన్ని గుర్తించిన వారెవ్వరూ విప్లవోద్యమాలను గుర్తించక మానరు. ప్రపంచంలో సంభవించిన గొప్ప విప్లవాలు ఇందుకు సాక్ష్యం. అంతర్యుద్ధాన్ని (విప్లవం) తోసిపుచ్చడం లేదా విస్మరించడం రాజకీయ దివాళాకోరుతనమే అవుతుంది.”

హింస లేదా సాయుధ పోరాటం గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అయితే అందుకు సరైన సమయం రావాలి. పరిస్థితులు పూర్తిగా అనుకూలించాలి. విప్లవానికి అనుకూలమైన పరిస్థితులేవి? స్థూలంగా, ఇవి రెండు కారకాల మీద ఆధారపడి ఉంటాయి. ఇవి పరస్పర స్ఫూర్తినిస్తూ ఉద్యమం బలపడటానికి ఎంతో సహకరిస్తాయి. ఈ రెండు కారకాలు, అలాగే విప్లవం సాధించాలన్న గట్టి పట్టుదల, విప్లవ పక్షాల మధ్య (ప్రపంచవ్యాప్తంగా) సమన్వయం, విప్లవానికి దిశానిర్ధేశంగా నిలుస్తాయి.

సామ్యవాద దేశాలలో విప్లవ పరిస్థితులు ఎలా ఉన్నా, వాటి ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఆరంభ దశలో ఉన్న ప్రజా పోరాటాలపై తప్పక ఉంటుంది. ఎందుకంటే వారి ఉదాహరణ ఉద్యమానికి మరింత బలాన్ని చేకూరుస్తుంది. 1963 జులై 26న ఫైడెల్ కాస్ట్రో ఇలా ఉద్ఘాటించారు. “ప్రస్తుత తరుణంలో విప్లవ కారుల ప్రధాన కర్తవ్యం వివిధ సామాజిక వర్గాల మధ్య ఉన్న సంబంధాలను విప్లవానికి అనుకూలంగా ఎలా మలచుకోవాలన్న ఆలోచనలపై దృష్టి సారించడం. ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా కొనసాగాలి.  సామాజిక పరిస్థితులు అనుకూలించే వరకు వేచి చూడకుండా లాటిన్

దేశాలలోని విప్లవకారులు, నాయకులు ఉన్న పరిస్థితులలోనే ఉద్యమాన్ని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలి. విప్లవ లక్ష్యాన్ని సాధించాలి.”

అయితే రాజకీయ విశ్లేషకులు “ సాయుధ పోరాటంతో విప్లవం సాధించడం, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి విప్లవ పంథా ఒక ప్రముఖమైన మార్గమని చెబుతూనే, విప్లవాన్ని సమర్ధవంతంగా నడిపే, నడపగలిగే నాయకత్వం ఏదీ?” అని ప్రశ్నిస్తున్నారు. ఫైడెల్ క్యాస్ట్రో లాంటి నాయకులు మనకు ఉన్నారా? అని అడుగుతున్నారు. చరిత్ర గమనంలో లభించిన అత్యుత్తమ వ్యక్తి ( అందరు నాయకుల వలె) ఫైడెల్ క్యాస్ట్రో సాయుధ పోరాటానికి లేదా విప్లవానికి నాయకత్వం వహించే వ్యక్తి పోరాట దశలోనే యుద్ధ తంత్రాన్ని షడ్యంత్రాలను నేర్చుకుంటూ, అనుభవపూర్వకంగా లక్ష్యసాధనకు ముందుకు సాగుతాడు. ఇది లాటిన్ దేశాలకూ వర్తిస్తుంది. కేవలం పుస్తకాలు, సాహిత్యం ద్వారా వాణిజ్యాన్ని లేదా ఇతర వృత్తిని నేర్చుకోవడం సాధ్యం కాదు. విప్లవ విషయానికి వస్తే పోరాట దశే గొప్ప బోధకునిగా అవతరిస్తుంది. అయితే లక్ష్య సాధన అంత సులువు కాదు, అది తీవ్రమైన ప్రమాదాలతో కూడుకున్నదనేది వాస్తవం.

సాయుధ పోరాటం ప్రారంభ దశలో రెండు సందర్భాల్లో విప్లవ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పువాటిల్లే అవకాశం ఉంటుంది. ప్రాథమిక దశలో ఎదురయ్యే ముప్పు విప్లవ పంథా భవితవ్యాన్ని, ఉద్యమం సాగించాలన్న దృఢ నిర్ణయాన్ని నిర్ధారిస్తాయి. అలాగే ప్రజాశక్తులకు ఒక ఖచ్చితమైన అభిప్రాయాన్ని కల్గిస్తాయి. ప్రజా స్థావరాలపై బూర్జువా శక్తులు దాడి చేస్తే అందుకు అనుగుణంగా స్పందించేందుకు, శత్రు సైన్యాన్ని ఎదుర్కొనేందుకు ఒక స్పష్టమైన రక్షణ వ్యవస్థ, విధానం అంటూ ఉండాలి. సైద్ధాంతిక, వాస్తవ పరిస్థితులు అనుకూలంగా ఉన్నపుడు, రక్షణ కోసం ఆయుధాలు చేపట్టాల్సి ఉంటుంది. ఇలా చేస్తేనే ప్రజాశక్తులు శత్రుసైన్యం ధాటిని తట్టుకోగలం. అలాగే రక్షణ కేంద్రాలు ప్రభుత్వ బాధితులకు ఆశ్రయంగా రూపాంతరం చెందకూడదు.

గెరిల్లా సైన్యం, ప్రజాప్రతిఘటనలు శత్రుసైన్యంపై దాడి చేయడానికి ఉపయోగపడతాయి. కాలక్రమేణా అవి బలోపేతమవుతాయి. శత్రు వర్గంపై దాడి చేయగల శక్తి సామర్థ్యాలే ముమ్ముందు విప్లవ పంథాను నిర్దేశిస్తాయి. ఆత్మరక్షణ కోసమే గెరిల్లా దళాలను వినియోగించకూడదు. తమను తాము రక్షించుకుంటూనే శత్రు సైన్యాన్ని తీవ్రంగా

దెబ్బతీయడం మొదలు పెట్టినపుడే విప్లవానికి సార్థకత చేకూరుతుంది. అలాంటి శక్తి సామర్థ్యాలు సాధించిన నాడు రాజ్యాధికారం కోసం జరిపే తుదిపోరుకు అనుకూల పరిస్థితులు ఏర్పడగలవు.

సమయం చాలా ప్రధానమైనది. సామాజిక ఉత్పాదన క్రమంలో శత్రువర్గంతో ఎన్నిసార్లు తలపడ్డాం, ఎన్నిసార్లు పరస్పర కాల్పులు జరిగాయన్నది ప్రధానం కాదు. మారుతున్న సమీకరణలు, వాస్తవ పరిస్థితుల ఆధారంగానే విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్ళే అవకాశం ఉంటుంది. మనలోటుపాట్లు, బలహీనతలు తెలుసుకుంటూ శక్తివంతమైన సైన్యాన్ని పథకం ప్రకారం ఎదుర్కొంటూ ముందుకు సాగాలి. ఈ క్రమంలో ఎలాంటి నష్టాలు ఎదుర్కోకుండా విజృంభిస్తే పాలకవర్గాలు సంయమనం వీడి తమ అసలు రూపం( నిరంకుశత్వం) బట్టబయలు చేసుకుంటాయి. అలా జరగని పరిస్థితుల్లో గెరిల్లా దళాలే ప్రభుత్వాన్ని కవ్వించాలి. తిరోగమన శక్తుల కలయికే పాలకవర్గ వ్యవస్థ అని ప్రజలకు తెలియజేసేందుకు ఇది దోహదపడుతుంది. నియంతృత్వానికి రెండు స్పష్టమైన అవకాశాలివ్వాలి. ఒకటి భీకరపోరాటం, రెండవది ఉపసంహరణ అపుడే రాజ్యాధికారం కోసం తుదిపోరు సాగించగలం.

రెండవ ముప్పును అధిగమించడం విప్లవ శక్తుల ప్రభావంపై ఆధారపడి ఉంటుంది. విప్లవం బలోపేతం కావడానికి కార్మిక వర్గం ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి పెంచి, దానిపై ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీయాలి. ఇది నిత్యకృత్యం కావాలి. ఉద్యమం బలపడకుంటే అది క్రమంగా క్షీణిస్తుంది. విప్లవకారులు మనోస్థైర్యం కోల్పోతే, బూర్జువా వర్గాల ఆధిపత్యం పెరుగుతుంది. ఈ పరిస్థితులలో కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకొనేందుకు ఎన్నికలు (నిష్పాక్షికమని ఖచ్చితంగా చెప్పలేం) జరగవచ్చు. ఒక నిరంకుశ పాలకుడి స్థానంలో బూర్జువా వర్గాలకు ఆమోదయోగ్యమైన మరో ప్రతినిధి ఎన్నిక కావచ్చు. లేదా తిరోగామి శక్తులు ప్రభుత్వంపై తమ పట్టు కోల్పోకుండా కాపాడుకోవడానికి సైనిక తిరుగుబాటును ప్రోత్సహించవచ్చు. ఇలాంటి కుయుక్తులు ఎన్ని ఉన్నా, వాటి గురించి సమగ్రంగా చర్చించడం మన పని కాదు.

పైన పేర్కొన్నట్లుగా సైనిక తిరుగుబాటును పరిశీలిద్దాం. ప్రజాస్వామ్యానికి సైన్యం ఏ విధంగా దోహదపడగలదు? తిరోగమన శక్తుల ఆధిపత్యాన్ని కాపాడటమే వారి

కర్తవ్యమైతే వ్యవస్థ పట్ల వారి విధేయతను ఎలా తెలుసుకోగలం? అలాగే సైనికులు తమకు తాము ఒక ప్రత్యేక వర్గంగా భావించి, అధికారంలో తమకూ ప్రత్యేకమైన హక్కులు కావాలని కోరనూవచ్చు.

పాలకవర్గాలు తమ హక్కులకు ముప్పు వాటిల్లుతుందనుకున్న సందర్భాల్లో నియంతను తొలగించడానికి సైన్యం సహాయం తీసుకుంటాయి. వాస్తవంగా అప్పటికే దేశ పాలకుడు అన్ని రంగాల్లో విఫలమై తమ ప్రత్యేక హక్కులు కాపాడలేని స్థితిలో ఉంటాడు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించి, హింస ప్రజ్వరిల్లుతూ ఉంటుంది. పై వాదన సైనికుల సేవలను వ్యక్తిగతమైనవి అని చెప్పడానికి చేసింది కాదు. పాలకుల సేవ నుండి నిష్క్రమించిన మరుక్షణం, ప్రజాపోరాటంలో భాగస్వాములు కావాలనుకునేవారూ కొందరుంటారు. ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకొని విప్లవ లక్ష్యాన్ని సాధించడానికి ఉద్యమ నాయకులు సిద్ధంగా ఉండాలి.

చాలా కాలం క్రితం ఏంగెల్స్ (అంతర్యుద్ధం) ఇలా రాశారు : " విప్లవం సంభవించిన ప్రతిసారీ శ్రామికవర్గాల చేతిలో ఆయుధాలు ఉండేవి. పాలకవర్గాలలోని బూర్జువా శక్తులు వారిని నిరాయుధులను చేయడానికి ప్రయత్నిస్తాయి. దానికి ఎక్కువగా ప్రాధాన్యతనిస్తాయి. కనుక విప్లవం ముగిసిన ప్రతిసారి మరో పోరు మొదలై శ్రామికుల ఓటమితో ముగుస్తుంది". ఇదే విషయాన్ని లెనిన్ తన 'రాజ్యాంగ యంత్రాంగం – విప్లవం' విప్లవం పుస్తకంలో ప్రస్తావించారు.

ఈ పరిణామ క్రమం పెట్టుబడిదారీ దేశాలలో అనేక దఫాలుగా సంభవించింది. కార్మిక వర్గాలతో ఈ చెలగాటం శతాబ్దానికి పైగా కొనసాగింది. విప్లవాత్మకమైన మార్పును కోరుకునే శ్రామికవర్గాలు ప్రగతిశీల పక్షాలు కాలక్రమేణా తమ పట్టును కోల్పోయే ప్రమాదముంది. రాజ్యాధికారం లక్ష్యాన్ని సాధించే అవకాశాన్ని కోల్పోతుంది.

విప్లవ క్రమంలో సంభవించే రెండు ప్రధానమైన ఆటంకాలను మనం విశ్లేషించాం. అయితే మార్క్సిస్టు – లెనినిస్టు నాయకులు సాయుధ పోరాటాన్ని చక్కగా సమన్వయపరిచి రాజ్యాధికారం లక్ష్యాన్ని సాధించడం మనం చరిత్రలో అనేకసార్లు చూశాం.

ఈ సిద్ధాంత వ్యాసాన్ని రూపొందించే సమయంలో మాకు సాయుధ పోరాటం లేదా గెరిల్లా పోరాటం ద్వారా విప్లవం సాధించగలమన్న పూర్తి నమ్మకం ఏర్పడింది.

అమెరికా దేశాలలో కూడా సాయుధ పోరాటం అవసరమని ఎందుకు గుర్తించాం? ఇక్కడ విప్లవ పోరాటావశ్యకత గుర్తించడానికి స్పష్టమైన వాదనలు ఉన్నాయి.

మొదట, పాలకవర్గాలు తమ చివరి ప్రయత్నం వరకూ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ప్రాధాన్యత ఇస్తాయనేది నిర్వివాదం. శత్రువర్గాన్ని తుదముట్టించేందుకు సాయుధ పోరాటం జరగాలి. అందుకోసం ప్రజాదళాలు ఎంతో అవసరం. ఈ దళాల ఆవిర్భావం ఉన్నట్టుండి జరిగే పరిణామం కాదు. ఆయుధాలు కూడా శత్రుపక్షం నుండే అపహరించాల్సి ఉంటుంది. దీని కోసం సుదీర్ఘ పోరాటం చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ప్రజాదళాలు, విప్లవనాయకత్వం సైన్యాన్ని ఢీకొని తమను తాము రక్షించుకోవడమే కాక ఎదుటి పక్షాన్ని తీవ్రంగా దెబ్బతీయాల్సి ఉంటుంది.

గెరిల్లా కేంద్రాలు సాయుధ పోరుకు కేంద్ర బిందువులు. విప్లవ పోరాట నాయకత్వం ఇక్కడి నుండే తన కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ప్రజాదళాలకు ఊతంగా నగర, పట్టణ ప్రాంతాలలో శ్రామిక వర్గాలు తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉంది. పాలకవర్గాలను ధ్వంసం చేయడానికి వారు ఎంతో సహాయకారిగా ఉంటారు. ఒక వేళ ప్రభుత్వం దమననీతితో వారి ఉద్యమాన్ని బలహీన పరచినా, విప్లవానికి వచ్చే నష్టం పెద్దగా ఉండకపోవచ్చు. గ్రామీణ, కొండ, అటవీ ప్రాంతాల నుండి విప్లవ జ్వాలలు అంతిమంగా ప్రభుత్వ కేంద్రాలకు విస్తరించే అవకాశాలే ఎక్కువ. ఈ క్రమంలో ప్రజాదళాలు మరింత పటిష్టంగా, ఆయుధ సంపత్తితో మరింత శక్తివంతంగా ముందుకు సాగడానికి వీలు ఉంటుంది. ఈ ప్రాంతాల నుండే మున్ముందు ఏర్పడబోయే ప్రజాప్రభుత్వానికి పునాదులు వేయాల్సి ఉంటుంది. సాయుధ పోరాటం దీర్ఘకాలికంగా సాగితే విప్లవకారులు, సానుభూతిపరులకు సంక్లిష్టమైన పాలనా వ్యవహారాలపై అవగాహన పెరిగి భవిష్యత్‌లో విప్లవ ప్రభుత్వాన్ని నడిపేందుకు తగిన అనుభవం వస్తుంది. అలాగే అధికారం పదిలం చేసుకోవడానికి అది ఎంతో దోహదపడుతుంది.

భూస్వామ్య వ్యవస్థపై లాటిన్ రైతాంగంలో తీవ్రమైన ఆగ్రహజ్వాలలు రేగుతున్నాయి. స్థానిక, విదేశీ దోపిడీదారుల చేతిలో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని వారు తీవ్ర వేదనతో ఉన్నారు.

## ద్వితీయ హవానా తీర్మానం ఏమంటోందంటే:

"గడిచిన శతాబ్దం తొలిదశకంలో లాటిన్ ప్రజలు స్పెయిన్ దురాక్రమణకు, దమనకాండకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించి, దాస్య విముక్తులయ్యారు. అయితే తర్వాతి కాలంలో విదేశీయుల దోపిడీ స్థానంలో భూస్వామ్య వ్యవస్థ బలపడి సామాన్య ప్రజ, రైతాంగం తిరిగి కష్టాలపాలవడం మొదలైంది. ఫలితంగా ప్రజలు శాశ్వత బానిసత్వంలో మిగిలిపోయారు. దీనికి తోడు అమెరికా సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థ వారి జీవితాలను మరింత కృంగదీశాయి. ఇప్పటికీ పరిస్థితులలో ఎలాంటి మార్పులేదు. ఇప్పుడు కొత్తగా అమెరికా తన గుత్తాధిపత్యం కోసం ఈ ప్రాంత ప్రజలపై సామ్రాజ్యవాదం దాడికి దిగింది. లాటిన్ ప్రజల ఆశయాలను కాలరాయడానికి ప్రయత్నిస్తోంది."

ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితులు రైతాంగం, శ్రామికులలో దాగి వున్న విప్లవాగ్నిని వెల్లడిస్తున్నాయి. మనం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ముఖ్యంగా మరో విషయమేమిటంటే ఈ ప్రజాపోరాటానికి అమెరికా ఖండం సమస్తం సిద్ధంగా ఉంది. ఇక్కడి పోరు రెండు స్థానిక ప్రజాశక్తుల మధ్య జరిగేది కానేకాదు. దమననీతిని పాటిస్తున్న పాలకవర్గాలపైనే ప్రజలు తమ పోరాటం సాగించాల్సి ఉంది. అమెరికన్లు లాటిన్ దేశాల వ్యవహారాలలో తలదూర్చి తమ సామ్రాజ్యవాద కాంక్షను తీర్చుకోవాలని తహతహలాడుతున్నారు. విప్లవ ప్రభుత్వాలు ఏర్పడకుండా చర్యలు (సైనిక, ఆర్థిక) తీసుకోవాలని భావిస్తున్నారు. ప్రజలను దాడికి గురి చేసి భూస్వామ్య, పాలకవర్గాల హక్కులు కాపాడాలనేదే వారి కుతంత్రం. తమ సైనిక శక్తితో ప్రజాపోరాటాలను అణచివేయగలమనే ధీమా వారికి ఉంది. శ్రామిక, రైతాంగ వర్గాలు రాజ్యాధికారం చేపట్టకుండా అడ్డుకొని తమ గుత్తాధిపత్యాన్ని నిలుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు అవసరమైతే దేశాలనే సర్వనాశనం చేయడానికి కూడా వారు వెనకాడరు.

లాటిన్ అమెరికాలోని నేటి ఈ పరిస్థితిలో ఏదో ఒక రాష్ట్రంలోనే అధికారాన్ని హస్తగతం చేసుకొని దాన్ని నిలుపుకోవడం చాలా కష్టం. అందుకే ఈ ప్రాంత దేశాలన్నింటిలో ఒకేసారి విప్లవ పోరాటాలు ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైంది.

ఆండిస్‌లోని కోర్డిల్లెర్రా లాటిన్ అమెరికా సియర్రా మాయెస్త్రా కావాలి. ఈ ఖండమంతటా సాయుధ పోరాటంతో సామ్రాజ్యవాదానికి స్వస్తిచెప్పాలి.

ఈ పోరాటం ఖండవ్యాప్తంగా ఒక నిర్దిష్టరూపం ఎపుడు దాలుస్తుందో ఖచ్చితంగా అంచనా వేయలేం. అయితే ఆ సమయం దగ్గరలోనే ఉందనే విశ్వాసంతో ప్రజాదళాలు తమ ఉద్యమాన్ని కొనసాగించాల్సి ఉంది.

తొలుత ఆయా దేశాలలోని విప్లవ పక్షాలు తమ ఉద్యమాన్ని ప్రారంభించి, కాలక్రమంలో పోరాటాలకు ఒక ఖండవ్యాప్త స్వభావం తీసుకురావడానికి ప్రయత్నించాలి. అది సాధించాకే ఉమ్మడి ప్రణాళికను సిద్ధం చేసుకొని విప్లవ లక్ష్యసాధనగా పాటుపడాలి. ఒక దేశంలో జరిగే ప్రజాపోరాటం మరో దేశంలోని విప్లవకారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచి, ప్రజాపోరాటాలన్నీ సమన్వయంతో నడవడానికి అవకాశాలు ఏర్పడతాయి.

విప్లవం రగిలే కొద్దీ ఫలితాలు పరస్పర విరుద్ధంగా ఉండొచ్చు. విప్లవం ఉధృత దశలో విప్లవ వ్యతిరేక భావం బలహీనంగా ఉంటే, దమనకాండ పెరిగే కొద్దీ విప్లవ వ్యతిరేక జ్వాలలు (ఉద్యమం బలహీనపడిన సందర్భంలో) అంతే స్థాయిలో చెలరేగుతాయి. ఈ పరిస్థితులలో విప్లవ సైన్యాలు అనేక కష్టాలు ఎదుర్కోవలసి వస్తుంది. శక్తివంతమైన పాలకవర్గ సైన్యాలతో పోరాటం తీవ్రమవుతుంది. బూర్జువా వర్గాలు ప్రజాపక్షంవైపు ఉంటారో, పాలకవర్గాలకు దన్నుగా నిలుస్తారో విశ్లేషించడం అసాధ్యం. తటస్థంగా మాత్రం ఉండవు.

గెరిల్లా యుద్ధ కేంద్రంపై చర్చిద్దాం. కొద్ది మంది సభ్యులతో, సాహిత్యం, తేలికపాటి ఆయుధాలతో, శత్రువుకు దూరంగా అభేద్యమైన ప్రాంతంలో స్థావరం ఏర్పరచుకోవడం చాలా అవసరం. స్థావరం ఏర్పాటు చేసుకున్న తర్వాత ముందుగా దళసభ్యులు ఆ ప్రాంత భౌగోళిక స్వరూపాన్ని, సామాజిక వ్యవస్థను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ప్రజలతో సంబంధాలు పెంచుకుంటూ తమస్థావరాన్ని పటిష్టం చేసుకోవలసి ఉంటుంది.

పై కర్తవ్యాలు సాధించిన తర్వాత తమ లక్ష్యాలను ప్రజలకు వివరిస్తూ, స్థానిక సమస్యలు, భూపంపిణీ తదితర అంశాలపై వారిని సమీకరించాల్సి ఉంటుంది. నిర్దిష్టమైన సామాజిక, రాజకీయ, ఆర్థిక లక్ష్యాలను నిర్ధారించుకొని, ప్రణాళికాబద్ధంగా విప్లవాన్ని ముందుకు తీసుకెళ్ళి అంతిమ లక్ష్యమైన రాజ్యాధికారంవైపు దృష్టి సారించాల్సి ఉంటుంది.

విప్లవయోధుని గుణగణాలు, వీరత్వం కంటే విప్లవ సంకల్పమే స్ఫూర్తిగా ఉద్యమించాల్సి ఉంటుంది. ప్రాణత్యాగానికి సైతం దళ సభ్యులు సిద్ధంగా ఉండి లక్ష్యంవైపు పయనించాల్సి ఉంది. సైన్యాన్ని ఎదుర్కొవడం కంటే, పాలక వర్గాలు విప్లవకారులను మానసికంగా, శారీరకంగా బలహీనపరచడానికి పాలకవర్గాలు ప్రయత్నిస్తాయనేది అందరూ గ్రహించాల్సిన విషయం.

చిన్న చిన్న బృందాలుగా ఉండే గెరిల్లాలను అంతమొందించడానికి సైన్యం దారుణ చర్యలకు పాల్పడే అవకాశం ఉంది. బందీలుగా దొరికే వారిని తీవ్ర చిత్రహింసలకు గురి చేసి విప్లవకారులను మానసికంగా దెబ్బతీయడానికి ప్రయత్నించవచ్చు. జంతువుల కంటే హీనంగా వారిని వేటాడి చంపి ప్రజలలో ప్రభుత్వం పట్ల భయాన్ని, దాంతో పాటు వినయ భావం కల్గించడానికి కుయుక్తులు పన్నవచ్చు. విప్లవకారులకు రెండే మార్గాలు మిగిలి ఉంటాయి. మరణమో, సమరమో. విప్లవం కేవలం మిధ్య అనే ప్రచారం ఉధృతం కావచ్చు. ఈ పరిస్థితులే విప్లకారులను నాయకులు (హీరోలు)గా నిరూపిస్తాయి. ఆత్మరక్షణ, స్వేచ్ఛగా తిరగ గలగడమే అప్పుడు నిరంతర సమరంగా మారుతుంది.

శత్రువర్గం శక్తియుక్తులను పథకం ప్రకారం దెబ్బతీస్తూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత అపుడు ప్రజాదళాలపై ఉంటుంది. శత్రు సైన్యానికి ధీటుగా గెరిల్లాలను సమీకరించి చాటుగా వారిని దెబ్బతీస్తూ సైనికపరంగా ముఖ్యమైన స్థావరాలను ఆక్రమించుకోవలసి ఉంటుంది. వ్యూహాత్మక విజయాలను సాధిస్తూ కైవసం చేసుకుంటూ విప్లవ పతాకాన్ని ఎగురవేస్తూ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి సరైన చర్యలు తీసుకోవాలి. ఎక్కడ, ఎలా, ఎప్పుడు అన్న సరైన వ్యూహంతో దాడులు నిర్వహిస్తూ సైన్యాన్ని ముప్పు తిప్పలు పెట్టాలి. సాయుధ ఘర్షణలో విజయం తప్ప మరో ఫలితాన్ని చవిచూడరాదు.

రాజకీయ సైనిక కార్యక్రమంతో విప్లవాన్ని పటిష్టపరుస్తూ, మరిన్ని స్థావరాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. సైన్యం ఆ స్థావరాలపై దాడికి దిగాలంటే పెద్ద సంఖ్యలో సైనికులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందనే విధంగా పరిస్థితులు కల్పించాలి. స్థావరాలు ఆశ్రయాలుగా, సైనిక కేంద్రాలుగా పని చేయాల్సి ఉంది. సైనిక, రాజకీయ అవరోధాలను అధిగమించినపుడే విప్లవానికి మరింత బలంచేకూరి, ఉద్యమంపై ప్రజా

విశ్వాసం కూడా పెరుగుతుంది. విప్లవ నాయకత్వం తమ విధి అన్నట్లు గెరిల్లాలు ముందుకు సాగాలి. రైతాంగ సమస్యలను సంతృప్తికరమైన రీతిలో పరిష్కరించాలి. అలా చేసినపుడే స్థానిక ప్రజల విశ్వాసం విప్లవంపై మరింత పెరుగుతుంది. ఇతర ప్రాంత ప్రజలు కూడా ఉద్యమం వైపు మొగ్గు చూపేలా ఫలితాలుంటాయి.

అయితే సాయుధ పోరాటానికి తీవ్రమైన ముప్పు వాటిల్లితే, రాజకీయపరంగా కూడా ఉద్యమం ముందుకు సాగే పరిస్థితి ఉండదు. వ్యూహంలో ఓ చిన్న తప్పు దొర్లినా సైనికపరంగా ఎంత నష్టపోతామో, రాజకీయాలలో కూడా తప్పటడుగు వేస్తే అంతే తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది. మన ఉద్యమం సైనిక – రాజకీయ పరమైనది కావడం వల్ల ఎంతో నేర్పు ఓర్పుతో ముందుకు సాగాల్సి ఉంటుంది.

సాయుధ పోరాటం విస్తరిస్తే దాని శక్తియుక్తులు కూడా గణనీయంగా పెరిగి విప్లవకారుల బృందాలు గెరిల్లా కేంద్రాలలో అత్యధిక సంఖ్యలో కేంద్రీకృతమై పాలకవర్గ సైన్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వీలుపడుతుంది. మూకుమ్మడి దాడులు నిర్వహిస్తూ పాలకవర్గాలను బెంబేలెత్తించవచ్చు.

ప్రజాసైన్యం ఏర్పాటు చేయనిదే విప్లవ స్వప్నం సాకారం కాదు. గెరిల్లా దళాలు ఒక పరిమితి వరకు పెరగవచ్చు. అయితే ప్రజల సహకారంతో పాటు ప్రజాసైన్యం ఆవిర్భావం ఎంతో కీలకం. పట్టణ, నగర ప్రాంతాలలో ఉద్యమకారులు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయగలవుకాని, తిరోగమన శక్తుల పట్టును సడలించలేవు. శత్రువర్గ నిర్మూలనే చివరి లక్ష్యమనే సంగతి మరువరాదు. గెరిల్లా జోన్లు ఏర్పాటు చేసుకుంటూనే ప్రభుత్వ దళాల పట్టు ఉన్న ప్రాంతాలకు ఉద్యమాన్ని విస్తరించాల్సి ఉంటుంది. ప్రధాన నగరాలతో సైనిక దళాలతో పోరు సాగిస్తున్న ఉద్యమ బృందాలను ఒకే నాయకత్వం కిందికి తేవాల్సి ఉంటుంది.

విముక్తి కోసం సాగే పోరు మూడు దశలలో ఉంటుంది. మొదటిది సైనికపరంగా ఏర్పాటు చేసుకునే రక్షణ వ్యవస్థ. రెండవది గెరిల్లాదళాలకు, ప్రభుత్వ సైన్యానికి మధ్య సమానబలం. చివరిది శత్రుసైన్య స్థావరాల ఆక్రమణ, పాలకవర్గాల నిర్మూలన, రాజ్యాధికారం.

ఇరుపక్షాల మధ్య సమతుల్యం వచ్చినపుడు, విప్లవసైన్యం కొత్త లక్షణాలను, స్వరూపాన్ని సంతరించుకుంటుంది. రక్షణ వ్యూహాలలో దండోపాయాలు, మార్పులు చోటుచేసుకుంటాయి. శక్తివంతమైన సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించి, ప్రజాయుద్ధాన్ని ప్రభుత్వం ముంగిట్లోకి తీసుకెళ్ళవచ్చు. ఈ స్థితిలో కూడా పాలకవర్గ సైన్యాలకు శక్తిసామర్థ్యాలు ఉంటాయి. కనుక వ్యూహాత్మక, తీవ్రవాద దాడులకే ప్రాధాన్యతనివ్వాల్సి ఉంటుంది. పరిస్థితులు మారి ప్రజాసైన్యం ఏర్పడే వరకు ఇదే వ్యూహాన్ని అనుసరించాల్సి ఉంటుంది. చివరి దశలో కూడా విప్లవకారులు గెరిల్లా యుద్ధ పద్ధతులనే అనుసరిస్తూ, ప్రభుత్వ రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేస్తూ, ప్రజల మద్ధతుతో తన లక్ష్యంవైపు దూసుకెళ్లాలి.

లాటిన్ దేశాలన్నింటిలో విప్లవపోరు తప్పదని ముందుగానే పేర్కొన్నాం. విప్లవం సుదీర్ఘంగా సాగవచ్చు. ఎన్నో స్థావరాల నుండి ఈ పోరు సాగించాల్సి ఉంటుంది. ప్రజలు వేల సంఖ్యలో హతులై, తీవ్రమైన ఆస్తినష్టం సంభవించే అవకాశాలెక్కువగా ఉంటాయి.

ప్రస్తుతం లాటిన్ అమెరికాలో ఒక స్పష్టమైన రాజకీయ పరిస్థితి నెలకొని ఉంది. పాలక, పీడిత వర్గాల మధ్య ప్రజలు విభజితమై ఉన్నారు. ప్రజల సాయుధ విప్లవ నాయకత్వం అధికారాన్ని హస్తగతం చేసుకుంటే సామ్రాజ్యవాదులు, దోపిడీ వర్గాలు ఒక వేటులో కుప్పకూలిపోతారు.

తొలిదశ సామాజిక విప్లవం బలపడి ప్రజలు తమ ఆశయాల సాధనకు నడుం బిగిస్తారు. సామ్యవాద నిర్మాణంలో పాలుపంచుకుంటారు.

రక్తపాత రహిత మార్గాలేవైనా ఉన్నాయా? కొద్ది సంవత్సరాల క్రితం ప్రపంచం రెండు విధాలుగా చీలిపోయింది. అమెరికా సంయుక్త రాష్ట్రాలు లాటిన్ దేశాలపై తమ పట్టును బిగించాయి. పాతతరం సామ్రాజ్యవాదులు మళ్ళీ పుట్టుకొచ్చారు. ఐరోపా సంయుక్త వాణిజ్య సముదాయం అమెరికా గుత్తాధిపత్యాన్ని ప్రశ్నిస్తోంది. ఈ వాణిజ్య యుద్ధాన్ని మనం ప్రేక్షకుల్లాగా చూస్తూ ఉండిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సామ్రాజ్యవాదులు, వాణిజ్యవేత్తలు ఆయా దేశాలలోని బూర్జువా వర్గాలతో జత కట్టి తమ ధన దాహాన్ని తీర్చుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. అయితే పరిస్థితులను చూస్తూ ఊరుకుంటే భవిష్యత్‌లో తీవ్రమైన ఆర్థిక, రాజకీయ పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది. కనుక ఇప్పటి నుంచే విప్లవానికి పునాదులు వేయాల్సిన అవసరం ఏర్పడింది. వర్గపోరులో కార్మిక

వర్గాలు నిర్వహించే పాత్ర విప్లవాత్మకమైనదే అయినా, అది స్వల్పకాలికమే. సమాయనుకూలంగా మనం ఆయా వర్గాలతో పొత్తు కుదుర్చుకోవాల్సి ఉంటుంది. దోపిడీదారులు, పీడిత ప్రజల మధ్య ఉన్న వైషమ్యాలు, సామ్రాజ్యవాద శక్తుల ప్రగతికి విఘాతం కలిగించవచ్చు.

జాతీయ స్థాయిలో బూర్జువా వర్గాలు అమెరికా సామ్రాజ్యవాదంతో మమేకమై తమ ప్రత్యేక హక్కులు కాపాడుకోవడానికి ప్రయత్నిస్తాయి. వారి మధ్య రాజకీయ, ఆర్థికపరమైన విభేదాలు తలెత్తిన పరస్పర అవగాహనతో సమస్యను పరిష్కరించుకోవడానికి కృషి చేస్తారు. విప్లవ క్రమంలో వీరు కూడా పీడిత వర్గాల జాబితాలోకి వస్తారు. వర్గపోరు ఉధృతమైంది. అలాగే పాలక – పేద వర్గాల మధ్య అంతరాలు పెరిగిపోతున్నాయి. ఇక్కడ రెండు స్పష్టమైన శాఖలు ఏర్పడ్డాయి. ఫలితంగా ప్రజలకు విప్లవం తప్ప మరో మార్గం లేదని స్పష్టంగా తెలిసిపోతుంది.

సాయుధ విప్లవాన్ని అడ్డుకోవడానికి ప్రగతిశీలపక్షాలు కూటమి ప్రయత్నించినా, ఎలాంటి ఫలితం ఉండదు. సామ్రాజ్యవాదులు, పారిశ్రామికవేత్తల స్వలాభాలు పెరిగే కొద్దీ వర్గపోరు కూడా తారాస్థాయికి చేరుకొని వ్యవస్థలో మరిన్ని వైరుధ్యాలు తలెత్తి ప్రజాపోరాటానికి అనుకూలంగా పరిస్థితులు ఏర్పడతాయి. అప్పుడు ఉద్యమ శక్తులు సమాజంలోకి చొచ్చుకుపోయి తమ లక్ష్యాలను, ఆశయాలను ప్రజలకు వివరించి వీరి సంపూర్ణ మద్దతు కూడగట్టడానికి గట్టి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వర్గ శత్రువుకు తమ ఉనికి, ఆచూకీ, లక్ష్యం తెలియనివ్వకుండా జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. లాటిన్ అమెరికాలో ఇపుడిపుడే విప్లవ పోరాటానికి బాటలు పడుతున్నా దాని ముఖ్యకేంద్రం ఎక్కడుంటుంది? వెనిజులా, గౌటిమాలా, కొలంబియా, పెరూ, ఇక్వెడార్....? ఎక్కడ? ప్రస్తుత ఘర్షణలు కేవలం ప్రజల అసహనాన్ని తెలుపుతున్నాయా లేక విప్లవ స్వరూపం సంతరించుకున్నాయా అన్నది ఇక్కడ అప్రస్తుతం. ఒకటి అరా ఉద్యమాలు విఫలమైనా విప్లవానికి వచ్చిన నష్టమేమీ లేదు. ఎందుకంటే ప్రజలు పోరుబాటలో ఉన్నారన్నది ఇక్కడ స్పష్టంగా తెలుస్తుంది. వారిలో విప్లవాగ్ని రేగుతోందని తెలుస్తోంది. విప్లవం తథ్యమని బోధపడుతోంది.

ఇది కేవలం భవిష్యత్తు సంకేతమే. చరిత్ర కూడా మా వాదనలు నిజమేనని నిరూపిస్తుంది. లాటిన్ అమెరికాలోని వాస్తవిక, సైద్ధాంతిక పరిస్థితులను విశ్లేషిస్తే హవానా ద్వితీయ తీర్మానంలో ఉద్ఘాటించిన రాజకీయ, ఆర్థిక సిద్ధాంతాలు వాస్తవరూపం దాల్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# క్యూబా ప్రస్థానం

**(1959–65)**

**“వ్య**క్తులు అత్యధిక మానవత్వం, అత్యధిక న్యాయవర్తనం, సత్యవర్తనం కలిగి సైద్ధాంతిక వైపరీత్యాలు, మధ్యయుగం నాటి ఆలోచనలకు దూరంగా ఉంటూ ప్రజాబాహుళ్యంతో సత్సంబంధాలు కొనసాగించాలి. విప్లవకారులు ప్రతినిత్యం శ్రమపడుతూ మానవీయ జీవనశైలిని, ప్రేమను వాస్తవం చేయాలి”

# విప్లవ సైన్యం సామాజిక సిద్ధాంతాలు

**(జనవరి 29, 1959)**

**ఈ** రాత్రి జోస్ మార్టిని తప్పక స్మరించుకోవాలి. విప్లవసైన్యం సామాజిక సిద్ధాంతాల గురించి మనం చర్చించినపుడు మార్టి ఆశయాలను సాకారం చేస్తున్నామా! అన్న ఆనందం కలుగుతోంది. గత విప్లవానికి సంబంధించిన కొన్ని పరిణామాలను క్లుప్తంగా విశ్లేషిద్దాం.

1953 జులై 26న మోంకాడా ఆయుధగారంపై దాడితో ఈ చర్చను ప్రారంభించదలచుకోలేదు. నేను పాల్గొన్న ఉద్యమాలు, సంఘటనల గురించే ఇక్కడ ప్రస్తావించదలిచాను. ఈ సంఘటనలు అంతిమంగా ఈ సంవత్సరం జనవరి ఒకటిన సంపూర్ణ విప్లవానికి దారి తీశాయి. మన కథను మెక్సికోనుండి ప్రారంభిద్దాం. అక్కడే నేను విప్లవం పట్ల ఆకర్షితుడయ్యాను. ముందుగా విప్లవ సైన్యం కూర్పు ఏమిటో తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. సైన్యం ఆలోచనా విధానం, సిద్ధాంతాలు, కార్యాచరణ శైలిని విశ్లేషిద్దాం. విప్లవ సైన్యం గ్రాన్మా సంఘటనలో నిర్వహించిన పాత్ర, ఆవిర్భావం నుండి నేటి వరకు సైన్యంలో సంభవించిన మార్పులపై చర్చిద్దాం. మెక్సికోలోని ఓ ఇంటిలో జరిగిన సంభాషణ ఒకటి నాకు గుర్తుకొస్తోంది. క్యూబా ప్రజలకు ఓ విప్లవాత్మకమైన కార్యాచరణను అందించాలని అపుడు నేను వాదించాను. జులై 26 ఉద్యమంలో పాల్గొన్న ఒక యోధుడు ఇలా సమాధానమిచ్చాడు. " విషయం చాలా స్పష్టం. మేము కోరుకుంటున్నదల్లా సైనిక తిరుగుబాటే. బాటిస్టా ఒక్కరోజులోనే సైనిక తిరుగుబాటు చేసి రాజ్యాధికారం సంపాదించుకున్నారు. వారిని గద్దె దింపడానికి అదే బాటలో మనమూ పయనిద్దాం. బాటిస్తా అమెరికాకు వంద రాయితీలిస్తే, మనమూ ఇంకో రాయితీ ఎక్కువగానే ఇద్దాం" ఈ జవాబు నన్ను ఆశ్చర్యపరిచింది. ఆ పెద్ద మనిషి ఉద్యమం నుండి తర్వాత తప్పుకున్నాడు. అది వేరే సంగతి. అతని ఆశయం ఒక్కటే :

అధికారాన్ని హస్తగతం చేసుకోవడం తిరుగుబాటు కొన్ని విలువలతో కూడుకొని ఉండాలని నేను వాదించాను. రాజ్యాధికారం పొందిన తర్వాత దేశాన్ని ఏ సిద్ధాంతాల మీద నడపాలన్న విషయమై స్పష్టమైన అవగాహన ఉండాలని తేల్చి చెప్పాను. జూలై 26 ఉద్యమంలో పాల్గొన్న ఒక కార్యకర్త అభిమతం అలా ఉండేది. అదృష్టవశాత్తు అలాంటి అభిప్రాయాలున్న వారు విప్లవ పంథాను వీడి ఇతర మార్గాలను ఎంచుకున్నారు.

ఆ సమయం నుండే 'గ్రాన్మా' విప్లవ బృందం ఏర్పాటు ఒక కొలిక్కి వచ్చింది. అయితే ఈ వ్యవహారంలో అనేక కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. మెక్సికన్ అధికారులు విప్లవకారులపై అణచివేత చర్యలు తీవ్రతరం చేయడంతో ఒక దశలో గ్రాన్మా ప్రయాణమే ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు తోడు బృందంలోని కొందరు సభ్యులు ఉద్యమాన్ని విడిచి వెళ్లడంతో గ్రాన్మా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. చివరగా కేవలం 82 మంది కార్యకర్తలే గ్రాన్మాను అధిరోహించారు. తర్వాతి చరిత్ర క్యూబా ప్రజలకు బాగా తెలుసు. ఇపుడు నన్ను బాధిస్తున్నదల్లా ఒకే ఒక్క విషయం : అలెగ్రియా డి పయో పరాజయం తర్వాత విప్లవకారుల సామాజిక చింతన ఏ విధంగా ఉందా అని. అలెగ్రియా ఓటమి తర్వాత కేవలం 15 మంది మాత్రమే మిగిలారు. అందరూ శారీరకంగా, మానసికంగా చాలా కృంగిపోయి ఉన్నారు. కామ్రేడ్ ఫైడెల్ క్యాస్ట్రో ఇచ్చిన స్ఫూర్తి, కల్గించిన విశ్వాసంతోనే మేము ముందుకు వెళ్ళగలిగాం. ప్రజలపై క్యాస్ట్రోకు అపారమైన విశ్వాసం ఉండేది. అలాగే ఆయన సమర్థవంతమైన విప్లవ నాయకత్వం మాకు ఆదర్శమైంది. పౌరజీవనంతో సంబంధమున్న చిన్న సంస్థగా మేము ఏర్పడ్డాం. సియర్రా మాయెస్ట్రాతో సంబంధాలున్నా ఆ ప్రాంతంతో మాకు పూర్తి అనుబంధం ఏర్పడలేదు. ఒక గుడిసె నుండి గుడిసెకు వెళుతూ ఆహారాన్ని సమకూర్చుకునే వారం. ఇందుకు అయ్యే వ్యయాన్ని భరించేవాళ్ళం. మావి కాని వస్తువులను ముట్టేవారం కాదు. ఈ నియమం వల్ల కొన్ని సార్లు ఆకలిపాలై పస్తులు ఉండాల్సి వచ్చేది. మా బృందాన్ని రైతులు సహించారు కాని మాతో జత కట్టలేదు. ఈ పరిస్థితులలోనే ఎంతో కాలం వ్యర్థమైంది. కొన్ని నెలల పాటు మేము సంచార జీవితం గడిపాం. సియర్రా పర్వత ప్రాంతాల్లో మెరుపుదాడులు నిర్వహిస్తూ మా స్థావరాన్ని ఒక కొండ నుండి మరో కొండ ప్రాంతానికి మార్చేవాళ్ళం. చాలా సార్లు నీళ్ళు దొరికేవి కాదు, జీవన ప్రమాణాలు మరీ దారుణంగా ఉండేవి.

కొద్ది కొద్దిగా రైతాంగం మా కార్యకలాపాలపై తన అభిమతాన్ని, వ్యవహారశైలిని మార్చుకోసాగింది. అప్పటికే బాటిస్టా అనుకూల సైన్యాలు రైతులపై అణచివేత చర్యలను తీవ్రతరం చేసి ఉన్నాయి. వారి ఇళ్లను సైతం ధ్వసం చేయడం ప్రారంభించారు. విప్లవ

సైన్యానికి సహకరిస్తున్న వారి పట్ల బాటిస్టా అనుచరులు కఠినంగా వ్యవహరించసాగారు. రైతాంగం ధోరణిలో వచ్చిన ఈ మార్పు ఫలితంగా అనేక మంది స్థానికులు గెరిల్లా సైన్యంలో సభ్యులుగా చేరారు. క్రమంగా విప్లవ సైన్యం పౌరసైన్యం నుండి రైతాంగ సైన్యంగా రూపాంతరం చెందింది. స్వేచ్ఛా, సామాజిక న్యాయం కోసం రైతులు విప్లవ సైన్యంలో చేరే కొద్దీ క్యూబాలోని ఇతర ప్రాంత రైతులు కూడా ఉద్యమం పట్ల అవగాహన పెంచుకున్నారు. భూమి, వ్యవసాయరంగ సంస్కరణల కోసం తాము జరుపుతున్న పోరాటానికి ఉద్యమం ఎంతో చేయూతనివ్వగలదనే అభిప్రాయానికి వచ్చారు.

ఈ విధంగా తొలి సామాజిక లక్ష్యాన్ని నిర్ధారించగలిగాం. తర్వాతి కాలంలో వ్యవసాయరంగ సంస్కరణలు ఉద్యమ ప్రధాన లక్ష్యంగా మారాయి. పూర్వం ఉద్యమకారులు కేవలం అమెరికా విధానాలు, వ్యవహారశైలిని పరిశీలించడంలోనే కాలం వెలిబుచ్చారు. ఆ సమయంలో విదేశీ పత్రికా ప్రతినిధులు ముఖ్యంగా అమెరికా విలేకరులు, మా ఉద్యమాన్ని ప్రపంచానికి తెలియజేయడమే ప్రధానమని భావించేవాళ్లం. సైనిక విజయం కన్నా ఉద్యమ ప్రచారమే మాకు ముఖ్యమైపోయింది. విప్లవ పోరులో రైతులను భాగస్వాములను చేయడం కంటే అమెరికాలో మద్దతుదారులను పెంచుకోవడానికి, విప్లవ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాం. అదే సమయంలో సాంటియాగో డి క్యూబా వద్ద ఓ దురదృష్టకరమైన సంఘటన జరిగింది. కామ్రేడ్ ఫ్రాంక్ పాయిస్ హత్యకు గురయ్యారు. విప్లవ ఉద్యమంలో ఇదో మరచిపోలేని మలుపు. హత్యకు నిరసనగా ఆ ప్రాంత ప్రజలు వీధులలో పడ్డారు. తొలి రాజకీయ నిరసనను పాటించారు. నిరసనకు ఎవరు నాయకత్వం వహించనప్పటికీ ఓరియంటే ప్రాంతం, లాస్‌విల్లాస్, కామాగులే తదితర ప్రాంతాలలో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.

ఎలాంటి సంఘటిత స్వరూపం లేనటువంటి ఈ ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేయగలిగింది కాని ప్రజలలో పాలకుల పట్ల ఉన్న వైముఖ్యం మరింత పెంచింది. ఈ పరిణామం మాకో పాఠం నేర్పింది. విప్లవ లక్ష్యాన్ని సాధించడానికి శ్రామిక వర్గాల మద్దతు తప్పని సరి అని మాకు బోధపడింది.

కార్మిక ఉద్యమాలతో ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతూ విప్లవ సైన్యం పటిష్టతకు చర్యలు తీసుకున్నాం. అజ్ఞాత బృందాలను ఏర్పరచి విప్లవ ప్రచారం సాగించాం. కార్మికుల సాధారణ సమ్మెలు ప్రజాభిప్రాయాన్ని విప్లవంవైపు మళ్ళించడానికి ఎంతో ఉపయోగపడ్డాయి.

పరిస్థితులలో స్పష్టమైన మార్పు వచ్చినా 1958 ఏప్రిల్ 9న పిలుపునిచ్చిన సాధారణ సమ్మె విఫలమైంది. ఎందుకంటే ఉద్యమ నాయకత్వానికి విప్లవాత్మకమైన ఆలోచనా సరళి, తెగింపు లేవు. ఉద్యమ స్ఫూర్తిని కింది స్థాయి కార్యకర్తల వరకు తీసుకెళ్లలేకపోయారు.

అంతవరకూ విప్లవ సైన్యం సాధించిన విజయాలు నిష్ఫలమయి వ్యవస్థాగతంగా కార్మిక సంఘాలు బలంగా లేకపోవడం వల్లనే ఈ పరిణామాలను ఎదుర్కోవలసి వచ్చింది. నాయకత్వానికి, కార్యకర్తలకు మధ్య సమన్వయ లోపం కూడా మరో కారణం. ఈ అనుభవం ఒక గుణపాఠం నేర్పింది. సిద్ధాంతపరమైన పోరాటం మొదలై జులై 26 ఉద్యమానికి దారి తీసింది. దేశ ప్రజలలో కొత్త ఆశలను రేకెత్తించింది. గ్రామీణ, నగర ప్రాంతాలలోని ఉద్యమాలు దేశవ్యాప్త సరళిని ప్రతిబింబిస్తూ విప్లవానికి ఆజ్యం పోశాయి. ఈ సమయంలోనే విప్లవ సైన్యం సైద్ధాంతిక, వ్యూహాత్మక కార్యాచరణను రూపొందించి సంపూర్ణ విప్లవ సాధనకు రంగం సిద్ధం చేసింది. ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం క్రమంగా బలపడసాగింది.

ప్రయోగాత్మక దశ నుండి ఆచరణాత్మక దశకు విప్లవం చేరుకుంది. సియర్రా మాయెస్త్రా ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమల స్థాపన పుంజుకుంది. వలసవాద జీవితం నుండి శాశ్వత స్థావరాలు ఏర్పరచుకునే స్థాయికి విప్లవ యోధులు చేరుకున్నారు. ఆయుధాలను సమకూర్చుకోవడంతో పాటు గెరిల్లా స్థావరాలకు రక్షణగా మందుపాతరలను ఏర్పాటు చేసుకోగలిగాం. సాయుధ పోరాట దశలో విప్లవకారులు తమ లక్ష్యాన్ని ఏ మాత్రం విస్మరించలేదు. రైతాంగాన్ని ఉద్యమంలో భాగస్వాములను చేయడానికి ప్రతిఒక్కరు కృషి చేశారు. ఓరియంటే ప్రాంతంలో పాఠశాలలు ఏర్పాటు చేశాం. ఈ విధంగా సామాజిక ప్రయోగాలు చేస్తూ ప్రజా మన్ననలు పొందాం. హ్యాంబెర్టోసోరి మార్టిన్, క్యాస్ట్రో, నేను స్వయంగా రూపొందించిన ప్రణాళిక మేరకు పేద రైతులకు భూమి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం. బాటిస్తా మద్దతుదారులైన భూస్వాములు భూములన్నింటినీ స్వాధీనం చేసుకున్నాం. అలాగే ప్రభుత్వ భూమిని రైతుకూలీలకు అప్పగించాం. ఈ దశలో విప్లవాన్ని రైతాంగ విప్లవంగా అందరూ గుర్తించసాగారు.

తర్వాతి దశలో కార్మిక ఉద్యమాలను తీవ్రతరం చేశాం. అయితే ప్రభుత్వం తీవ్రంగా స్పందించి కార్మిక సంఘాలను అణచివేసింది. కార్మికుల్లో వైముఖ్యం పెరిగి ఉద్యమ స్ఫూర్తి దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. 1958 మే 25న సుమారు పదివేల మంది సైనికులు మా స్థావరంపై దాడి చేశారు. ముఖ్యంగా ఫైడెల్ కాస్ట్రో నేతృత్వంలోని

ఒకటవ కాలమ్‌పై ఒత్తిడి తీవ్రతరం చేశారు. ఆ సమయంలో విప్లవ సైన్యాల ఆధీనంలో వున్నది స్వల్ప భూభాగమే. కేవలం 300 రైఫిళ్లతో మేము శక్తివంతమైన పదివేల మంది సైనికులను ఎదుర్కోవడం ఒక చరిత్రాత్మకమైన ఘటన. వ్యూహాత్మక చర్యల వల్ల బాటిస్తాలు జులై 30కల్లా తమ ఆక్రమణకు స్వస్తి పలికారు. ఈ క్షణం నుండి విప్లవకారులు ఎదురుదాడిని ప్రారంభించారు. సుమారు 600 ఆయుధాలను స్వాధీనం చేసుకోగలిగాం. శత్రు సైన్యం సుమారు వెయ్యి మంది సైనికులను కోల్పోయి, వేల సంఖ్యలో క్షతగాత్రులతో నిర్వీర్యమైంది.

క్యూబా లోతట్టు ప్రాంతాల్లోకి విప్లవ సైన్యం విస్తరించింది. ఇది వ్యూహాత్మక, మానసిక ఎదురుదాడి. ఎందుకంటే మా వద్ద శక్తివంతమైన ఆయుధాలు లేవు. ఉన్నా కొద్ది సంఖ్యలో మాత్రమే. ఈ సాయుధ పోరాటంలో మేం ఆధారపడ్డది కేవలం ప్రజావిశ్వాసంపైనే. విప్లవ బృందాలు శత్రువర్గాలను వంచిస్తూ సైనికపరంగా ముఖ్యమైన స్థావరాలను హస్తగతం చేసుకోవడం ప్రారంభించాము. రైతాంగం ఇందుకు ఎంతగానో సహాయ సహకారాలు అందించింది. ఇక్కడ రైతు ప్రభుత్వానికి కనిపించని శత్రువు. విప్లవ సైన్యాలకు తన చేతనైన సహాయం అందిస్తూ ఉద్యమం బలోపేతం కావడానికి కారకుడయ్యాడు.

రైతులు శత్రు సైన్యాల కదలికలు, వారి వ్యూహాలను ఎప్పటికప్పుడు పసిగడుతూ గెరిల్లా దళాలకు స్పష్టమైన సమాచారం అందించసాగారు. ఇదంతా ఏదో అద్భుత కార్యమని భావించాల్సిన విషయం కాదు. విప్లవ క్రమంలో సంభవించిన ముఖ్య పరిణామం మాత్రమే. అలాగే విప్లవ సైన్యాల వ్యవసాయ విధానం కూడా ఇందుకు ప్రధాన కారణం. సియర్రా మాయెస్ట్రాపై సైన్యం దాడి నిర్వహించినపుడు సుమారు పదివేల పశువులను విప్లవకారులు, సానుభూతిపరుల కోసం పంపడం ఇందులో భాగమే. చరిత్రలో తొలిసారిగా సియర్రా మాయెస్ట్రా రైతాంగం ఆ సమయంలో మాంసాహారానికి అలవాటు పడింది. వారి సంతానం పాలు తాగడం ప్రారంభించింది. అలాగే వారు విద్య అభ్యసించసాగారు. ఈ కారణాలతో రైతాంగం ఉద్యమం పట్ల సానుకూల ధోరణి అవలంభించింది.

ఈ పరిస్థితులలోనే ప్రభుత్వం రైతుల ఇళ్లను ధ్వంసం చేయడం మొదలు పెట్టింది. వారి భూములను స్వాధీనం చేసుకొని, వారి నివాస ప్రాంతాల నుండి వెళ్లగొట్టింది. నాపాం బాంబులు గ్రామీణ ప్రాంతాలపై వర్షం వలె కురవసాగాయి. ఆకాశం నుండి దాడి చేయడానికి బాటిస్తాలకు అమెరికా పూర్తి సహాయసహకారాలు అందించింది. ప్రభుత్వం వద్ద 500 కిలోల బరువుగల బాంబులు, ఇతర ఆధునిక సాయుధ సంపత్తి

ఉండడంతో గ్రామీణ ప్రాంతాలపై (సుమారు వంద మీటర్లలోపు) వారు దాడులు నిర్వహించసాగారు. కాఫీ వనంపై ఒక్క నాపాం బాంబు విసిరితే ఆ ప్రాంతమంతా ధ్వంసమయ్యేది. రైతుల కష్టం బుగ్గిపాలయ్యేది. ఒక్క క్షణంలో ధ్వంసమైన సంపదను (పైరు) తిరిగి పొందాలంటే ఐదారు సంవత్సరాలు కష్టం చేయాల్సి వచ్చేది.

ఈ సమయంలో మేము లాస్ విల్లాస్ వైపు ప్రస్థానం కొనసాగించాం. ఇందులో నేను స్వయంగా పాల్గొన్నానని కాదు, ఈ ఘట్టం ఎంతో ముఖ్యమైనది ఎందుకంటే మేము అక్కడ ప్రవేశించడంతోనే రాజకీయ, సామాజిక ఉద్యమం తారాస్థాయికి చేరుకొని ఉంది. జూలై 26 ఉద్యమ పతాకంతో మేము లాస్ విల్లాస్‌లో ప్రవేశించిన సమయంలో ఎస్కాంబ్ర ద్వితీయ సంగ్రహానికి చెందిన బృందాలు, ప్రజాసోషలిస్టు పార్టీ బృందాలు, ఔటెంటికా బృందాలు ప్రభుత్వంపై ఉద్యమాన్ని తీవ్రతరం చేసి ఉన్నాయి.

ఈ బృందాల మధ్య సమన్వయం సాధించి విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లాం. జులై 26 ఉద్యమాన్ని సామూహిక చర్యల ద్వారా విజయవంతం చేయాలని సంకల్పించాం. వివిధ పక్షాల మధ్య సైద్ధాంతిక వైరుధ్యాలున్నప్పటికీ ప్రభుత్వ వ్యతిరేక నినాదంతో వారిని ఏకతాటిపై తెచ్చాం.

అక్కడ తొలుత భూసంస్కరణల చట్టాన్ని ప్రవేశపెట్టాం. ఈ సంస్కరణల బలంపైనే విప్లవ సైన్యం ముందుకు సాగింది. ఇది వ్యూహాత్మకమైన చర్య కాదు. సంపూర్ణ విప్లవం తర్వాత సుమారు రెండేళ్లకు నాయకత్వానికి, రైతాంగానికి మధ్య ఉన్న సంబంధం వ్యవసాయరంగ సంస్కరణలేనని నిర్ధారణ అయ్యింది. ఈ కారణంగానే విప్లవక్రమంలో ఇలాంటి చర్యలకు ప్రాధాన్యత ఎంతో ఉంటుంది. భూ సంస్కరణలు మా ఆలోచన కాదు, అవి రైతాంగం నుండి తీసుకున్న సూచనలు మాత్రమే. ఫలితంగా మేము వారిని విప్లవానికి సన్నద్ధులం చేయగలిగాము. విప్లవానికి తమ అవసరాన్ని గుర్తించిన రైతాంగం కూడా భూసంస్కరణలు, పశుసంపద, తదితర సమస్యలను ఉద్యమంలో భాగంగా పరిష్కరించాలని నాయకత్వాన్ని ఒప్పించగలిగింది. అలాగే సామాజిక సంస్కరణల కోసం ఒత్తిడి తెచ్చింది. సియర్రా మాయెస్ట్రాలో 1958 నవంబర్ 3న జరిగిన బూటకపు ఎన్నికల తర్వాత మూడవ చట్టాన్ని విప్లవ సైన్యం తీసుకువచ్చింది. ఫలితంగా ప్రభావ వంతమైన వ్యవసాయరంగ సంస్కరణలు అమలులోకి వచ్చాయి. కౌలుదారులకు కూడా భూములు పంపిణీ చేయడం జరిగింది. ఈ చర్యలు విప్లవాత్మకమైనవి.

భూసంస్కరణలు సుమారు రెండు లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలిగించాయి. మూడవ చట్టం ప్రకారం అధిక మోతాదులో భూమి కలిగి ఉండడం నేరం. ఇందుకు రాజ్యాంగ చట్టం అవసరం. ఈ విషయాలు రైతాంగం విప్లవ నాయకత్వంపై తీవ్రమైన వత్తిడి తీసుకువచ్చింది.

ఇంకో చట్టం ప్రకారం భూసేకరణకు సరైన పరిహారం చెల్లించాలి. దీని అమలుకు చాలా కాలం పట్టవచ్చు. అది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కూడా. ఇందుకోసం రైతాంగం సమిష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

ఇప్పుడు మనం విప్లవసైన్యం యొక్క సామాజిక ఆదర్శాలు (సిద్ధాంతాలు) గురించి తెలుసుకుందాం. ప్రస్తుతం మనకు విప్లవ ప్రజాస్వామ్యం ఉంది. భూసంస్కరణలు అమలు చేసినప్పుడు మన ధ్యాస అంతా సామాజిక న్యాయంపై ఉంటుంది. భూమి పంపిణీలో సామాజిక సమతుల్యం పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే సందర్భంలో వ్యవసాయ విధానం, వాణిజ్య చట్టాలు కూడా అమలు చేయాల్సి ఉంటుంది. ఆర్థికపరమైన కార్యకలాపాలన్నీ ఒకదానికి ఒకటి ముడిపడినవే. పారిశ్రామిక ప్రగతిపై కూడా అంతగానే దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా పన్నుల విధానాన్ని, ఎగుమతి-దిగుమతుల చట్టాన్ని రూపొందించాల్సి ఉంటుంది. వాణిజ్య రంగ ప్రగతికి చర్యలు చేపట్టి దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యత కల్పించాల్సి ఉంటుంది. ఇందుకు రైతాంగం సహకారం ఎంతో అవసరం.

ఇప్పుడు మనకో విషయం స్పష్టంగా అర్థమయ్యేదేమిటంటే పాలనాపరంగా మనం ఎన్నో సంక్లిష్టమైన సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. ప్రజల ఆశలు నెరవేర్చడానికి అహర్నిశలు కృషి చేయాల్సి ఉంటుంది. జనాభాలో 75 శాతంగావున్న రైతాంగ సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించాలి. విదేశీ ఉత్పత్తుల తాకిడిని తట్టుకునేందుకు పన్నుల విధానాన్ని ప్రవేశపెట్టాలి. అలాగే పటిష్టమైన నౌకా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

మరీ ముఖ్యంగా పారిశ్రామికీకరణను ప్రోత్సహించాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన ముడిసరుకులపై ప్రభుత్వం పూర్తి ఆధిపత్యం కలిగి ఉండాలి. ఖనిజ సంపదను జాగ్రత్తగా వినియోగిస్తూ దేశ సంపదను వృద్ధి చేయడానికి ప్రయత్నించాలి. పారిశ్రామికీకరణకు ప్రధానంగా విద్యుచ్ఛక్తి ఎంతో అవసరం. అందుకు అనువైన మార్గాలు, ప్రణాళికలు రూపొందించాల్సి ఉంటుంది. సమాచార, ప్రసార వ్యవస్థలను జాతీయం చేసి ప్రజాసేవకు వాటిని వినియోగించాల్సి ఉంటుంది.

దేశ నిర్మాణ పథకాన్ని ఎలా అమలు చేయాలి? అందుకు అవసరమైన వ్యవస్థ ఎలా ఉండాలి? విప్లవ సైన్యం ఇందులో అగ్రభాగాన ఉండాలి. అందుకోసం సైన్యాన్ని పున:వ్యవస్థీకరించాలి. తొలుత విప్లవ సైన్యంలో రైతాంగం, నిరక్షరాస్యులైన శ్రామికులు చేరినందున, వారిని పాలనాపరమైన బాధ్యతలకు సన్నద్ధులను చేయడం ఇప్పుడు ఇబ్బందికరంగా మారింది. అయితే సైన్యాన్ని సాంకేతిక, పాలనాపరమైన విషయాలను బోధించాల్సి ఉంది.

విప్లవ సైన్యం క్యూబన్లకు నాయకత్వం వహిస్తోంది. సైన్యాన్ని కొత్త బాధ్యతలకు సంసిద్ధం చేయడానికి సాంకేతిక, సాంస్కృతిక అవగాహనా కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే తగు బోధనా కార్యక్రమాలు మొదలయ్యాయి.

జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమం మొదలైంది. పాలకవర్గాలకు ఎలాంటి ప్రత్యేక హక్కులు, రాయితీలు ఉండాల్సిన అవసరం లేదు. విముక్తి పోరాటానికి స్ఫూర్తినిచ్చిన ఆదర్శాలను తు.చ. తప్పకుండా పాటించే చర్యలు తీసుకొని అంతర్గత శత్రువులను అదుపు చేయాల్సి ఉంది.

ఒకవేళ క్యూబాపై సామ్రాజ్యవాదులు దండెత్తితే, బలమైన సైన్యాలతో మనం పోరాటం చేయాల్సి రావచ్చు. ఇందుకోసం అన్ని తరహా యుద్ధతంత్రాల్లో ఆరితేరి ఉండాలి. క్యూబన్లందరూ గెరిల్లాలుగా తయారు కావాల్సి ఉంటుంది. విప్లవ సైన్యం ఇప్పుడిప్పుడే సంస్థాగతంగా బలోపేతమవుతుంది. అయితే మన జనాభా పరిమిత సంఖ్యలో ఉన్నందున బలమైన శత్రు సైన్యాన్ని ఎదుర్కోవడానికి ప్రత్యేక రక్షణ వ్యవస్థను ఏర్పరచుకోవడం అవసరం. అందుకు ప్రతి పౌరుడూ సహకారం అందించాలి.

ఇప్పటివరకు నేను విప్లవ సైన్యం సిద్ధాంతాలు, ఆదర్శాల గురించి, విప్లవం తర్వాత వారి బాధ్యతల గురించి చెప్పాను. అయితే ఇంకో ఆసక్తికరమైన విషయం మీకు చెప్పాలి. క్యూబా విప్లవం వెలువరించిన బోధనలు ఇంతకు పూర్వం స్థిరపడిన పైస్థాయి సామాజికుల సిద్ధాంతాలను పటాపంచలు చేసాయి. చిన్న చిన్న బృందాలైన గెరిల్లా దళాలు నిష్టతో, పట్టుదలతో విప్లవాన్ని ఎలా సాధించగలవో క్యూబా పాఠం నేర్పింది. విప్లవానికి నాందిగా భూసంస్కరణల కార్యక్రమాన్ని చేపట్టడం అత్యంతావశ్యమని లాటిన ప్రజలు

తెలుసుకోవాలి. అందుకు పర్వత, అటవీ, గ్రామీణ ప్రాంతాలలో ఉద్యమాలు నిర్వహించాలి. తర్వాత విప్లవాన్ని నగర, పట్టణ ప్రాంతాలకు తీసుకెళ్లాలి. సామాజిక చింతన లేకుండానే విప్లవం సాధించడం చాలా కష్టమని తెలుసుకోవాలి.

క్యూబన్ల అనుభవాలతో లాటిన్ ప్రజలు ముందుకు సాగాల్సి ఉంటుంది. లేకపోతే దోపిడీదారులు, పాలకవర్గాలు వారిని శాశ్వతంగా అణచేస్తోంది. ఇప్పుడు లాటిన్ దేశాలలో కూడా ఉద్యమ జ్వాలలు రేగుతున్నాయి. నియంతలపై ప్రజలు మరణశాసనం ప్రకటించారు. విదేశీ వాణిజ్య సంస్థల్లాగా, పాలకులు కూడా ప్రజాప్రభుత్వానికి వ్యతిరేకులు. క్యూబా చాలా చిన్న దేశం. దానికి లాటిన్ అమెరికా ప్రజలు, దేశాల మద్దతు ఈ సమయంలో చాలా అవసరం.

క్యూబా విప్లవ ప్రధాన లక్ష్యాలను ప్రపంచానికి తెలియచేయాల్సిన బాధ్యత మనపై ఉంది. అమెరికా ప్రజల మద్దతు కూడగట్టాల్సి ఉంది. లాటిన్ ప్రజల మధ్య భావత్మక ఐకమత్యం సాధించి, విప్లవ ఫలాలు పంచుకోవాల్సి ఉంది.

చివరగా, పేద దేశాలన్నీ ఒక్కటై ప్రజల అభ్యుదయానికి కొత్త మార్గాలు అన్వేషించాల్సి ఉంది. అయితే దేశాల మధ్య అంతరాలు పెంచడానికి కొన్ని శక్తులు పన్నుతున్న కుట్రల గురించి మాకు స్పష్టంగా తెలుసు. ఆ శక్తుల గుట్టు రట్టు చేయడానికి పేద దేశాలు ముందుకు రావాలి.

ఈ రోజు క్యూబా ప్రజలు తమ కాళ్లపై నిలబడి నిరంతర పోరు కొనసాగిస్తున్నారు, కొనసాగించాలి కూడా. నియంతృత్వంపై వారి విజయం తాత్కాలికం కారాదు, అది లాటిన్ అమెరికా విజయానికి తొలి మెట్టు కావాలి.

# రాజకీయ సార్వభౌమాధికారం, ఆర్థిక స్వాతంత్ర్యం

## (మార్చి 20, 1960)

**(ప్రజా విశ్వవిద్యాలయం' శీర్షికతో టెలివిజన్‌లో ప్రసారితమైన కార్యక్రమంలో ఇచ్చిన ప్రసంగవ్యాసం ఇది. ఈ కార్యక్రమం ప్రతి ఆదివారం ప్రత్యక్ష ప్రసారమయ్యేది. ఇందులో ప్రశ్నోత్తరాల విభాగం కూడా ఉండేది. ఈ వ్యాసం తొలి ప్రసంగానిది).**

సాధారణంగా, ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనేటప్పుడు క్యూబా ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యాన్ని కూడా వివరించాల్సి ఉంటుంది. విప్లవానికి సంబంధించిన సత్యాలు ముందుకు తేవాల్సి ఉంటుంది. అంతకు ముందులా మాటల గారడీ చేయడానికి అవకాశమే ఇక్కడ లేదు.

ఫైడెల్ కాస్ట్రో ఈ కార్యక్రమాన్ని తొలుత నిర్వహించాల్సి ఉన్నా ఆ బాధ్యత నాకు అప్పగించినందుకు చాలా గర్వపడుతున్నాను. ముఖ్యంగా ఆర్థికపరమైన విషయాలు చర్చించడానికే నాకీ అవకాశాన్నిచ్చారు. విప్లవ సేనానులుగా, మనం మన బాధ్యతలు తెలుసుకుని ముందుకు సాగాలి. ఇందుకోసం మాకు ప్రత్యేకమైన శిక్షణంటూ లేదు. సాధారణ భాషలో ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు వివరించడానికే ఇక్కడ మొగ్గు చూపాం. రాజకీయ సార్వభౌమాధికారం, ఆర్థిక స్వాతంత్ర్యానికి సంబంధించిన విషయాలను నేను మీ దృష్టికి తీసుకురాదలిచాను. ఈ రెండు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. కొద్దికాలం తర్వాత ఇవి కలిసిపోవచ్చు.

ఈ రెండు అంశాల కలయిక ఒక అభ్యుదయకరమైన పరిణామం. క్యూబా విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. విప్లవం తర్వాత మనం ఆర్థిక స్వాతంత్ర్యం

కోసం పోరాడాల్సి ఉంటుంది. కొన్ని దేశాలకు రాజకీయపరమైన స్వాతంత్ర్యం ఉన్నా తమ ఆర్థిక విధానాలను స్వతంత్రంగా నడుపుకొనే అవకాశం వారికి లేదు. ఆర్థిక వ్యవహారాలపై వారి పట్టు క్రమంగా తగ్గి పూర్తిగా నశించిపోయే ప్రమాదముంది. ఇప్పుడు మనముందున్న విప్లవ కర్తవ్యం భవిష్యత్‌కు గట్టి పునాదులు వేయడం. అప్పుడే మనకు కొన్ని దేశాల నుండి బెదిరింపులు వస్తున్నాయి. తక్షణ కర్తవ్యం సమగ్రమైన ప్రణాళికను రూపొందించడం. ప్రజల అభ్యున్నతికి, సమాన న్యాయానికి ప్రాధాన్యతనివ్వడం. శత్రువు నుండి ముప్పు వాటిల్లినప్పుడు కేవలం ఖండనలకు పరిమితం కాకుండా దేశాన్ని సురక్షితంగా కాపాడుకోవలసిన అవసరం ఉంది. కేవలం విప్లవకారులే కాకుండా సామాన్యప్రజలు కూడా దేశ నిర్మాణంలో పాలు పంచుకుని విప్లవ లక్ష్యాలను సాధించాలి. భవిష్యత్ గురించి ప్రజలలో ఎలాంటి ఆందోళనలు, భయాలు లేకుండా అభ్యుదయ బాటపై నడవాలి. లాటిన్ అమెరికా చరిత్రలోనే తొలిసారిగా మనం వాస్తవికమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాధించుకున్నామన్న సంగతి మరవరాదు.

అందుకే జాతీయ పునర్నిర్మాణ పథకానికి ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. ప్రజలు తమ అభిప్రాయాలను, సూచనలను నిర్భయంగా ముందుకు వచ్చి వెల్లడించవచ్చు. ఇదేమి కొత్త విషయం కాదు, ఎందుకంటే మన ప్రధానమంత్రి(కాస్ట్రో) కెమెరాల ముందుకు వచ్చినప్పుడు ప్రజలకు సుదీర్ఘపాఠాన్ని చెబుతారు. అది కూడా స్కూలు మాస్టారు లాగా. ఇప్పుడు కూడా మేము బోధనా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాము. ముఖాముఖి ప్రశ్నలకు జవాబు ఇవ్వడానికే మేము పరిమితం కావడం లేదు.

ఇప్పుడు మనం రాజకీయ సార్వభౌమాధికారం, ఆర్థిక స్వాతంత్ర్యం అంశంపై చర్చిద్దాం. ఈ అంశాలపై విప్లవ సైన్యం ఏ విధంగా ముందుకు సాగుతోందో వివరించడానికి ముందు వాటికి సరైన నిర్వచనం ఇవ్వదలచుకున్నాను. అయితే నిర్వచనాలు ఎప్పుడూ లోపభూయిష్టంగానే ఉంటాయి. కొన్ని పదాలు, వర్ణనలు కాలక్రమంలో స్తంభించి కనుమరుగయ్యే అవకాశం కూడా ఉంది. అయితే అత్యంత సాధారణమైన నిర్వచనం ఇవ్వడానికి ప్రయత్నిస్తాను.

సార్వభౌమాధికారం అన్న ఆలోచన చాలామందికి అర్థం కాదు. వారు అర్థం చేసుకోవాలని కోరుకోరు కూడా. ఉదాహరణకు మేము సోవియెట్ రష్యాతో వాణిజ్య సంబంధమైన ఒప్పందాలు కుదుర్చుకున్నప్పుడు చాలా మంది ఆందోళన వ్యక్తం చేసారు.

సార్వభౌమాధికారానికై జరిగిన పోరాటాల తాలుకూ వివరాలు మనకు చరిత్రలో లభిస్తాయి. కేవలం రెండు రోజుల క్రితమే జనరల్ లజారో కార్డెనాస్ నేతృత్వంలోని మెక్సికో ప్రభుత్వంచే చమురు కంపెనీల జాతీయకరణ వార్షికోత్సవం జరిగింది. అప్పట్లో మేము యుక్తవయస్సులో ఉన్నాం కనుక జాతీయకరణ తర్వాత చెలరేగిన ఆందోళన గురించి పెద్దగా తెలియదు. అప్పట్లో వచ్చిన విమర్శలు ఇప్పుడు క్యూబా కూడా ఎదుర్కోవలసి వస్తుంది. గౌటిమాలలో కూడా ఇదే పరిస్థితి కొన్నేళ్ల క్రితం వరకు ఉండేది. ఈ విమర్శలు వచ్చినప్పుడు నేను అక్కడే ఉన్నాను. పూర్తి స్వేచ్ఛతో నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వాలు ఇలాంటి విమర్శలను ఎదుర్కోక తప్పదు. అమెరికా పత్రికారంగం మన నాయకుడిని ఎంతగా విమర్శిస్తే అతడు అంత మంచివాడు అన్నట్లు మనం గ్రహించాలి. ఇప్పుడు క్యూబా పరిస్థితి కూడా అదే. గౌటిమాలా, మెక్సికోల విషయం కంటే క్యూబా చేపడుతున్న చర్యలను అమెరికన్ మీడియా తీవ్రంగా విమర్శిస్తోంది. మెక్సికోకు సంబంధిత చమురు పరిశ్రమల జాతీయకరణ విషయమై పత్రికలు విమర్శలు సంధిస్తే, క్యూబా చక్కెర ఎగుమతుల గురించి నానా అర్థాలు తీస్తున్నారు.

"చక్కెర లేనిదే మేము లేము" అని ఒక తిరోగమనవాది నినదించాడు. మనం ఏ దేశానికి ఎగుమతి చేస్తున్నామో వారు ఒప్పందాన్ని రద్దు చేసుకుంటే క్యూబాకు గడ్డుకాలం ఏర్పడుతుందని కూడా వీరు వాదిస్తున్నారు. ఈ వాదన ఎలా ఉందంటే కేవలం మనపై దయ తలచి ఆయా దేశాలు మన దేశం నుంచి చక్కెర దిగుమతి చేసుకుంటున్నారన్నట్లు ఉంది.

శతాబ్దాల తరబడి రాజ్యాధికారం భూస్వాముల చేతుల్లో ఉండేది. వర్గ శత్రువులను అణచివేయడానికి తమలో అత్యంత క్రూరుడైన, కఠినాత్ముడైనవాడిని వారు నాయకునిగా ఎన్నుకునేవారు. అతడే రాజు, నియంత. కొద్దికొద్దిగా తన అధికారాన్ని పెంచుకుంటూ, చివరికి అత్యంత శక్తిమంతునిగా అతడు అవతరించాడు. ఇది చారిత్రక వాస్తవం. అయితే మానవ ప్రస్థానాన్నంతా ఇక్కడ ప్రస్తావించదల్చుకోలేదు.

ఇప్పుడు రాజుల కాలం పోయింది. కేవలం కొన్ని ఐరోపా దేశాలలో మాత్రమే రాజకుటుంబాలు రాజ్యమేలుతున్నాయి. ఫుల్జెంచియో బాటిస్టా తనను తాను ఫుల్జెంచియో వన్‌గా ప్రకటించుకోలేదు. శక్తివంతమైన పొరుగు రాజ్యం తనను అధ్యక్షుడిగా గుర్తిస్తే అదే చాలుననుకున్నాడు. సైన్యం తన మాటకు విలువిస్తే అదే పదివేలనుకున్నాడు. భౌతికవాదులు, సైనికాధికారులు, ఇతర బూర్జువా వర్గాల మద్దతు కూడగట్టుకున్నాడు. ఈ వర్గాలన్నీ అతడిని ఆదరించి, అతడి ఆజ్ఞలను శిరసావహించాయి. ఎందుకంటే అతడు నిరంకుశవాది, పొరుగు దేశంలో బలమైన మిత్రులు కలిగి ఉన్నాడు.

ప్రస్తుతం మకుటం లేని మహరాజులు ఉన్నారు. రాజ్యాల స్థానంలో గుత్తాధిపత్యం తాండవిస్తోంది. ఆసియా, ఆఫ్రికా దేశాలలో ఇదే పరిస్థితి ఉండేది. కొన్ని దేశాలలో ఇంకా కొనసాగుతోంది. లాటిన్ దేశాలలో దురదృష్టవశాత్తూ ఈ పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ప్రక్రియకు ఆద్యుడు హిట్లర్. జర్మన్ పరిశ్రమల గుత్తాధిపత్యాన్ని కాపాడడానికి ఆయన జాతి దురహంకార నినాదంతో అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. తన అరాచక విధానాలతో ప్రపంచ యుద్ధానికి కారకుడై నాలుగు కోట్ల మంది ప్రాణాలు బలిగొన్నాడు.

గుత్తాధిపత్యాల ప్రాముఖ్యత ఘనమైనది. అది మన దేశ రాజకీయ అధికారాన్ని సర్వనాశనం చేయగలదు. కొద్దికాలం క్రితం పాపిని రాసిన పుస్తకం చదివాను. అందులో గోగ్ అనే పాత్ర ఒక రిపబ్లిక్ (దేశం)ను కొంటుంది. ఆ దేశానికి చట్టసభలు, అధ్యక్షుడు, స్వాతంత్ర్యం ఉందని తెలిసి కూడా దానిని కొనుగోలు చేస్తాడు. ఈ వర్ణన ముమ్మాటికి నిజం. కొన్ని దేశాలకు పై వ్యవస్థలున్నా అవి విదేశీ వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తల అదుపాజ్ఞలలో నడుస్తుంటాయి. ఉదాహరణకు యునైటెడ్ ఫ్రూట్ కంపెనీ, స్టాండర్డ్ ఆయిల్ లాంటి పరిశ్రమలు తమ గుత్తాధిపత్యం నిలుపుకోవడం కోసం ఆయా దేశాల ఆంతరంగిక విషయాల్లో కూడా జోక్యం చేసుకోవడం మనం చూశాం. ఇక ఆసియా, ఆఫ్రికా దేశాల సంగతి ఎలాగూ ఉంది.

రాజకీయ సార్వభౌమత్వాన్ని ఖచ్చితమైన ప్రాసతో నిర్వచించడానికి వీలుపడదు. మరింత లోతుగా, శాస్త్రీయంగా విశ్లేషిస్తే కాని ఆ సంకల్పాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం. కొందరు దార్శనికులు, రాజకీయ విశ్లేషకులు చెప్పిన ప్రకారం దేశ సార్వభౌమత్వం,

రాజకీయ సార్వభౌమత్వం మధ్య ఎలాంటి తేడా ఉండదు. అలాకాకుండా ఉన్నట్లయితే, సామ్రాజ్యవాదులు తాము ఆక్రమించుకున్న దేశాలను అసోసియేట్ (మిత్ర) దేశాలుగా ప్రకటించడానికి సంకోచించేవారు కాదు. దురాక్రమణను కప్పిపుచ్చడానికి అనేక పర్యాయ పదాలను వాడుకుంటున్నారు. ఒక దేశం తన వ్యవహారాలను ఎంత స్వేచ్ఛగా నడపగలదు అన్నది ఆ దేశ నాయకత్వంపైనే ఆధారపడి ఉంటుంది. దేశ సార్వభౌమత్వం అంటే ఆ దేశ వ్యవహారాలలో ఇతరుల జోక్యాన్ని పూర్తిగా నివారించడం, దేశ ప్రజలే తమ విధి విధానాలను రూపొందించుకోవడం. ఆ దేశం యొక్క సామర్థ్యంపై ఇది పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ఆ దేశ ప్రజలే తమ రాజకీయ నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సి ఉంటుంది. అయితే సార్వభౌమత్వానికి తోడు ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నప్పుడే ఆయా దేశాలు పూర్తిగా స్వతంత్రమవుతాయి.

ముందుగా చెప్పినట్లు ఆర్థిక స్వాతంత్ర్యం, రాజకీయ సార్వభౌమాధికారం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ఒక దేశం తన ఆర్థిక విధానాలను స్వయంగా నిర్దేశించలేనప్పుడు అది సార్వభౌమ రాజ్యంగా పిలవజాలదు. అలాగే విదేశీ పెట్టుబడులు కలిగి ఉంటే రుణదాతలైన దేశాల ప్రభావం నుండి తప్పించుకోలేవు. తన సత్తాను చాటుకోవాలని చూస్తే శక్తివంతమైన దేశాల సహకారం కోల్పోయి ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే అవకాశముంది. ఈ విషయం క్యూబన్లకు ఇంకా పూర్తిగా తెలియదు. 1959 జనవరి ఒకటిన నిర్మించిన రాజకీయ సార్వభౌమ పునాదులు భద్రపరచాలనుకుంటే సర్వస్వతంత్రమైన ఆర్థిక విధానాలను మనం రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడు మనం అదే బాటలో పయనిస్తున్నాం. ఆర్థిక స్వాతంత్ర్యం కాపాడుకునేందుకు నిత్యం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం క్రియాశీలంగా లేకపోతే ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ఛిన్నాభిన్నమయ్యే ప్రమాదముంది. క్రమంగా దేశం ఆర్థిక బానిసత్వాన్ని చవిచూడాల్సి రావచ్చు. అయితే ఆయా దేశాల సామాజిక వ్యవస్థ, పాలనా సిద్ధాంతాలపై ఈ పరిణామాలు ఆధారపడి ఉంటాయి.

ఇప్పటి తక్షణావసరం ఈ రెండు అంశాలను అర్థం చేసుకోవడం. హింసాత్మక చర్యలు, సమ్మెలతో దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించడం ఈ రోజుల్లో కష్టతరమైన కార్యం. ఇంగ్లీష్, ఫ్రెంచి సైన్యాలు పోర్టు సయిద్ (ఈజిప్టు)పై దురాక్రమణకు పాల్పడడం ఇందుకో

నిదర్శనం. అయితే ముందులాగా అమెరికన్ మెరైన్లను ఏ ప్రాంతానికీ తరలించడం ఇప్పుడు సాధ్యం కాదు. ఒక స్వతంత్ర దేశాన్ని ఆక్రమించడం కంటే అబద్ధాల ముసుగును తగిలించుకోవడం చాలా సులభం. ఎందుకంటే ఆక్రమణలతో కొన్ని వాణిజ్య సంస్థల గుత్తాధిపత్యానికి తీవ్రమైన విఘాతం కలుగుతుంది. ఐక్యరాజ్యసమితి ఏర్పడిన తర్వాత ఇతరదేశాల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవడం కూడా ఇప్పుడు కష్టమవుతుంది. ఆక్రమణ చాలా దూరమైన విషయం.

జాతీయ, అంతర్జాతీయ విమర్శలను, ఆందోళనలను చల్లార్చడం అంత సులువు కాదు. బూటకపు ప్రచారం, అబద్ధాలతో  ఇతర దేశాలలో జోక్యం చేసుకోవచ్చు. అయితే అది కూడా విమర్శలనెదుర్కొనే అవకాశాలే ఎక్కువ. అయితే ద్రోహపూరిత, మోసపూరిత చర్యలతో దురాక్రమణకు సామ్రాజ్యవాద శక్తులు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. క్యూబాను కూడా ఏదో విధంగా లొంగదీసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకే క్యూబన్లు సమైక్యంగా ఈ దురాక్రమణ చర్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఆర్థికంగా కూడా మన దేశాన్ని బలహీనపర్చడానికి కుట్ర పన్నుతున్నారు. ఈ సమయంలో మన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రజలను విశ్వాసంలోకి తీసుకుని సామ్రాజ్యవాద శక్తుల కుట్రలను భగ్నం చేయాల్సిన అవసరం ఉంది. భౌతికంగా దాడి నిర్వహించినా దానిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సిద్ధం కావాలి. వారు దాడి చేయాలనుకున్నా పెద్ద ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి అందుకు సంసిద్ధం గాకపోవచ్చు. దేశంలోని విప్లవ ప్రభుత్వాన్ని, ఆర్థిక వ్యవస్థను అవసరమైతే రక్తపు మడుగులో ముంచడానికి వారు కుతంత్రాలు పన్నుతున్నారు. రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని మన దేశం నిలుపుకోవడం వారికే మాత్రం ఇష్టం లేదు. అయితే దేశ ప్రజలు ఇప్పుడు రాజకీయంగా ఎంతో పరిణతి చెందారు., అభ్యుదయ మార్గంలో నడుస్తూ తమ స్వేచ్ఛ, స్వాతంత్రాలను పటిష్టపర్చుకుంటున్నారు.

విప్లవపోరుతో మనం రాజకీయాధికారం సాధించాం. ఇప్పుడు విముక్తి కోసం, ప్రజల అధికారం కోసం శ్రమిస్తున్నాం. ప్రజల ఆశయాలు, వారి హక్కులను కాపాడాలంటే ఆర్థిక స్వాతంత్ర్యం ఎంతో ముఖ్యం. అదే జరగకుంటే దేశ సార్వభౌమత్వం కూడా నిలువజాలదు. ప్రభుత్వ విభాగాలే ప్రజాధికారం కాదు. ఆర్థిక విభాగాలు కూడా వారి

చేతుల్లో వుండాలి. విప్లవాధికారం లేదా రాజకీయ సార్వభౌమత్వం ఆర్థిక వ్యవస్థను జయించడం ద్వారానే పరిపూర్ణమవుతుంది. అప్పుడే దేశ సార్వభౌమత్వానికి సార్థకత చేకూరుతుంది. ఈ దశకు చేరుకోవాలంటే విప్లవ ప్రభుత్వమే ప్రధాన భూమిక వహించాల్సి ఉంటుంది. క్యూబా ప్రజలకు నిజమైన అధికారాన్ని కట్టబెట్టాల్సి ఉంటుంది, మన దేశ ఖనిజ సంపద, వ్యవసాయ దిగుబడిపై ప్రజలకే పూర్తి హక్కు కల్పించాల్సి ఉంటుంది.

అమరవీరులపై ప్రమాణం చేసి ఇప్పుడు క్యూబా ఆర్థికంగా సర్వస్వతంత్రమైందని చెప్పలేము. ఒక్క రవాణా నౌకను అమెరికా నావికాదళం పట్టుకుంటే ఇక్కడ మొత్తం ఉత్పత్తి నిలిచిపోయే పరిస్థితి ఉన్నప్పుడు ఆ విధంగా ప్రకటించడం అవివేకమే అవుతుంది. గుత్తాధిపతుల ఒక్క చర్యతో ఇక్కడి పారిశ్రామిక సంస్థలు మూతపడే అవకాశం ఉంది. క్యూబా తన సహజవనరులను, ఖనిజసంపదను సక్రమంగా వినియోగించుకొని, సరైన వాణిజ్య పొత్తులు కుదుర్చుకొని, ఆచరణాత్మకమైన ఆర్థిక విధానాలను అవలంబిస్తే ఆర్థికంగా దేశం స్వతంత్రం కావడానికి వీలుపడుతుంది. పరాయిదేశం జోక్యం చేసుకున్నా దేశీయ పరిశ్రమలు మనుగడ సాధించగలిగినప్పుడే మనం ఆ దశకు చేరుకున్నామని భావించవచ్చు. అలాగే వ్యవసాయోత్పత్తి కూడా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందాలి.

ఒక విషయాన్ని మాత్రం ఇప్పుడు ఖచ్చితంగా చెప్పగలను. క్యూబా తన రాజకీయ సార్వభౌమత్వాన్ని సాధించిన రోజు 1959 జనవరి ఒకటి. విప్లవంలో ఇది కేవలం తొలి అడుగు మాత్రమే. ప్రజల విమోచన కోసం ఇప్పుడే పోరాటం మొదలైంది. క్యూబాకే ఇది కొత్త అధ్యాయమని చెప్పను, ఇది లాటిన్ అమెరికా అంతటికి నూతన శకమని నేను భావిస్తున్నాను.

1953 జూలై 26, 1933 ఆగస్టు 12, 1895 ఫిబ్రవరి 24 లేదా 1868 అక్టోబర్ 10 సంఘటనల పర్యావసానమే 1959 జనవరి ఒకటిన లభించిన స్వాతంత్ర్యం. లాటిన్ అమెరికా చరిత్రలో ఇదో కొత్త మలుపు. ఇది 1809 మే 25న మద్రిల్లో తిరుగుబాటు, 1810 మే 25 బియోనాస్ ఏయిర్స్ కాబిల్డో అబయర్తో దినం, ఇంకా ఇతర పోరాటాలకు కొనసాగింపు కూడా కావచ్చు.

జనవరి ఒకటి విప్లవం క్యూబా ప్రజల నిస్వార్థ బలిదానంతో సాధ్యమైంది. దీన్ని తరతరాల వారు తమ పోరాటాల ద్వారా సాధించుకున్నారు. ఇప్పుడు ఆర్థిక

స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. క్యూబా రాజకీయ స్వాతంత్ర్యాన్ని ఎవరూ కొల్లగొట్టలేరు, విప్లవాన్ని రక్తపు మడుగులో ముంచలేరు. వేయలర్ వారసులైన బాటిస్తాల పతనాన్ని జనవరి ఒకటి సూచిస్తుంది. అలాగే తొలి రిపబ్లిక్ ఏర్పాటు చేసిన దినంగా చరిత్రలో నిలిచిపోతుంది. జోస్ మార్టి మొదలు అనేకమంది అమరవీరుల త్యాగఫలం జనవరి ఒకటి. ఎప్పటిలాగే క్యాస్ట్రో ప్రజల పక్షాన పోరాడుతూ, విప్లవ దశను ఆయా పరిస్థితులకు అనుగుణంగా నిర్దేశించేవారు. వ్యక్తిగత ప్రయత్నాల కంటే సామూహిక చర్యలే ఉద్యమాన్ని బలోపేతం చేస్తాయని ఆశయంగా విశ్వసించేవారు. ఫలితంగానే విప్లవ సైన్యం ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

గ్రాన్మా తీరం చేరాక మిగిలిన అతి కొద్దిమంది విప్లవకారులతో క్యూబాలో ఉద్యమాన్ని నిర్మించారో అదే స్ఫూర్తితో ముమ్మందు సవాళ్లను ఎదుర్కోవడానికి క్యాస్ట్రో సిద్ధమవుతున్నారు. అందుకోసమే ప్రజలలో ఆయనపై ఎనలేని విశ్వాసం ఏర్పడుతోంది. తమ ఆశయాలు నెరవేరతాయన్న కృతనిశ్చయంతో వారున్నారు. కేవలం సియర్రా మాయెస్ట్రా ప్రాంతానికి ఈ సంఘర్షణ పరిమితం కాదని వారికి స్పష్టంగా తెలుసు. ఇందులో ప్రతి స్త్రీ, పురుషుడు ఉత్సాహంతో పాల్గొనాల్సిన అవసరం ఉంది.

ఆర్థిక స్వాతంత్ర్యం కోసం జరుగుతున్న ఈ పోరులో ప్రజలు ఐకమత్యంగా పాల్గొని విజయమో, వీర స్వర్గమో పొందాలనేదే క్యాస్ట్రో లక్ష్యం. మన ముందున్న సవాళ్లు సంక్లిష్టమైనవి. అయితే ఈ పోరాటంలో లక్షలమంది పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నారు. లాటిన్ ప్రజల ఆశయం ఇదే అయినా దురదృష్టవశాత్తు కేవలం క్యూబా ప్రజలే పోరాటం చేయాల్సిన పరిస్థితి నేడు నెలకొంది.

అయితే, క్యూబా ఈ సంఘర్షణలో ఓడిపోయిందే అనుకోండి, లాటిన్ అమెరికా అంతటా ఇదే పరిణామం వస్తుందని ఆందోళన చెందాల్సిన అవసరమే లేదు. కాని క్యూబా ఇందులో విజయం సాధిస్తే లాటిన్ దేశాలన్నీ గెలిచినట్లేనని భావించాలి. అందుకే క్యూబాకు అంత ప్రాముఖ్యత ఏర్పడింది. సామ్రాజ్యవాద శక్తులు మనపై డేగ కన్ను వేసి ఉంచారు.

1956లో విప్లవ సైన్యం ప్రధాన లక్ష్యం బాటిస్తాలను పదవీచ్యుతులను చేయడం. ప్రజాస్వామ్యం, సార్వభౌమత్వాన్ని ఏర్పాటు చేయడం. 1952 మార్చి 10 నుండి క్యూబా అంతటా సైనిక స్థావరాలు లేక మోహరింపులు ఎక్కువయ్యాయి. దేశమంత

యుద్ధక్షేత్రమైంది. ప్రభుత్వ సైనిక దళాలు తిరోగమనశక్తుల రాజకీయాధికారాన్ని కాపాడటంలో మునిగిపోయాయి. భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, ధనికవర్గాలు బాటిస్తాలకు దన్నుగా నిలిచారు. విప్లవ లక్ష్యం నియంతృత్వాన్ని కూలదోయడం. అయితే విప్లవాధికారంతో పాటు ఆర్థిక స్వాతంత్ర్యం కూడా ఎంతో అవసరమని అప్పుడే గ్రహించాం.

1930వ దశకంలో జరిగిన తప్పిదాలను పునరావృతం చేయదలచుకోవడం లేదు. కేవలం నియంతను నిర్మూలించినంత మాత్రాన లక్ష్యం నెరవేరినట్లు కాదని, ఆ వ్యవస్థను బలపరిచే సామాజిక వర్గాల ప్రతినిధులను కూడా అణచివేస్తేనే సత్ఫలితాలు ఉంటాయని గ్రహించాం. ఈ ఆలోచన కంటే విప్లవాత్మక చర్య మరొకటి ఉండదని భావించాం. శత్రు వర్గ మూలాలను వెదికి వాటిని నిర్మూలించడానికి ప్రాధాన్యతనిచ్చాం. మార్టి ఆలోచనలకు క్యాస్ట్రో కార్యరూపం ఇచ్చారు.

ఒకప్పుడు మా వ్యూహాలన్నీ కీలకమైన రక్షణ స్థావరాలపై సామూహిక దాడులు జరిపి ఆక్రమించుకోవడంపైనే కేంద్రీకృతమైతే నేడు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి, ఎగుమతులలో వృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి నేడు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడానికి నడుం బిగించాం.

ఇప్పుడు ఆర్థిక రంగం యుద్ధక్షేత్రమైంది. విద్య, వైద్యంపై కూడా ప్రధానంగానే దృష్టి సారించాం. విద్య ద్వారా సుశిక్షితులైన క్యూబన్లను ఆర్థికపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి తయారు చేయాలని భావిస్తున్నాం. నన్ను నేను ఒక సైనికునిగా, ప్రజాసేనానిగా భావిస్తాను. అయితే ఆర్థిక రంగాన్ని చక్కదిద్దే పనిని నాకు అప్పగించాడు. నేనో పెద్ద ఆర్థికవేత్తనన్నట్టు నటించాను. ఇతర విప్లవకారుల వలె, నేను కూడా ఈ కొత్త యుద్ధప్రదేశానికి వచ్చాను జాతీయ ఆర్థిక వ్యవస్థను ఎలా బలోపేతం చేయాలన్న ఆలోచన నన్ను తొలచివేస్తోంది. ఎందుకంటే ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడంపైన విప్లవ విజయం ఆధారపడి ఉంది.

యుద్ధరంగానికి, ఆర్థిక రంగానికి స్పష్టమైన తేడాలున్నాయి. ఆర్థిక క్షేత్రంలో కేవలం స్థావరాల స్వాధీనంపైనే దృష్టి ఉంటుంది. ఇందుకు సమగ్రమైన, ఆచరణాత్మకమైన ప్రణాళికలు, శ్రమ, ఓపిక చాలా అవసరం. ఈ సంఘర్షణ ఫలితాలు కొన్ని వారాల్లోనో, నెలల్లోనో సాధించడానికి వీలుపడదు. ఈ పోరాటంలో వివిధ రకాల ఆయుధాలను వినియోగించాల్సి ఉంటుంది. పారిశ్రామికాభివృద్ధికి కార్మిక వర్గాలు తమ వేతనాల్లో నాలుగు శాతాన్ని కేటాయించాల్సి ఉంది. సహకార సంఘాలు, రసాయన, లోహపరిశ్రమలను

స్థాపించాల్సి ఉంది. ఆర్థిక రంగంలో విజయం సాధించగలిగితేనే దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోగలమన్నది ప్రతి ఒక్కరూ గ్రహించాలి.

ఒక మంచి కార్యాన్ని సాధించాలంటే కొన్ని త్యాగాలు చేయక తప్పదు. ఈ ఆలోచనతోనే గుత్తాధిపత్యాన్ని రద్దు చేయాలని భావిస్తున్నాం. ఇప్పుడు గుత్తాధిపత్యం వహిస్తున్నదంతా అమెరికన్ సంస్థలు, వ్యాపారవేత్తలే. అలాగే మన పోరాటం శక్తివంతమైన మన పొరుగు రాష్ట్రంతోనే అని, అది ఎంతో దుర్భరమైనదని అర్థం చేసుకోవాలి.

విప్లవం సాధించిన తర్వాత ఆర్థిక పరిస్థితిని విదేశీ పెట్టుబడులతో చక్కదిద్దగలమనే ఆలోచన సరైనది కాదని క్యాస్ట్రో స్పష్టం చేశారు. గుత్తాధిపత్యం నుండి మన కార్మికుల, కర్షకుల జీవితాలను ఎలా విముక్తి చేయగలమనే దిశగానే మనం చర్యలు చేపట్టాలని ఆయన నిర్దేశించారు. ఇందుకోసం త్యాగాలు చేయడానికైనా ప్రజలు సిద్ధం కావాల్సి ఉంది. గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తే దేశం విప్లవ బాటలో కాకుండా బానిసత్వంలోకి వెళుతుందనే విషయాన్ని మరచిపోరాదు. దీని కోసం ఓ కొత్త బాటను నిర్మించాల్సి ఉంది. తొలుత భూమిపై కొందరి ఆధిపత్యాన్ని నిర్మూలించి, భూమిలేని పేదలకు దానిని పంచిపెట్టాలి. భూసంస్కరణలు తక్షణమే అమలు చేసి భూస్వామ్య వ్యవస్థనే నిర్మూలించాలి. రసాయన, ఇంజనీరింగ్, చమురు పరిశ్రమలపై విదేశీ వాణిజ్య సంస్థల గుత్తాధిపత్యాన్ని తొలగించాలి.

భూసంస్కరణల విషయానికి వస్తే కేవలం (1.5) ఒకటిన్నరశాతం మంది ప్రజలు (క్యూబన్లు, విదేశీయులు) సుమారు 46 శాతం భూమిపై హక్కు కలిగి ఉన్నారు. మరోవైపు 70 శాతం జనాభా కేవలం 12 శాతం భూమిపై హక్కు కలిగి ఉంది. ఈ పరిస్థితిలో విప్లవాత్మకమైన మార్పు తీసుకురావాలి. ప్రతి రైతు కుటుంబానికి కనీసం రెండు హెక్టార్ల భూమి ఉండాలన్నదే మా లక్ష్యం. కామాగువేలో ఐదారు చక్కెర కర్మాగారాలు సుమారు 56 వేల హెక్టార్ల భూమి కలిగి ఉన్నారు. ఇలాంటి ఆధిపత్యాన్ని సహించే ప్రసక్తే లేదు.

అలాగే పరిశ్రమలు, రసాయనాలు, ఖనిజాలపై కొన్ని సంస్థలకే ఆధిపత్యం ఉంది. దీనిని చక్కదిద్ది, సంపదను దేశ ప్రజలంతా పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అమెరికన్ వాణిజ్య సంస్థల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించాల్సి ఉంది. దేశ సంపదను విదేశీయులు కొల్లగొట్టకుండా చర్యలు తీసుకుంటాం.

గృహ నిర్మాణ రంగంలో ఉన్న సమస్యలను, గుత్తాధిపత్య విధానాలను పరిష్కరిస్తాం. దేశీయ సంస్థలే ఈ రంగంలో ఉన్నప్పటికీ అమెరికన్ తరహా వ్యవస్థను కొనసాగించడం మాకు ఇష్టం లేదు. దోపిడీ వ్యవస్థకు, విధానాలకు మేము పూర్తి వ్యతిరేకులం. దేశీయ వాణిజ్య రంగాన్ని కూడా సంస్కరించాల్సి ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయాల్సి ఉంది.

వినిమయ వస్తువుల ధరలు క్రమంగా పెరిగిపోతున్నాయి. ఈ విషయం రైతులు, శ్రామికులకు బాగా తెలుసు. ధరలను స్థిరీకరించడానికి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికైతే ప్రభుత్వరంగ సంస్థల ఆధిపత్యాన్ని తగ్గించగలిగాం. ఇందుకు విద్యుచ్ఛక్తి, దూరసంచారశాఖలే నిదర్శనం. గుత్తాధిపత్యం కేవలం ఆర్థిక వ్యవహారాల్లోనే కాక రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో కూడా కొనసాగుతోందనేది క్యూబన్లకు స్పష్టంగా తెలుసు. వీటిపై కూడా విప్లవ నాయకత్వం దృష్టి సారించింది.

విదేశీ వాణిజ్య రంగంలో ప్రధానంగా ఉన్న గుత్త వ్యవస్థను రూపుమాపడానికి చర్యలు తీసుకుంటున్నాము. ప్రత్యేకంగా చక్కెర, రసాయన పరిశ్రమల ఏకచ్ఛత్రాధిపత్యాన్ని నిర్మూలిస్తాం. చక్కెర ఎగుమతులకు కొత్త ఒప్పందాలు కుదుర్చుకున్నాం. అయితే డాలర్ల రూపంలో మనకు విదేశీ మారకద్రవ్యం లభించడం లేదన్నది వాస్తవం. డాలరే సర్వసం కాదు. కేవలం విదేశీ కొనుగోళ్లకే అది పరిమితమైంది. చక్కెరనే మనం డాలర్‌గా వాడుకుంటున్నాం. దిగుమతులకు చక్కెర రూపంలో మారకాన్ని చెల్లిస్తున్నాం. రష్యాతో ఒప్పందం కుదిరిన కారణంగా మనకు అమెరికా సంస్థల కంటే 33 శాతం తక్కువ ధరకు చమురు కొనుగోలు చేసే అవకాశం లభించింది. ఆర్థిక విముక్తి పోరాటంలో ఇదో అధ్యాయం.

రష్యాతో కుదిరిన వాణిజ్య ఒప్పందాలు కేవలం రాజకీయ పరమైనవని కొందరు ఆరోపించారు. కేవలం అమెరికాకు వ్యతిరేకంగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నామని చెబుతున్నారు. ఇందులో కొంత వాస్తవమున్నప్పటికీ అది పెద్ద తప్పిదమేమి కాదు. రష్యా ఉద్దేశాలు ఏమైనప్పటికీ మన జాతీయ ప్రయోజనాలు నెరవేరినంత కాలం మనకెలాంటి సమస్యా లేదు. క్యూబా విషయానికి వస్తే మేము కేవలం ఉత్పత్తులను మాత్రమే అమ్ముతున్నాం, జాతీయాభిమానాన్ని, సార్వభౌమత్వాన్ని కాదు. క్యూబా ప్రపంచదేశాలతో సమానంగా ఎదగడానికి ప్రయత్నం చేస్తోంది.

ఆయా దేశాల ప్రతినిధులు క్యూబా పర్యటించినపుడు పరస్పర సహకారం, సమానత్వం గురించే మాట్లాడుతున్నారు. జనాభా, వైశాల్యం పరిమితులు లేకుండా దేశాల మధ్య సమాన స్థాయిలో చర్చలు, ఒప్పందాలు కుదరాలని క్యూబా భావిస్తోంది. అన్ని దేశాల వలె క్యూబాకు కూడా ఐక్యరాజ్యసమితిలో ఓటుహక్కు ఉంది. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇదే స్ఫూర్తితో మేము ముందుకు సాగుతున్నాం.

ఇక్కడ మార్టి చెప్పిన విషయాన్ని గుర్తు చేయదలచుకున్నాను. " కొనుగోలు చేసే దేశాలు శాసిస్తే, అమ్మే దేశాలు వాటిని శిరసావహిస్తాయి".

రష్యాతో జరిగిన వాణిజ్య ఒప్పందాలు క్యూబన్లకు ఎంత లాభకరమో కాస్ట్రో వివరిస్తున్నపుడు, ఆయన వివరణలో క్యూబా ప్రజల మనోభావాలు ప్రతిబింబిస్తాయి. మన కిష్టమైన దేశంతో మనం ఒప్పందాలు కుదుర్చుకోవచ్చన్న ధైర్యం ప్రజలు మరింత స్వతంత్రులమయ్యామనే భావన కలిగిస్తోంది. రష్యా మనకు అందిస్తున్న రుణాలపై కేవలం 2.5 శాతం వడ్డీ మాత్రమే విధిస్తోంది. ప్రపంచ వాణిజ్య చరిత్రలో ఇంత తక్కువ వడ్డీతో రుణం పొందిన దేశం ఏదీ లేదు. అయితే ఈ రుణం కేవలం రష్యా పారిశ్రామిక ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి మాత్రమేనన్న విషయం వాస్తవం. అమెరికా ఆర్థిక సంస్థలు కూడా ఇవే రకమైన షరతులు విధిస్తాయన్నది అందరికీ తెలుసు. వారిచ్చే రుణాలపై వడ్డీ కూడా అధికంగానే ఉంటుంది. ఇందుకు ఎగుమతి బ్యాంక్ విధానాలే నిదర్శనం. విదేశీ రుణాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలహీనపడే అవకాశం కూడా ఉంది. చక్కెర, ఇతర రసాయనాల ఎగుమతులు చేస్తున్నా వాటికి ప్రతిఫలంగా అంతే విలువైన యంత్రాలను, ఇతర వినిమయ వస్తువులను దిగుమతి చేసుకుంటున్నాము. ఈ వ్యవహారంలో దేశానికి లాభమే చేకూరుతోంది కాని నష్టమేమి రావడం లేదు.

సామ్రాజ్యవాద దేశాల వాణిజ్య సంస్థలు దేశంపై గట్టిపట్టు సాధించడానికి ప్రయత్నిస్తాయి. చివరి దశలో ప్రజలను బానిసలుగా మార్చడానికి చూస్తాయి. అపుడు మనం రాజకీయ స్వాతంత్ర్యం కూడా కోల్పోవలసి ఉంటుంది. ఈ పరిస్థితి క్యూబాకు దాపురించకూడదనే కృతనిశ్చయంతో నాయకత్వం ఉంది. వాణిజ్య ఒప్పందాలు మన దేశానికి ముప్పు తెస్తున్నాయని కొందరు మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారు. వారు అసలు విషయాన్ని గ్రహించడం లేదు.

అంతర్జాతీయ వ్యవహారాలలో కూడా క్యూబా రష్యా కూటమికి మద్ధతు పలుకుతోంది కేవలం సామ్రాజ్యవాదం, ఆర్థిక బానిసత్వానికి వ్యతిరేక భావంతోనే. అలాగే

విశ్వశాంతి కోసం ఐక్యరాజ్య సమితిలో పోరాడుతున్నాం. ఐరాస సిద్ధాంతాలకు అనుగుణంగా తన సిద్ధాంతాలను అమలు చేస్తున్నందునే క్యూబా నేడు విమర్శలు ఎదుర్కొంటోందని ఈ మధ్యనే కాస్ట్రో పేర్కొన్నారు.

వాణిజ్య, ఆర్థిక వ్యవహారాలు, ఒప్పందాలను సమర్ధిస్తూ మన వాణిజ్యశాఖ మంత్రి బలమైన వాదనే వినిపించారు. ఆరోపణల్లోని సైద్ధాంతిక లోపాలను స్పష్టంగా ఎత్తి చూపారు. ధరలకు సంబంధించి, చక్కెర ధర అంతర్జాతీయ మార్కెట్టుపైనే ఆధారపడి ఉంటుంది. అలాగే డిమాండ్ కూడా ధరను నిర్ణయిస్తుంది. ఈ విధానాలకు లోబడే మనం చక్కెర ధరను నిర్ణయిస్తున్నాం. మన చక్కెరను తిరిగి ఐరోపా మార్కెట్‌లో పెట్టి రష్యా అధిక లాభాలు గడుస్తోందన్న విమర్శల్లో ఎలాంటి నిజం లేదు.

ఒక మాట వాస్తవం. చక్కెర మన నుంచి దిగుమతి చేసుకున్న తర్వాత రష్యా దానిని మరింత శుద్ధి చేసి సంపన్న దేశాలకు విక్రయిస్తుంది. ఇందులో క్యూబా నష్టపోయేదంటూ ఏదీ లేదు. ఇపుడు అమెరికన్ కాంగ్రెస్‌లో మన వాణిజ్య విధానాల గురించి, ఆర్థిక రంగంలో రష్యా సాధిస్తున్న పురోగతి గురించి చర్చించుకుంటున్నారు. సోవియట్ రష్యా గురించి వారే ఆలోచన చేస్తున్నపుడు క్యూబా ఎందుకు చేయకూడదు. అదీ గాక రష్యా మనకు రాతపూర్వకమైన హామీ కూడా ఇచ్చి ఉంది. మన చక్కెరను ఇకపై కేవలం దేశీయంగానే వినియోగిస్తామని ఆ దేశం స్పష్టం చేసింది. ఇదంతా జరుగుతున్నపుడు మనమెందుకు ఆందోళన చెందాలి. ఈ విషయమై పత్రికలు, ఇతర వర్గాలు వ్యతిరేక ప్రచారం చేయడం మానుకోవాలి. ఈ వ్యవహారం వల్ల క్యూబాపై అంతర్జాతీయ వేదికల్లో అనుమానాలు తలెత్తే ప్రమాదముంది. అలాగే చక్కెర ధర పడిపోయే అవకాశముంది. విప్లవ వ్యతిరేక చర్యలే ఇవన్నీ అని భావించాల్సి ఉంటుంది. బూర్జువా వర్గాలు తమ ప్రత్యేకమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ హక్కులు కోల్పోతున్నామన్న కసితో ఈ వ్యతిరేకత కనబరుస్తున్నాయి.

చక్కెర ధర గురించి అమెరికా ప్రతినిధి లింకన్ ప్రైస్ ఒక అనవసరమైన వ్యాఖ్య చేశారు. తాము అదనంగా చెల్లిస్తున్న 150 మిలియన్ డాలర్లు క్యూబాకు బహుమతిగా ఇస్తున్నదేనని ప్రకటించారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదు. అమెరికాతో కుదిరిన ఒప్పందం ప్రకారం చక్కెర ఎగుమతి ద్వారా వచ్చే ఆదాయాన్ని దాదాపుగా అమెరికన్ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికే వినియోగించాల్సి ఉంటుంది. దీని వల్ల పదేళ్లలో క్యూబా ప్రజలు దాదాపు బిలియన్ డాలర్ల అమెరికన్ ఉత్పత్తులు, సేవలు పొందే అవకాశం ఉంది. ఈ డబ్బంతా అమెరికన్ వాణిజ్య సంస్థలే పొందుతాయి. ఈ వ్యవహారాన్ని

మేము కొనసాగించదలచుకోలేదు. క్యూబా ప్రజల డబ్బు అమెరికన్ ప్రజల చేతుల్లోకి వెళితే మాకెలాంటి అభ్యంతరం లేదు. అయితే పెద్ద పెద్ద వాణిజ్య సంస్థలు, పరిశ్రమలకే లాభం కలిగేలా వాణిజ్య ఒప్పందాలుంటే వాటిని పునఃపరిశీలిస్తాం. అమెరికా మనకు రుణంగా ఇచ్చిన మొతంపై 61 శాతం వడ్డీ విధిస్తోంది. అయితే ఇవి స్వల్పకాలిక రుణాలే కావడం వల్ల పెద్దగా నష్టపోయే ప్రమాదం లేదు. అదే దీర్ఘకాలిక రుణాలైతే వడ్డీ చెల్లించడానికే దేశ ఆదాయమంతా వ్యయం చేయాల్సి వచ్చేది.

మార్టి ఆలోచనల ప్రకారం నడుచుకుంటూ ఆర్థిక వ్యవహారాలు, వాణిజ్య ఒప్పందాలు, ఎగుమతుల విధానంలో మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాము. కేవలం ఒకే ఒక్క దేశంపై ఆధారపడి ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టాలనుకోవడం లేదు. విదేశీ వాణిజ్యాన్ని సంస్కరించడమే కాక దేశీయ ఉత్పత్తులను పెంచి స్థానికంగానే వాటిని వినియోగించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాము.

ఈ దశలో క్యూబా ముందుకు సాగుతోంది. చరిత్రలో ఇపుడు క్యూబాకు ఘనమైన స్థానమే ఉంది. లాటిన్ ప్రజలందరూ క్యూబావైపు చూస్తున్నారు. తిరోగమన శక్తులు తమ దేశాలలో తలెత్తుతున్న విప్లవాలకు క్యూబానే దోషిగా నిలబెడుతున్నాయి. మేము ఇంతకు ముందే స్పష్టంగా చెప్పాం. క్యూబా విప్లవాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయదని, ఆయా దేశాలలోని రాజకీయ, సామాజిక వైరుధ్యాల వల్లే ఉద్యమాలు చోటు చేసుకుంటున్నాయి. అంతర్జాతీయ రాజకీయాల పేరిట మా విప్లవ భావజాలాన్ని ఎగుమతి చేయాలన్న ఆలోచనే మాకు లేదు.

ప్రజాస్వామ్యం ముసుగులో ఇతర దేశాలలో జోక్యం చేసుకుంటున్న సామ్రాజ్యవాద శక్తులు, ప్రజలు నిజమైన స్వాతంత్ర్యం కోరితే అనవసరమైన ఆందోళనకు గురవుతున్నాయి. విప్లవం ఏదో పెద్ద నేరమన్నట్లు వారు వ్యవహరిస్తున్నారు. లాటిన్ దేశాలకు క్యూబా స్ఫూర్తిగా నిలుస్తోందని భావించిన ఈ శక్తులు మన దేశాన్ని అణగదొక్కాలని చూస్తున్నాయి. మన్రో సిద్ధాంతాన్ని క్యూబాకు వర్తింపజేయడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే సెనేట్‌లో మన్రో ప్రవేశపెట్టిన ప్రతిపాదన తిరస్కరించబడింది. మన్రో ప్రతిపాదన అత్యంత హేయమైనది. అది సామ్రాజ్యవాదాన్ని బాహాటంగా బలపరుస్తున్నట్లుగా ఉంది. అమెరికన్ ప్రజలకు తలవంపులు తెచ్చేదిగా ఉంది.

మన్రో ప్రతిపాదనలోని ఒక ముఖ్య అంశాన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. " లాటిన్ ఖండంలో అమెరికా తప్ప ఇతర దేశాలు లాటిన్ ప్రజలను బానిసలుగా చేయడానికి

వీలు లేదు" ఇంకో విషయం కూడా ఇందులో ఉంది. ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్‌తో సంబంధం లేకుండా అమెరికా ఏ దైశంలోనైనా సైనికపరంగా జోక్యం చేసుకోవచ్చు. ఇదంతా చూస్తుంటే ఈ ఖండ ప్రజలు ఆర్థికంగా విముక్తి కావడం అమెరికాకు ఇష్టం లేనట్లుంది. ప్రస్తుతం మనకు సమయాభావం ఉంది. విదేశీ మారకాన్ని ఎలా ఆర్జించాలన్న విషయమై దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. ఫిబ్రవరి 4న కార్మికులు తమ వేతనాలనుండి విరాళంగా ఇచ్చిన వాటాను స్వీకరించిన సందర్భంగా కాస్ట్రో మాట్లాడుతూ " విప్లవం సంభవించిన నాటికి విదేశీ మారకమంతా ఆవిరైపోయింది. ప్రజలు దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడేవారు. ఇపుడు మనం పొదుపు పాటించడంతో పాటు ఎగుమతుల లక్ష్యాన్ని కూడా పెంచుకోవాలి" అని పిలుపునిచ్చారు.

ఇప్పుడు పొదుపుపై దృష్టి పెట్టాం. అలాగే విదేశీ మారకాన్ని సాధ్యమైనంత వరకు పొదుపు చేయాలని, దానిని అత్యంత జాగ్రత్తగా వాడుకోవాలని నిర్ణయించాం. పెట్టుబడిదారీ విధానాలను పూర్తిగా రద్దు పరచి దేశీయ పరిశ్రమలను అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. దిగుమతులకు పెట్టుబడులు కావాలి కాబట్టి దేశీయ పెట్టుబడులనే ప్రోత్సహించాలని నిర్ణయించాం. విదేశీ వ్యక్తిగత పెట్టుబడులు ఉదారంగా వచ్చే అవకాశమే లేదు. లాభార్జనే వాటి ధ్యేయం. ఇందులో క్యూబా ప్రజలకు ఆర్థికంగా ఎలాంటి మేలు జరిగే అవకాశంలేదు. విదేశీ వ్యక్తిగత పెట్టుబడులు ఆ దేశపు అదనపు ఆదాయం. దాన్ని ఇతర దేశాలకు మళ్ళించి లాభాలపై లాభాలు ఆర్జించాలని చూస్తున్నారు.

వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో దాదాపు 300 మిలియన్ డాలర్లు వెచ్చించాలని నిర్ణయించాం. ఇదే సరైన మార్గమని భావిస్తున్నాం. ఆర్థికంగా క్యూబాను బలహీనపర్చడానికి కుట్రలు జరుగుతున్నాయి. మన ఎగుమతుల కోటాను తగ్గించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇవన్నీ పట్టించుకోకుండా మన ఉత్పత్తులను ఆయా దేశాలలో విక్రయిస్తూనే ఉన్నాం. బెదిరింపులకు భయపడి మన విధానాలను ఏ మాత్రం మార్చుకోదలచలేదు. ఇతర దేశాల ప్రజల శ్రమపై జీవించాలని క్యూబా భావించడం లేదు. అలాగే మన రైతాంగం, కార్మికులను ఆకలిదప్పులకు వదలివేయాలనీ కోరుకోవడం లేదు.

ఆర్థికరంగాన్ని ప్రజల అవసరాలు తీర్చడానికి, వారి అభ్యున్నతికే వాడుకోవాలని చూస్తున్నాము తప్ప లాభాపేక్ష కోసంకాదు. విద్యా, వైద్యం, గృహవసతి, గౌరవప్రదమైన జీవితాన్ని ప్రజలకు అందించడమే మా ప్రభుత్వ ధ్యేయం. సామాజిక సంక్షేమ రంగానికి

ఎక్కడి నుండి నిధులు సమకూర్చుకోగలమన్న విషయాన్ని తదుపరి కార్యక్రమంలో మరో కామ్రేడ్ వివరిస్తారు.

ఈ క్షణంలో దేశం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొందని భావిస్తున్న దుర్బలులకు ఒక్కటే విషయం చెప్పదలిచాను. ఇదో ప్రత్యేకమైన పరిస్థితి. దీనిని అధిగమించడానికి విప్లవ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుంది. ఈ విషయంలో ఎవరికీ అనుమానాలు ఉండాల్సిన అవసరం లేదు. మెక్సికోకు సంబంధించిన చమురు పరిశ్రమపై విదేశీ పెట్టుబడిదారుల పిడికిలి పట్టును వివరిస్తూ ఆర్థికవేత్త జీసస్ సిల్వా హెర్జాగ్ చేసిన వ్యాఖ్యలను ఇక్కడ ప్రస్తావిస్తాను.

“ మెక్సికో కమ్యూనిస్టు దేశమని అందరూ చెబుతారు. కమ్యూనిజం భూతం ముందుకొచ్చింది. వాషింగ్టన్ పర్యటన విషయమై మెక్సికో రాయబారి డానియెల్స్ ఒక ఆసక్తికరమైన కథ చెప్పారు. అక్కడ ఆయనను ఒక బ్రిటన్ దేశస్థుడు కమ్యూనిజం గురించి ప్రశ్నించాడు. డిగో రివేరా తప్ప మరో కమ్యూనిస్టు తనకు తెలియదని అయినా కమ్యూనిస్టు అంటే ఏమిటని డానియెల్స్ జవాబిచ్చారు. కొద్ది సేపు ఆలోచించి ఆ బ్రిటీషు పౌరుడు ఏదో సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించాడు. కమ్యూనిజం గురించి అతడు ఇచ్చిన నిర్వచనం డానియెల్స్‌కు నచ్చలేదు. మరోసారి దీర్ఘంగా ఆలోచించి ఆ పౌరుడు మరో నిర్వచనం ఇచ్చాడు. అది కూడా సంతృప్తికరంగా లేదు. ఎన్నోసార్లు ప్రయత్నించి విఫలమైన తర్వాత ఆ పౌరుడు చికాకుగా ఇలా చెప్పాడు “ మిస్టర్! మిమ్మల్ని చికాకు పెట్టే ఏ వ్యక్తైయినా కమ్యూనిస్టు కావచ్చు.”

దీనిని బట్టి చారిత్రకంగా పరిస్థితులు ఎలా పునరావృతం అవుతాయో గ్రహించవచ్చు. క్యూబా ప్రజలు అందరినీ చికాకు పెడుతున్నారని నేను బలంగా నమ్ముతున్నా. అత్యంత చికాకు కల్గిస్తున్న వ్యక్తుల్లో కాస్ట్రోతో పాటు నేను కూడా ఉన్నానని ఎంతో గర్వపడుతున్నా. మెక్సికో చమురు పరిశ్రమను జాతీయం చేసి ఎలా ముందుకు సాగిందో క్యూబా కూడా అదే బాటలో నడుస్తుంది. వ్యతిరేకులు ఏమైన చెప్పవచ్చు, ఎన్ని అర్థాలైనా తీయొచ్చు. కాని క్యూబా ప్రజలందరి అభ్యున్నతికే మేము ఇదంతా చేస్తున్నాము. ఈ విషయంలో ఎలాంటి రాజీకి ఆస్కారమే లేదు. బహిష్కృతులు, ఆస్తులు పోగొట్టుకున్న వారు మళ్ళీ క్యూబాకు వచ్చే ప్రసక్తే ఉండదు.

# వైద్య విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలనుద్దేశించి చేసిన ప్రసంగం

## (ఆగస్టు 20, 1960)

**(ప్రజారోగ్యశాఖ నిర్వహించిన చర్చాగోష్టి సందర్భంగా చేసిన ప్రసంగమిది. ఈ వేదికను కమెండర్ డాక్టర్ జోస్ మచాడో ప్రారంభించారు. క్యూబా కార్మిక సమాఖ్య కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి వందల సంఖ్యలో వైద్య విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు)**

**వి**ప్లవబాటలో నడుస్తూ తమ స్వాతంత్ర్యానికి ఆనందిస్తున్న క్యూబా ప్రజలు నిర్వహించిన వందల సభల్లో ఇదొకటి. అయితే ఈ సమావేశం ఎంతో ఆసక్తికరమైందని నేను భావిస్తున్నాను.

వైద్యునిగా నేను వృత్తి ప్రారంభించానని చాలా మందికి తెలుసు. వైద్య వృత్తిని అభ్యసిస్తున్నపుడు నాకు గొప్ప పరిశోధకుడు కావాలనే ఆకాంక్ష ఉండేది. ఇపుడు ఈ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులు, విధానాలను అప్పట్లో ఊహించనే లేదు. మానవాళి అభ్యున్నతి ఏదో ఒకటి సాధించాలన్న తపన నాలో ఉండేది. నా ఊహాలోకంలోనే నేను విహరించేవాడిని.

నా స్వభావానికి తగ్గట్టుగానే వైద్య పట్టా పుచ్చుకున్న తర్వాత నేను ఎక్కువగా ప్రయాణం చేయడం మొదలెట్టాను. లాటిన్ అమెరికా అంతటా పర్యటించి (హైతీ, డొమెనికన్ రిపబ్లిక్) అక్కడి భూభాగాన్నంతా క్షుణ్ణంగా తెలుసుకున్నాను. వైద్య విద్యార్థిగా, వైద్యునిగా నేను జరిపిన ప్రయాణాల్లో పేదరికం, ఆకలి, వ్యాధులతో బాధపడుతున్న ప్రజలతో సన్నిహితంగా మెలిగాను. పెద్దలు, పిల్లలు అన్న తేడాలేకుండా ప్రజలు అనేక రకాల జబ్బులతో బాధపడుతున్నా వైద్యం చేయడానికి సరైన సదుపాయాలు, వనరులు లేకపోవడంతో వారు తరచూ మృత్యువాత పడేవారు. వైద్య పరిశోధకునిగా కంటే వారి

సమస్యలను సమూలంగా పరిష్కరించడానికి వేరే మార్గాలు అన్వేషించాలన్న కోరిక నాలో బలపడింది.

విప్లవకారునిగా, వైద్యునిగా ప్రజలకు సేవ చేస్తూ ముందుకు సాగాను. ఈ సమయంలోనే విప్లవ వైద్యుని ఆచరణ ఎలా ఉండాలన్న విషయమై ఒక సూచికను రాసుకున్నాను. అప్పటికే అమెరికా వాణిజ్య సంస్థలు, విదేశీ వ్యవహారాల శాఖలు ప్రజలను దోపిడీ చేయడం ప్రారంభించాయి. గ్వాటిమాలాలో సామ్రాజ్యవాదులు ఏర్పరచిన కాస్టిల్లో ఆర్మాస్ ప్రభుత్వం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసేది. ప్రజల అజ్ఞానం వల్ల వారి కుతంత్రాలు ఫలించాయి.

ఆ సమయంలో ఒక మంచి రోజు చూసుకొని నేను అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోయాను. గ్వాటిమాలా వదిలాను. అయితే విప్లవ వైద్యునిగా నేను కొనసాగాలంటే ముందుగా విప్లవం తీసుకురావలసిన అవసరం ఉందని గ్రహించాను. నాకు మరికొందరు మిత్రులు జత అయ్యారు. పాలకవర్గాల దోపిడిని ఎదుర్కోవడానికి, సమసమాజస్థాపనకు, విప్లవ ప్రభుత్వం ఏర్పాటుకు వ్యక్తిగత కృషి సరిపోదని, అందుకు పీడిత ప్రజలను సమీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుసుకున్నాను. వారికి శిక్షణ ఇచ్చి సాయుధ పోరాటానికి సిద్ధం చేయాలని నిర్ణయించాను.

సమస్య మూలాలను తెలుసుకొని దాని పరిష్కారానికి సాధనాలు వెదకాల్సిన అవసరం ఉందని గ్రహించాను. సామాజిక సమస్యలు సాధించడానికి వ్యక్తిగత కృషితో పాటు ప్రజలలో చైతన్యం తీసుకురావాలని తీర్మానించుకున్నాను. విప్లవానికి ముందు వైద్యునిగా, సేనానిగా నేను నిర్వహించిన పాత్రను మరోసారి నెమరువేసుకుంటున్నాను. ఇతరులు కూడా ఒక్కసారి వెనక్కి వెళ్లి తాము ఏమీ సాధించదలచుకున్నది, సాధించిందేమి అన్న విషయాన్ని తెలుసుకోవాలి. కొత్త ఆలోచనలు, కొత్త స్వభావంతో కూడిన ప్రజలను తయారు చేసి (క్యూబా) నూతన శకం ప్రారంభించాలని లక్ష్యం పెట్టుకున్నాం.

ఇప్పుడు మరో విషయం తెలుసుకోవాలి. క్యూబాలో కొత్త తరాన్ని తయారు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. జులై 26 ఉద్యమం గురించి తెలిసిన వారికి, ఆ పోరాటంలో పాల్గొన్న వారికి ఒక విషయం స్పష్టంగా తెలిసే ఉంటుంది. కర్రలు, గడ్డపారలతో ఒక ప్రజాదళం తమ ఆయుధాలతో విప్లవసైన్యం ఓరియంటె రాష్ట్రంలో ప్రదర్శన నిర్వహించడం. అప్పట్లో మీరు తొమ్మిది లేదా పదేళ్ల బాలురై ఉండొచ్చు. అయితే అందరూ 14 ఏళ్ళ బాలుర వలె వ్యవహరించారు. సియర్రా మాయెస్త్రా చిన్నారులు ఆకలి, పేదరికానికి చిహ్నాలుగా ఉండేవారు. ఆహారలేమితో బాధపడేవారు. నాలుగైదు

టీవీ ఛానళ్ళు, వందలాది రేడియోస్టేషన్లు కలిగిన క్యూబాలో గ్రామీణప్రాంత పిల్లలు రాత్రిపూట చదువుకోవడానికి వచ్చి విద్యుత్ దీపాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు. ఆకాశంలో నక్షత్రాలు తక్కువగా ప్రకాశిస్తున్నాయని చెప్పేవారు. ఇపుడదే పిల్లలు ఉన్నత విద్యా సంస్థలలో అభ్యాసం కొనసాగిస్తున్నారు. శాస్త్ర సాంకేతిక విద్యను సైతం అభ్యసిస్తున్నారు. వీరే క్యూబా నూతన తరానికి చెందిన పౌరులు. సియర్రా, మాయెస్ట్రా తదితర మారుమూల ప్రాంతాలకు చెందిన వారే ఈ విద్యార్థులు.

ఈ చర్చావేదిక ప్రధానాంశం వైద్యులను విప్లవ పంథాలోకి తీసుకురావడం. ఎందుకంటే ఉన్నతమైన విప్లవ లక్ష్యాల సాధనకు వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు తమ పూర్తి సహకారం అందించాల్సిన అవసరం ఉంది. విద్య, వైద్యం, వ్యవసాయ భూమి ప్రజలకు చేరువకు తీసుకు రావడానికి మీరు కలసికట్టుగా కృషి చేయాల్సి ఉంటుంది. క్యూబాలో విప్లవం గొప్ప సామాజిక వైద్యం.

వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటం సాగించడానికి సామూహిక చర్యలు తీసుకోవాల్సి ఉంది. వైద్యులు ఒక ఆరోగ్యవంతమైన వ్యక్తిని తయారు చేయడానికే తమ ప్రావీణ్యాన్ని వినియోగించాలి తప్ప ఒక రోగిపై పరిశోధన చేస్తున్నట్లుగా తమ వృత్తిని నిర్వహించడం తగదు.

వైద్యశాస్త్రం ఒక రోజు అమితంగా అభివృద్ధి చెంది ప్రజలు తమ ఆరోగ్య బాధ్యతలను తామే స్వయంగా చూసుకునే పరిస్థితి వస్తుంది. వ్యాధులను నివారించి కేవలం అత్యవసర పరిస్థితుల్లో శస్త్ర చికిత్స నిర్వహించే స్థాయికి మనం చేరుకోవాలి. ఆ వైపు క్యూబా తప్పకుండా పయనిస్తుంది. ప్రజారోగ్యశాఖ ముఖ్య కర్తవ్యం వైద్యాన్ని ప్రజలందరి అందుబాటులోకి తేవడం, హానికరమైన వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవడం, ఆరోగ్య విషయాలపై ప్రజలను చైతన్యవంతులను చేయడం. ఇందుకు వ్యక్తిగత కృషి ఎంతో అవసరం. విప్లవం అంటే సామూహిక చర్య కాదు, వ్యక్తులు తమ తమ శక్తిసామర్థ్యాలను సామూహికంగా ప్రదర్శించడం. విప్లవం కేవలం వారి శక్తిని సరైన సమయంలో వినియోగిస్తుంది. ఇపుడు మన లక్ష్యం వైద్యులను సామాజిక వైద్యానికి సన్నద్ధులను చేయడం.

ప్రపంచవ్యాప్తంగా ఇపుడు సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానం పతనావస్థలో ఉన్నాయి. ఒక శకానికి తెరపడుతోంది. పీడిత ప్రజలకు క్యూబా నేడు విప్లవ నాయకత్వం వహిస్తోంది. శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న విప్లవాత్మక మార్పులను ప్రజావిముక్తికి వినియోగించాలని భావిస్తోంది. సామాజిక మార్పులు తీసుకురావాలంటే ప్రజల ఆలోచనా సరళి కూడా మారాల్సిన అవసరం ఉంది.

వ్యక్తిగత ప్రయోజనం, గుర్తింపు కోరుకోకుండా సమాజ వికాసానికి అందరూ కృషి చేసే రోజు రావాలి. వ్యక్తిగత ఆలోచనా వైఖరి మారాలంటే ప్రజలు తమను తాము సంస్కరించుకోవాలి. సమాజాన్ని సంస్కరించాలి. విప్లవ సారం తెలుసుకోవాలంటే క్యూబాలోని అన్ని ప్రాంతాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, సందర్శించి ప్రజల అనుభవాలు తెలుసుకోవలసిన అవసరం మీకుంది. వైద్యులపై ఆ భారం మరింత ఉంది. సహకార సంఘాలు, పారిశ్రామిక సంస్థల్లో ప్రజలు ఎలా పనిచేస్తున్నారో మీరు అధ్యయనం చేయాలి. ప్రజల ఆరోగ్య సమస్యలేవీ? ఏఏ వ్యాధులు వారిని ఇబ్బంది పెడుతున్నాయో తెలుసుకొని వారి సమస్యలకు సమగ్రమైన పరిష్కారం అన్వేషించాలి. వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు సామాన్య ప్రజలలో ఒకరిగా ఉంటూ సామాజిక సేవకు అంకితం కావాలి.

ప్రపంచంలో ఎలాంటి పరిణామాలు సంభవించినా వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ, వారి మనస్తత్వాన్ని తెలుసుకొంటూ, వారి బాధను దూరం చేయాల్సి ఉంటుంది. సమాజ సంక్షేమ  బాధ్యత అందరికంటే వైద్యులపైనే ఎక్కువగా ఉంటుంది.

కొద్దికాలం క్రితం కొందరు వైద్య విద్యార్థులు చదువు ముగిసిన తర్వాత హవానా నుండి గ్రామీణ ప్రాంతాలకు తరలివెళ్లి ప్రజలకు వైద్య సేవలందించడానికి విముఖత వ్యక్తం చేశారు. అక్కడకువెళ్ళాలంటే తమకు అధిక వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పాత అనుభవాల దృష్ట్యా ఇలాంటి డిమాండ్లు మళ్ళీ తలెత్తుతాయన్నది వాస్తవం. ఈ విషయం నాకు బాగా తెలుసు. వైద్యులు ఈ విధంగానే ఆలోచిస్తారని ఎప్పుడో అర్థమైంది. వారు ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. తమకు మంచిభవిష్యత్ ఉండాలని, అత్యున్నత జీవన ప్రమాణాలు కావాలని, అధికారిక గుర్తింపు కావాలని వారు పోరాటం చేశారు.

ఈ తరహా వైద్యులు కాకుండా రైతు కుటుంబాలకు చెందిన 200 లేదా 300 మంది వైద్యులు విశ్వవిద్యాలయాల నుండి బయటకి వచ్చి ఉంటే పరిస్థితి అప్పుడెలా ఉండేది?  చెప్పిన వెంటనే వారు అత్యుత్సాహంతో తమ సామాజిక వర్గానికి చెందిన ప్రజలకు వైద్య సేవలందించడానికి పరుగు తీసేవారు. జీతభత్యాలు, అదనపు సౌకర్యాల గురించి ఆలోచించేవారు కాదు. ఎంతో నిష్టతో, బాధ్యతతో తమ వృత్తిని నిర్వహించేవారు. ఇపుడు జరగనిది, వచ్చే ఐదారేళ్లలో జరగవచ్చని నేను నమ్ముతున్నా.

భవిష్యత్‌లో పరిస్థితులు మరింత దారుణంగా ఉంటాయని ఊహించి వృత్తికారులను రైతాంగ, విప్లవ వ్యతిరేక వర్గాలుగా విభజించడం సరికాదు. విప్లవ జీవితం

గడపడం కంటే మరో అనుభవం ఒక పౌరునికి గౌరవప్రదంగా ఉంటుందని నేను భావిస్తున్నాను. గ్రాన్మా నుండి కాలుమోపిన విప్లవ కారులు గతంలో ఎన్నడూ రైతులు, పేదలు మధ్య జీవితం గడపలేదు లేదా వ్యవసాయం, ఇతర శ్రామిక వ్యవహారాలతో సంబంధంలేదు. మేము వారి మధ్యనే జీవిస్తూ అనేక శ్రమలకోర్చి ఉద్యమాన్ని నిర్మించాం. పేదరికం, ఆకలి ఎలా ఉంటాయా ప్రత్యక్షంగా అనుభవించి తెలుసుకున్నాం. సియాఱ్ఱా మాయెస్ట్రాలో రెండేళ్ళు గడిపి జీవిత అనుభవాలను సొంతం చేసుకున్నాం. ప్రజలు ఎదుర్కొంటున్న చాలా సమస్యలు మాకు స్పష్టంగా అర్థమయ్యాయి.

గతంలో ఒక ధనిక రైతుకు చెందిన కోడి గుడ్డును దొంగలించే పేదవాడిని కఠినంగా శిక్షించిన మేము,  ఇపుడు సుమారు పదివేల పశువులను బలవంతంగా తోలుకెళ్లి ఉద్యమ పథంలో ఉన్న రైతాంగానికి అప్పగించి, వాటి మాంసాన్ని తినమని చెప్పాం. తమ జీవితంలో మొదటిసారిగా వారు గొడ్డు మాంసాన్ని తిన్నారు. సాయుధ పోరాటంలో మునిగిన విప్లవకారులకు ఆ పశువుల యాజమానుల హక్కులు కానరాలేదు. ఒక్క ధనవంతుని జీవితం కంటే వేలాది మంది ప్రజల బాగోగులే ముఖ్యమని భావించాం. అందునా మేము రైతాంగ, శ్రామిక కుటుంబాల నుండి వచ్చిన వారము కాదు. ఇతరుల కంటే మాకు ప్రత్యేక హక్కులున్నాయని ఎందుకు బాకా ఊదాలి? ఇతరులు కూడా తాము ప్రత్యేక వర్గానికి చెందిన వారమని ఎందుకు భావించకూడదు? వారు తమ హక్కులు తెలుసుకొని వాటిని సాధించడానికి పోరాడటంలో తప్పేముంది. సాటి మానవునికి సేవ చేయడంలో ఉన్న తృప్తి జీవితాంతం శ్రమపడి కూడగట్టే సంపాదన కంటే ఎక్కువ. ఈ విషయాన్ని ప్రతి వైద్యుడు అర్థం చేసుకొని ప్రజావిశ్వాసాన్ని చూరగొనేందుకు కృషి చేయాలి.

పాత సిద్ధాంతాలను పక్కనపెట్టి ప్రజలతో కలిసిపోవడానికి ప్రాధాన్యతనివ్వాలి. “నేను ప్రజాపక్షపాతిని. రైతులు, కార్మికులతో సంభాషించడానికే నేను ఇష్టపడతాను. ప్రతి ఆదివారం వారి నివాసిత ప్రాంతాలకు వెళ్ళి వారి కష్టాలను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాను” అని ప్రతి ఒక్కరూ భావించే రోజు రావాలి. ఇంతకు ముందు కూడా కొందరు ప్రజలకు సేవలందించారు. వారిది సేవాతత్పరత. ఇపుడు మేము పోరాడుతున్నది ప్రజల పక్షానే. సంఘీభావమే మా ఉద్యమ లక్ష్యం. ప్రజల మధ్యకు వెళ్ళడం పెద్ద త్యాగమేమి కాదు. వారికి విద్యా, వైద్య వసతి సదుపాయాలు కల్పించి తామేదో వారిని ఉద్ధరిస్తున్నామన్న అహంకారం మీలో ఉండకూడదు. వారి అజ్ఞానాన్ని అపహాస్యం చేసే విధంగా మీ ప్రవర్తన ఉండరాదు. నిష్కళంకమైన మనస్సుతో, పూర్తి ఉత్సాహంతో వారి సేవలో నిమగ్నమై ప్రజానుభవాల మహోన్నతమైన జ్ఞానాన్ని సముపార్జించాలి.

తప్పు చేస్తున్నామన్న విషయం తెలిసికూడా వాటిని మన ఆలోచనా ధోరణిలో భాగం చేసుకుంటున్నాం. ఈ పరిస్థితి మారాలి. కేవలం తార్కిక పరిశోధనా విధానాలు మార్చుకోవాలి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లాగా పేదలకు వైద్యం చేసే వ్యవస్థ మారాలి. వైద్యుడు కూడా రైతాంగంలో ఒక భాగమేనన్న భావన కలిగించాలి. వారిని జీవనశైలిని, ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలి. వారికి విద్యాబుద్ధులు నేర్పుతూ ఆరోగ్యం పట్ల పూర్తి అవగాహన ఏర్పరచాలి. ఈ సందర్భంలో వైద్యులు రాజకీయ నాయకుల పాత్ర కూడా పోషిస్తూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. మన నైపుణ్యాన్ని వారికోసం వినియోగిస్తున్నామన్న ఊహ కల్పించకుండా వారితో పాటు తాము కూడా జీవిత పాఠం నేర్చుకుంటున్నామన్న భావన కలిగించాలి. నూతన క్యూబా నిర్మాణానికి బాటలు వేయాలి.

ఈ దిశగా ఇప్పటికే ఎన్నో చర్యలు తీసుకున్నాం. వాటి ఫలితాలను సాంప్రదాయ పద్ధతిలో విశ్లేషించలేం. నియంతే కాక, అతనితో పాటు దోపిడీ రాజ్యం కూడా పతనమైందని ఇపుడు ప్రజలు పూర్తిగా అర్ధం చేసుకున్నారు. పతనమైన వ్యవస్థ నుండి ఒక నూతన శకాన్ని నిర్మించాలని ప్రతి పౌరుడూ ముందుకు సాగాలి.

అర్జెంటీనా నుండి ఇక్కడికి వచ్చిన కామ్రేడ్ నికోలాస్ గుల్లెస్ మొదటి నుండి గొప్ప కవి. ఇపుడిపుడే ఆయన రచనలు ఇతర భాషల్లోకి అనువదించబడుతున్నాయి. పాఠకుల సంఖ్యా పెరిగింది. ఆయన మొదట్లో ఎలా ఉండేవాడో ఇపుడూ అలాగే ఉన్నాడు. తన కవితల్లో ఏది ఎక్కువగా ప్రజావాణి వినిపిస్తుందో ఎన్నుకోవడం ఆయనకు ఇపుడు కష్టమైన పని. ఎందుకంటే ఏళ్ల తరబడి ఆయన ప్రజల పక్షాన కవితలు రాస్తున్నాడు. తన లక్ష్యానికి పూర్తిగా అంకితమయ్యాడు. క్యూబా ప్రజలు ఆయన సిద్ధాంతాలను కాక, ఆయన రాజకీయ అనుబంధాన్ని ఎక్కువగా గుర్తిస్తారు. ఈ విధానం సమంజసంకాదు, గతాన్ని పక్కనపెట్టి, సైద్ధాంతిక విభేదాలకు అతీతంగా జాతీయ పునర్నిర్మాణానికి అందరూ సహకరించాలి.

ప్రజలందరికీ ఒక విషయం అర్థమైంది. మనకో ప్రధాన శత్రువు ఉన్నాడని సామ్రాజ్యవాదం, గుత్తాధిపత్యంపై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించడానికి జంకుతున్నారు. ఎవరైనా గూఢచారులు తమ ఆలోచనల గురించి శత్రువులకు తెలియజేస్తారన్న భయం వారిలో నాటుకుపోయింది." క్యూబా ప్రజలకే కాక సమస్త లాటిన్ అమెరికా ప్రజలకు గుత్తాధిపత్య విధానాలు అవలంబించే అమెరికా ప్రభుత్వం ప్రధాన శత్రువు" అని స్పష్టంగా చెప్పడానికి వారు ముందుకురావడంలేదు.

ఈ విషయం ముందుగానే పసిగట్టినవారు, ఇపుడిపుడే తెలుసుకుంటున్న వారు, గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారు ఈ ఉమ్మడి శత్రువును ఎదుర్కోవడానికి సంసిద్ధమవుతున్నారు. క్యూబాలో ఈ అంశంపై మన ఆలోచనలు, లక్ష్యాలు ఏమిటి? ప్రజల సంక్షేమమే మన లక్ష్యమా? కాదా? ఆర్థిక స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నామా? లేదా? ఏ ప్రపంచ కూటమిలో చేరకుండా మన జాతీయ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటున్నామా?, లేదా? స్వేచ్ఛాయుతంగా వాణిజ్య వ్యవహారాలు నిర్వహిస్తున్నామా? లేదా? ధన సంపద ప్రజలకు సమానస్థాయిలో పంచుతున్నామా? దార్శనిక విధానాలతో ప్రజాభ్యుదయానికి పాటుపడుతున్నామా? అలా చేస్తున్నట్లయితే లక్ష్యాలను మనం గుర్తించామని చెప్పవచ్చు. ఈ లక్ష్యాలను గుర్తించిన వారందరూ మనకు మిత్రులు. వారు ఇతర సంఘాలు, రాజకీయ పక్షాలకు చెందినవారైనా మనకు పట్టింపులేదు.

ప్రస్తుతమున్న ప్రమాదకర పరిస్థితులు, వైరుధ్యాలు, సంఘర్షణ వాతావరణంలో మన లక్ష్యాలపై దృష్టి సారించి శత్రువును ఎదుర్కోవడానికి సిద్ధం కావాలి. ఈ పరిణామాలను అందరూ అర్థం చేసుకుంటే మన కృషి మొదలుపెట్టవచ్చు. మీరు విప్లవకారులు కాదలచుకుంటే ముందో విప్లవం కావాలి. మనకది ఉంది. ఎవరితో కలిసి పని చేయాలో కూడా విప్లవకారుడు తెలుసుకొని ఉండాలి. ఒక వేళ సహచరులతో పూర్తిగా సమన్వయం కుదరకపోతే ఉద్యమ లక్ష్యం ఇంకా ఎంతో దూరంలో ఉన్నట్లే. ప్రజలతో సమన్వయం, సత్సంబంధాలు ఎలా పెంచుకోవాలని తెలుసుకోగోరితే వారికి క్యూబా అనుభవాల గురించి చెబుతాను. ఇక్కడ విప్లవానికి పూర్తి సంఘీభావం తెలిపిన వారు విప్లవసేనానులు. వారే ఇపుడు వైద్యులకు వారి బాధ్యతల గురించి గుర్తు చేస్తూ వారిని కార్యోన్ముఖులను చేస్తున్నారు. పొరుగున ఉన్న బలమైన శత్రువు మనపై సైనికపరంగా దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలో ప్రజలకు వివరిస్తున్నారు. విప్లవకారుడైనప్పటికీ వైద్యుడు వైద్యునిగానే వ్యవహరించాలని హెచ్చరించాలి. సియర్రా మాయెస్ట్రాలో మన వైద్య సహచరులు చేసిన తప్పులు వారు చేయకుండా నివారించాలి. అవి తప్పులు అని నేను అనుకోను. అయితే సాయుధపోరాటంలో గాయపడిన కామ్రేడ్లను వైద్యపరంగా ఆదుకోకుండా తాము కూడా ఆయుధాలు చేతపట్టి సైన్యాన్ని ఢీకొంటామని అప్పట్లో వైద్యులు ముందుకు వచ్చేవారు.

ఇప్పటి పరిస్థితులు వేరు. దేశ సంరక్షణ కోసం ఏర్పాటవుతున్న సైన్యాలు తమ బాధ్యతలను స్పష్టంగా తెలుసుకొని ఉండాలి. ఇందులో వైద్యులకు ప్రముఖపాత్ర ఉంది.

వైద్యుడు తన వృత్తినే కొనసాగించాలి. యుద్ధంలో వైద్య సేవలే అత్యంత ప్రధానమైనవి. వైద్యులకు నర్సులు, ఇతర సాంకేతిక సిబ్బంది పూర్తి తోడ్పాటును అందించాలి.

అలాగే మన ముందున్న పెనుముప్పు గురించి మనం ఆలోచించడం మానుకోవాలి. కేవలం యుద్ధ సన్నాహాల్లో మునిగిపోతే జాతీయ నిర్మాణ పనులకు విఘాతం కలుగుతుంది. యుద్ధానికి వెచ్చించే ధనం, శ్రమ అన్నీ వృధాయే. దురదృష్టవశాత్తు మనం అలా చేయక తప్పడం లేదు. ఎందుకంటే ఇతరులు దాడికి సన్నద్ధమవుతున్నారు. జాతీయ బ్యాంకుల నుండి ఖాళీ అవుతున్న ధనమంతా శక్తివంతమైన ఆయుధాలు కొనుగోలుకే వినియోగిస్తున్నందుకు చాలా బాధగా ఉన్నా, ఒక సైనికునిగా నేను గర్వపడుతున్నాను.

శాంతి సమయాల్లో కూడా విప్లవకారులకు కొన్ని బాధ్యతలుంటాయి. వారు ప్రజల మధ్యనే ఉంటూ వారిని జాగృతం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. నిజమైన సంఘీభావాన్ని పాటిస్తూ ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి. వారికిపుడు గొప్ప అవకాశం లభించింది. సహచరులతో కలసి ప్రజల మధ్య జీవిస్తూ వారిని వర్గాలకతీతంగా తెలుసుకుంటూ, వారిని సమైక్యపరచడానికి కృషి చేయాలి.

ఆరోగ్య కార్యకర్తలు తమ బాధ్యతలను, లక్ష్యాలను, ప్రణాళికలను తెలుసుకొని ముందుకు సాగితే ప్రతిరోజు మనం ప్రయాణించాల్సిన దూరాన్ని, తీసుకోవలసిన మార్గాన్ని మాత్రమే ఎంచుకోవలసి ఉంటుంది. ఈ మార్గం వ్యక్తిగతమైనప్పటికీ ప్రజాబాహుళ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. ఈ విధంగా వైద్యులు ప్రజాసేవకు అంకితం కావచ్చు. మార్టి చెప్పిన విషయాన్ని ఇక్కడ మరోసారి గుర్తు చేయదలిచాను. “ మన భావాలను వ్యక్తపరచడానికి ఉత్తమ మార్గం వాటిని అమలు చేసి చూపెట్టడం”. ఈ స్ఫూర్తితో మనం భవిష్యత్తువైపు అడుగులు వేయాలి.

# క్యూబా విప్లవ అధ్యయనం

**(అక్టోబరు 1960)**

ఇదో ప్రత్యేకమైన విప్లవం. లెనిన్ చెప్పినట్లు "విప్లవ సిద్ధాంతం లేకుంటే ఏ విప్లవ ఉద్యమం మనుగడ సాధించలేదు" సామాజిక వాస్తవాలు విప్లవ సిద్ధాంతంలో ప్రతిబింబించి, సిద్ధాంత నిర్వచనానికి ప్రత్యేక వివరణ ఇవ్వాల్సిన పరిస్థితిని బాగా అధిగమిస్తుంది. చారిత్రక వాస్తవాలను విశ్లేషణాత్మకంగా అనువదించుకుంటే (అన్వయించుకుంటే) విప్లవం సాధ్యమవుతుంది. విప్లవంలో భాగస్వాములైన సామాజిక శక్తులను సక్రమంగా వినియోగించుకోగలిగితే ఎలాంటి సిద్ధాంతం లేకున్నా లక్ష్యాన్ని సాధించవచ్చు.

వివిధ సామాజిక వర్గాలు ఉద్యమంలో భాగస్వాములవుతాయి. ఉమ్మడి లక్ష్యాలు, ఆశయాల సాధనకు వారు పోరాటంలో సమైక్యంగా పాల్గొంటారు. ఉద్యమ నాయకులకు సైద్ధాంతిక పరిజ్ఞానం ఉన్నట్లయితే విప్లవపోరులో జరిగే ఎన్నో తప్పిదాలను నివారించడానికి వీలుంటుంది. అయితే ఉద్యమ సిద్ధాంతం వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి.

క్యూబా విప్లవ నాయకులకు ఒకే ఆలోచనా ధోరణి అంటూ ఉండేది కాదు. అయితే చరిత్ర, రాజకీయ, ఆర్థిక, సామాజిక శాస్త్రాలలోని వివిధ సంకల్పాల గురించి తెలియని వారు కాదు. వాస్తవ పరిస్థితులపై పూర్తి అవగాహన, ప్రజలతో సన్నిహిత సంబంధాలు, లక్ష్యంపై అకుంఠిత దీక్ష, విప్లవపోరాటాల అనుభవం మా నాయకులకు ఉండేది. ఫలితంగా సంపూర్ణ సిద్ధాంత సంకల్పాన్ని రూపొందించగలిగారు. క్యూబా విప్లవం గురించి ఇపుడు విస్తారంగా వివరణ యిస్తాను. కేవలం కొద్ది మంది విప్లవకారులు శక్తివంతమైన సైన్యం ధాటికి తట్టుకొని ఎలా బతికి బయటపడ్డారు. తర్వాత ప్రజలను

సమీకరించి సాయుధపోరులో సైన్యంపై పైచేయి ఎలా సాధించారు. చివరిగా ప్రభుత్వ శక్తులను ఎలా ఓడించారు? ఈ అనితర సాధ్య కార్యాన్ని అధ్యయనం చేయడం సమకాలీన చరిత్ర విద్యార్థులకు ఎంతో అవసరం.

స్వాభావికంగా, సిద్ధాంతం పట్ల నమ్మకంలేని మేము, క్యూబా విప్లవానికి బాటలు వేసిన సామాజిక మార్పులను విశ్లేషించే ముందు, ఉద్యమానికి మేమే అధినేతలమని ఎన్నడూ ఉద్ఘాటించం. సామాజిక వాస్తవ పరిస్థితులకు కేవలం పునాది వేసే వరకే మా పాత్ర ఉండేది. విప్లవాన్ని రెండు దశలుగా విభజించవచ్చు. 1959 జనవరి ఒకటి వరకు జరిగిన సాయుధ విప్లవపోరు, తర్వాత జరుగుతున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక పోరు.

ఈ రెండు దశలను కూడా మరిన్ని విభాగాలుగా విభజించవచ్చు. కేవలం చారిత్రక వివరణ కోసం కాకుండా విప్లవ ఆలోచనలో సంభవించిన సహజ పరిణామక్రమం కోణం నుండి వీటిని అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

ఇపుడు అత్యంత వివాదాస్పదంగా మారిన మార్క్సిజం పట్ల ఓ సాధారణ వైఖరి అవలంభించాల్సిన అవసరముంది. మా నాయకులను మీరు మార్క్సిస్టులా? కాదా? అని ప్రశ్నించడం భౌతికశాస్త్రవేత్తను మీరు న్యూటోనియనా కాదా? అని ప్రశ్నించినట్లుంటుంది. కొత్త విషయాలు బయటపడితే కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయి. ఇది క్యూబా విషయంలో అక్షరసత్యం.

మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతాల్లో లోపాలను కొందరు ఎత్తి చూపవచ్చు. అయితే లాటిన్ ప్రజలు బొలివర్ లేదా ఏంగెల్స్ మెక్సికన్లను విశ్లేషించిన తీరుతో ఏకీభవించడంలేదు. జాతీయత లేదా జాతి సిద్ధాంతాలను వారు వాస్తవాలుగా ప్రవేశపెట్టడం మాకు నచ్చలేదు. తమ చుట్టూ నిర్మించుకున్న ప్రపంచంలోనే వీరు జీవిస్తూ 'అద్భుత' సత్యాలను కనుగొంటూ ఉంటారు. వారి రచనలు పరిశీలిస్తే వారు కూడా మానవ మాత్రులేనని స్పష్టంగా తెలుస్తుంది. మార్క్సిజం సైద్ధాంతిక వాస్తవాలను మానవాళి సాంస్కృతిక, సాంకేతిక పరిజ్ఞానంలో భాగంగా మేము గుర్తిస్తాం.

కొన్ని విషయాలను ఎలాంటి వివరణలు అడగకుండానే సహజంగా ఎలా అంగీకరిస్తామో మార్క్సిజాన్ని కూడా అలాగే నమ్ముతాము. సుదీర్ఘ చారిత్రక క్రమంలో భాగంగానే సామాజిక, రాజకీయ శాస్త్రాలలో అనేక విప్లవాత్మకమైన మార్పులు చోటు

చేసుకుంటున్నాయి. వివిధ ఆలోచనలు పరస్పరంగా మిళితమవుతూ కొత్త సిద్ధాంతాలను, సంకల్పాలను ముందుకు తెస్తున్నాయి. పూర్వకాలంలో చైనీస్, అరబ్ లేదా హిందూ లెక్కల శాస్త్రాలు ఉండేవి. ఇపుడు ఆ శాస్త్రానికి ఎలాంటి సరిహద్దులు లేవు. ఒక గ్రీకు పైథాగొరాస్, ఇటాలియన్ గెలీలియో, బ్రిటీషు న్యూటన్, జర్మన్ గావస్, రష్యన్ లోబాచెవిస్కీ, ఐన్‌స్టీన్..... ఇలా చాలా మందికి చరిత్రలో స్థానముంది. అలాగే రాజకీయ, సామాజిక శాస్త్రాలలో కూడా గొప్ప ఆలోచనాపరులైన డెమోక్రిటస్ నుండి మార్క్స్ వరకు తమ విలువైన పరిశోధనలను ప్రవేశపెట్టి కొత్త అనుభవాలను, సిద్ధాంతాలను ప్రజల ముందుంచారు.

మార్క్స్ ప్రతిభంతా సామాజిక ఆలోచనలో గుణాత్మక మార్పును ప్రవేశపెట్టడంలోనే ఉంది. చరిత్రను అన్వయించి పరిణామాల వైరుధ్యాలను, సమానతలను అర్థం చేసుకొని, భవిష్యత్తు ఎలా ఉంటుందో ఆయన ప్రబోధించారు. అలాగే ఒక విప్లవాత్మక ఆలోచనను కూడా ప్రవేశపెట్టారు. " ప్రపంచాన్ని వ్యాఖ్యానించినంత మాత్రాన సరిపోదు, దాన్ని మార్చాలి" ప్రతి వ్యక్తి తన భవిష్యత్‌ను తానే నిర్మించుకోవాలని ఆయన సూచించారు. అయితే తన ఆలోచనా విధానంపై ఆయన ప్రశ్నలు వేయడం ద్వారా మార్క్స్ అనేక విమర్శలకు గురయ్యారు. డెమోక్రిటస్ విషయంలో కూడా అదే జరిగింది. ఆయన రచించిన పుస్తకాలను ప్లేటో శిష్యులు తగులబెట్టారు. వారు బానిస యాజమాన్యం కలిగిన రాజ్యవ్యవస్థను ప్రతిపాదించారు.

మార్క్స్, ఏంగెల్స్ సిద్ధాంతాలను కాలక్రమంలో అమలు చేస్తూ ముందుకెళ్లిన లెనిన్, స్టాలిన్, మావో, సోవియట్ రష్యా, చైనా పాలకులు సైద్ధాంతిక కోశాన్నే రూపొందించారు. వీటిని మనం ఉదాహరణలుగా తీసుకొని మన ప్రణాళికను రూపొందించుకోవలసి ఉంది. మార్క్స్ తన శాస్త్రాన్ని వదిలి విప్లవ ఆయుధాన్ని చేపట్టిన రోజు వరకు ఆయన బోధించిన సిద్ధాంతాలను క్యూబా విప్లవం స్ఫూర్తిగా తీసుకొంది. ఎందుకంటే మార్క్స్ తన సిద్ధాంతాలను చారిత్రక క్రమాలను శాస్త్రీయంగా అన్వయిస్తూ ప్రబోధించిన సమయం వరకు ఆయన విప్లవ చిత్రం నుండి బయటి ఉండి, భవిష్యత్ రాజకీయ పరిణామాలను సూచించేవారు. తర్వాత విప్లవకారుడైన మార్క్స్ ఆయుధాలను చేపట్టి సాయుధ పోరుకు సిద్ధమయ్యారు.

శాస్త్రవేత్త, సిద్ధాంతకర్త అయిన మార్క్స్ ప్రవచనాలనే మేము విప్లవానికి నిర్దేశకాలుగా తీసుకున్నాము. ప్రజలను పునాదులుగా చేసుకొని ఉద్యమాన్ని చేపట్టాం. పాత పాలక వ్యవస్థను నిర్మూలించి ప్రజారాజ్యాన్ని ఏర్పాటు చేయడానికి కంకణం కట్టుకున్నాం. స్పష్టంగా చెప్పాలంటే మార్క్స్ సిద్ధాంతాలు క్యూబా విప్లవ క్రమంలో కనిపించినా వాటికి స్వాతంత్ర్యం ఉండేది. ఉద్యమ నాయకులకు ఈ సిద్ధాంతాల స్ఫూర్తి తెలుసా, లేదా అన్నది క్యూబా విషయంలో అనవసరమైన సందేహం. విప్లవాన్ని గ్రాన్మాకు ముందు, తరువాతి దశలుగా విభజించవచ్చు. ఎల్ ఉవేరో (Eiuvero) నుండి గెరిల్లాల రెండవ దళం స్థాపన, తర్వాత మూడవ, నాల్గవ దళాల ఏర్పాటు, అలాగే సియర్రా డిక్రిస్టల్ ఆక్రమణ నుండి ద్వితీయ యుద్ధ ప్రాంత స్థాపన, ఏప్రిల్ తిరుగుబాటు – వైఫల్యం, సైన్యాన్ని వెనక్కునెట్టి లాస్ విల్లాస్‌ను స్వాధీనం చేసుకున్న ఘట్టాలు ఇందులో ముఖ్యమైనవి.

గెరిల్లా యుద్ధాలు కొత్త సామాజిక సిద్ధాంతాలను, క్యూబా వాస్తవ పరిస్థితులను విశ్లేషిస్తూ వెళ్లాయి. విప్లవ నాయకుల నిర్ణయాలపై అవి ప్రభావం చూపాయి. ఈ నాయకులే భవిష్యత్ రాజకీయవేత్తలుగా రూపాంతరం చెందారు. గ్రాన్మా రాకకు పూర్వం ప్రజల్లో ఒక భావన ఉండేది. బాటిస్తాకు వ్యతిరేకంగా ప్రజలు ఉవ్వెత్తున తిరుగుబాటు చేసి నియంతృత్వ పాలనకు తెరదించుతారని “ సంపద కంటే గౌరవం” ముఖ్యం అన్న నినాదంతో ఈ ఉద్యమాన్ని చేపట్టాలని ప్రజలు ఆలోచించేవారు.

‘చరిత్ర నన్ను నిర్దోషిగా నిర్ణయిస్తుంది’ అన్న పుస్తకంలో విప్లవానికి ఏర్పడ్డ పునాదులు ఇపుడు బలంగా తయారయ్యాయని కాస్ట్రో పేర్కొన్నారు. ఈ పునాదులు ( సిద్ధాంతాలు) దాటి విప్లవం పయనిస్తోంది. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించే దిశలో సాగుతోంది. ఇది దేశీయంగా, అంతర్జాతీయంగా కొత్త రాజకీయ సమీకరణలకు దారి తీస్తుందనేది వాస్తవం.

గ్రాన్మా రాక తర్వాత సంభవించిన పరాజయం విప్లవ సాధనాలను పూర్తిగా నాశనం చేసింది. ఈ సంఘటన తర్వాత క్యూబా ప్రజలు స్వచ్ఛందంగా నిరసన తెలిపారు. వీటిని పాలకులు తేలికగా కొట్టిపారేశారు. అయితే ప్రజల్లో విప్లవ భావాలు బలంగా నాటుకుపోయి ఉన్నాయని కొద్ది సంఖ్యలో మిగిలిపోయిన విప్లవకారులకు స్పష్టంగా తెలిసిపోయింది. తొలుత రైతులు, రైతు కూలీలు మా ఉద్యమంలో చేరారు. ఈ సమయం

రెండు ఘర్షణలు, చిన్నపాటివి జరిగాయి. వాటికంత ప్రాముఖ్యం లేకపోయినా, మానసికంగా శత్రుసైన్యంపై కొద్ది ప్రభావాన్ని చూపాయి. ‘ పట్టణాలకు చెందిన గెరిల్లా వీరుల పట్ల అప్పటి వరకు ఉన్న సామాజిక వైరుధ్యాలను రైతులు మరచిపోయారు. వారితో మరింత సమన్వయంగా పని చేయడానికి వారు ముందుకు వచ్చారు. తమ రక్షణ కోసం విప్లవ యోధులపై ఆధారపడ్డారు.

ఈ మార్పు వచ్చాక గెరిల్లా దళాలు కూడా రైతుల కోసం ఏదో ఒకటి చేయాలని నిర్ణయించారు. రైతుకు భూమిపై తప్ప ఇతర భౌతిక ఆస్తులపై మక్కువ ఉండదని గ్రహించి ఆ దశలో పోరాటాన్ని ఉధృతం చేశాం. విప్లవ సైన్యం సంచార జీవితం గడుపుతూ తన ప్రాబల్యాన్ని ఇతర ప్రాంతాలకు విస్తరించడం మొదలు పెట్టింది. కొండ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలపై పట్టు సాధించింది.

1957 మే 28 ఒక కొత్త అధ్యయానికి నాంది పలికింది. ఎల్ ఉవేరో సైనిక స్థావరంపై దాడి జరిగింది. ఈ సాయుధ సంఘర్షణ అప్పటి వరకు జరిగిన ఉద్యమంలో ఎంతో రక్తసిక్తమైనది. సుమారు 30శాతం విప్లవకారులు ప్రాణం కోల్పోయారు. అత్యంత ముఖ్యమైన ఈ సైనిక స్థావరాన్ని స్వాధీనం చేసుకోగలిగాం. ఇప్పుడా ప్రాంతం విప్లవ సైన్యం ఆధీనంలోకి వచ్చింది. ఈ విషయం బయటికి పొక్కలేదు. ఫలితంగా ఉద్యమకారులు తమ కార్యకలాపాలను మైదాన ప్రాంతాలకు కూడా విస్తరించగలిగారు.

కొద్ది కాలానికే విప్లవ సైన్యం మొదటి విభాగం ఏర్పాటైంది. రెండు కొత్త గెరిల్లా యూనిట్లు ఏర్పడ్డాయి. రెండవ గెరిల్లా దళం కాలమ్ 4గా పిలవబడసాగింది. జులై 26న ఎస్ట్రాడా ఫాల్మాను, తర్వాత బ్యూసిట్‌ను స్వాధీనం చేసుకున్నాం. సాయుధ బలప్రదర్శనలో ఈ ప్రాంతాల ప్రజలలో కొత్త ఆశలను రేకెత్తాయి. సైన్యం కోసం కాపు కాస్తూ గెరిల్లా ఘర్షణలతో వారిని కకావికలం చేస్తూ వారిని సియర్రా వరకు వెళ్ళకుండా అడ్డుకట్ట వేయగలిగాం. జనసాంద్రత లేని విశాలమైన భూభాగాలను స్వాధీనం చేసుకుంటూ విప్లవరాజ్యం విస్తరించుకుంటూ వెళ్ళాం.

సాయుధ పోరాట స్థావరాలు పెద్దగా మారలేదు. అయినా గెరిల్లా దళాల సంఖ్యలో పెరుగుతూపోయాయి. గెరిల్లాలు మరింత సైనిక సామర్థ్యాన్ని పెంచుకున్నారు. తమ పోరాట విధానంపై వారికి విశ్వాసం మరింత పెరిగింది. 1958 ఫిబ్రవరిలో సైనికుల దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాం. యువాన్ అల్మెడా నేతృత్వంలోని గెరిల్లా విభాగం

(కాలమ్3) సాంటియాగోన్ అనుకోని ఉన్న ప్రాంతాలకు తరలి వెళ్లింది. కాస్ట్రో నేతృత్వంలోని కాలమ్ 6 సెంట్రల్ హైవేను దాటి మాయారీ (Mayari) కొండ ప్రాంతాల వద్ద రెండవ సైనిక పోస్టును ఏర్పాటు చేసింది. దీనికి ఫ్రాంక్ పాల్స్ అని నామకరణం చేశారు.

విప్లవ సైన్యం సాధిస్తున్న పురోగతి ప్రభుత్వ ఆంక్షలను దాటుకొని పత్రికలు, ఇతర ప్రసార మాధ్యమాల్లో ప్రముఖంగా ప్రచారమైంది. హవానాలో కలకలం బయల్దేరి, పాలకులకు నిద్రలేకుండా చేసింది. కొందరు విప్లవనేతలు ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా లేవదీయాలని పిలుపునిచ్చారు. సైనిక వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేయాలని ప్రతిపాదించారు.

అయితే విప్లవసైన్యం కేవలం మార్పు తెచ్చే సాధనంగా ఉండాలని, ప్రజలే పోరాటంలో అగ్రభాగాన ఉండాలని మేము స్పష్టం చేశాం. కామిలో సియన్‌ఫ్యూగోస్ నేతృత్వంలోని గెరిల్లా బృందాలు సైనిక స్థావరాలను స్వాధీనం చేసుకుంటూ ముందుకు సాగాయి. సియన్‌ఫ్యూగోస్‌కు నాయకునిగా ఎనలేని పేరు వచ్చింది. విప్లవపోరాటంలో ఒక బలహీనత ఉండేది. ఇందులో కార్మికవర్గాలు ఇంకా పూర్తిస్థాయిలో పాలుపంచుకోలేకపోయారు. కార్మికవర్గంలో ఐక్యత లోపించింది. సాధారణ సమ్మెకు పిలుపునిచ్చి, విప్లవ సాయుధ పోరును తీవ్రతరం చేయాలని ఈ దశలో నిర్ణయించాం. సమ్మె పిలుపు రేడియో ద్వారా తెలియజేశాం. ఈ విషయాన్ని బాటిస్తా గూఢచార వర్గాలు పసిగట్టాయి. ఫలితంగా సమ్మె విఫలమైంది. చాలా మంది విప్లవకారులు తమ ప్రాణాలు కోల్పోయారు.

ఒక ఆసక్తికరమైన విషయమేమిటంటే అమెరికా గుత్తాధిపత్యం గురించి అమితంగా వాగే జాల్స్ డుబోయిస్ సమ్మె ఏ రోజు జరగగలదో ఖచ్చితంగా అంచనా వేయగలిగాడు. ఈ సమయంలో విప్లవంలో గుణాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. సాయుధ వీరుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. అంతిమ లక్ష్యంవైపు దూసుకెళ్ళే రోజులు ఇంకెంతో దూరంలో లేవని అందరిలో విశ్వాసం కలిగింది. అప్పటికే రైతాంగంతో పూర్తి సమన్వయం కుదిరింది. సమాంతర ప్రభుత్వం ఏర్పాటైంది. విప్లవ సైన్యం పరిధిలో లేని ప్రాంతాలలో సైతం మా ప్రభావం పెరగసాగింది. సైన్యం పెద్ద ఎత్తున మోహరించి దాడులు ప్రారంభించింది. రెండు నెలల్లో దాదాపు వెయ్యిమందికి పైగా సైనికులు

మరణించారు. సుమారు 600 అత్యాధునిక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాం. సైన్యం మనోధైర్యం దెబ్బతింది.

సైన్యం విప్లవవీరులను నిలువరించలేదని ప్రజలకు సంకేతాలిచ్చాం. సియర్రా మాయెస్ట్రా, ఫ్రాంక్ పాల్స్ పర్వతక్షేత్రాలు శత్రుసైన్యానికి దుర్భేద్యమయ్యాయి. కాలమ్ 2, 8లను కామాగువే దాటి లాస్ విల్లాస్‌కు చేరుకోవాలని ఆదేశించాం. శత్రుసైన్య దూరసంచార వ్యవస్థను నాశనం చేయాలని సూచించాం. కామిలో సియన్‌ఫ్యూగోస్, సిరో రెడెండోలు ఈ దళాలకు నాయకత్వం వహించారు. లాస్ విల్లాస్ తర్వాత విప్లవ పోరును తూర్పు నుండి పశ్చిమ ప్రాంతాలకు వ్యాపింపచేయాలని ఒక ప్రణాళిక సిద్ధం చేశాం.

ఈ సమయంలో విప్లవకారులతో ప్రజల సత్సంబంధాలు పెరిగి, వారు కూడా విప్లవంవైపు మొగ్గు చూపారు. గెరిల్లా దళాలు కామాగువే చేరుకొని, అక్కడి నుంచి లాస్ విల్లాస్‌కు ప్రస్థానం మొదలు పెట్టారు. లాస్ విల్లాస్‌ను అతికష్టంగా చేరుకున్న తర్వాత క్యూబా ద్వీపాన్ని రెండు ప్రాంతాలుగా విభజించే చర్యలను ముమ్మరం చేశారు. రెండు దళాలలో కేవలం 220(80+140) మంది విప్లవ సైనికులు మాత్రమే ఉన్నారు. వారు చేపడుతున్న కార్యం అసాధ్యమైంది. అత్యంత ప్రమాదకరమైనది. అయినా తమ లక్ష్యంవైపు వారు దూసుకెళ్లడం ప్రారంభించారు. బలమైన శత్రువును ఎదుర్కోవాలంటే తగిన ఆయుధాలు, రక్షణ కవచాలు, అనుకూలమైన భూభాగం. అన్నింటికంటే ముఖ్యంగా స్థానిక ప్రజలు మద్దతు ఉండాలి. ఇవన్నీ కలిగిన గెరిల్లా బృందాలు పోరాటంలో గెలుస్తామన్న ధీమాతో ముందుకు సాగాయి.

శత్రు సైనికుడు నియంతకు, నియంతృత్వానికి చిన్న భాగస్వామి. వాల్‌స్ట్రీట్ మొదలుకొని ఇతర దోపిడీ విధానాల ద్వారా లభించే సంపాదనలో అతనికీ చిన్న వాటా ఉంటుంది. ఈ హక్కులను నిలుపుకోవడానికి అతడు తనవంతు కృషి చేస్తాడు. కాని ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడడు. హోదా, జీతం లభిస్తున్నా అతని స్థాయికి అలాంటి జీవితం వ్యర్థం. అయితే హక్కుల కోసమే పోరాడుతూ ఉంటే, వారు గెరిల్లాల స్థావరాల నుండి తప్పుకోవడమే మేలనుకొంటారు. ఈ రెండు అంశాలు 1958 డిశంబర్ 31న నిజమయ్యాయి.

విప్లవసైన్యం రోజు రోజుకూ తన పట్టును పెంచుకుంటోంది. లాస్ విల్లాస్ ప్రవేశం తర్వాత జులై 26 ఉద్యమం ఇతర ప్రజాపోరాటాల కంటే ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకుంది. విప్లవ కమాండ్, లాస్‌విల్లాస్ ద్వితీయ సైనిక స్థావరం, పాపులర్ సోషలిస్టు పార్టీ, ఇంకా ఇతర సంఘాలు జులై 26 ఉద్యమం కంటే బలమైనవి కావు అన్న విషయం స్పష్టమైంది. దీనికి ఫైడెల్ క్యాస్ట్రో నాయకత్వం ప్రతిభే కారణం.

ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు ఆగిపోయాయి. ఓరియంటే, కామాగువే, సియర్రామాయెస్ట్రా పర్వత ప్రాంతాలు, లాస్ విల్లాస్ లాంటి నగరాల నుండి విప్లవ సైన్యాలు హవానావైపు ప్రస్థానం మొదలు పెట్టాయి. గ్రాన్మా నుండి క్యూబాపై అడుగుపెట్టిన విప్లవకారులతో ప్రస్తుత పోరాట యోధులకు పోలికే లేదు. రైతులపై ఉన్న అపనమ్మకం నేడు విశ్వాసంగా మారింది. గ్రామీణ ప్రాంత జీవనం తెలియని వారు నేడు అక్కడి పరిస్థితులను పూర్తిగా అవగాహన చేసుకున్నారు. సిద్ధాంతాలు, అంచనాల స్థానంలో కార్యసాధనకు ప్రాముఖ్యం పెరిగింది.

విప్లవానికి వ్యవసాయ రంగ సంస్కరణలను నినాదంగా చేసుకున్నాం. సామ్రాజ్యవాదానికి, నియంతృత్వానికి వ్యతిరేకంగా సియర్రా నుండి మైదాన ప్రాంతాలకు ఉద్యమం విస్తరించింది. భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించి నవ క్యూబా నిర్మాణానికి పునాదులు వేయాలని సంకల్పించాం. అలాగే అమెరికా వాణిజ్య, వ్యాపార సంస్థల గుత్తాధిపత్యాన్ని అరికట్టాలని నిర్ణయించాం. ఈ పోరాటంలో ప్రజలే అగ్రభాగాన ఉండాలని, వారికి మనోధైర్యం కల్గించడానికి విప్లవ సైన్యం తగు చర్యలు తీసుకుంటుందని ప్రకటించాం. సైనిక చర్యల్లో వచ్చినట్లే సామాజిక సిద్ధాంతాలలో కూడా గుణాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. విప్లవానికి రైతాంగం తన పూర్తి సహకారాన్ని, సైద్ధాంతిక, సామాజిక మద్దతును ప్రకటించింది. ప్రజల్లో చైతన్యం తేవడానికి విప్లవ నాయకత్వం అనేక చర్యలు చేపట్టింది. ప్రజలతో సంబంధాలు బలపడ్డాయి. వారితో త్యాగనిరతి పెరిగింది. ఇలాంటి పరిస్థితులు గతంలో లేవు. ఈ కారణంగా విప్లవసైన్యం హవానా ప్రవేశించినపుడు చరిత్ర ప్రజలే ఆధారంగా మరో మెట్టు ఎక్కింది.

# క్యూబా : చారిత్రక మినహాయింపా లేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరుకు నాయకత్వమా?

**(1961 ఏప్రిల్ 9)**

"శ్రామిక వర్గం విభిన్నమైనది. దేశ సంపదను సృష్టిస్తుంది. అధికారం లేకున్నా తమ యాజమాన్యాలకు అధికారాన్ని కట్టబెడుతుంది. అలాగే భూస్వామ్యానికి కూడా తమను దోపిడీ చేయడానికి అవకాశం కల్పిస్తుంది. పెట్టుబడిదారులు, విదేశీ వ్యాపార సంస్థలు తమ గుత్తాధిపత్యం చెలాయించడానికి తోడ్పాటునిస్తుంది. ఉత్పాదనకు అవసరమైన పరికరాలు, యంత్రాలు కూడా పై వర్గాల చేతిలో ఉంటే వారు తిని మిగిలిపోయిన రొట్టెముక్కలే కార్మికులకు దిక్కు. వారు దుర్భర జీవితాలను గడపాల్సి వస్తుంది"

**– ఫైడెల్ కాస్ట్రో**

పీడిత ప్రజలకు భూస్వామ్యం, నియంతృత్వం, సామ్రాజ్యవాద శక్తుల నుండి విముక్తి కలిగించిన ఉద్యమాలు లాటిన్ చరిత్రలో క్యూబా తప్ప ఎక్కడా కనిపించవు. ఇది లాటిన్ అమెరికా చరిత్రలో ఓ గొప్ప మలుపు. రష్యా విప్లవం, నాజీ జర్మనీపై విజయం, చైనా సాంస్కృతిక విప్లవం తర్వాత అంతటి ప్రధానమైన చారిత్రక ఘట్టం క్యూబా విప్లవం. క్యూబా విప్లవం అనూహ్యమైంది, సాంప్రదాయ వ్యతిరేక పద్ధతుల్లో సాధించినది. అయితే చారిత్రక క్రమాల గురించి వెలువడిన సిద్ధాంతాలు, ఆదర్శాల బాటనే అది సాధ్యమైంది. సోషలిజం, సామ్రాజ్యవాద వ్యతిరేక లక్ష్యాలు ఇందులో ఉన్నాయి.

అయితే కొన్ని శక్తులు విప్లవానికి కారణమైన పరిస్థితులను, అవలంబించిన పద్ధతులను వేరే రూపంలో చూపడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇతర విప్లవాలకంటే క్యూబా విప్లవం భిన్నమైనదని, లాటిన్ దేశాలలో ఇపుడు జరుగుతున్న ఉద్యమాల ఫలితం వేరుగా ఉంటుందని వాదిస్తున్నారు. క్యూబా విషయంలో కొన్ని ప్రత్యేకతలు ఉన్న విషయాన్ని మేమూ అంగీకరిస్తున్నాము. ప్రతి విప్లవానికి ప్రత్యేకమైన లక్షణాలు, సిద్ధాంతాలుంటాయన్నది వాస్తవం. అయితే అన్ని సందర్భాల్లో అవి సామాజిక చింతనకు లోబడే జరిగాయి. క్యూబా విప్లవం ప్రత్యేకమైనదని చెప్పడానికి కారణమైన కొన్ని విషయాలను ఇక్కడ విశ్లేషిద్దాం.

మొదటి కారణం మాత్రం నిస్సందేహంగా కాస్ట్రో చారిత్రక నాయకత్వం. చరిత్రే ఆయన సాధించిన అసమాన విజయాలను నిర్ధారించాల్సి ఉంది. అయితే ఇతర లాటిన్ విప్లవ నాయకుల సరసన ఆయన నిలబడతారనేది మాత్రం నేను చెప్పగలను. కాస్ట్రో వ్యక్తిత్వానికి అంతటి ప్రాముఖ్యం ఎందుకు? ఆయన జీవిత ప్రధాన లక్షణాలు, దృఢ సంకల్పం సమకాలీన కామ్రేడ్ల కంటే ఎంతో ఎత్తులో ఉన్నాయి. తాను చేపట్టే ఏ ఉద్యమంలోనైనా ఆయన నాయకత్వ స్థానాన్ని ఆక్రమించుకునే బలమైన వ్యక్తిత్వం ఆయనది. తొలి నుంచి ఆయన అలాగే ఉన్నారు. అలాగే వ్యవహరించారు. విద్యార్థి దశ నుండే తిరుగులేని నాయకునిగా ఎదిగారు. ఇప్పుడు ఆయన లాటిన్ దేశాల పీడిత ప్రజల ప్రవక్తగా రూపాంతరం చెందారు. ఆయన దూరదృష్టి, దార్శనిక సిద్ధాంతాలు దేశ ప్రజలందరికీ ఆదర్శం. అనుభవాన్ని, జ్ఞానాన్ని రంగరించి తన లక్ష్యంవైపు ఎలాంటి అడ్డంకులు వచ్చినా దూసుకుపోగల సామర్థ్యం ఆయనలో ఉంది. విషయ పరిజ్ఞానం, లక్ష్యం సాధనపట్ల ఆయన అంకితభావం సాటిలేనివి. భవిష్యత్ పరిణామాలను శాస్త్రీయంగా అంచనా వేయడంలో ఆయన దిట్ట. ఇలాంటి ఉన్నత లక్షణాలు కలిగి, ప్రజలను సమైక్య పరచగల శక్తి, వారిని ఉద్యమ పథాన నడిపించే సామర్థ్యం, ప్రజలపై ఆయనకున్న అపారమైన నమ్మకం, భవిష్యత్ ఆశాజనకంగా ఉంటుందన్న ఆయన విశ్వాసం, కాస్ట్రోను తిరుగులేని నాయకునిగా నిలబెట్టాయి. ఎలాంటి సాధనాలు లేని దశ నుండి ప్రస్తుత విప్లవ పాలనా వ్యవస్థను నిర్మించగలిగిన సామర్థ్యం క్యూబాలో మరే నాయకునికి లేదు.

క్యూబాలో కొన్ని ప్రత్యేకమైన రాజకీయ, సామాజిక పరిస్థితులు నెలకొని ఉండేవని ఎవరూ ఖచ్చితంగా వాదించలేరు. ఈ కారణంగానే విప్లవం సంభవించిందనో లేదా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేకపోయినా కాస్ట్రో విప్లవాన్ని సాధించగలిగారని చెప్పడం సరికాదు. కొన్ని పరిస్థితులు ప్రత్యేకంగా లేనప్పటికీ ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. ఎందుకంటే సామ్రాజ్యవాద శక్తులు తప్పులను తెలుసుకొని వాటిని సరిదిద్దే చర్యలను కాలక్రమంలో తీసుకుంటూనే ఉంటారు. కాస్ట్రో తన సమర్ధ నాయకత్వంతో ప్రజలను ఏకం చేసి ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించారు. రాజకీయ వైరుధ్యాలు, వర్గపోరును ఆయన విప్లవ విజయానికి అత్యంత వ్యూహాత్మకంగా వినియోగించగలిగారు.

ఒక్క విషయంలో మాత్రం మినహాయింపు ఉందని మాత్రం చెప్పగలను. అప్పట్లో అమెరికా సామ్రాజ్యవాద విధానాలు లోపభూయిష్టంగా, లక్ష్యం లేకుండా ఉండేవి. గుత్తాధిపతులు బాటిస్టా స్థానంలో వేరే పాలకుణ్ణి లేదా పాలక వ్యవస్థను ప్రవేశపెట్టాలని భావించారు. సైనిక తిరుగుబాటు ఇందుకు చక్కటి అవకాశం. కొత్త నాయకుడు అమెరికా ప్రయోజనాలను కాపాడే వాడైతే చాలనే ఆలోచనలు వారిలో ఉండేది. ఈ విధానాన్ని ముందు నుండి అనుసరిస్తున్న క్యూబా విషయంలో అది ఘోరంగా విఫలమైంది.

విప్లవ సైన్యం హవానాలో అడుగుపెట్టే వరకు మాపై వారికి కొన్ని అనుమానాలు ఉండేవి. అయితే బహిరంగంగా ఎలాంటి భయాందోళనలు వ్యక్తం చేయలేదు. సామ్రాజ్యవాద కాంక్షతో వారు ఇలాంటి ఉద్యమాల విషయంలో ఎలాంటి పాత్ర పోషించేవారు కాదు. వర్గపోరుకు ఊతం ఇచ్చేవారు.

అమెరికా విదేశీ వ్యవహారాల శాఖకు చెందిన అనేక మంది నిపుణులు పాత్రికేయుల వేషంలో క్యూబా వచ్చి విప్లవం సాగుతున్న తీరును అధ్యయనం చేసేవారు. అయితే అమెరికా ప్రయోజనాలకు ఎలాంటి తక్షణ ముప్పులేదని నిర్ధారించారు. ప్రత్యక్ష జోక్యం చేసుకునేలోగా సమయం మించిపోయింది. కొత్త పాలకులు తమ సిద్ధాంతాలకు కట్టుబడి ఇంకా విప్లవ బాటలోనే పయనిస్తున్నారని తెలుసుకొని అమెరికా ప్రయోజనాలను కాపాడుకోలేని స్థితిలో ఉండిపోయారు. ఈ విధంగా లాటిన్ దేశాలకంతటికీ ఒక దిశా నిర్దేశం ఇచ్చే విప్లవ ప్రభుత్వం 1959 జనవరి ఒకటిన క్యూబాలో అధికారం చేపట్టింది.

బూర్జువా వర్గాలు, లేదా వారిలో కొందరు విప్లవపోరును సమర్థించినంత మాత్రాన విప్లవానికేదో ప్రత్యేకత వచ్చినట్లు కాదు. విప్లవం జరుగుతుండగానే వారు ఆయా వర్గాలతో చర్చలు జరిపి తమ హక్కులను కాపాడుకోవాలని మాత్రమే ప్రయత్నించారు. ప్రభుత్వం మారినా తమకే ఆపద రాకూడదని కోరుకున్నారు. ఈ రకంగా చూసినా క్యూబా విప్లవానికి ఎలాంటి ప్రత్యేకత లేదు. ఒక పక్క సామ్రాజ్యవాద శక్తులు, మరోవైపు నియంతృత్వ ప్రభుత్వంతో వేగలేక వారు యువవిప్లవకారుల లక్ష్యాన్ని సమర్థించారు. పరోక్షంగా ఈ వర్గాల విప్లవ ప్రభుత్వం ఏర్పాటుకు తోడ్పాటునందించాయి.

మరో ప్రత్యేకత ఏమిటంటే రైతాంగం కార్మిక వర్గంగా రూపాంతరం చెందడం. ఆహార ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్, వాటిపై ఆధారపడ్డ పరిశ్రమల సంఖ్య పెరగడంతో రైతులు కూడా కార్మికుల వలె కష్టపడి వ్యవసాయ దిగుబడిని పెంచడంలో ప్రావీణ్యత సాధించారు. వారిలో కూడా వర్గ, సామాజిక, రాజకీయ చైతన్యం పెరగసాగింది. ఈ కారణంగానే గ్రామీణ ప్రాంతాలలో విప్లవ పునాదులను వేశాం. సియర్రా మాయెస్త్రా అనుభవాలతో వారు మైదాన ప్రాంతాలకు తరలివెళ్లి భూములను ఆక్రమించుకున్నారు. అంతకు పూర్వం వారికి మైదాన ప్రాంత రైతాంగంతో ఎలాంటి సాంస్కృతిక సంబంధాలు ఉండేవి కావు. విప్లవం వివిధ సామాజిక, భౌగోళిక వర్గాల మధ్య అంతరాలను దూరం చేసింది. భూస్వామ్యవాదులకు వ్యతిరేకంగా రైతులు ప్రాంతాలకు అతీతంగా పోరాటంలో పాల్గొన్నారు. విప్లవంలో చేరిన రైతులకు భూమి తప్ప వేరే ఆస్తులు సంక్రమించుకోవడంపై ఎలాంటి ఆశలు ఉండేవి కావు. ఇది పెటీ బూర్జువా మనస్తత్వంగా కనిపిస్తుంది. భూమిని హస్తగతం చేసుకొని వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయాన్ని కుటుంబాన్ని పోషించడానికి, పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు వెచ్చించాలన్నదే వారి ఆశయం.

ఇలాంటి మనస్తత్వం ఉన్నప్పటికీ, తమ లక్ష్యాన్ని అంత సులభంగా సాధించలేమని వారికి అర్థమైంది. భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించందే తమ కోరిక నెరవేరదని, అలాగే వ్యవసాయ రంగ సంస్కరణలు అవసరమని వారు తెలుసుకున్నారు. చక్కెర, మాంసం పరిశ్రమల్లో విదేశీయుల గుత్తాధిపత్యాన్ని కార్మిక వర్గాలు తీవ్రంగా వ్యతిరేకించడం మొదలుపెట్టాయి. ఫలితంగా రైతు, కార్మిక వర్గాలు ఉద్యమ బాటలో నడవడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. ఇరు వర్గాలు తమ ఉద్యమాలకు పరస్పర సహకారం

అందించుకున్నారు. భూమి పొందిన పేదరైతులు విప్లవాన్ని మనస్ఫూర్తిగా మద్ధతు పలికారు.

ఇంతకంటే మినహాయింపులు క్యూబా విప్లవానికి ఇవ్వలేము. ఈ ప్రత్యేకతలు ఎంచడానికి కూడా చాలా ఉదార ఔదార్యాన్ని చూపాం. ఇపుడు దేశంలో నెలకొని ఉన్న సామాజిక వైరుధ్యాలు, వర్గపోరుపై దృష్టి సారిద్దాం.

మొదటిగా భూయాజమాన్య వ్యవస్థ గురించి చర్చిద్దాం. పాలకవర్గాలకు భూములు ఆదాయవనరులుగా ఉండేవి. భూస్వామ్య వర్గాలు దేశ సామాజిక పరిణామాలకు దూరంగా తనదైన ప్రపంచంలో జీవిస్తుంటారు. లాటిన్ అమెరికా అంతా ఇదే పరిస్థితి. రాజకీయ పరిజ్ఞానం గల భూస్వాములు తమ ఆస్తులను (భూమి) వేరే రూపంలో మార్చుకోవడానికి ప్రయత్నించారు. ముంచుకొస్తున్న ముప్పు (విప్లవం) ను వారు గ్రహించగలిగారు. వ్యాపారంలోనో, పరిశ్రమలలోనో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యారు. తిరోగమన శక్తులైన వీరు శతాబ్ధాలుగా పేద రైతుల బతుకులను దుర్భరంగా మార్చివేసి తమ పబ్బం గడుపుకునేవారు. ఇపుడు ఆ పేద రైతులు, రైతు కూలీలు ఉద్యమ పథంలో నడుస్తుండడంతో తమ భూములను గుత్త వాణిజ్య సంస్థలకు విక్రయించడానికి పరుగులు తీశారు.

కొందరు భూస్వాములు సామ్రాజ్యవాద శక్తులతో చేతులు కలిపి తమ ఆస్తులను కాపాడుకొనే ప్రయత్నాల్లో మునిగిపోయారు. చక్కెర పరిశ్రమకు ప్రధాన పంట అయిన చెరుకును విశాలమైన భూభాగాల్లో పండించి వాటిని పారిశ్రామికవేత్తలకు విక్రయించే ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ పరిస్థితి లాటిన్ అమెరికా అంతటా ఉండేది. గత శతాబ్ద కాలంగా లాటిన్ దేశాలలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరు తీవ్రంగా నడుస్తోంది. కోస్టారికా, నికరాగువ, పనామా, ఈక్వెడార్, పెరు, మెక్సికో తదితర దేశాలలో దోపిడీదారి వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించడాన్ని మనం చూశాం. ద్వితీయ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత అమెరికా తన వ్యాపార ప్రయోజనాలను (సామ్రాజ్యవాద విధానంలో భాగంగా) కాపాడుకోవడానికి పేద దేశాలలో పెద్ద ఎత్తున జోక్యం చేసుకోవడం ప్రారంభించి, తన కనుసన్నలలో పని చేసే ప్రభుత్వాలను నియంతలను పేద ప్రజలపై రుద్దింది. ఆయా దేశాల సహజ వనరులను కొల్లగొట్టడానికి, స్థానికులను ఆర్థికంగా కృంగదీయడానికి అనేక పథకాలు అమలు చేసింది.

వ్యాపార, కార్మిక వర్గాలలో విభేదాలు సృష్టించి అమెరికన్ వాణిజ్య సంస్థలను బలోపేతం చేయడానికి ఎన్నో మార్గాలను అవలంబించింది. తన పరోక్ష ఆధీనంలో ఉన్న దేశాలను (లాటిన్) వర్ణించడానికి ఒకే ఒక పదాన్ని అమెరికా ఉపయోగిస్తోంది. అదే " పేద (లేదా) అభివృద్ధి చెందని దేశం".

అభివృద్ధి లేమి అంటే ఏమిటి? పెద్ద తలకాయ, చిన్న కాయంతో ఉన్న మరుగుజ్జును అభివృద్ధి చెందని వ్యక్తిగా చెప్పవచ్చు. శరీర అవయవాలు సాధారణస్థాయిలో అభివృద్ధి చెందకపోవడంతో అతడు అలా ఉండిపోవాల్సి వస్తుంది. ఇదే లౌక్యాన్ని దేశాల ఆర్థిక వ్యవస్థకు అన్వయించి వాటిని పేద దేశాలుగా ప్రకటించడం జరుగుతోంది. ఈ దేశాలపై సామ్రాజ్యవాద శక్తుల పరోక్ష లేదా ప్రత్యక్ష పట్టు ఉంటుంది. అవి తమ అవసరాలకోసం సంపన్న దేశాలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. ఒకే పంట, ఒకే ఉత్పత్తి, సాధారణ మార్కెట్టు ఉన్న దేశాలు కూడా అభివృద్ధి చెందని దేశాలే. వాటిని సంస్కరించడం తమ కర్తవ్యమన్నట్లుగా సంపన్న దేశాలు వ్యవహరిస్తుంటాయి. దేశాలను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ' విభజించు–ఆక్రమించు' సిద్ధాంతాన్ని అమలు చేస్తాయి.

భూస్వామ్య వ్యవస్థకు తోడు సామ్రాజ్యవాద, గుత్తాధిపత్య విధానాలే పేదరికానికి మూలకారణాలు. దీనివల్ల రైతాంగం, కార్మిక వర్గాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. అలాగే నిరుద్యోగం మరింత ప్రబలుతోంది. వ్యవస్థలో వైరుధ్యాలు మరింత వికటించి, అమెరికా దేశాలన్నింటిలో ఒకే రకమైన ఆర్థిక వ్యవస్థ లేదా స్థితిగతులు ఏర్పడడానికి సామ్రాజ్యవాద శక్తులు బాటలు వేస్తున్నాయి. పేదరికం, ఆకలి సర్వసాధారణమయ్యే పరిస్థితులు కల్పిస్తున్నాయి. ప్రజలను సాధ్యమైనంత వరకు దోపిడీ చేయడానికే కొత్త ఆర్థిక విధానాలను అమలు చేస్తున్నాయి. తమ విధానాలను అడ్డుకునే వర్గాలను భౌతికంగా నిర్మూలించడానికి తమకు అనుకూలమైన పాలకులను వినియోగించుకుంటున్నాయి. కార్మికుల శ్రమను పిండుకుంటున్నాయి.

భూస్వామ్య వ్యవస్థ అంతిమంగా సామ్రాజ్యవాదానికి దారి తీస్తుందనేది లాటిన్ దేశాల అనుభవాలతో స్పష్టమైంది. ప్రజలు ఆర్థిక స్వాతంత్ర్యం కోల్పోయి బానిసలుగా మార్చే పరిస్థితులను దోపిడీ వర్గాలు కల్పిస్తున్నాయి. ఈ పరిస్థితులు క్యూబాలో కూడా

ఉండేవి. ఆకలి పెద్ద శత్రువుగా ఉండేది. లాటిన్ దేశాలలోనే గరిష్ట స్థాయిలో ఇక్కడ నిరుద్యోగం రాజ్యమేలింది. సామ్రాజ్యవాదం గట్టిగా పునాదులు వేసుకుంది. భూస్వామ్య వ్యవస్థ పతాకస్థాయికి చేరుకుంది. ఈ వైపరీత్యాల నుండి ప్రజలను విముక్తి చేయడానికి కొన్ని విధానాలు, సిద్ధాంతాలను విప్లవాత్మకంగా అమలు చేశాం. సామాజిక మార్పు కోసం  కొత్త పద్ధతులను, వైద్యాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాం.

విప్లవానికి దారితీసే ఖచ్చితమైన రాజకీయ, సామాజిక పరిస్థితులను ప్రజల ఆకలే సృష్టించింది. దమనకాండ ఎక్కువై ప్రజలు తమ అస్థిత్వాన్ని నిలుపుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా వెనుకాడని చారిత్రక సమయం ఆసన్నమైంది. ఈ పరిస్థితులు ఇతర లాటిన్ దేశాలలో ఉండేవి కావు. అక్కడి ప్రజలలో రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవహారాలపై చైతన్యం కొరవడి ఉండేది. చైతన్యవంతమైన క్యూబాలో సాయుధ పోరాటం ద్వారా దోపిడీదారి వ్యవస్థ, సామ్రాజ్యవాద పునాదులను పెకలించివేశాం.

సాయుధ పోరాటమే లాటిన్ ప్రజలకు శరణ్యమనే విషయాన్ని క్యూబాలో విప్లవం  ద్వారా స్పష్టం చేశాం. రైతాంగ సైన్యం ఇందులో కీలకపాత్ర పోషించగలదని నిరూపించాం. ఇప్పుడు లాటిన్ ప్రజలు క్యూబా అనుభవాలను పాఠాలుగా తీసుకుంటున్నారు. రైతాంగ, కార్మిక వర్గాలు సమన్వయంతో ఉద్యమ బాటలో పయనిస్తున్నారు. విప్లవ చైతన్యం పెరుగుతోంది. సాయుధ పోరాటానికి అనుకూలమైన పరిస్థితులు కల్పించడానికి ఆయా పీడిత వర్గాలు సిద్ధమవుతున్నాయి. ప్రజాసైన్యం ఏర్పాటు  దిశగా కొన్ని దేశాలు పయనిస్తున్నాయి. విప్లవ సాధనకు పాలకవర్గసైన్యం తుడిచిపెట్టుకుపోవడమే ప్రధానమని  క్యూబా ద్వారా తెలియజేశాం.

విప్లవానికి ముందు క్యూబాలో ఉన్న పరిస్థితులే ఇతర లాటిన్ దేశాలలో కొనసాగుతున్నట్లయితే పీడిత ప్రజల పోరాటం ఎలాంటి  ఫలితాలకు దారితీస్తుంది? రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం సాధ్యమేనా? సాధ్యమైతే క్యూబా కంటే కష్టతరమైన పోరాటం తప్పదా?

ఇక్కడ మనం విశ్లేషించాల్సింది ఈ పరిస్థితులనే. ఆయా దేశాలలో ఉన్న ప్రత్యేక పరిస్థితులు, జాతీయవాద సిద్ధాంతాలు విప్లవ సాధన లక్ష్యాన్ని కష్టతరంగా

మార్చవచ్చు. సామ్రాజ్యవాద ధోరణి, ఇతర దోపిడీ విధానాలను ఇక్కడ ప్రస్తావించవచ్చు. బూర్జువా వర్గాల వైఖరి కూడా పరిగణలోకి తీసుకోవలసి వస్తుంది. భూస్వామ్య నిరంకుశ పాలకవర్గాలు తమ హక్కులకు భంగం కల్గిస్తే తప్ప బూర్జువా వర్గాలు విప్లవానికి మద్దతు తెలిపే అవకాశాలు లేవు. బూర్జువా, కార్మికవర్గాలు ఉద్యమంలో పరోక్ష పాత్ర పోషించే స్థితిలో ఫలితాలు అనుకూలంగా ఉండగలవు. క్యూబాలో ఈ విషయం స్పష్టమైంది. అయితే ఈ వర్గాలు ప్రజల పక్షాన్నో లేదా పాలకుల పక్షాన్నో నిలుస్తుంటాయి.

క్యూబా పాఠాన్ని సామ్రాజ్యవాదం బాగా అర్థం చేసుకుంది. విప్లవానికి దారి తీసే పరిస్థితులను కల్పించకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశముంది. లాటిన్ అమెరికాలోని ఇరవైకి పైగా దేశాలలో సామ్రాజ్యవాద శక్తుల ప్రభావం ఎక్కువగా ఉంది. రోమన్ సామ్రాజ్యవాదం తరహా నినాదాన్ని ప్రజాపోరాటాలు మట్టికరిపించగలవనే విషయాన్ని సంపన్న దేశాలు గ్రహించాయి. బలమైన సైన్యాన్ని సైతం ఖంగుతినిపించగలవని అని అర్థం చేసుకున్నాయి. క్యూబాలో పరిస్థితులు విషమంగా ఉంటే, ఇతర దేశాలలో అవి మరింత జటిలంగా ఉండే అవకాశాలే ఎక్కువ.

అమెరికా ఇప్పుడు పాలకవర్గాలను ఆయుధపరంగా మరింత బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తోంది. ఆయుధాల ఎగుమతి ఎక్కువైంది. తమకు అనుకూలమైన వాణిజ్య, వ్యాపార ఒప్పందాలను కుదుర్చుకుంటోంది. ఉద్యమాలను అణచివేయడానికి పాలక సైన్యాలను సమాయత్తం చేస్తోంది.

బూర్జువా వర్గాల సంగతేమిటి? జాతీయ బూర్జువా వర్గం తనకు తానుగా సామ్రాజ్యవాద శక్తులను అడ్డుకోలేదు. కనీసం నామమాత్రపు ఉద్యమ స్వభావాన్ని కూడా ప్రదర్శించలేదు. ప్రజాపోరాటాన్ని కూడా అది సమర్థించలేదు, ఎందుకంటే విప్లవం సంభవిస్తే తమకున్న పరపతిని, హక్కులను కోల్పోతామని దానికి తెలుసు.

విప్లవాన్ని బూర్జువా వర్గాలు బాహాటంగానే వ్యతిరేకిస్తాయి. అవసరమైతే పాలక వర్గాలకు మద్దతు తెలపడానికి కూడా వెనుకాడవు. విప్లవ మార్గాలను మూసివేయడానికి భూస్వాములను, విదేశీ వాణిజ్య సంస్థలను సమర్థించగలవు. ఇలాంటి సామాజిక వర్గాలే ఇపుడు లాటిన్ దేశాలలో విప్లవ ప్రభుత్వాల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నాయి.

క్యూబా కంటే దారుణమైన పరిస్థితులు నేడు లాటిన్ అమెరికా దేశాల్లో ఉన్నాయి. గెరిల్లా దళాల ఏర్పాటు, ప్రజలను సమీకరించడం కష్టసాధ్యమనే చెప్పాలి. క్యూబా వలె ఇక్కడ రైతాంగాన్ని విప్లవానికి సిద్ధం చేయడం కూడా కష్టం. పట్టణాలు, నగరాలలో పారిశ్రామికీకరణ ఎక్కువై గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో వలసపోయారు. వాస్తవంగా పారిశ్రామికీకరణ ప్రజల జీవితాలపై అంతగా ప్రభావం చూపలేదనే చెప్పాలి. నగర జీవనశైలి గెరిల్లా దళాల ఏర్పాటుకు ఆటంకంగా మారే అవకాశం ఉంది. సంఘటనాతత్వం పెరగడంతో విప్లవ ఉద్యమానికి పరిస్థితులు అనుకూలించకపోవచ్చు. విప్లవ శక్తులను పాలనలో భాగస్వాములను చేసి రాజకీయ స్థిరత్వాన్ని సాధించడానికి పాలకులు ప్రయత్నించే అవకాశం ఉంది.

అయితే రాజకీయ స్థిరత్వం సాధించడానికి ప్రస్తుత పరిస్థితులు అనుకూలించే అవకాశం లేదు. ఒక వేళ ఎన్నికలు నిర్వహిస్తే పరిస్థితుల్లో కొంత మార్పు వచ్చే వీలుంది. ఇది కేవలం ఊహాగానమే.

విప్లవకార్యాచరణ అమలులో వచ్చే అడ్డంకులను విప్లవనేతలు విశ్లేషణాత్మకంగా అంచనా వేయలేకపోతున్నారు. విప్లవ వ్యూహాలను చాకచక్యంగా అమలు చేయగల సామర్థ్యం నాయకత్వానికి ఉన్నపుడే ప్రజలలో ఉద్యమంపై విశ్వాసం కలుగుతుంది. ఎన్నికల వ్యవస్థను కూడా వాడుకోవడంలో తమ ప్రతిభను విప్లవకారులు చాటుకోవాల్సి ఉంది. అలాగే కేవలం ఎన్నికలకే పరిమితం కాకుండా ఉద్యమాన్ని నిరంతరం కొనసాగించగల ప్రణాళికను వారు సిద్ధం చేసుకోవాలి. విప్లవ కార్యాచరణ లేకుంటే సత్ఫలితాలు సాధించలేమని వారు తెలుసుకోవాలి.

ఎన్నికల్లో విజయం సాధించి రాజకీయాధికారాన్ని చేపట్టినా తిరోగమన శక్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశముండదు. బూర్జువా, సైనిక వర్గాలను కట్టడి చేయడం సాధ్యం కాదు. తమ ఆధిపత్యానికి సవాళ్లు ఎదురైతే కొత్తగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోయడానికి సైతం సైన్యం వెనకాడదు. మళ్లీ దోపిడీ వ్యవస్థ తెరపైకి వచ్చే అవకాశముంది. ఈ రాజకీయ చక్రం పరిభ్రమిస్తూనే ఉంటుంది. కనుక పరిస్థితులు ఎంత అనుకూలంగా లేనప్పటికీ ఉద్యమ బాటలో పయనిస్తూ ప్రజలను విప్లవానికి

సిద్ధం చేయాల్సిన బాధ్యత విప్లవ నాయకత్వంపై ఉంది. నగర ప్రాంతాల్లో సైతం ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సి ఉంటుంది. ఇందుకు శివారు ప్రాంతాలను వేదికగా చేసుకోవడం ముఖ్యం. గెరిల్లా దళాలు మారుమూల గ్రామీణ ప్రాంతాలు, పర్వతశ్రేణుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తూ పాలక వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాలి. గెరిల్లా యుద్ధానికి అనువైన ప్రాంతాలను ఎంపిక చేసుకొని పాలకవర్గాలపై పోరును తీవ్రతరం చేయాలి. అలాంటి ప్రాంతాలలో సైన్యం కూడా జోక్యం చేసుకోవడానికి వీలు లేకుండా పటిష్టమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. స్థానిక ప్రజలు, ముఖ్యంగా రైతులను సమీకరించి వారి అండదండలతో విప్లవ లక్ష్యాలను సాధిస్తూ ముందుకెళ్ళాలి.

సాయుధ పోరాటానికి అవసరమైన ఆయుధాలను, రక్షణ సామాగ్రిని వ్యూహాత్మక దాడులు జరిపి బలమైన ప్రభుత్వ సైన్యం నుండే అపహరించుకోవలసి ఉంటుంది. పట్టణ, నగర ప్రాంతాలలో కూడా ఇలాంటి దాడులు జరిపి ఆయుధాలను సమీకరించుకోవలసి ఉంటుంది. రైతాంగాన్ని ముందువరసలో ఉంచి విప్లవ సాధనకు కార్యాచరణ సిద్ధం చేయాలి. నగర ప్రాంతాలలో ఉద్యమం బలహీనపడినా, గ్రామీణ, కొండప్రాంతాలలో విప్లవాన్ని సైన్యం అణచివేయలేదు. అలాగే విప్లవకారుల స్థావరాలు కూడా శత్రుసైన్యం నుండి సురక్షితంగా ఉంటాయి. నాయకత్వం ఈ స్థావరాల నుండే సాయుధ పోరాటాన్ని నిర్దేశిస్తూ, అవసరమైన పక్షంలో ఇతర ప్రాంతాలకు స్థావరాలను మారుస్తూ లక్ష్యసాధనపై దృష్టి సారించాలి. పట్టణ, నగర ప్రాంతాల వైశాల్యం ఎక్కువున్న దేశాలలో సైతం గెరిల్లా యుద్ధం చేయడానికి పై సూచనలు పాటించడం ఎంతో అవసరం.

విప్లవం తేవడానికి సైన్యం మద్ధతు తీసుకునే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరం. ముందుగా సైన్యం పటిష్టమైన నాయకత్వం కలిగి, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే శక్తి కలిగి ఉండాలి. అలా పటిష్టమైన నాయకత్వం ఉంటేనే సైనిక తిరుగుబాటుకు అవకాశం ఉంటుంది. ఇంకో కల్పన ఏమిటంటే సైన్యం విప్లవ సైన్యం చేతిలో ఘోర పరాజయాన్ని ఎదుర్కొంటూ మనోధైర్యం కోల్పోయిన సందర్భంలో, వారితో వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకొని రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం. ఇందుకు విప్లవ సైన్యం నిరంతరంగా శ్రమపడాల్సి ఉంటుంది.

అయితే ప్రధానమైన మార్గం మాత్రం గెరిల్లా యుద్ధాన్ని కొనసాగిస్తూ, కార్మిక వర్గాలతో చేయి కలిపి పట్టణ, నగర ప్రాంతాలలో ఉద్యమాన్ని బలోపేతం చేసుకుంటూ అంతిమ లక్ష్యాన్ని సాధించడం.

సియర్రా మాయెస్త్రా తరహాలో నేడు లాటిన్ దేశాలలో పరిస్థితులున్నాయా అన్న విషయాన్ని ప్రాథమికంగా విశ్లేషించాల్సి ఉంది. ఇప్పుడున్న పరిస్థితులు విప్లవ పోరాటానికి నాంది పలకవచ్చనేది నా అభిప్రాయం. విప్లవ విజయం తథ్యమనే నమ్మకం, అందుకు తగిన పరిస్థితులను కల్పించడం ముఖ్యం. గ్రాన్మా సాహసం, తర్వాత ఏర్పడిన గెరిల్లా దళాలు క్యూబా విప్లవానికి ఎలా బాటలు వేశాయో అలాంటి చర్యలే లాటిన్ దేశాలలో ప్రజాపోరాటానికి నాంది పలకగలవు. గ్రామీణ ప్రాంతాల నుండి ఆక్రమణ చేసి నగర ప్రాంతాలను కైవసం చేసుకునే వరకు విప్లవ పోరాటాన్ని కొనసాగించడం క్యూబాలోనే సాధ్యమైందన్న కొందరి వాదనను నేను తోసిపుచ్చుతున్నాను. లాటిన్ దేశాలలో సైతం ఈ వ్యూహాన్ని సమర్ధవంతంగా అమలు చేయడానికి ప్రాథమిక పరిస్థితులు అనుకూలించగలవన్నది నా వాదన.

రైతాంగ దళాలు విప్లవ నాయకత్వ నిర్దేశాలతో ముందుకుసాగుతూ అంతిమ లక్ష్యాన్ని సాధించవచ్చు. ఇంకో ప్రధాన అంశం ప్రజల ఆలోచనా వైఖరి. కొన్ని త్యాగాలు తప్పవని, భవిష్యత్ ఉజ్వలంగా ఉండగలదనే ఆలోచన వారిలో ఉంటే విప్లవానికి పునాదులు వేయడం అంత కష్టమేమీ కాదు. అయితే ఆయా దేశాలలో రాజకీయ, సామాజిక పరిస్థితులు వేరుగా ఉన్నాయన్నది మాకు స్పష్టంగా తెలుసు. కాని ఒక్క విషయం మాత్రం నిజం. క్యూబా రైతుల కంటే లాటిన్ దేశాల రైతాంగం పరిస్థితి దారుణంగా ఉంది. రైతాంగం వర్గ రూపం దాలుస్తోందన్న వాదన కేవలం ఊహాతీతం. వారి జీవన ప్రమాణాలు దారుణంగా ఉన్నాయి. వారు నిరంతరం దోపిడీకి గురవుతున్నారు. తాము పడ్డ శ్రమకు తగిన ఫలితం ఉండడం లేదని గ్రహించారు. విప్లవ కాంక్ష వారిలో బలంగా ఉంది. ఈ అవకాశాన్ని చేజిక్కించుకొని విప్లవ పోరుకు బాటలు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవసాయ రంగ సంస్కరణలు విప్లవానికి ఆజ్యం పోయగలవు. భూమి పంపిణీ, భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనతో విప్లవాన్ని సాధించవచ్చు. రైతాంగాన్ని విప్లవ సైన్యంలో ప్రధాన విభాగంగా గుర్తించి, వారిలో విశ్వాసాన్ని నింపాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉంది. అయితే ఈ

ఖండమంతటా రైతుల ఆలోచన ఒకేలాగా లేదు. అర్జెంటీనా రైతుతో పోలిస్తే పెరూ, బొలివియా లేదా ఈక్వెడార్ రైతుల దృక్పథం వేరుగా ఉంటుంది. రైతాంగం వర్గీకరణ చెందుతోందన్న వాదన క్యూబా విషయంలో నిలవలేదు. అక్కడ సహకార సంఘాల ఏర్పాటు, భూమి పంపిణీ, వ్యవసాయ రంగ సంస్కరణలు అమలు చేయడానికి ఎలాంటి ఇబ్బందులూ ఎదురుకాలేదు.

లాటిన్ అమెరికాలోనూ దాదాపు అదే పరిస్థితి ఉంది. భూమిపై ఆశను రైతులు ఇంకా వదులుకోలేదు. వ్యవస్థపై వారిలో కసి ఏర్పడింది. వారిని సాయుధ పోరాటానికి సన్నద్ధం చేయడానికి ఎలాంటి ఆటంకాలు ఉండవని నేను భావిస్తున్నాను. బాటిస్తా సైన్యంలో ప్రతి ఒక్కరూ దోపిడీ వ్యవస్థకు సహకరించే వారుండేవారు. వారు పూర్తిగా ప్రభుత్వ సేవలో మునిగి ఉండేవారు. దోపిడీ వర్గం ప్రతినిధులుగా వారు గుర్తింపు పొందడం వల్లే వారితో యుద్ధం చేయడానికి రైతులు వెనుకాడలేదు. లాటిన్ సైన్యాలు వృత్తిపరమైనవి. వాటిలో గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన అనేక మంది యువకులు సైనికులుగా పని చేస్తున్నారు. వారికి ప్రజల కష్టసుఖాలు కొద్ది మేరకైనా తెలుసు. విప్లవకారులతో యుద్ధం చేయాల్సి వచ్చినా వారు మనస్ఫూర్తిగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించలేరు. దీనికి తోడు విప్లవ నాయకత్వం తన ప్రచారాన్ని ఉధృతం చేయగలిగితే వారి మనో ధైర్యం కూడా దెబ్బతినే అవకాశం ఉంది. ఈ పరిస్థితులే ఏర్పడితే విప్లవోద్యమానికి తగిన ప్రతిఫలం దక్కుతుంది.

# నవీన పని సంస్కృతి

## (1962 - ఆగస్టు 21)

**(క్యూబా కార్మిక సంఘాలు హవానాలో ఏర్పాటు చేసిన సభలో చేసిన ప్రసంగ వ్యాసమిది. కార్మిక సంఘాల(సిటిసి) ప్రధాన కార్యదర్శి లజారోపెనా కూడా సభలో మాట్లాడారు.)**

**కామ్రేడ్స్** ! లజారో ఇంతకు ముందు చెప్పినట్లు ఈ సభ రెండు లక్ష్యాలను సాధించడానికి ఉద్దేశించినది. జర్మన్ కార్మికులకు కృతజ్ఞతలు తెలుపుకోవడంతో పాటు మన కార్మికులు ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినందుకు వారిని అభినందించడం ఈ సభ ముఖ్య ఉద్దేశాలు.

పరిశ్రమలు వేరైనా ప్రజల అవసరాలను తీర్చడానికి తగిన ఉత్పాదన చేయడమే వాటి లక్ష్యం. ఆహార ధాన్యాల నుండి మద్యం తయారీ వరకు అనేక ఉత్పత్తులను అవి సాధిస్తున్నాయి.

అయితే ప్రస్తుత పరిస్థితుల వల్ల మద్యం తయారీ కర్మాగారాలు తమ లక్ష్యాలను సాధించలేకపోయాయి. ముఖ్యంగా గుత్తాధిపత్య విధానాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ముడి సరుకు కోసం ఇతర దేశాలపై ఆధారపడడం వల్ల, మద్యం తయారీ లక్ష్యాలను భారీగా తగ్గించుకోవలసి వచ్చింది.

దిగుమతులలో ఉన్న కష్టాల వల్లే కొన్ని ఇతర పరిశ్రమలు కూడా అనుకున్న రీతిలో అభివృద్ధి చెందలేకపోయాయి. స్థానికంగా లభించే సహజ వనరులను అత్యాధునిక విజ్ఞానంతో సక్రమంగా వినియోగిస్తూ దేశ సంపదను పెంచుకోవలసిన అవసరం ఇపుడు

ఏర్పడింది. ఆధునిక యంత్రాలను సమకూర్చడానికి సోషలిస్టు దేశాలు సిద్ధంగా ఉన్నాయి. సహజవనరులను పొదుపుగా వినియోగిస్తూనే సమతూల్యమైన అభివృద్ధి సాధించడానికి మనం ప్రణాళికలుసిద్ధం చేసుకోవాలి. విప్లవ చైతన్యంతో ముందుకు సాగాలి.

పరిశ్రమలు, కార్మికులు, ప్రభుత్వం మధ్య సమన్వయం ఉండాలి. సమన్వయం ఉంటేనే తగిన ఫలితాలు సాధించడానికి వీలుంటుంది. సోషలిస్టు దేశాలు ఇందుకు ఉదాహరణ. హవానాలోని ఈచెవెరియా ధాన్యాగారంలో సుమారు లక్ష బస్తాల ధాన్యాన్ని ఉత్పత్తి చేసిన సందర్భంగా కొన్ని రోజుల క్రితం ఉత్సవం కూడా నిర్వహించాం. మనకు పోటీదారులైన శాంటియాగో ఫ్రాంక్‌పాల్స్ ధాన్యాగారం సుమారు 50,000 బస్తాల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించింది. ఇలా పోటీపడి ఉత్పత్తిని పెంచాల్సిన బాధ్యత కార్మికులపై ఉంది. ఈ సభ కార్మికులను అభినందించడానికి, వారిని జాతి నిర్మాణంలో మరింత కార్యోన్ముఖులను చేయడానికి ఉద్దేశించినదే. అలాగే మన ముందున్న సవాళ్లను పరిగణలోకి తీసుకొని ఇప్పటి వరకు మనం సాధించిన లక్ష్యాలపై ఆత్మ విమర్శ చేసుకోవలసిన అవసరం కూడా ఉంది. పోటీతత్వంతో ముందుకు సాగుతూ ప్రజలను పునర్నిర్మాణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాల్సి ఉంది.

గత నవంబర్‌లో జరిగిన కార్మిక సమాఖ్యల సదస్సులో కొన్ని మార్గదర్శక సూత్రాలను ఆమోదించాం. వాటిని ఆధారంగా చేసుకొని ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తున్నందుకు సంతోషంగా ఉంది. అయితే నియమాలు, ప్రభుత్వశాఖలు చట్రం నుండి బయటపడలేకపోతున్నాం. నిపుణులైన అధికారులు ఆయా శాఖలను పర్యవేక్షించాల్సిన అవసరముంది. మంచి ప్రణాళికలను స్ఫూర్తిగా తీసుకొని ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నించాలి. అయితే ప్రజలనుకూడా ఇందుకు సిద్ధం చేయాలి. విప్లవ స్ఫూర్తితో ఉత్పాదన రంగంలో అభివృద్ధి సాధించాలి.

తప్పుల నుండి గుణపాఠం నేర్చుకొని సామూహిక స్పృహతో ముందుకు సాగాలి. కార్మికులే కాకుండా ఇతర వర్గాలు కూడా పారిశ్రామికాభివృద్ధి వల్ల లబ్ధి పొందేలా ప్రణాళికలు రూపొందించాలి. సోషలిస్టు దేశాలు చూపిన బాటలో నడుస్తూ ఉత్పత్తిని గణనీయంగా పెంచగలిగితేనే మన అభివృద్ధికి సార్థకత ఉంటుంది. పోటీతత్వం అన్నది ప్రతి ఒక్క కార్మికునిలో ఉండాలి. దేశానికి ఇది చాలా అవసరం. దీని ఫలితాలు ఉన్నతంగా

ఉండాలి. అదే సమయంలో సహజ వనరులను కాపాడుకోవడానికి ప్రయత్నించాలి. వ్యవస్థాగతంగా అభివృద్ధి సాధిస్తేనే మనకు మనుగడ ఉంటుంది. ఈ విషయాన్ని ఆయా సందర్భాల్లో కార్మికులకు నొక్కి చెబుతూనే ఉన్నాం. విప్లవంలో ఇదో ముఖ్యమైన దశ. సామ్రాజ్యవాద శక్తులను అడ్డుకుంటూ సామ్యవాద దేశంగా క్యూబాను తీర్చిదిద్దడానికి కష్టపడుతున్నాం. బలమైన శత్రువు మనకు కేవలం 150 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాడని గుర్తించాలి. మన దేశ కార్యకలాపాలపై వారు నిరంతర నిఘా వేసి ఉంచారు. గాంటోనమ్ స్థావరం నుండి వారు గూఢచర్యం చేస్తున్నారు. ఏ క్షణంలోనైనా వారు మనపై సైనిక చర్య తీసుకునే అవకాశం ఉంది. అదే జరిగితే చరిత్ర ఎన్నడూ ఎరుగని రక్తపాతం సంభవిస్తుంది.

ప్రపంచ కార్మిక వర్గానికి క్యూబా నాయకత్వం వహిస్తోంది. సామ్రాజ్యవాద ప్రభావం ప్రబలకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో దేశాన్ని ప్రగతిబాటపై నడపాలని మేము కృషి చేస్తున్నాం. కొత్త సమాజాన్ని నిర్మించి దోపిడీదారి వ్యవస్థను అంతమొందించే ప్రయత్నాలు చేస్తున్నాం. పీడిత ప్రజలను విముక్తి చేసి గుత్తాధిపతులను దేశం నుండి తరిమివేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. విదేశీ సైన్యం మనపై దాడి చేయనంత వరకు మన పోరాటక్షేత్రం నిత్యం కర్మాగారాలు, వ్యవసాయ భూమే కావాలి. నిరంతర శ్రమ మన ఆయుధం కావాలి. పని పట్ల నిబద్ధత, అంకితభావాన్ని అలవర్చుకోవాలి. శ్రామికుల కష్టంపైనే సామ్యవాద సౌధాన్ని నిర్మించగలం. అయితే ఉత్పాదన పెంచకపోతే మనం ఈ లక్ష్యాన్ని సాధించలేము.

సామ్యవాదం అన్నది జాతీయ సంపదను ప్రజలకు సమానంగా పంచడం ఇందుకు పెట్టుబడి, యంత్రాలు, సాంకేతిక విజ్ఞానం, ముడిసరుకు అన్నీ అవసరం. ప్రజలకు సరిపడ ఉత్పత్తులను మనం తయారు చేయాల్సి ఉంది. అప్పుడే సామ్యవాదాన్ని ప్రతిష్ఠించినట్లవుతుంది.

కొత్త కర్మాగారాల నిర్మాణం చాలా అవసరం. ఎందుకంటే సామ్యవాదం ఈ పరిశ్రమలపైనే ఆధారపడి ఉంటుంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన సమాజంలోనే సామ్యవాదం పునాదులు వేయడానికి అవకాశముంటుంది. భూస్వామ్య వ్యవస్థలో ఇది సాధ్యం కాని పని. శ్రమ ఉత్పాదనకు దారి తీస్తుంది. వైవిధ్యం, అంకితభావం తోడైతే

సామ్యవాద చింతన మనలో మరింత పెరుగుతుంది. ఉత్పాదన, అధికోత్పత్తి, చైతన్యం ఆధారంగానే కొత్త సమాజాన్ని నిర్మించగలం.

కొత్త సమాజం ఇంకా ఏర్పడలేదన్న విషయాన్ని అందరూ గ్రహించాలి. పాత జ్ఞాపకాలు, విప్లవ పోరాట అనుభవాలు గతంలో చేసిన తప్పులు ఇంకా మన ఆలోచనల నుండి చెరిగిపోలేదు. కార్మిక వర్గాలు ఎంతో కష్టపడుతున్నప్పటికీ అవి ఇంతవరకు పరిపూర్ణం కాలేదు. వారిలో స్వార్థచింతన, ఇతర దురాచారాలు ఇంకా ఉన్నాయి. వీటి కారణంగానే ఇన్నాళ్లూ మనం అభివృద్ధి చెందలేకపోయాం.

ఈ వ్యవస్థ వారసులం మనం. రాజ్యవ్యవస్థను కూల్చివేసి మరో పాలనా శకాన్ని ప్రారంభించాం. అయితే చారిత్రకంగా వస్తున్న దురాచారాలను ప్రజలలో తొలగించలేకపోయాం. సాంఘిక, సామూహిక, వర్గపరంగా శ్రమపడ్డా కొత్త ఆలోచనా ధోరణిని కల్గించలేం. ప్రతి ఒక్కరూ పనిచేయడం తమ నైతిక హక్కు అని భావించేలా సామాజిక చైతన్యం తీసుకురావలసిన అవసరం ఎంతో ఉంది.

ప్రజలు, ప్రభుత్వం మధ్య సంబంధాలను మరింత పటిష్టపరచడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలను జాతి నిర్మాణంలో భాగస్వాములను చేసి పాత ఆలోచనలను, దురలవాట్లను రూపుమాపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సామ్యవాదంవైపు మన దేశాన్ని తీసుకెళ్లి అభ్యుదయ క్యూబాను నిర్మించడానికి కంకణం కట్టుకున్నాం. ఈలక్ష్యం సాధించడానికి ఇంకా ఎన్నో సంవత్సరాలు పట్టవచ్చు. అయితే అందుకు ప్రజలను సంసిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

ఇతర కారణాలను తీసుకుంటే మొదటిగా క్రమశిక్షణ మనకెంతో అవసరం. విప్లవం సాధించినపుడు కార్మికులు తమపై భారం తగ్గిపోయినట్లు భావించారు. ఎందరో సహచరులు ఇక తమ బాధ్యత ఏమీ లేదనట్లు ప్రవర్తించారు. ఇది పాత ధోరణులను సూచిస్తోంది. బాధ్యతలు మరచి కేవలం హక్కుల గురించే ఆలోచించడం పాత వ్యవస్థ నైజాన్ని గుర్తుకు తెస్తోంది. జాతి నిర్మాణ ప్రక్రియలో క్రమశిక్షణ కీలకపాత్ర పోషిస్తుంది. క్రమశిక్షణను తిరస్కారధోరణిగా భావించరాదు. ఇపుడు మనముందున్న లక్ష్యాలను అధిగమించడానికి క్రమశిక్షణ ఒక్కటే సరైన పరిష్కారం. కేంద్రీకృత ప్రజాస్వామ్యంలో తీసుకున్న సామూహిక నిర్ణయాలకు కట్టుబడి ఉండడం క్రమశిక్షణగా భావించాలి. ప్రభుత్వ

మార్గదర్శక సూత్రాలను పాటించడం ఈ కోవలోకే వస్తుంది. ఉత్పాదన, ఇతర రంగాలలో క్రమశిక్షణా లేకుంటే ఉత్పత్తి లక్ష్యాలు సాధించడం కష్టతరమవుతుంది. కార్మిక సమాఖ్యలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వానికి సూచనలు అందిస్తూ నిర్ణయాలలో భాగస్వాములు కావాలి. పాలనాపరమైన వ్యవహారాల్లో కూడా క్రమశిక్షణ ఎంతో అవసరం.

ఇంతకు ముందు ప్రతి అంశంలోనూ మనలో క్రమశిక్షణ లోపించింది. గెరిల్లా దళాలు మొదలుకొని రైతాంగం, కార్మికవర్గాలు, ఇతర సముదాయాలు క్రమశిక్షణ లేకుండా వుండేవారు. కార్మికవర్గాలు ఆర్థికరంగంలో కట్టుబాటు లేకుండా తప్పి ఇష్టానుసారంగా వ్యవహరించేవారు. ఈ పరిస్థితిని కొంతవరకు అదుపులోకి తెచ్చినా ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. అధికారాన్ని, కేంద్ర ప్రభుత్వ బాధ్యతలను మనం గౌరవించాలి. ఇటీవలే ఒక ఫ్యాక్టరీ యజమానికి జరిమానా విధించాం. కేంద్ర ప్రణాళికా సంఘం నిర్ణయాలను బేఖాతరు చేసినందుకు ఈ చర్య తీసుకున్నాం.

అనేక మంది ఫ్యాక్టరీ డైరెక్టర్లు కూడా ఈ శిక్షకు గురయ్యారు. అయితే వారి విప్లవ చింతన, కష్టపడే స్వభావం, వారి నిబద్ధత పట్ల మాకెలాంటి అనుమానాలు లేవు. కాకపోతే ప్రభుత్వ ఉత్తర్వులను సాధ్యమైనంత వరకు పాటించడానికి వారు చర్యలు తీసుకోవలసి ఉంది. పాలనారంగంలోనే కాక ఉత్పత్తి రంగంలో కూడా క్రమశిక్షణకు పెద్ద పీట వేస్తే దేశం అభ్యుదయ బాటలో పరుగులు తీస్తుందనే నమ్మకం నాయకత్వానికి ఉంది. ఇందుకు ప్రతి వ్యక్తి తన సహకారాన్ని అందించాలి. మనకు రెండు ప్రాథమిక విధానాలు వున్నాయి. ఒకటి పని విధానం, రెండవది సాధారణ జీతభత్యాల విధానం. వీటి ఆధారంగానే నవసమాజాన్ని నిర్మించగలం. మే డే సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కొన్ని గనుల్లో ఈ విధానాలను ప్రవేశపెట్టాం. వాటి అమలు తీరును విశ్లేషించాక దేశవ్యాప్తంగా అన్ని కర్మాగారాల్లో వాటిని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటాం. ఈ విధానాల రూపకల్పనకు ప్రజలు సహకరించాలి. సదస్సులు, సమావేశాలు నిర్వహించి ప్రభుత్వానికి తగిన సూచనలివ్వాలి. కార్మిక సంఘాలు, విప్లవ పార్టీలు, ప్రభుత్వ యంత్రాంగం, కార్మికులు అందరూ ఇందులో పాలుపంచుకోవాలి.

పని విధానాలు అమలైతే ఉత్పాదనలో రాశి, వాసి రెండూ పెరుగుతాయి. ఫలితంగా సమాజమూ బాగుపడుతుంది. నాణ్యమైన వస్తువులను ప్రజలకు అందించడమే

కార్మికుల ధ్యేయం కావాలి. సామ్యవాద నినాదం నాణ్యతకు ఎక్కడా అడ్డంకిగా నిలిచే అవకాశంలేదు. ప్రజలకు అత్యుత్తమ సేవలు, నాణ్యమైన ఉత్పత్తులు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. అయితే క్రమశిక్షణతో ఇవన్నీ సాధించాల్సి ఉంటుంది.

మిత్రదేశాలు మనకు అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆధునిక యంత్రాలను, రుణాలను సద్వినియోగం చేసుకొని సమాజ ఉత్థానానికి పాటుపడాలి. శారీరక శ్రమ ఎంతో విలువైనది. పెద్ద పెద్ద కర్మాగారాల్లో ఆధునిక యంత్రాలున్నా కార్మిక శక్తికి మించిన పెట్టుబడి మరొకటి లేదు. కార్మిక శక్తిని సరైన మార్గంలో వినియోగించడానికి నాలుగేళ్ల ప్రణాళికా కాలంలో ఎన్నో చర్యలు తీసుకుంటున్నాం.

పారిశ్రామికాభివృద్ధి సాధించడానికి ప్రజలు కూడా అనేక త్యాగాలు చేయాల్సి ఉంటుంది. మిత్ర దేశాల సహకారం మన త్యాగాన్ని కొద్ది మేరకైనా తగ్గిస్తున్నది. అయితే మనం ఏ మాత్రం వెనుకంజ వేయకుండా కొత్త పరిశ్రమల స్థాపనపై దృష్టి కేంద్రీకరించాలి. నవసమాజం నిర్మాణానికి పునాదులు వేయాలి. అమెరికా సామ్రాజ్యవాద కేంద్రాలను ధ్వంసం చేయడం అంత సులభమైన పని కాదు. వారి నిరంకుశ విధానాలను మనం సమర్థవంతంగా ఎదుర్కొనే స్థాయికి ఇంకా చేరుకోలేదు. అయితే తగిన శక్తి సామర్థ్యాలు ఆర్జించడానికి కొన్ని త్యాగాలు చేయకతప్పదు. ఆర్థిక ఆంక్షలు, మోసపూరిత వాణిజ్య ఒప్పందాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. మన సమాజాన్ని శత్రువు బారి నుండి కాపాడుకోవాలి. లాటిన్ అమెరికాలో సామ్యవాద సమాజం తొలుత మన దేశంలోనే ఆవిర్భవించాలి. పీడిత ప్రజలకు క్యూబా ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలవాలి.

లాటిన్ దేశాల ప్రతినిధులు క్యూబా సందర్శించినపుడు లేదా హవానా రేడియో ద్వారా ఇక్కడి సంగతులు తెలుసుకున్నపుడు లాటిన్ ప్రజలలో సరికొత్త చైతన్యం వెల్లివిరుస్తుంది. మార్పు అవసరమని పీడిత ప్రజలు భావిస్తున్నారు. నిరంకుశ విధానాలను, దోపిడీ వ్యవస్థను వ్యతిరేకిస్తున్నారు. తమకు జరుగుతున్న అన్యాయం గురించి గళం విప్పుతున్నారు. రైతాంగం, కార్మికులు, ఇతర వర్గాలతో రాజకీయ, సామాజిక చైతన్యం క్రమంగా పెరుగుతోంది. మార్పుపై వారిలో ఆశలు చిగురించాయి. విప్లవం సాధించడానికి తమ ఆయుధాలను పదును చేసుకుంటున్నారు.

క్యూబా విప్లవం సందర్భంగా మనం చేసిన త్యాగాలు వృధాగా పోకూడదు. మన బాధ్యత క్యూబా పరిధి దాటి అనేక దేశాల ప్రజలను దమనకాండ నుండి విముక్తి

చేయడమన్నది అందరూ గుర్తించాలి. ఈ ప్రయత్నంలో ఎన్ని అవాంతరాలు వచ్చినా వాటిని అధిగమించాలి.

సరే కామ్రేడ్స్ ! కొత్త సమాజ స్థాపనకు ఉన్నతమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక యంత్రాలు ఎంతో అవసరం. సోవియట్ నిపుణుడు మన ధాన్యాగారాల అభివృద్ధి కోసం చేపట్టిన సాంకేతిక చర్యలను మనం ఉదాహరణగా తీసుకోవాలి. అధికోత్పత్తి సాధించడానికి ఆధునిక పద్ధతులను వినియోగించాల్సి ఉంటుంది. అవసరమైన పెట్టుబడులు, ఆధునిక యంత్రాలను సమకూర్చుకోవాల్సి ఉంది. ఉత్పాదనలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవలసి ఉంది. జాతీయకరణ జరిగిన తర్వాత చాలా రబ్బరు ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. చాలా మంది కార్మికులు, నిపుణులు దేశం వదలిపోయారు. అయితే కొందరు కార్మికులు, ఒక క్యూబా సాంకేతిక నిపుణుడు చొరవ తీసుకొని వారిని స్వదేశానికి రప్పించారు. పరిశ్రమలను తెరవడమే కాకుండా కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా సమకూర్చుకున్నారు. క్రమంగా ఉత్పత్తిని కూడా పెంచారు. ఇప్పుడా పరిశ్రమ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది.

ఉత్సాహం, క్రమశిక్షణ, త్యాగ గుణం, శ్రమించే స్వభావం ఉంటే ఎంతటి క్లిష్టమైన లక్ష్యాన్నైనా సాధించవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం తగినంత లేకున్నా ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి ఆస్కారం ఉంటుంది. శిక్షణ, నైపుణ్యం ఉంటే కార్మికవర్గం ఉన్నత లక్ష్యాలను సాధించగలదు.

సాంకేతిక విద్య ప్రధానమైనది. భవిష్యత్తులో మనకు ఎంతో ఉపకరిస్తుంది. సవాళ్లను స్వీకరించి అసంభవం అన్న లక్ష్యాలను సైతం అధిగమించడానికి ఇప్పటి నుంచే సిద్ధం కావాలి. ' అసంభవాన్ని సంభవం చేయగలం' అన్న నినాదంతో కార్మికులు ముందుకు సాగాలి. శ్రమ ఎంతో ఉన్నతమైనది. దానిని గౌరవించడానికే ఈ సమావేశం నిర్వహిస్తున్నాం. పని పట్ల అంకితభావమే తగిన ఫలితాలు అందిస్తుంది.

ఒక్కసారి మనం గతాన్ని స్మరిద్దాం.శ్రమను అణచివేత లక్షణంగా అప్పుడు భావించేవారు. ఈ రకమైన పాత ధోరణులకు స్వస్తి చెప్పి దేశ నిర్మాణంలో ఉత్సాహంగా పాల్గొంటేనే నవ సమాజం సాధ్యమవుతుంది. కార్మికులు శ్రమపట్ల తమ వైఖరిని మార్చుకోవాలి. పని చేయడం నైతిక బాధ్యతగా గుర్తించాలి. ఆసక్తి, ఉత్సాహంతో

శ్రమపడటం నేర్చుకోవాలి. పని విధానాలను సక్రమంగా అర్ధం చేసుకొని నూతన పోకడలు సృష్టించాలి. సాంకేతికపరమైన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. సాంకేతిక శిక్షణ, నైపుణ్యాన్ని సమకూర్చుకోవాలి. శ్రమ సుఖసంతోషాలకు కేంద్రబిందువుగా మారాలి. సామ్యవాద సమాజం ఏర్పాటుకు శ్రమ ఎంతో కీలకం. అయితే కార్మికులు, శ్రామికుల్లో మార్పు అంత త్వరగా వస్తుందని భావించలేం. శ్రమపట్ల వైఖరి మారాలంటే తరాలు పట్టవచ్చు. నూతన వైఖరి అవలంభించినపుడే కార్మికుల జీవితాల్లో వెలుగు నిండుకుంటుంది. కనుక మన వైఖరిని నేటి నుండే మార్చుకోవడానికి ప్రయత్నిద్దాం. కార్మికులు ఒకరికొకరు ఆదర్శంగా నిలుస్తూ నిరంతర శ్రమతో సామ్యవాద సమాజ నిర్మాణానికి పాటుపడాలి.

విప్లవ చైతన్యంతో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకొని పనిలో వైవిధ్యాన్ని చూపాలి. ఇప్పుడే, ఈ రోజే ఇది సాధించగలమని నేను చెప్పడంలేదు. ఎందుకంటే ఇదో నిరంతర ప్రక్రియ. విప్లవంలో తాము భాగం కాదన్న భావనను ప్రజల ఆలోచన నుండి తొలగించాలి.

సామ్యవాద సమాజ నిర్మాణ లక్ష్యాన్ని మధ్యలో వదలివేయకుండా, ఆచరణాత్మక ప్రణాళికతో ముందుకు పోవాలి. కేవలం చర్చలతో కాలక్షేపం చేసే పరిస్థితులు నేడు లేవని గ్రహించాలి. సామ్యవాద దేశం నిర్మించాలంటే ప్రజలు తమ సంపూర్ణ సహాయసహకారాలు అందించాలి. వారిని సమైక్యపరిచే బాధ్యత కార్మిక సమాఖ్యలపై ఉంది. ప్రజలు శాస్త్ర సాంకేతిక దృక్పధాన్ని అలవర్చుకొని ఈ లక్ష్యసాధనలో పాలుపంచుకోవాలి. విప్లవంలో ఇదో ద్వితీయ క్రమం. పారిశ్రామికాభివృద్ధి, వ్యవసాయోత్పత్తిలో గణనీయమైన వృద్ధి సాధించేందుకు కార్మికులు, రైతులు నూతన సాంకేతిక పద్ధతులను పాటించాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత కృషి కంటే సామూహిక చర్యలే మనకు లక్ష్యంవైపు తీసుకెళ్లగలవు.

ఈ రోజు మనం కొందరు కామ్రేడ్లను సత్కరిస్తున్నాం. కేవలం నాయకులే కాక సవాళ్లు ఎదుర్కోవడానికి ముందువరుసలో నిలబడే ఈ కామ్రేడ్లు ఇతరులకు ఆదర్శం కావాలి. ప్రతి ఒక్కరి ముందు ఇప్పుడో లక్ష్యముంది. అదే సామ్యవాద సమాజ నిర్మాణం ఈ ఉద్యమంలో మనం తప్పక విజయం సాధిస్తాం.

# కార్యకర్తలు : విప్లవానికి మూలం

**(సెప్టెంబరు 1962)**

**వి**ప్లవ లక్షణాలను, పంథాను ఇప్పుడు విశ్లేషించుకోవలసిన అవసరం లేదు. జాతీయ విమోచనం నుండి సామ్యవాద విప్లవం వరకు దేశం ఎంచుకున్న విధానాలపై చర్చ అనవసరం. విప్లవ క్రమంలో జరిగిన సంఘటనలు, సామాజిక మార్పులు, ప్రజాపోరాట ఆవిర్భావం, చివరగా విప్లవ ప్రభుత్వం ఏర్పాటు తదితర విషయాలను నొక్కి చెప్పాల్సిన అవసరం కూడా లేదు. సానుభూతిపరులు, కార్యకర్తలు, సంఘాలు విప్లవ తొలిదశలో పాల్గొని ఉద్యమాన్ని బలోపేతం చేశారు. క్రమంగా అది ప్రజా ఉప్పెనలా ఎగిసిపడి నియంతృత్వ పాలనకు తెరదించింది. ఇదే క్యూబా విప్లవానికి విలక్షణత తెచ్చిపెట్టింది.

ఓ కొత్త సామాజిక వర్గం రాజ్యాధికారాన్ని చేపట్టిందని స్పష్టమైన తర్వాత దేశ సార్వభౌమాధికారాన్ని నిలుపుకోవడానికి ఎన్ని కష్టాలు పడ్డామో కూడా మాకు స్పష్టంగా తెలుసు. అధికారానికి పరిమితులు ఉంటాయని గ్రహించాం. దేశ పాలనా వ్యవస్థను సవ్యంగా నడపడానికి సరైన సంఖ్యలో కార్యకర్తలు లేరు. అలాగే రాజకీయ సంఘటనంలో, ఆర్థిక రంగంలో కార్యాలు చక్కబెట్టగల సమర్థులు కరువయ్యారు.

విప్లవం తర్వాత ఏర్పడిన ప్రభుత్వంలో ఉన్నత పదవులను సులభంగా భర్తీ చేశాం. ఇందులో ఎలాంటి కష్టాలు ఎదురుకాలేదు. ఎందుకంటే పాత పాలనావ్యవస్థ ఇంకా పూర్తిగా నశించిపోలేదు. వ్యవస్థ నెమ్మదిగా, దిశానిర్దేశం లేకుండా నడుస్తూ ఉండడంతో పాలనా వ్యవహారాలు స్తంభించిపోయాయి. అయితే వ్యవస్థకు ఓ రూపం

ఉండడం వల్ల రాజకీయ పరిణామాలతో పనిలేకుండా ప్రభుత్వాన్ని సమన్వయంతో నడపడానికి వీలు పడింది. జూలై26 ఉద్యమం మొదలుకొని విప్లవ క్రమంలో జరిగిన సైనిక దాడులు, ఇతర కారణాల వల్ల కార్యకర్తలను దేశ నిర్మాణ కార్యక్రమానికి సన్నద్ధం చేయలేకపోయాం. సోషలిస్టు పార్టీపై విపరీతమైన దాడులు జరగడంతో వారు కూడా పాలనా వ్యవహారాలు నడపడానికి కార్యకర్తలను సిద్ధం చేయలేకపోయారు.

విప్లవం తర్వాత చేపట్టాల్సిన బాధ్యతలపై కార్యకర్తలకు సరైన అవగాహన లేదు. ఆర్థిక రంగంలో ప్రభుత్వం తొలిసారిగా జోక్యం చేసుకున్నపుడు కార్యకర్తలు, పదాధికారులను గుర్తించడంలో పెద్ద గా సమస్య ఎదురుకాలేదు. నాయకులకు కొదవ ఉండేది కాదు. అయితే జాతీయకరణ కార్యక్రమం పూర్తి కాగానే నిపుణులైన అధికారులు లేరన్న సత్యాన్ని తెలుసుకున్నాం. ఉత్పత్తి రంగంలో సాంకేతిక నిపుణులు తక్కువ సంఖ్యలో ఉన్నారు. చాలా మంది దేశం విడిచి వెళ్లారు. రాజకీయ వ్యవస్థ సైద్ధాంతిక మార్గదర్శక సూత్రాల రూపకల్పనలో నిమగ్నమైంది.

నాయకులు తమ బాధ్యతలను సాధ్యమైనంత వరకు నిర్వర్తించారు. అయితే అడ్డంకులు, చిక్కులు ఎదుర్కోక తప్పలేదు. పాలనా వ్యవహారాల్లో ఎన్నో తప్పులు జరిగాయి. ఆయా సంస్థల అధిపతులు ఘోరమైన తప్పిదాలుచేశారు. రాజకీయపరంగా కూడా కొన్ని తప్పుడు చర్యలు తీసుకున్నాం. అయితే ఈ గందరగోళంలో ఉద్యోగవర్గం తన పట్టును పదిలపర్చుకుంది. దానికి జనసామాన్యంతో ఎలాంటి సంబంధాలు ఉండేవి కావు.

వాస్తవ పరిస్థితులను సక్రమంగా అంచనా వేయకపోవడం వల్లే ఈ తప్పులు జరిగాయి. విప్లవ ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసే నిస్వార్థ కార్యకర్తలు కరువయ్యారని గ్రహించాం. సమర్థులైన, నిపుణులైన క్షేత్రస్థాయి కార్యకర్తలను తీర్చిదిద్దితేనే ప్రభుత్వ పథకాలు విజయవంతమవుతాయని ఆలస్యంగానే తెలుసుకున్నాం. విప్లవం తొలి దశలో ప్రజలతో ఏర్పరుచుకున్న సంబంధాలను తిరిగి పునరుద్ధరించుకోవాలని నిర్ణయించాం. ఇందుకు తగిన యంత్రాంగం కావాలని, రాజకీయ మాధ్యమాన్ని వినియోగించాలని – ప్రధానమంత్రి ఫైడేల్ కాస్ట్రో జోక్యంతో నిర్దేశించాం.

కార్యకర్తలంటే ఎవరు అనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నం కావచ్చు. తగిన రాజకీయ చైతన్యం కలిగి, కేంద్ర ప్రభుత్వం నుండి వెలువడే నిర్ణయాలను క్షేత్ర స్థాయికి అనుకూలంగా అన్వయించుకొని, ప్రజలవద్దకు వాటిని తీసుకెళ్లగలిగే సామర్థ్యం ఉన్న వ్యక్తిని కార్యకర్తగా

అభివర్ణించవచ్చు. అదే సమయంలో కార్యకర్త అన్న వాడు ప్రజల కోరికలను, వారి ఆశయాలను ప్రభుత్వానికి నివేదించగలిగి తగు పరిష్కార మార్గాలను అన్వేషించడానికి వీలు కల్పించాలి. కార్యకర్తకు సైద్ధాంతిక, పాలనాపరమైన క్రమశిక్షణ ఎంతో అవసరం. కేంద్రీకృత ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానాలు, వాటిలోని వైరుధ్యాలను తెలుసుకొని సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించే చొరవ ఉండాలి.

ఉత్పాదనారంగంలో సామూహిక నిర్ణయాలను ప్రోత్సహించి వ్యక్తిగత నిర్ణయ శక్తిని పెంచడంతో పాటు కార్మికులకు తమ బాధ్యతలను గుర్తుచేయగల చాతుర్యం కార్యకర్తకు అవసరం. ప్రభుత్వంపై అతనికి పూర్తి విశ్వాసం ఉండి, శారీరక, నైతిక ధైర్యంతో ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేయడంతో పాటు, వాటిపై వచ్చే ప్రతిపాదనలను, విమర్శలను గట్టిగా తిప్పికొట్టగల వాగ్ధాటి కలిగి ఉండాలి. విప్లవ లక్ష్యాలను సాధించడానికి అవసరమైతే ప్రాణత్యాగం కూడా చేయడానికి కార్యకర్త సిద్ధంగా ఉండాలి. తన గురించి ఆలోచించే గుణం కలిగి ఉండడంతో పాటు క్రమశిక్షణతో కూడిన నిర్ణయాధికార శక్తిని పెంచుకోవాలి.

మరో విధంగా చెప్పాలంటే కార్యకర్త సృష్టికర్త, ప్రజలలో పలుకుబడి ఉన్న నేత, రాజకీయ పరిజ్ఞానం ఉన్న నిపుణుడు. తన పరిధిలో సాధ్యమైనంత వరకు ప్రజల అభ్యుదయానికి పాటు పడుతూ ఉత్పాదనా శక్తిని పెంచే సామర్థ్యం అతనిలో ఉండాలి.

ఇలాంటి విశిష్ట లక్షణాలున్న కార్యకర్తలు క్యూబా ప్రజలలో చాలామంది ఉన్నారు. అతడు మనకు రోజు తారసపడుతుంటాడు. జాతి నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేయడానికి అతడిని తగిన విధంగా శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దాల్సి ఉంది. కార్యకర్తల వ్యక్తిగత కృషిని ప్రభుత్వం సాధ్యమైనంత మేరకు దేశ ప్రగతి కోసం వినియోగించాలి.

రోజువారీ కార్యక్రమాలతో కార్యకర్తలను సమీకరించి వారిని తీర్చిదిద్దాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కార్యక్రమాలను సరైన రీతిలో చేపట్టి సైద్ధాంతిక ప్రగతిని వేగిరపరచాల్సి ఉంది.

సామ్యవాద నిర్మాణ వ్యవస్థలో కార్యకర్తలను రాజకీయపరంగా ఎంతో అభివృద్ధి పరచాలి. రాజకీయ పరిణతి అంటే కేవలం మార్క్సిస్టు సిద్ధాంతాన్ని గ్రహించడం కాదు.

అలాగే కార్యకర్తలను వారి నిర్ణయాలకు బాధ్యులు చేయాలి. వారిలో క్రమశిక్షణ పెంచాలి. విప్లవ సమస్యలతో వారికి తీరిక లేకుండా చూడాలి.

కార్యకర్తలను ప్రజల నుండే ఎన్నుకోవాలి. అక్కడి నుండే సమర్థులు, నిస్వార్థులు, నిపుణులైన కార్యకర్తలు మనకు లభించగలరు. ఒక వేళ వారిలో ఈ లక్షణాలు లోపించినా, వారికి పూర్తి బాధ్యతలు అప్పజెప్పి వారి కార్యశీలతను పరీక్షించవచ్చు. పై పద్ధతుల్లో మేము కార్యకర్తలను ఎంపిక చేస్తూనే ఉన్నాం. అయితే వారిలో వ్యక్తిగత వికాసం సమతుల్యంగా జరగడం లేదు. వారికి దిశానిర్దేశం చూపే నాయకత్వం కొరవడింది. అలాగే విప్లవం తెచ్చిన మౌలిక మార్పులు కూడా వారికి అవరోధంగా ఉన్నాయి.

కొందరు కార్యకర్తలు తమ బాధ్యతల నిర్వహణలో విజయం సాధించినప్పటికీ అనేక మంది మధ్యలోనే తప్పుకున్నారు. అధికార దాహంలోనో, వ్యవస్థాగత చట్రంలోనో ఇరుక్కుపోయి తమ బాధ్యతలను విస్మరించారు.

విప్లవ విజయాన్ని మరింత స్థిరం చేసేందుకు వివిధ రకాల కార్యకర్తలు మనకెంతో అవసరం. ప్రజాసంఘాలను నడపడానికి రాజకీయ కార్యకర్తలు అవసరం. సమైక్య సామ్యవాద విప్లవ పార్టీ (United Party for Socialist Revolution) ద్వారా ఈ కార్యాన్ని సాధించగలం. అలాగే మనకు సైనిక కార్యకర్తలు కావాలి. సాయుధ పోరాటంలో పాల్గొన్న అనేక మంది యువకులను సైనిక కార్యకర్తలుగా నియమించుకోవచ్చు. వారికి సైద్ధాంతిక శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే ఆర్థిక రంగంలో ప్రభుత్వ ప్రణాళికలను అర్థవంతంగా అమలు చేసే కార్యకర్తలు కూడా ఇపుడు ఎంతో అవసరం.

వృత్తిపరమైన నిపుణులతో కలసి పని చేయాల్సిన అవసరం నేడు విప్లవనాయకత్వంపై ఉంది. శాస్త్రసాంకేతి రంగ నిపుణులు ఉత్పాదనారంగంలో సైద్ధాంతిక నిబద్ధతతో పని చేయాల్సి ఉంది. పాలనాపరమైన వ్యవహారాలలో, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలలో నైపుణ్యం కలిగిన కార్యకర్తలను నియమించి సామ్యవాద పునాదులను పటిష్టం చేయాల్సి ఉంది. ఈ లక్ష్యసాధనలో కార్యకర్తలకు రాజకీయపరమైన అవగాహన పూర్తిగా ఉండాలి. గుడ్డిగా విప్లవ సిద్ధాంతాలకు లోబడి కాకుండా వాస్తవిక దృక్పథంతో వారు తమ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. విశ్లేషణ, కార్యశీలతతో పాటు త్యాగగుణం వారిలో

ఉండాలి. జనబాహుళ్యం నుండే ఈ లక్షణాలు కలిగిన కార్యకర్తలను ఎంపిక చేయడానికి శాస్త్రీయమైన పద్ధతులు అవలంభించాల్సి ఉంది.

ఏ రంగమైనా కార్యకర్తల లక్ష్యం ఒక్కటే, బాధ్యతలు అవే. ఐక్య విప్లవ పార్టీకి కార్యకర్తలు దన్నుగా ఉండాలి. పార్టీ కార్యక్రమాలకు వారే కేంద్రబిందువు. లక్ష్యసాధన కోసం పార్టీకి వారు మోటారు వాహనం గేరు వలే వ్యవహరించాలి. నినాదాలతో ముందుకు సాగకుండా కార్యదక్షతతో ప్రజల సర్వతోముఖాభివృద్ధికి వారు పాటుపడాలి. నాయకత్వానికి, ప్రజల మధ్య వారు వారధులుగా వ్యవహరించాలి. విప్లవ స్ఫూర్తి ఏ మాత్రం తగ్గకుండా, పార్టీ కార్యక్రమాలలో ప్రజలను భాగస్వాములను చేయాలి.

కార్యకర్తల సమీకరణ అంశం అత్యంత ప్రధానమైనది. ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయకుండా తక్షణమే చేపట్టాలి. గౌరవ వేతనాలు, ఇతర ప్రాయోజిక కార్యక్రమాలతో విప్లవ ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని సాధించబోతోంది. ఇందుకోసం అనేక మార్గదర్శక సూత్రాలను రూపొందించాం. కార్మిక వర్గాలకు శిక్షణా కార్యక్రమాలు, సాంకేతిక విద్యా సంస్థల ఏర్పాటు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాల స్థాపన, ఆయా రంగాలలో ఉద్యోగావకాశాల పెంపుతో కార్యకర్తలను అభివృద్ధి పరచడానికి చర్యలు తీసుకుంటున్నాం. పరిశోధన, శ్రమ, విప్లవాన్వేషణతో కార్యకర్తలు ఎంపిక జరుగుతుంది. ఈ విధానాలతో విప్లవ నాయకులు కూడా తయారయ్యే అవకాశాలున్నాయి.

కార్యకర్త అన్న పదానికి త్యాగం అన్న స్వభావం అంతర్గతంగా ముడిపడి ఉంది. వ్యక్తిగత సామర్థ్యంతో కార్యకర్తలు ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. రాజకీయ నాయకులుగా వారు శ్రామిక వర్గాల ఆదరణను, విశ్వాసాన్ని చూరగొనాలి. నాయకత్వ స్థాయిలో వారు ఇతర కామ్రేడ్లను ముందుకు తీసుకెళ్లాలి.

ఈ లక్ష్యాలన్ని సాధించాల్సి ఉంది. కాబట్టి ప్రజలు ఎన్నుకున్న అసెంబ్లీ సభ్యులే కార్యకర్తలుగా ఎంతో ఉపయోగపడతారనేది నా ఆలోచన. కార్మిక వర్గాలతో తమకున్న పట్టుతో వారు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలరు. తొలుత ఈ కార్యకర్తల సమూహం చిన్నదైనా, ప్రజలలో సామ్యవాద చైతన్యం పెరిగే కొద్దీ వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగే అవకాశముంది. ప్రభుత్వ లక్ష్యాలు, ప్రజల

ఆశయాల సాధనకోసం వారు అంకితం కావాల్సి ఉంది. ఇలాంటి ద్వితీయస్థాయి కార్యకర్తలు తమ బాధ్యతలను ఎలాంటి ఘోర తప్పిదాలు చేయకుండా పూర్తి చేయగలరన్నది ప్రభుత్వ విశ్వాసం.

గత అనుభవాల దృష్ట్యా, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించడానికి నాయకత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. కార్మిక వర్గాలలో దాగివున్న అందులోని శ్రమశక్తిని వినియోగించుకుంటూ భవిష్యత్తులో ఏర్పడబోయే ఐక్య సామ్యవాద విప్లవ పార్టీకి కార్యకర్తలను సమకూర్చుకునే దిశగా మేము పయనిస్తున్నాం. ఈ ప్రయత్నంలో మేము విజయం సాధించగలమన్న ధీమాతో ఉన్నాం.

3

# లేఖలు

# జోస్ ఇ. మార్టి లెవ్యాకు

హవానా

**ఫిబ్రవరి 5, 1959**

**జోస్ ఇ. మార్టి లెవ్యా**
**మార్టెయిర్స్ నం.180**
**హోల్గిన్, ఓరియంటె**

**ప్రియమిత్రమా,**

మా పొరుగు శాంటో డొమింగో ప్రజల స్వేచ్ఛ కోసం పోరాడేందుకు సంసిద్ధతను వ్యక్తం చేస్తూ మీరు రాసిన లేఖను ఎంతో సంతోషంతో చదివాను.

ఎంతో ఉదాత్తంగా, నిస్వార్థ బుద్ధితో మీ కోర్కెను వ్యక్తం చేశారు. దాని సంపూర్ణ ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుంటూ, భవిష్యత్తులో అవసరమయ్యేంత వరకు మీ ఆసక్తిని అలాగే అట్టిపెట్టమని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ కాలంలో స్కూల్లో మీ సమయాన్ని సద్వినియోగం చేసుకోమని, ప్రయోజనకరమైన వ్యక్తిగా తీర్చిదిద్దుకోమని సలహా ఇస్తున్నాను. మీలాంటి వారి అవసరం క్యూబాకు ఎంతగానో ఉంది. మీరు అలాంటి వారిలో ఒకరవుతారని నాకు పూర్తి విశ్వాసం ఉంది. చిత్రలేఖనంపై కేంద్రీకరించండి. అలా అని నాకు వాగ్దానం చేయండి.

**హృదయపూర్వక శుభాకాంక్షలతో**
**డా॥ ఎర్నెస్టో చేగువేరా**
**కమాండర్ ఇన్ చీఫ్, మిలిటరీ**
**డిపార్ట్‌మెంట్, లా కబానా**

# జోస్ టిక్వెట్‌కు

హవానా

**మే 17, 1960**

**సర్ జోస్ టిక్వెట్**

**పబ్లికేషన్స్ కొంటినెంటె, ఎస్.ఎ,**

**పాస్కోడి లారిఫార్మ 95,**

**మెక్సికో, డి.ఎఫ్.**

**ప్రియమిత్రమా,**

మీ లేఖకు జవాబు రాయడంలో ఆలస్యం జరిగినందుకు మన్నించమని వేడుకుంటున్నాను. నిర్లక్ష్యంతో నేను ఆలస్యం చెయ్యలేదు. పని వత్తిడివల్ల అలా జరిగింది. మీరు క్యూబాలో పర్యటించడానికి అయ్యే ఖర్చును భరించడం నాకు ఆనందమే. కాని నా వద్ద అంత డబ్బులేదు. తిరుగుబాటు సైన్యంలో మేజర్‌గా పొందే వేతనానికే నా ఆదాయం పరిమితం. చక్కటి జీవన ప్రమాణాన్ని కొనసాగించడానికి సరిపోయినంత మాత్రమే మా విప్లవ ప్రభుత్వ పొదుపు విధానం ప్రకారం నాకు లభిస్తుంది.

అయినప్పటికీ మీ లేఖ నాకు ఎలాంటి ఇబ్బంది కలిగించలేదు. అలాంటి లేఖను అందుకోగలిగినందుకు నేను ఎంతో ఆనందిస్తున్నాను.

**ప్రేమతో**

**కమాండర్ ఎర్నెస్టో చేగువేరా**

# డా॥ ఫెర్నాండో బ్యారల్‌కు

హవానా

ఫిబ్రవరి 15, 1961

"విద్యా సంవత్సరం"

**డా॥ ఫెర్నాండో బారల్**

**ఉజ్పెస్ట్, హంగరీ.**

ప్రియమైన ఫెర్నాండో,

కొద్ది నిముషాలపాటయినా మనిద్దరం కలుసుకోలేకపోవడం నిజంగా విచారకరం. అనేక పనుల మధ్యన పడి హడావిడిగా, చాలా క్లుప్తంగా రాయాల్సి వస్తున్నది. నీవు అర్థం చేసుకోగలవన్న విశ్వాసం నాకుంది. అసలు విషయానికొస్తాను. పోయినసారి లెటర్లో కాకపోయినా, అంతకు ముందు లెటర్లో రాసిన దాన్ని బట్టి నీకు ఈ ప్రాంతానికి వచ్చి పని చేయాలన్న ఆసక్తి ఉన్నట్లు అర్థమయ్యింది. ఇక్కడ నీకు, నీ భార్యకు పని ఉంది. వేతనం తగినంతగా ఉంటుంది. విలాసవంతమైన జీవితానికి మాత్రం సరిపోదు. ఇక్కడ కొంత కాలం పని చేసి మళ్ళీ స్వదేశానికి తిరిగి వెళ్ళాలనుకునే నీలాంటి వ్యక్తులకు క్యూబా విప్లవానుభవం ఎంతో ఆసక్తి కలిగిస్తుందని నాకు తెలుసు. నీ తల్లిని కూడా వెంటబెట్టుకురావచ్చు. నీ పనికి అవసరమైన ఏర్పాట్లన్నీ చేయగలం. విశ్వవిద్యాలయాన్ని పునర్వ్యవస్థీకరిస్తున్నాం. నీకు ఆసక్తి ఉంటే అక్కడే పని చేయవచ్చు.

ఇక్కడ నీకు చాలా అహేతుకమైన అంశాలు సహజంగానే ఎదురవుతాయి. ఎందువల్లనంటే విప్లవం ప్రతి ఒక్క అంశాన్నీ తలక్రిందులు చేస్తుంది. అస్తవ్యస్తం చేస్తుంది. నెమ్మది నెమ్మదిగా ఎక్కడ అనువైన వ్యక్తిని అక్కడ నియమించడం జరుగుతుంది. ఏ ఒక్కరి పనికీ ఆటంకం కల్గించకూడదన్నది ఒక్కటే అన్నింటికన్నా ముఖ్యమైన విషయం.

నీవు రావాలనుకున్నట్లయితే నాకు తెలియచేయి. నీ భార్యను తీసుకురావడానికి ఏం చెయ్యాలో కూడా నాకు వివరించు.

మనం చాలా సంవత్సరాలుగా వేర్వేరు మార్గాల్లో పయనించడంతో ఒకరి వ్యక్తిగత విషయాలు మరొకరికి తెలియవు. నా విషయానికొస్తే నేను పెళ్ళి చేసుకున్నాను. ఇద్దరు కూతుళ్ళు కూడా ఉన్నారు. కొద్ది నెలల క్రితం నా వద్దకు వచ్చిన మామా నుండి మన పాత మిత్రులు కొందరి వివరాలు తెలిశాయి.

**నీ సోదర మిత్రుని శుభాకాంక్షలు**

**కమాండర్ ఎర్నెస్టో చేగువేరా**

# కార్లస్ ఫ్రాంకీకి

"ఎస్కాంబరీలో చే : దాడి గురించిన డైరీ" అనే పేరుతో 'రివల్యూషన్' పత్రిక ప్రత్యేక ఫొటో అనుబంధాన్ని ప్రచురించిన సందర్భంలో రాసినదీ లేఖ. 1962 డిసెంబరు 24 సంచిక ఈ అనుబంధాన్ని ప్రచురించింది. 1969 డిసెంబరు 29 'రివల్యూషన్' సంచికలో ఈ లేఖ ప్రచురితమయింది.

**కాంపనేర్ కార్లస్ ఫ్రాంకి**

**ఎడిటర్, 'రివల్యూషన్'**

**హవానా**

**కాంపనీరో ఫ్రాంకి,**

మీరు ఫొటో సప్లిమెంట్ ప్రచురించడం నాకెంత మాత్రం నచ్చలేదు. ఎందువల్ల నచ్చలేదో నిర్మొహమాటంగా వివరిస్తాను. ఈ మాటలు "నా ఆగ్రహం"గా ప్రచురించ బడతాయని ఆశిస్తాను.

సీరియస్‌నెస్ లోపాన్ని ఎత్తిచూపే చిన్న విషయాలను పక్కన పెడతాను. శత్రువుపై దాడి చేయడానికి దృష్టి సారించిన సైనికుల బృందం కెమెరా వైపు చూస్తున్నట్లు చూపడంలాంటివి ఈ పొరపాట్లు. ఇలాంటివి కాకుండా మౌలికమైన పొరపాట్ల గురించి చెబుతాను.

1. డైరీ నుండి మీరు ప్రచురించిన భాగం సాధికారమైనది కాదు. అసలు విషయం ఇది. యుద్ధం సమయంలో డైరీ ఏమైనా రాశావా అని నన్ను అడిగారు. (అప్పుడు నేను ఓరియంటె నుండి లావిల్లాస్‌కు దళాన్ని నడిపాను) నేను రాశాను. కాని అది ఒక చిత్తు నోట్స్ మాత్రమే. నా స్వంత వినియోగం కోసం ఉపయోగపడేది. దాన్ని పరిపుష్టం చెయ్యడానికి నాకు అప్పుడు అవకాశం దొరకలేదు. శాంటా క్లారాకు చెందిన ఓ పెద్ద మనిషి ఆ బాధ్యత తీసుకున్నారు. (ఎలాంటి సమయంలో అది జరిగిందో నాకిప్పుడు జ్ఞాపకం లేదు) ఆయన చాలా దూకుడుగా వ్యవహరించాడు. అనేక విశేషణాలు తగిలించి అనేక విన్యాసాలు చేశాడు.

ఈ విధంగా సాధికారత కోల్పోయిన తర్వాత ఆ నాలుగు భాగాల నోట్స్‌కు ఏ కాస్త ప్రాధాన్యత ఉన్నప్పటికీ అది ధ్వంసమయింది.

2. రైతాంగ అవసరాలను నెరవేర్చడమే ప్రథమ ప్రాధాన్యతగా పరిగణించానని, యుద్ధానికి ద్వితీయ స్థానం ఇచ్చానని చెప్పడం తప్పు. ఆ సమయంలో యుద్ధంలో విజయం సాధించడమొక్కటే ప్రధాన విషయం. నాకు సాధ్యమైనంత పట్టుదలతో ఆ కృషిలో నిమగ్నమయ్యానని నేను విశ్వసిస్తున్నాను. ఎస్కాంబ్రే పర్వతాలను చేరుకున్న తర్వాత నా దళాలకు రెండు రోజుల విశ్రాంతి ఇచ్చాను. అప్పటికి 45 రోజులుగా అతిక్లిష్టమైన పరిస్థితుల్లో దళాలు ప్రయాణించాయి. రెండు రోజుల తర్వాత గినియా డి మీరాండాను స్వాధీనం చేసుకోవడంతో మళ్ళీ దళ చర్యలు ఆరంభమయ్యాయి. పొరపాటేదన్నా జరిగిందంటే అది మీరు చెప్పిన దానికి భిన్నమయినది. అలాంటి కష్టతరమైన పర్వత ప్రాంతాల్లో ఆయుధాలు పట్టుకొని నిలబడ్డ ఆ 'పశువుల కాపర్ల' పట్ల తగినంత శ్రద్ధ చూపలేకపోయాము. గుటిరెజ్ మెనోయొ ఆయన బృందం నన్ను చివరి దాకా విసిగించారు. దాన్ని తట్టుకొని ప్రధాన కర్తవ్యమయిన యుద్ధంపట్ల కేంద్రీకరించవలసి వచ్చింది.

3. రమీరో వాల్దీస్ "వ్యవస్థాగత విషయాల్లో చే కు సన్నిహితుడు" అని చెప్పడం తప్పు. అలా మీరు ఎలా భావించారో నాకు అర్థం కాలేదు. ఆయన గురించి మీకు తెలుసు కూడా.

రమీరో అప్పుడు మంకాడాలో ఉన్నాడు. పైన్స్ దీవిలో ఆయన జైల్లో నిర్బంధించబడ్డాడు. ఆయన 'గ్రాన్మా'కు లెఫ్టినెంట్‌గా వచ్చాడు. నేను కమాండర్ అయినపుడు

ఆయన క్యాప్టెన్ అయ్యాడు. ఒక దళాన్ని ఆయన కమాండర్‌గా నడిపించాడు. ఆయన దాడికి ద్వితీయ నాయకుడు. ఆ తర్వాత ఆయన తూర్పు రంగంలో దాడులు నిర్వహించాడు. అప్పుడు నేను శాంటా క్లారా వైపు పురోగమిస్తున్నాను.

చారిత్రిక సత్యాలను గౌరవించాలని నేను భావిస్తాను. ఇష్టం వచ్చినట్లు దాన్ని మార్చడం సత్ఫలితాలకు దారితీయదు. అందుచేతనూ, ఆ నాటకీయ పరిణామాలలో నేనూ పాత్రధారిని కావడం వల్లనూ, నిర్మాణాత్మకంగా ఉండాలని ప్రయత్నిస్తూ ఈ విమర్శనాత్మక వ్యాఖ్యలు తెలియచెయ్యాలని అనుకున్నాను. మీరు అచ్చులోకెళ్ళే ముందు ప్రతిని సరిచూసినట్లయితే ఈ పొరపాట్లు దొర్లేవికావని అనిపిస్తుంది.

మీ శలవులు సంతోషంగా గడపాలని ఆశిస్తున్నాను. వచ్చే సంవత్సరంలో పెద్ద శీర్షికలు (అవి తెచ్చిపెట్టే ఇబ్బందుల మూలంగా) ఎక్కువగా ఉండబోవని కూడా ఆశిస్తాను.

**చే**

# గులెర్మో లారెంజన్‌కు

హవానా

**మే 4, 1963**

"నిర్మాణ సంవత్సరం"

**కామ్రేడ్ గులెర్మో లారెంజన్,**

**హవానా**

**కామ్రేడ్,**

మీ లేఖ అందింది. కృతజ్ఞతలు.

నేను అర్జెంటినాలో పుట్టాను. క్యూబాలో పోరాటం చేశాను. విప్లవకారునిగా నా జీవితం గ్వాటిమెలాలో మొదలయింది.

మీ వ్యవహారాల్లో నేనెందుకు జోక్యం చేసుకుంటున్నానో నా ఆత్మకథ కొంత వివరణ ఇస్తుందనుకుంటాను.

గ్వాటిమెలాలో గెరిల్లాలు పోరాటం చేస్తున్నారు. కొంతమేరకు ప్రజలు కూడా ఆయుధాలు చేపట్టారు. ఈ పోరాటం క్యూబా లేదా అల్జీరియా తరహా విప్లవాల వైపుగా పయనించడాన్ని అడ్డుకునేందుకు ఒకే ఒక్క అవకాశం ఉంది.

సామ్రాజ్యవాదానికే ఆ అవకాశం ఉంది. వారు దాన్ని వాడతారో లేదో నాకు తెలియదుకాని, అది అరివాలో 'స్వేచ్ఛా ఎన్నికలు'

మేము విషయాన్ని అర్థం చేసుకున్న తీరు ఇది.

మీరు వేరే విధంగా ఏమైనా భావిస్తున్నారా?

**విప్లవాభినందనలతో**

**పాట్రియా ఓ ముయర్టె,**

**వెన్సెరిమోస్, కమాండర్ ఎర్నెస్టో చేగువేరా**

# పీటర్ మారుచ్చికి

హవానా

**మే 4, 1963**

"నిర్మాణ సంవత్సరం"

**పీటర్ మారుచ్చి,**

**వైర్ ఎడిటర్,**

**ది డైలీ మెర్క్యురీ**

**గెల్ఫ్, కెనడా.**

**కామ్రేడ్,**

మా దేశంలో అధికార యంత్రాంగం బలంగా ఉందని, బాగా పాతుకుపోయిందని ముందుగా మీకు చెప్పదలుచుకున్నాను. తమ పొత్తిళ్ళలో పత్రాలను పొదువుకుంటారు. వాటిపై కూర్చొని పొదుగుతారు. ఆ తర్వాతనే అవి వాటి గమ్యానికి చేరతాయి. మీరు దయతో రాసిన లేఖకు అందుచేతనే ఇప్పుడు జవాబు రాస్తున్నాను.

క్యూబా ఒక సోషలిస్టు దేశం. ఉష్ణదేశం. భేషజాలు లేనిదేశం. తెలివైంది, తేజోవంతమైంది. తన ప్రత్యేకత ఏ ఒక్కదాన్నీ వదులుకోకుండానే సోషలిస్టు దేశంగా ఉంటుంది. ప్రజల పరిణతి కోసం కృషి చేస్తుంది. ఈ దేశంతో పరిచయం ఏర్పరచు కోవలసిందే. మీరు ఎప్పుడు రాదలుచుకుంటే అప్పుడు రావచ్చు.

**ప్రియమైన**

**వెన్సెరిమోస్,**

**కమాండర్ ఎర్నెస్టో చేగువేరా**

# డా॥ అలైడా కోటో మార్టినెజ్‌కు

మే 23, 1963

"నిర్మాణ సంవత్సరం"

డా॥ అలైడా కోట్ మార్టినెజ్,

అసిస్టెంట్ డైరెక్టర్, ప్రాథమిక ప్రాంతీయ విద్య,

పుయెర్టోరెగ్లా – గ్యాన్ బకోవా

విద్యా మంత్రిత్వశాఖ

సిటీ

ప్రియమైన కామ్రేడ్,

మీ లేఖకు కృతజ్ఞతలు.

విప్లవకారులమైన మనం కొన్ని సందర్భాలలో ఒంటరి వాళ్ళమవుతాం. మన పిల్లలు సైతం మనల్ని అపరిచితులుగా చూస్తారు. వాళ్ళు 'అంకుల్' అనిపిలిచే సెంట్రీ డ్యూటీ సైనికుని చూసినంత తరచుగా కూడా వాళ్ళు మనల్ని చూడరు.

మీరు పంపిన కవితలు నన్ను గత స్మృతుల్లోకి తీసుకెళ్ళాయి. నేను రెండు లేదా మూడో తరగతిలో ఉన్నప్పుడు మా పట్టణానికి దేశాధ్యక్షుని రాక సందర్భంగా రాసిన కవిత్వం జ్ఞప్తికి వచ్చింది. అప్పటి పిల్లలు రాసినదానికి, ఇప్పుడు విప్లవం బిడ్డలు రాసిన దానికి మధ్య తేడా భవిష్యత్తు పట్ల మన విశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

విప్లవాభివందనాలతో,

పాట్రియా ఓ ముయెర్టె

వెన్సెరి మాఫ్

కమాండర్ ఎర్నెస్టో చేగువేరా

# మోటార్ సైకిల్ అసెంబ్లీ ప్లాంట్ కామ్రేడ్స్‌కు

**హవానా**

**మే 31, 1963**

**మోటార్ సైకిల్ అసెంబ్లీ ప్లాంట్ కామ్రేడ్స్,**
**శాంటియాగో డి క్యూబా**

**కామ్రేడ్,**

మీ ప్రతిపాదనల్లో ఒక పొరపాటు ఉంది. ఒక వస్తువును ఉత్పత్తి చేయడానికి బాధ్యత వహించిన కార్మికులకు దానిపై హక్కు ఉండదు. బేకరీలో పని చేసే వారికి అధిక బ్రెడ్లపై హక్కు ఉండదు. సిమెంట్ కార్మికులకు సిమెంటు అధికంగా పొందే హక్కు ఉండదు. అలాగే మీకు మోటారు సైకిళ్ళపై హక్కు ఉండదు. నేను మీ ఫ్యాక్టరీని సందర్శించినపుడు త్రిచక్రవాహనం ఒకదాన్ని మినీ బస్సు మాదిరిగా వాడటాన్ని గమనించాను. దాన్ని నేను విమర్శిస్తూ ఉండగానే, కమ్యూనిస్టు యువజన సంఘంలో సభ్యుడయిన ఒక కార్మికుడు ఫ్యాక్టరీకి చెందిన ఒక మోటారు సైకిల్‌పై ఆ సంఘం పని కోసం వెళ్ళడం చూశాను. దీన్ని మరింత తీవ్రంగా విమర్శిస్తున్నాను. వేతనం చెల్లిస్తూ సమాజం తనకు నిర్దేశించిన పని సమయంలో ఆ పనిని చేయకపోగా, సమాజం కోసం తాను పూర్తి స్వచ్ఛందంగా అదనపు సమయం కేటాయించి చేయాల్సిన పనిపట్ల పూర్తిగా పొరపాటు దృక్పథాన్ని ఆ కార్మికుడు కలిగి వున్నాడు. వాహనాలను కార్మికులకు, టెక్నీషియన్లకు కేటాయించే అవకాశముందా మీతో సంభాషిస్తున్న సమయంలో అని అడిగారు. అలా కేటాయిస్తే దానికి ఎలా కార్మికుడు చెల్లించాలన్న అంశాన్ని కూడా తెలియచేయాలని కోరారు.

వాహనాల పంపిణీ, అమ్మకం రవాణా శాఖకు అప్పగించిన దృష్ట్యా, వాహనాలను మీరు కోరిన విధంగా కేటాయించే అవకాశం ఉంటుందని నేను భావించడం లేదు.

**విప్లవాభివందనాలతో,**
**పాట్రియా ఓ ముయెర్టె,**
**వెన్సెరి మోస్, కమాండర్ ఎర్నెస్టో చేగువేరా**

# పాబ్లో డియాజ్ గొంజాలెజ్‌కు

హవానా

**అక్టోబరు 28, 1963**

"నిర్మాణ సంవత్సరం"

**కామ్రేడ్ పాబ్లో డియాజ్ గొంజాలెజ్**

**అడ్మినిస్ట్రేటర్, క్యామగ,**

**పాబ్లో,**

నీ వ్యాసం చదివాను. నన్ను బాగా చిత్రించినందుకు కృతజ్ఞతలు. మరీ బాగా చిత్రించావనుకుంటాను. నిన్ను కూడా చాలా బాగానే చిత్రించుకున్నావు.

ఒక విప్లవకారుడు చరిత్రను రాసేటప్పుడు చేతి తొడుగులో వేలులాగా సత్యానికే అంటిపెట్టుకొని ఉండాలి. నీవు ఆ పని చేశావు. కాని అది బాక్సింగ్ చేతి తొడుగు. అలాంటి తొడుగు ధరించడం న్యాయంగా లేదు.

వ్యాసాన్ని మళ్ళీ చదవమని నా సలహా. నిజంకాదని నీకు తెలిసిన అంశాలను తొలగించు. నిజం అని నీకు నిర్ధారణగా తెలియని విషయాలపట్ల జాగ్రత్త వహించు.

**విప్లవాభివందనాలతో,**

**పాట్రియా ఓ ముయెర్టె,**

**వెన్సెరి మోస్,**

**కమాండర్ ఎర్నెస్టో చేగువేరా**

# లైడియా ఆరెస్ రోడ్రి గుయెజ్‌కు

**హవానా,**

**అక్టోబరు, 1963**

**మ్రా. లైడియా ఆరెస్ రోడ్రిగుయెజ్**

**కాల్ కార్డెవాస్ 69,**

**హవానా**

**కామ్రేడ్,**

మీ లేఖను హోం మంత్రిత్వ శాఖకు పంపించాము. అలాంటి సమస్యలను పరిష్కరించే సంస్థ అక్కడ ఉంది.

ఏదేమయినప్పటికీ పనిపట్ల, విప్లవంపట్ల మీ వైఖరిని అభినందిస్తున్నాను. నా వ్యక్తిగత అభిప్రాయం అయితే మీ కుమారుడు శిక్షా కాలాన్ని అనుభవించాలి. ఎలాంటి పరిస్థితుల్లో చేసినప్పటికీ సోషలిస్టు ఆస్తికి వ్యతిరేకంగా చేసిన నేరం అతి తీవ్రమైంది.

నా లేఖ మీకు బాధ కల్గిస్తుందని తెలుసు. అయినప్పటికీ చెప్పకతప్పదు. అలా నిర్మొహమాటంగా చెప్పకపోతే నా విప్లవ కర్తవ్యాన్ని నెరవేర్చనివాడనవుతాను.

**విప్లవాభివందనాలతో,**

**పాట్రియా ఓ ముయెర్టె,**

**వెన్సెరి మోస్,**

**కమాండర్ ఎర్నెస్టో చేగువేరా**

# మేరియా రోసారియో గువేరాకు

హవానా,
ఫిబ్రవరి 20, 1964
"ఆర్థిక వ్యవస్థ సంవత్సరం"

శ్రీ. మేరియా రొసారియో గువేరా
36, రూ డి అన్నామ్
మారిఫ్ క్యాస బ్లాంకొ
మొరాకో

కామ్రేడ్,

నిజం చెప్పాలంటే మా కుటుంబం స్పెయిన్‌లో ఏ ప్రాంతం నుండి వచ్చిందో నాకు తెలియదు. మా పూర్వీకులు చాలా కాలం క్రితం పొట్టచేతబట్టుకొని ఇక్కడికి వచ్చారు. మా కుటుంబం ఒకే చోట ఉండకపోవడానికి కారణం అక్కడ సదుపాయంగా లేకపోవడమే.

మనిద్దరి మధ్య పెద్ద సాన్నిహిత్యం ఉన్నట్లు నేను భావించడంలేదు. ప్రపంచంలో అన్యాయం జరిగినప్పుడు ఆగ్రహంతో మీరు వూగిపోతున్నారంటే, మనిద్దరం కామ్రేడ్స్‌మే. అదే ముఖ్యం.

విప్లవాభినందనాలతో,
పాట్రియా ఓ ముయెర్టె,
వెన్సెరి మోస్,
కమాండర్ ఎర్నెస్టో చేగువేరా

# జోస్ మెడిరో మెస్త్రేకు

హవానా,

ఫిబ్రవరి 26, 1964

"ఆర్థిక వ్యవస్థ సంవత్సరం"

శ్రీ జోస్ మెడిరో మైస్త్రే

హవానా.

కామ్రేడ్,

మీ ఆసక్తికి, వ్యాఖ్యలకు కృతజ్ఞతలు. నన్ను ఒప్పించేందుకు ఒక ఇబ్బందికరమైన అంశాన్ని లేవనెత్తారు. నా శత్రువులను మీరు ఉటంకించారు. దురదృష్టవశాత్తు తగినంత సమయంలేని దృష్ట్యా ఈ వాదప్రతివాదనను ఉత్తరాల ద్వారా కొనసాగించలేను. ఇదే మాదిరి అంశాలపై ఎంపిక చేసిన పలువురు సోవియట్ టెక్నీషియన్ల అభిప్రాయాలు 'నుఎస్త్రా ఇండస్ట్రియా ఎకనామిక్' రాబోయే సంచికల్లో ప్రచురించబడతాయి.

మీరు ఆలోచించడానికి ఇక్కడ ఒక్క విషయం మాత్రం చెప్పదలుచుకున్నాను. ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్‌లో సోషలిస్టు సామర్థ్యాన్ని, పెట్టుబడిదారీ అసమర్థతతో పోల్చి చూడటం మన కోర్కెలను, వాస్తవాలను కలగాపులగం చెయ్యడమే. పంపిణీలో సోషలిజానికి నిస్సందేహమైన ఆధిక్యత ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థతో పోల్చుకున్నప్పుడు సోషలిజం తన సాంకేతిక, నిర్మాణపరమైన లోపాలను కేంద్రీకృత ప్రణాళికా వ్యవస్థ ద్వారా అధిగమించకలుగుతుంది. పాత వ్యవస్థ ధ్వంసమయినపుడు దాని స్థానంలో పాత కొత్తల కలయికతో ఒక నూతన సంకర వ్యవస్థను రూపొందించడానికి ప్రయత్నం జరిగింది. తోడేళ్ళ సమాజం స్థానంలో పొరుగువాడిని దోచుకోవాలన్న ఆలోచనలేని నూతన తరహా సమాజం ఆవిర్భవిస్తుంది. సంఖ్యలో స్వల్పమే అయినప్పటికీ అలాంటి ఆలోచన కలిగిన

వారు కొందరుంటారు. వ్యక్తుల సంక్షేమంలో భౌతిక ప్రయోజనాల పాత్ర కూడా ఉండటమే దీనికి కారణం. అక్కడే చెడుకు మూలం ఉందని నేను భావిస్తాను. పెట్టుబడిదారీ వ్యవస్థపై విజయం సాధించడం. ఆ వ్యవస్థలో పూజించబడే లాభం లాంటి అంశాలను అధిగమించడం కొంత గమ్మత్తైన కార్యక్రమంలాగా ఉంటుంది.

ఇది అస్పష్టంగా ఉంటే (ఇప్పుడు అర్ధరాత్రి అయిందని నా వాచ్ చెబుతున్నది) ఇంకో ఉపమానం విషయాన్ని మరింత స్పష్టం చేయవచ్చు. సోషలిజంలో భౌతిక ప్రయోజనం అనే సాధనం 'పాస్తోరీటా లాటరీ' లాంటిది. అత్యాశాపరులైన కొందరి కళ్ళను అది తెరిపించజాలదు. మరికొందరి ఉదాసీనతను తొలగించజాలదు.

ఈ విషయాన్ని కూలంకషంగా వివరించానని నేను నటించదలచలేదు. వీటికి, ఇంకా ఇతర వైరుధ్యాలకు 'ఆమెన్' చెప్పేశానని అనడం లేదు. దురదృష్టవశాత్తు మనవాళ్ళు చాలా మందిలోను, నాలోనూ ఒక వ్యవస్థ గురించిన శాస్త్రీయ విశ్లేషణ కన్నా దాన్ని గురించిన సమర్ధనలే అధిక ప్రభావం కలిగి ఉంటాయి. వివరణ ఇచ్చే కర్తవ్యాన్ని నెరవేర్చడానికి ఇది మనకు దోహదపడదు. మన మొత్తం కృషి అంతా మార్క్సిజం లాంటి మహోన్నత సిద్ధాంతానికి అనుగుణంగా ఆలోచించేలా చేయడం, దానిపట్ల సీరియస్‌గా వ్యవహరించేలా చేయడం లక్ష్యంగా పెట్టుకుంటుంది.

ఇందుచేతనే, మీరు ఆలోచిస్తున్నారు కాబట్టే మీ లేఖకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. మనం ఒకరితో మరొకరం అంగీకరించకపోవడం అన్న అంశానికి ఇక్కడ ప్రాధాన్యత లేదు.

మీరు నాకు ఏమి చెప్పదలచినా ఒక విషయాన్ని గుర్తుంచుకోండి. నేను టీచర్ని కాదు. నూతన క్యూబాను నిర్మించడానికి కృషి చేస్తున్న చాలా మందిలో నేనొకడిని మాత్రమే. అయితే క్యూబా విప్లవంలోని సంక్లిష్ట సందర్భాలలో ఫైడెల్ పక్షాన ఉండకలిగిన అదృష్టవంతుడిని, స్వేచ్ఛ కోసం ప్రపంచంలో జరిగిన కొన్ని విషాదమైన, సమున్నతమయిన ఘట్టాలలో పాలుపంచుకునే అదృష్టం కలిగిన వాడిని. మీ పేరు నాకు గుర్తులేకపోయినప్పటికీ నేనెవరినో మీకు తెలిసే పరిస్థితి అందువల్లనే ఏర్పడింది. మరో

విధంగా కూడా ఈ అంశాన్ని చెప్పవచ్చు. నేనిక్కడ జన్మించిన వాడిని కాదు. నా తిరుగాడే కాళ్ళు నన్నెక్కడికి తీసికెళినా ప్రపంచంలో అది ఏ మారుమూల ప్రాంతం అయినా అక్కడి నుండి కూడా మీకు లేఖ రాయవచ్చు.

**ఇంతే సంగతులు.**

**విప్లవాభినందనాలతో,**

**పాట్రియా ఓము అర్టే,**

**వెన్సెరి మోస్,**

**కమాండర్ ఎర్నెస్టో చేగువేరా**

# డా॥ బి. ఎడ్యుర్టో ఓర్డాజ్ డ్యుకుంజెకు

**మే 24, 1964**

**"ఆర్థిక వ్యవస్థ సంవత్సరం"**

**డా॥ ఎడ్యుర్డో బి. జోర్టాజ్ డ్యుకుంజె**

**డైరెక్టర్, సైకియాట్రిక్ హాస్పిటల్**

**హవానా.**

**డియర్ జోర్టాజ్,**

మీరు పంపిన పత్రిక అందింది. అంశాలు ఆసక్తికరంగా ఉన్నట్లున్నాయి. నాకు చదివే సమయం అంతగా లేదు. అయినా ప్రయత్నం చేస్తాను.

అయితే మరొక విషయం తెలుసుకోవాలని ఆసక్తిగా ఉన్నాను. ఒక మెడికల్ జర్నల్‌ను 6300 కాపీలు ఎలా ముద్రించకలిగారు. క్యూబాలో అంత మంది డాక్టర్లే లేరుకదా?

నా మనస్సును ఒక విషయం తొలిచేస్తుంది. ఆర్థిక మానసిక రుగ్మత (న్యూరో ఎకనామిక్ సైనేసిస్)లో పడిపోతానా అన్న ఆందోళన కలుగుతున్నది. ఎలుకలు తమ మానసిక వైద్యశాస్త్ర పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి ఈ జర్నల్స్‌ను ఉపయోగిస్తున్నాయా? లేకపోతే వాటి పొట్టలు నింపుకుంటున్నాయా? లేకపోతే ప్రతి పేషెంటు ఒక్కో కాపీని తన బెడ్డు పక్కన పెట్టుకుంటున్నాడా?

ఏదేమయినప్పటికీ 3000 కాపీలు సరిపోతాయనుకుంటాను. దీన్ని ఆలోచించాలని విజ్ఞప్తి.

సీరియస్‌గా చెప్పాలంటే జర్నల్ బాగా ఉంది. కాని అన్ని కాపీలు ముద్రించడం అనవసరం. నన్ను నమ్మండి. పిచ్చివాడు ఎప్పుడూ సత్యాన్నే చెబుతాడు.

**విప్లవాభినందనాలతో,**

**పాట్రియా ఓ ముయెర్టె, వెన్సెరి మోస్,**

**కమాండర్ ఎర్నెస్టో చేగువేరా**

# హేయడీ శాంట మారియాకు

**జూన్ 12, 1964**

**"ఆర్థిక వ్యవస్థ సంవత్సరం"**

**కామ్రేడ్ హేయడీ శాంట మారియా,**

**డైరెక్టర్, కాసా డిలాస్ అమెరికాస్,**

**హవానా.**

**డియర్ హేయడీ,**

రాజీ చర్యగా ఆ డబ్బును మీ వద్ద పెట్టాల్సిందిగా రచయితల సంఘాన్ని కోరాను. ఆ స్వల్ప విషయం దీర్ఘకాలిక ప్రభావం చూపే విధానాలపై ఘర్షణగా మారకుండా అలా చేశాను.

ఒకే ఒక్క ముఖ్యమైన విషయమేమంటే దానిలో ఒక్కపైసా కూడా నేను ముట్టుకోను. యుద్ధంలో సంఘటనలను వరుసగా చెప్పడం మినహా నేను చేసిందేమీలేదు. ఆ డబ్బును మీ ఇష్ట ప్రకారం వినియోగించండి.

**విప్లవాభినందనాలతో,**

**పాట్రియా ఓ ముయెర్టె,**

**వెన్సెరి మోస్,**

**కమాండర్ ఎర్నెస్టో చేగువేరా**

(ఈ లేఖ చేగువేరా "విప్లవ యుద్ధంలో సంఘటనలు" అన్న పుస్తకానికి సంబంధించినది)

# డా॥ రెగినో జి.బోటి

**జూన్ 12, 1964**

**"ఆర్థిక వ్యవస్థ సంవత్సరం"**

**డా॥ రెగినో జి. బోటి**

**మినిస్టర్ మరియు టెక్నికల్ సెక్రటరీ,**

**కేంద్ర ప్రణాళికా బోర్డు,**

**సిటీ.**

విషయం : 'కాన్ఫెడరేషన్ మెడికా ప్యానమెరికానా' జర్నల్ కాపీల సంఖ్యను పెంచాలన్న విజ్ఞప్తి గురించి.

డియర్ మినిస్టర్,

బోర్డు ఆదేశాలను పూర్తిగా అమలు చేస్తాము. వైద్యునిగా పరిమితమయిన, గొప్ప అని చెప్పుకోవడానికి వీలులేని అనుభవం ఆధారంగానే నేను ఈ జర్నల్‌లో విషయపుష్టి అంతగా లేదని చెప్పవలసి ఉంది. మీరు నెరవేర్చాలని ప్రయత్నిస్తున్న రాజకీయ కర్తవ్యానికి అలాంటి జర్నల్ ఉపయోగపడదు.

మిగతా విషయాలు మరో చరిత్రకు వదిలేద్దాం. అది చాలా విశాలమైనది.

**గౌరవాభివందనాలతో**

**పాట్రియా ఓ ముయెర్టె,**

**వెన్సెరి మోస్,**

***కమాండర్ ఎర్నెస్టో చేగువేరా***

# ఎలియాస్ ఎంట్రాల్గోకు

**ఆగస్టు 31, 1964**
**"ఆర్థిక వ్యవస్థ సంవత్సరం"**

**ఎలియాస్ ఎంట్రాల్గో,**
**ప్రెసిడెంట్, యూనివర్శిటీ ఎక్స్‌టెన్షన్,**
**యూనివర్శిటీ ఆఫ్ హవానా,**

**డియర్ కామ్రేడ్,**

దయతో మీరు పంపిన ఆహ్వానం అందింది. మీరు కావాలని చెప్పకపోయినా ఒక విషయం నాకు అర్థమయింది. నాయకుడు ఎవరు అన్న అంశంపై మనిద్దరి అభిప్రాయాలు తీవ్రంగా విభేదిస్తున్నాయి.

మీరు ఆహ్వానించిన ఉపన్యాసాన్ని నేను ఇవ్వలేను. నేను అలా చేయడమంటే విప్లవం కోసం వినియోగించాల్సిన నా సమయాన్ని ఈ విధంగా వెచ్చించడమే. ఒక ప్రభుత్వ నాయకునికి లేదా ఒక పార్టీ నాయకునికి, అది ఏ రకమైన పని అయినప్పటికీ డబ్బు రూపంలో ప్రతిఫలం ఇవ్వ చూపడాన్ని నేను వూహించలేకున్నాను.

క్యూబా ప్రజల్లో ఒకడినని భావించబడటమే నేను పొందిన ప్రతిఫలాన్నింటిలోకి అత్యున్నతమైనదని నేను భావిస్తాను. దాన్ని పెసోలు, పెండూవాలు లాంటి డబ్బు రూపంలో కొలవలేము.

ఈ విధంగా మీకు రాస్తున్నందుకు మన్నించండి. నా బాధను వ్యక్తం చేయడానికి మాత్రమే నేను ఇలా చేస్తున్నానని గుర్తించగలరు.

*పాట్రియా ఓము వార్టె,*
**వెన్సెరి మోస్, కమాండర్ ఎర్నెస్టో చేగువేరా**

# మా పిల్లలకు (1964)

## డియర్ హిల్డిటా, అలైడిటా, కామిలో, సెలినా, ఎర్నెస్టో,

నేను మీతో లేను కాబట్టి ఈ లేఖ రాస్తున్నాను. ఇది మీకు అంది చదవ కలిగితే నేను చెప్పే విషయాలు తెలుసుకోండి. నన్ను మీరు మర్చిపోయి ఉండవచ్చు. మీలో చిన్నవాళ్ళకు నేను అసలు గుర్తుండే అవకాశమే లేదు.

మీ తండ్రి తాను నమ్మిన ఆశయాల ప్రకారం పని చేసే వ్యక్తి. తన సిద్ధాంతాల కోసం కచ్చితంగా నిలబడ్డ వ్యక్తి.

మంచి విప్లవకారుల్లాగా పెరగండి. కష్టపడి చదవండి. సాంకేతిక పరిజ్ఞానంపై ప్రావీణ్యం సంపాదించండి. ప్రకృతిపై అదుపును సాధించడానికి అదే ఉపయోగపడుతుంది. విప్లవం ఒక్కటే అత్యంత ప్రాధాన్యత కల్గిన దని మర్చిపోకండి. వ్యక్తులుగా మనకు ఏమీ నిలువలేదు.

వీటన్నింటినీ మించి, ప్రపంచంలో ఎక్కడ, ఎవ్వరికి అన్యాయం జరిగినా తీవ్రంగా ప్రతిస్పందించ కలగాలి. ఒక విప్లవ వీరునికుండాల్సిన అత్యంత ఉత్తమ లక్షణం ఇది.

ఎప్పటికీ మీకు వీడ్కోలు. మిమ్మల్ని మళ్ళీ చూడకలననే అనుకుంటున్నాను. మీ అందరికీ నా ముద్దులు, ఆలింగనాలు.

**నాన్న**

# నా తల్లితండ్రులకు (1965)

**ప్రియమైన వృద్ధమూర్తులారా,**

రొసినాంటే వీధుల్లో మళ్ళీ నడుస్తున్న అనుభూతి కలుగుతున్నది. దాదాపు పదేళ్ళ క్రితం మీకు ఒక వీడ్కోలు లేఖ రాశాను. నేనొక మంచి సైనికునిగాను, మంచి డాక్టరుగాను లేనందుకు ఆ లేఖలో విచారం వ్యక్తం చేశాను. కాని ఇప్పుడు అలా భావించడం లేదు. ఎందువల్లనంటే నేనిప్పుడు అప్పటి మాదిరిగా నాసిరకమైన సైనికుడిని కాదు.

అయితే సారం రీత్యా ఎలాంటి తేడా లేదు. దానిపట్ల చైతన్యం మాత్రం మరింత పెరిగింది. నా మార్క్సిజం మరింత వేళ్ళూనుకున్నది. మరింత పరిశుద్ధంగా తయారయింది. స్వేచ్ఛ కోసం ఉద్యమించే ప్రజలకు సాయుధపోరాటమే ఏకైక మార్గం అని నేను నమ్ముతున్నాను. నా నమ్మకాలపట్ల నికరంగా ఉన్నాను. చాలా మంది నన్ను దుందుడుకు వాడినని అంటారు. నేను దుందుడుకువాడినే కావచ్చు. కాని భిన్నమైన తరహాకు చెందిన వాడిని. నేను సత్యమని నమ్మినదాన్ని నిరూపించడం కోసం ఏ కష్టానికయినా సిద్ధపడిన వాడిని.

ఇదే చివరి లేఖ అయ్యే అవకాశం ఉంది. అలా కావాలని నేను అనుకోవడంలేదు. కాని అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటే అదే జరుగుతుందని అనిపిస్తుంది. అలాగే అయినట్లయితే, ఇది నా చివరి ఆలింగనం. నేను మిమ్మల్ని ఎంతగానో ప్రేమించాను. నా ప్రేమను ఎలా వ్యక్తం చేయాలో నాకు తెలియలేదు. నా చర్యలు అత్యంత తీవ్రంగా ఉండేవి. కొన్నిసార్లు మీరు నన్ను అర్థం చేసుకోలేరని నాకు

తెలుసు. నన్ను అర్థం చేసుకోవడమూ కష్టమే. అయినా నన్ను నమ్మండి. ఒక కళాకారుడు నిరంతరం ఎలా ఆనందంగా ఉంటాడో, అలాగే నేనూ నా దీక్షను దృఢతరం చేసుకుంటూ వచ్చాను. అందువల్లనే నేను బలహీనమైన కాళ్ళతోను, అలసిపోయిన ఊపిరితిత్తులతోను నెట్టుకురాగలిగాను. అలా నేను ఉండగలను.

20వ శతాబ్దపు అదృష్టానికి చెందిన ఈ చిన్ని సైనికుని అప్పుడప్పుడూ గుర్తుకు తెచ్చుకోండి.

సెలియా, రాబెర్టో, జువాన్ మార్టిన్, పటోటిన్, బియాట్రిజ్ ప్రతి ఒక్కరికీ నా ముద్దులు. మంకు పట్టు కలిగిన, అసాధారణ లక్ష్యం కలిగిన కుమారుని నుండి మీకు పెద్ద ఆలింగనం.

ఎర్నెస్టో

# హిల్డీటాకు

**(తన పెద్దకుమార్తె హిల్డీటా 10వ పుట్టిన రోజు నాడు ఈ లేఖ రాశారు)**

ఫిబ్రవరి, 15, 1966

**డియర్ హిల్డీటా,**

ఈ లేఖ ఇప్పుడు రాస్తున్నాను. ఇది నీ వద్దకు చేరేసరికి చాలా కాలం పట్టవచ్చు. అయినప్పటికీ నేను మీ గురించి ఆలోచిస్తూనే ఉన్నానని తెలియ చెయ్యడానికి ఈ లేఖ రాస్తున్నాను. ఎంతో సంతోషంగా పుట్టిన రోజు జరుపుకుంటున్నావనుకుంటున్నాను. నీవు ఇప్పుడు బాగా పెద్దయి వుంటావు. చిన్న వాళ్ళకు చెప్పినట్లు అల్లరి విషయాలు, అద్భుతాలు గురించి నీకు చెప్పలేను.

నేను నీకు చాలా దూరంలో ఉన్నానన్న సంగతి నీవు తెలుసుకోవాలి. కొంత కాలంపాటు ఇక్కడే ఉంటాను. మన శత్రువుపై పోరాటం చేస్తున్నాను. అదేమంత గొప్ప విషయం కాదు. ఏదో నాకు చేతనయినంత చేస్తున్నాను. నేను మీ గురించి గర్వపడు తున్నట్లుగానే, మీరు కూడా నా గురించి గర్వించవచ్చు.

మనం ఇంకా చాలా కాలం పోరాటం చేయాలన్నసంగతి గుర్తుంచుకో. నీవు పెద్దయిన తర్వాత కూడా పోరాటం కొనసాగుతుంది. దానిలో నీవు భాగస్వామివి కావాలి. ఈ లోగా నీవు మంచి విప్లవకారిణిగా తయారవ్వాలి. అంటే ఇప్పుడు నీ క్లాసులో సాధ్యమైనంత ముందుండేందుకు ప్రయత్నించాలి. న్యాయం కోసం నిలబడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. మీ అమ్మ చెప్పినట్లు వినాలి. అంతా తెలిసిపోయిందని అనుకోవద్దు. ఆ జ్ఞానం కాలక్రమంలో వస్తుంది.

స్కూల్లో ఫస్టు వచ్చేందుకు నీవు పోరాడాలి. అన్నింటిలోనూ ఉత్తమంగా ఉండాలి. ఉత్తమంగా ఉండటమంటే అధ్యయనం, విప్లవకర దృక్పథం అని ఇప్పటికే తెలిసి ఉంటుంది. మరో విధంగా చెప్పాలంటే సత్ప్రవర్తన, ఆషామాషీగా ఉండకపోవడం, విప్లవాన్ని ప్రేమించడం, కామ్రేడ్లీతత్వం మొదలైనవి.

నీ వయసులో నేను నీలా లేను. అయితే నేను భిన్నమైన సమాజంలో జీవించాను. ఒక మనిషి మరో మనిషిని శత్రువుగా చూసే సమాజం అది. కాని నీవు మరో యుగంలో జీవించే అదృష్టాన్ని పొందావు. నీవు దానికి తగినట్లుగా వ్యవహరించాలి.

ఇంటి సంగతి మర్చిపోవద్దు. చిన్నవాళ్ళను కనిపెట్టుకొని ఉండు. బాగా చదవమని, మంచిగా మెలగమని చెబుతూ ఉండు. ముఖ్యంగా ఆల్డీటాను జాగ్రత్తగా చూసుకో. తన అక్కగా నిన్ను నిరంతరం గమనిస్తూ ఉంటుంది.

మంచిది తల్లీ. నీ పుట్టిన రోజునాడు చాలా సంతోషంగా ఉన్నావని మరోసారి ఆశిస్తున్నాను. మీ అమ్మకు, గినాకు నా ఆలింగనం. మనం మళ్ళీ కలుసుకునే వరకు నిలిచి పోయేంతటి పెద్ద, బలమైన ఆలింగనం నీకు.

**మీ నాన్న**

# ఫైడల్ కాస్ట్రోకు (1965)

ఈ లేఖను 1965 అక్టోబరు 3న నూతనంగా ఎన్నికయిన క్యూబా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీని పరిచయం చేసిన బహిరంగ సభలో ఫైడల్ కాస్ట్రో చదివారు. ఈ సభకు చేగువేరా భార్య, పిల్లలు కూడా హాజరయ్యారు. "కామ్రేడ్ ఎర్నెస్టో గువేరా స్వయంగా రాసి, ఆ తర్వాత టైప్ చేసిన ఈ లేఖను చదువుతున్నాను" అని కాస్ట్రో ప్రకటించారు. "ఆ లేఖ ఇలా ఉంది. 'హవానా' – దాని మీద తేదీ లేదు. ఈ సంవత్సరం ఏప్రిల్ 1నే అందినప్పటికీ అత్యంత సముచితమైన రీతిలో ఇప్పుడు ఇక్కడ చదవబడుతున్నది." క్యూబా నుండి తాను అదృశ్యమవడానికి దారితీసిన సందర్భాన్ని మొట్టమొదటిసారిగా చే గువేరా ఈ లేఖలో వివరించారు.

హవానా

ఫైడల్

ఈ క్షణంలో నాకు అనేక విషయాలు గుర్తుకు వస్తున్నాయి. మేరియా ఆంటోనియా ఇంట్లో ఆనాడు మనం కలుసుకున్నాం. నీవు ప్రతిపాదించిన వెంటనే నీతో రావడానికి అంగీకరించాను. ఆ సన్నాహాలలో మనం ఎన్నో ఆందోళనలకు గురయ్యాము. ఒక రోజు, నీవు చనిపోతే ఎవరికి తెలియచేయాలి? అని వారు అడిగారు. అలాంటి దానికి నిజంగా అవకాశం ఉందన్న ఆలోచన మనల్నందరినీ కదిలించింది. ఆ తర్వాత అది నిజమేనని తెలిసింది. విప్లవంలో ఎవరయినా విజయం సాధించవచ్చు. ప్రాణాలయినా కోల్పోవచ్చు. (అది నిజమైన విప్లవమయితే). మన విప్లవం విజయం సాధించే మార్గంలో కామ్రేడ్స్ అనేక మంది నేలకొరిగారు.

ఇప్పుడు మనకు ప్రతి విషయం అంత నాటకీయంగా కనిపించడంలేదు. ఎందువల్లనంటే మనం మరింత పరిణత సాధించాం. కాని అప్పటి పరిస్థితి ఇప్పుడు

పునరావృతమవుతున్నది. క్యూబా విప్లవంలో నా వంతు బాధ్యతను నిర్వర్తించానని భావిస్తున్నాను. నీకు, కామ్రేడ్స్‌కు, ఇప్పుడు నా వారిగా మారిన మీ ప్రజలకు వీడ్కోలు చెబుతున్నాను.

పార్టీలో నాయకత్వ స్థానానికి, మంత్రిపదవికి, సైన్యం కమాండర్ హోదాకు, నా క్యూబా పౌరసత్వానికి ఇప్పుడు లాంఛన పూర్వకంగా రాజీనామా చేస్తున్నాను. చట్టపరంగా ఇప్పుడు క్యూబాతో నాకు ఎట్టి బంధం లేదు. క్యూబాతో నన్ను కట్టిపడవేసే బంధనాలు ఇప్పుడు వేరే స్వభావం కల్గినవి. ఒక పదవిని, హోదాను వదిలి వేసుకున్నట్లుగా అవి వదిలివేసుకునేవి కాదు.

గతాన్ని గుర్తు తెచ్చుకున్నప్పుడు విప్లవ విజయాన్ని పటిష్టం చేయడంలో తగినంత అంకిత భావంతో, విశ్వాసంతో పని చేశాననే నాకనిపిస్తుంది. నేను ఒకే ఒక్క తీవ్రమైన తప్పిదం చేశాను. సియర్రా మాయెస్ట్రాలో మనం మొట్టమొదటిసారిగా కలుసుకున్నప్పుడే నీపట్ల మరింత విశ్వాసాన్ని ఉంచకపోవడం, ఒక నాయకునిగా, విప్లవకారునిగా నీలోని లక్షణాలను త్వరితంగా అర్థం చేసుకోలేకపోవడం – ఇదే నేను చేసిన ఆ పొరపాటు.

క్యూబాలో నేను అద్భుతంగా గడిపాను. నీ పక్షాన ఉన్నందుకు, ఆనాటి విచారకరమైన కరేబియా సంక్షోభంలో మన ప్రజలతో ఉన్నందుకు నేను గర్వపడుతున్నాను. అతి కొద్ది మంది రాజనీతిజ్ఞులు మాత్రమే ఆ రోజుల్లో నీవు వ్యవహరించిన విధంగా వ్యవహరించగలరు. ఏ మాత్రం సంకోచించకుండా నీ వెంటనడిచినందుకు నేనెంతో గర్వపడుతున్నాను. నీ ఆలోచనా పద్ధతులతోను, ప్రమాదాలను పసిగట్టడం, వాటి గురించి అంచనా వేయడంతోను, నీవు అనుసరించిన సూత్రాలతోను నేను సగర్వంగా ఏకీభవించాను.

ప్రపంచంలోని ఇతర దేశాలు కాస్త్రోకూస్తో నేను చేయకలిగిన కృషిని కోరుతున్నాయి. దాన్ని చేయగలను. క్యూబాకు అధినేతగా బాధ్యతలు నిర్వహించాల్సిన నీకు అలాంటి అవకాశం లేదు. మనం విడిపోయే సమయం ఆసన్నమయింది.

మిమ్మల్ని వదిలివెళ్తున్నందుకు సంతోషంగాను, విచారంగానూ ఉంది. ఈ దేశ నిర్మాణంలో పాల్గొన్న ఒక వ్యక్తిగా నా స్వచ్ఛమైన ఆశయాలను, నా ప్రియాతి ప్రియమైన వారిని ఇక్కడ వదిలివెళ్తున్నాను. నన్ను తమ పుత్రునిగా చూసుకున్న క్యూబా ప్రజలను

వదిలి వెళుతున్నాను. ఈ భావనలే నా స్ఫూర్తిని కొంత గాయపరుస్తున్నాయి. మీరు నాకు బోధించిన విశ్వాసాన్ని, ప్రజల విప్లవ స్ఫూర్తిని, అత్యంత పవిత్రమైన బాధ్యతలను నెరవేర్చాలన్న భావనలను, సామ్రాజ్యవాదం ఎక్కడ ఉన్నా దానికి వ్యతిరేకంగా పోరాడాలన్న దృఢదీక్షను –నాతో తీసుకెళ్తున్నాను. ఈ ఆలోచనే నన్ను సేద తీరుస్తున్నది. లోతైన గాయాలను మాన్పివేస్తున్నది.

క్యూబాకు సంబంధించి అన్ని బాధ్యతల నుండి వైదొలగానని చెబుతున్నాను. క్యూబా విప్లవ ఉదాహరణ నుండి ఉద్భవించిన బాధ్యత ఒక్కదాన్ని మాత్రమే నాతో కలిగి ఉన్నాను. నా చివరి ఘడియలు వేరే దేశాల్లో సంభవించినట్లయితే, ఆ సమయంలో నేను తలచుకునేది క్యూబా ప్రజల్ని, ముఖ్యంగా నిన్ను మాత్రమే నీ బోధనలకు, నీ ఆదర్శానికి కృతజ్ఞతలు. చివరి వరకు నేను వాటిపట్ల విశ్వాసంతో ఉంటాను.

మన విప్లవం అనుసరించిన విదేశాంగ విధానంతో నేను సంపూర్ణంగా ఏకీభవించాను. ఇక ముందు కూడా దాన్ని కొనసాగిస్తాను. నేనెక్కడ ఉన్నా క్యూబా విప్లవకారునిగా నా బాధ్యతను విస్మరించను. దానికి అనుగుణంగానే నడుచుకుంటాను. నా పిల్లలకు, భార్యకు ఎలాంటి ఆస్తి వదిలి వెళ్ళనందుకు నేను సిగ్గుపడటంలేదు, సంతోషపడుతున్నాను. వారి కోసం నేనేమీ అడగటంలేదు. ప్రభుత్వమే వారి జీవనానికి తగినంత లభించేలా చూస్తుంది. అవసరమైన విద్యను అందిస్తుంది.

నీకు, మన ప్రజలకు చాలా చెప్పాలని ఉంది. కాని అది అనవసరం. వారు ఏం చేయాలో మాటల ద్వారా వ్యక్తం చేయలేను. నోట్ పుస్తకంలో పేజీలు అట్టిపెట్టడమే మంచిదని భావిస్తున్నాను. హాస్టా లా విక్టోరియా సియంప్రె! పాట్రియా ఓమువర్టె!

**మీకు ప్రగాఢ విప్లవాభివందనాలు**

**చే**

# మా పిల్లలకు లేఖ

బొలీవియాలో ఏదో ఒక చోటు (1966)

నా ప్రియాతిప్రియమైన అల్యూషా, కామిలో, సెలిటా, టాటికో,

నేను ఎక్కడో చాలా దూరం నుండి, ఎంతో హడావిడిగా ఈ లేఖ రాస్తున్నాను. అంటే నా తాజా సాహసాల గురించి సవివరంగా ఇప్పుడు మీకు చెప్పలేను. విచారకరమైన విషయమేమంటే, పెపీ మొసలి (అంకుల్ శామ్ లేదా అమెరికాకు మరొక గమ్మత్తయిన పేరు) ద్వారా అత్యంత ఆసక్తికరమైన కొందరు మిత్రులను కలుసుకున్నాను.

దాని గురించి మరోసారి...

మిమ్మల్నందరినీ, మీ అమ్మను ఎంతగానో ప్రేమిస్తున్నానని మాత్రమే ఇప్పుడు చెప్పగలను. చిన్నవాళ్ళను నేను ఫొటోల ద్వారా మాత్రమే చూస్తున్నాను. నేను వదిలి వచ్చే సమయంలో వారు పసివాళ్ళు. మరో నిమిషంలో నా ఫొటో తీసుకుంటారు. ఇప్పుడు నేను ఎలా ఉన్నానో మీరు తెలుసుకోగలుగుతారు. నేను కొద్దిగా ముసలివాడినయ్యాను. అందవికారంగా కూడా తయారయ్యాను.

అల్యూషా ఆరవ పుట్టిన రోజుకల్లా ఈ లేఖ మీకు చేరుతుంది. ఈ లేఖ తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తుంది. అల్యూషా తన పుట్టిన రోజు ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటున్నాను.

అల్యూషా, నీవు కష్టపడి చదవాలి, మీ అమ్మకు ప్రతి విషయంలో చేయగలిగినంత సహాయం చేయాలి. నీవు అందరికన్నా పెద్దదానివని గుర్తుంచుకో.

కామిలో, నీవు స్కూల్లో ఎక్కువగా మాట్లాడవద్దు. నీకు తగిన విషయాలను నేర్చుకో. సెలిటా, మీ అమ్మమ్మకు ఇంటిలో తిరగటానికి సహాయం చెయ్యి. నేను వీడ్కోలు చెప్పినప్పుడు ఎంత సంతోషంగా ఉన్నావో, ఎప్పుడూ నీవు అంతే సంతోషంగా ఉండాలి. అలా ఉండకుండా ఎలా ఉంటావులే. టాటికో నీవు ఉత్తమ పురుషునిగా పెరగాలి. నీవు ఎలా తయారయ్యావో మనం మళ్ళీ కలుసుకున్నప్పుడు చూస్తాను. సామ్రాజ్యవాదం ఉన్నంత వరకు దానికి వ్యతిరేకంగా మనం పోరాడాలి. అది ఓడించబడిన తర్వాతనే మీరు, నేను చందమామ మీద ఆనందంగా శలవులను గడుపుతాము.

మీ అమ్మమ్మ, తాతయ్యలను అడిగినట్లు చెప్పండి. ఆమె బిడ్డకు నా ముద్దులు. ఎస్టెలా, కార్మిటాలకు కూడా. అందరికీ పెద్ద ఏనుగంతటి ముద్దు...

**నాన్న**

***మార్జిన్లో గమనిక :***

హిల్డీటా (చే పెద్ద కూతురు)కు, మరో ఏనుగంతటి ముద్దు. మళ్ళీ రాస్తానని ఆమెకు చెప్పండి. ఇప్పుడు నాకు టైము లేదు.

# చే జీవిత గమనం

| | | |
|---|---|---|
| **జూన్ 14, 1928** | : | అర్జెంటీనాలోని రొసారియోలో ఎర్నెస్టో గువేరా లించ్, సెలియా డి లా సెర్న దంపతులకు ఎర్నెస్టో చేగువేరా జన్మించారు. ఐదుగురు సంతానంలో ఆయనే మొదటి వాడు. |
| **1947** | : | గువేరా కుటుంబం బ్యూనస్ ఎయిర్స్‌కు మకాం మార్చింది. |
| **1947–53** | : | బ్యూనస్ ఎయిర్స్ వైద్య కళాశాలలో చే విద్యాభ్యాసం. |
| **డిసెంబరు 1951- జులై 1952** | : | చిలీ, పెరు, కొలంబియా, వెనిజులాలో చే పర్యటన. |
| **మార్చి 10 1952** | : | క్యూబాలో బాటిస్టా తిరుగుబాటు చే పర్యటన. |
| **మార్చి 10, 1953** | : | చే వైద్య శాస్త్ర పట్టభద్రుడయ్యారు. |
| **జులై 6, 1953** | : | వైద్యునిగా లాటిన్ అమెరికాలో పర్యటన. 1952 విప్లవ ప్రభావాన్ని పరిశీలించేందుకు బొలీవియా పర్యటన. |
| **జూలై 26, 1953** | : | మోంకాడా సైనిక శిబిరంపై ఫైడేల్ కాస్ట్రో నేతృత్వంలో దాడి |
| **డిసెంబరు 1953** | : | మోంకాడా దాడిలో ప్రాణాలు దక్కించుకున్న విప్లవకారులతో సాన్ జోస్ (కోస్టారికా) లో పరిచయం. |
| **జనవరి- జూన్ 1954** | : | మార్క్సిజం అధ్యయనం, రాజకీయ కార్యకలాపాలు |
| **జూన్ 17, 1954** | : | సిఐఎ ప్రోద్బలంతో తిరుగుబాటుదారులు గ్వాటిమాలా |

ఆక్రమణ, వారికి వ్యతిరేకంగా పోరాడడానికి గువేరా సంసిద్ధత

**ఆగష్టు 1954** : తిరుగుబాటుదారుల మారణహోమం

**సెప్టెంబరు 21, 1954**: గ్వాటిమాలా వీడి మెక్సికో నగరానికి చేరిక. కేంద్ర వైద్యశాలలో ఉద్యోగం.

**మే 15, 1955** : జైలు నుండి కాస్ట్రో విడుదల

**జులై 7, 1955** : కాస్ట్రో మెక్సికో చేరిక, క్యూబా సాయుధ యాత్రకు వ్యూహరచన

**జులై 1955** : కాస్ట్రోను కలుసుకున్న గువేరా. సాయుధ యాత్రలో మూడవ సభ్యునిగా చేరిక

**జూన్ 24, 1956** : కాస్ట్రో, గువేరాలను అదుపులోకి తీసుకున్న మెక్సికో పోలీసులు. 57 రోజులపాటు గువేరా నిర్బంధం.

**నవంబరు 25, 1956** : టుక్స్పాన్ (మెక్సికో) నుండి గ్రాన్మా పయనం

**నవంబరు 30, 1956** : సాంటియాగో డి క్యూబాలో ఉద్యమం

**డిసెంబరు 2,1956** : లాస్ కొలొరాడస్ ( క్యూబా)కు గ్రాన్మా చేరిక

**డిసెంబరు 5, 1956** : బాటిస్టా సైన్యంతో పోరాటం, గువేరాకు గాయాలు

**జనవరి 17, 1957** : లాప్లాటో సంఘర్షణలో సైన్య శిబిరాన్ని ఆక్రమించుకున్న విప్లవ సైన్యం.

**మార్చి 13, 1957** : హవానా అధ్యక్ష భవనంపై దాడి విఫలం.

**మే 27-28, 1957** : ఎల్ ఉవేరో యుద్ధం,విప్లవ సైన్యం జయకేతనం

**జులై 1957** : విప్లవ సైన్యం ద్వితీయ విభాగం ఆవిర్భావం, గువేరా సారథ్యం.

| | | |
|---|---|---|
| **ఏప్రిల్ 9, 1958** | : | సార్వత్రిక సమ్మె విఫలం |
| **మే 1958** | : | బాటిస్టా సైన్యంతో సియర్రా మాయెస్ట్రాలో భీకరపోరు. అణచివేత విఫలం |
| **జులై 1958** | : | ఎల్ జిగ్యూ యుద్ధంలో విజయం |
| **అగస్టు 31, 1958** | : | గువేరా నాయకత్వంలో లాస్ విల్లాస్‌కు దండయాత్ర |
| **అక్టోబరు 16, 1958** | : | గువేరా సైన్యం ఎస్కాంబ్రే పర్వతాలకు చేరిక |
| **డిసెంబరు 1958** | : | లాస్ విల్లీస్ రాజధాని శాంటా క్లారా ఆక్రమణ |
| **జనవరి 1, 1959** | : | క్యూబా నుండి పారిపోయిన బాటిస్టా, సైనిక పాలన సాయుధ పోరాటం కొనసాగుతుందని కాస్ట్రో ప్రకటన |
| **జనవరి 2, 1959** | : | సార్వత్రిక సమ్మె: గువేరా, సియన్ ఫ్యూగస్ ఆధ్వర్యంలోని విప్లవ సైన్యాలు హవానా చేరిక, లా కబానా కోట స్వాధీనం |
| **జనవరి 8, 1959** | : | హవానా చేరుకున్న కాస్ట్రోకు ఘన స్వాగతం |
| **ఫిబ్రవరి 9, 1959** | : | క్యూబా పౌరునిగా గువేరాకు గుర్తింపు |
| **ఫిబ్రవరి16,1959** | : | ప్రధానమంత్రిగా కాస్ట్రో |
| **మే 17,1959** | : | భూ సంస్కరణల అమలు |
| **జూన్ 12 - సెప్టెంబరు 8, 1959** | : | ఐరోపా, ఆఫ్రికా, ఆసియాలలో గువేరా పర్యటన |
| **అక్టోబరు 7, 1959** | : | వ్యవసాయ సంస్కరణలు, పరిశ్రమల శాఖ అధిపతిగా గువేరా నియామకం |
| **నవంబరు 26, 1959** | : | క్యూబా జాతీయ బ్యాంకు అధ్యక్షునిగా గువేరా నియామకం |
| **మార్చి 19, 1960** | : | క్యూబా శరణార్థుల సైన్యంతో క్యూబా ఆక్రమణకు అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హవర్ ఆదేశం |

**అక్టోబర్ 21,1960** : సోవియట్ యూనియన్, తూర్పు జర్మనీ చెకెస్లోవేకియా, చైనా, ఉత్తర కొరియాలలో గువేరా పర్యటన

**జనవరి 3, 1961** : క్యూబాతో దౌత్య సంబంధాలు తెంచుకున్న అమెరికా

**జనవరి 6, 1961** : సోవియట్ యూనియన్‌తో కుదుర్చుకున్న ఆర్థిక ఒప్పందాల గురించి ప్రజలకు గువేరా వివరణ

**ఫిబ్రవరి** 23, 1961 : పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గువేరా

**ఏప్రిల్ 15,1961** : శాంటియాగో డి క్యూబా, హవానాపై అమెరికా ప్రోద్భలంతో వైమానిక దాడులు.

**ఏప్రిల్ 17-19, 1961** : బే ఆఫ్ పిగ్స్ వద్ద తిరుగుబాటు అణచివేత

**ఆగష్టు 8, 1961** : ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ సమావేశంలో క్యూబా ప్రతినిధిగా గువేరా ప్రసంగం

**ఆగస్టు 27 - సెప్టెంబరు 7, 1962** : రెండవ సారి రష్యాలో పర్యటించిన గువేరా

**అక్టోబరు 22,1962** : క్యూబా క్షిపణి సంక్షోభం

**జూలై 3-17, 1963** : గువేరా అల్జీరియా పర్యటన

**మార్చి 25, 1964** : ఐక్యరాజ్య సమితి వాణిజ్య, అభివృద్ధి మండలి సమావేశంలో గువేరా ప్రసంగం

**డిసెంబరు 11, 1964** : ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో గువేరా ప్రసంగం

**మార్చి 14, 1965** : మూడు నెలల విదేశీ పర్యటన ముగించుకొని క్యూబా చేరుకున్న గువేరా , రాజకీయ కార్యకలాపాల విరమణ

**ఏప్రిల్1, 1965** : ఫైడెల్ కాస్ట్రోకు వీడ్కోలు లేఖ సమర్పించిన గువేరా కాంగోలో టాటు పేరుతో కార్యకలాపాలు

| | | |
|---|---|---|
| **డిసెంబరు 1965** | : | క్యూబాలో రహస్య పర్యటన , బొలీవియాకు పయనం |
| **మార్చి 23, 1967** | : | బొలీవియాలో విప్లవ యుద్ధం ప్రారంభం |
| **జులై 31 - ఆగస్టు 10, 1967** | : | లాటిన్ అమెరికా సంఘీభావ సంస్థ గౌరవ అధ్యక్షునిగా గువేరా ఎన్నిక. |
| **అక్టోబరు 8, 1967** | : | బొలీవియా సైనికులతో పోరాటం, గువేరాకు గాయాలు |
| **అక్టోబరు 9, 1967** | : | గువేరాతో సహా ఇద్దరు నిర్బంధ గెరిల్లాల హత్య |
| **అక్టోబరు 15, 1967** | : | గువేరా మరణవార్తను అధికారికంగా ప్రకటించిన కాస్ట్రో , మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా సంతాపం. |
| **అక్టోబరు 18, 1967** | : | పది లక్షల మందితో హవానాలో గువేరా స్మారక సభ , కాస్ట్రో ప్రసంగం |
| **మార్చి 1968** | : | గువేరా బొలీవియా డైరీ , ప్రచురణ, ప్రజలకు ఉచితంగా పంపిణీ. |
| **జూన్ 28,1997** | : | మూడు దశబ్దాల తర్వాత గువేరా భౌతిక అవశేషాలను వెలికితీసిన బొలీవియా అధికారులు |
| **అక్టోబరు 1997** | : | గువేరా అవశేషాలను సాంటాక్లారా (క్యూబా)లో ఖననం చేసిన క్యూబా అధికారులు |

విశ్వ వ్యాపిత విప్లవస్ఫూర్తికి ప్రతీకగా, విప్లవకారులకు ఉత్తేజంగా నిలిచిపోయిన వ్యక్తి చేగువేరా. వైద్యుడై వుండి సమాజ రుగ్మతలకు సమూల శస్త్ర చికిత్స చేసేందుకు ఆశయాన్ని ఆయుధంగా ధరించిన యోధుడు. సన్నిహితులకు మరపురాని నేస్తం. అయితే చే అనగానే స్ఫురించే భావాలు ఆయన వ్యక్తిత్వ సమగ్ర చిత్రణ ఇచ్చేవి కావు. మొదటి సారిగా చే రచనల సమగ్ర సంపుటిని లెఫ్ట్‌వర్డ్ ప్రచురించింది. ఇవి ఆయన జ్ఞాపకాలు కావు, భావాలు. క్యూబా విప్లవ చరిత్ర, అందులో తన పాత్ర, ఆ పైన నూతన సమాజ నిర్మాణం ఈ దశలన్నిటినీ చే భాషలో చెప్పే అమూల్యమైన పుస్తకం ఇది. ఆయా సందర్భాల్లో రాసిన లేఖలు కూడా ఇందులో చూడొచ్చు.

ISBN 978-93-84162-00-9

ప్రజాశక్తి బుక్‌హౌస్